# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 7 ఏప్రిల్ 2023 వెల : రూ.50




## ఆంటోనియో గ్రాంసీ

(జనవరి 22,1891 - ఏప్రిల్ 27 ,1937)

## 86 వ వర్ధంతి ప్రత్యేక సంచిక

## ఆధిపత్య రాజకీయాలు – ప్రతిఘటన మార్గాలు

One of the Biggest Cooperative Urban Banks in India with **107** Years of Service

# THE VISAKHAPATNAM COOPERATIVE BANK LIMITED

(MSCS/CR/1101/2014) (MULTI STATE COOPERATIVE URBAN BANK)

Dwarakanagar, Visakhapatnam-530016, Ph: 0891-2788461, 62, 63, 66, 71

## BOARD OF DIRECTORS





### Salient Features

- Higher Rate of Interest on Deposits.
- Additional rate of Interest on deposits of Senior Citizens.
- All Deposits are insured upto Rupees 5,00,000/- for each individual
- DDs/Bankers Cheques on all important places in India and RTGS, NEFT
- All Branches works on Sunday Extended Working hours for Customer's convenience
- Safe Deposit Locker facility
- Corporate Agency with United India Insurance Company Ltd, Life Insurance corporation of India, IFFCO TOKIO General Insurance Company Ltd

### Members Welfare Schemes

- All members covered under Personal Accident Policy upto Rs.50,000/- Members with share capital of Rs.5000/- and above covered under **"Arogya Visakha Bima"** for medical expenses upto Rs.50,000/- per year.
- In case of unfortunate death of member, legal heirs are entitled to received Death Benefit Fund equal to Share Capital with a minimum of Rs.5000/- and a maximum of Rs.1.00.000/-
- Yearly Cash Awards for Meritorious children of our members

**THE BIGGEST COOPERATIVE BANK IN SOUTH INDIA**



# గ్రాంసీ 86వ వర్ధంతి మరో ప్రత్యేక సంచిక

ఏప్రిల్ 27 గ్రాంసీ 86వ వర్ధంతి సందర్భంగా ఈ ప్రత్యేక సంచికను అందిస్తున్నాము. ఇదే సంపాదకవర్గం సారధ్యంలో 2020 నవంబరులో గ్రాంసీ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యాలనే తలంపుతో ఒక ప్రత్యేక సంచికను విడుదల చేసింది.

ఆంటోనియో గ్రాంసీ ప్రముఖ ఇటాలియన్ కమ్యూనిస్టు. కాని ఆయన భావజాలం ఇటలీకి మాత్రమే పరిమితమైంది కాదు. ప్రస్తుతం ప్రపంచం అంతటా గ్రాంసీ రచనల మీద చర్చోపచర్చలు సాగుతున్నాయి. మన దేశంలో గ్రాంసీ పేరు పెద్దగా ప్రాచుర్యంలో లేదు. ఉపశ్రేణుల రాజ్యాధికారం సమస్యల చుట్టూ సాగుతున్న చర్చలలో గ్రాంసీ ప్రస్తావన విస్తారంగా కనిపిస్తున్నది. అయితే అది మేధోపరమైన చర్చకే పరిమితం అయింది.

గ్రాంసీ రచనలు మార్క్సిజానికి కొనసాగింపు. మార్క్సిజం భావజాల పరిధిని ఆయన విస్తరింపజేశాడు. కొత్త చిగురులు తొడిగాడు. పర్యవసానంగా ప్రజా విప్లవాలకు అవసరమైన అనేక కొత్త కోణాలను ఆవిష్కరించాడు. మార్క్సిజానికి కొత్త పదబంధాలు జత చేశాడు. కొత్త భావాభివర్గాలు ఆయన రచనలలో రూపుదిద్దుకున్నాయి. ఇవన్నీ మార్క్సిజానికి ఆయన సృజనశీలనతో తెచ్చిన గుణాత్మకమైన పరిణామాలు. అవే మార్క్సిజానికి కొత్త చూపునీ, కొత్త రూపునీ ఇస్తున్నాయి.

ఎప్పుడైనా గుణాత్మక మార్పులు ఒక పట్టాన అర్థం కావు. అంత తేలికగా వంట బట్టవు. ఎందుకంటే గుణాత్మక మార్పులు పాతను తనలో ఇముడ్చుకుని కొత్తను ఆవిష్కరిస్తాయి. మార్క్సిజాన్ని సృజనాత్మక సిద్ధాంతంగా భావిస్తే గ్రాంసీ సాధించినది మనకి అవగతమవుతుంది. మార్క్సిజాన్ని పిడివాదంగా నియతివాదంగా కుదించుకుంటేనే గ్రాంసీని విస్మరించగలుగుతారు.

మా తొలి ప్రత్యేక సంచికకు విశేష ఆదరణ లభించింది. ఇది సృజనశీలతకు పాఠకుల సానుకూల స్పందనగా భావిస్తున్నాం. దాని ప్రేరణతోనే ఈ రెండవ ప్రత్యేక సంచిక రూపుదిద్దుకుంది. ఈ సంచిక గ్రాంసీ భావజాలాన్ని పరిచయం చేస్తూనే మరోపక్క ఆ భావజాలం స్ఫూర్తితో దేశంలోని ఆధిపత్య రాజకీయాల విశ్లేషణ, దానిని ప్రతిఘటించే మార్గాలను అన్వేషించే ప్రయత్నం చేస్తున్నది. మనది చాలా ప్రత్యేకతలు కలిగిన దేశం. ఇక్కడి ఆధిపత్య రాజకీయం, ప్రతిఘటన మార్గాలు సంక్లిష్టంగా వుంటాయి. ఏమైనా వాటిని అర్థం చేసుకోడానికి, విశ్లేషించుకోడానికి గ్రాంసీ భావజాలమే దారి దీపం అవుతుంది. ఎందుకంటే పౌరసమాజంలో హెజమనీ (ఆధిపత్య) భావనకు రూపశిల్పి ఆయనే.

ప్రత్యామ్నాయ రాజకీయం దిశగా ఈ సంచిక చేస్తున్న ప్రయత్నం తొలి అడుగు మాత్రమే. కొత్త తరహా విశ్లేషణలకు ప్రజా ఉద్యమాల కార్యాచరణకు ఇది ప్రేరణ కావాలి. ఇదొక అన్వేషణ. నిరంతరాయంగా కొనసాగాల్సిన మేధోమధనం. మార్క్సిస్టు భావజాలానికి చెందిన వివిధ స్రవంతుల రచయితలు ఈ ప్రయత్నంలో భాగస్వాములుగా వున్నారు. రచయితలందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు.

– డీవీవీఎస్ వర్మ

**ఫోన్ : 85006 78977**

ఏప్రిల్ - 2023
పేజీలు : 100

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 7

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 50 రూపాయలు

## ఈ సంచికలో..

1.గ్రాంసీ 86వ వర్ధంతి మరో ప్రత్యేక సంచిక 3
2.గ్రాంసీ జీవన రేఖలు 5
3.నిర్లిప్తులంటేనాకు నిలువెల్లా అసహ్యం 7
4.గ్రాంచీ ది గ్రేట్ - తక్కోలు మాచిరెడ్డి 8
5.ఆధిపత్యం, ప్రతి–ఆధిపత్యం - ఎస్.వెంకట్రావు 9
6.గ్రాంసీ తత్వం–మేధావులు - రావు కృష్ణారావు 18
7.గ్రాంసీ ఆలోచనల్లో కీలకం 'లోకజ్ఞానం'- హెచ్చార్కె 23
8.ఆధిపత్య భావజాల స్థావరాలను బద్దలు కొట్టాల్సిందే - అశోక్ కుంబము 27
9.గ్రాంసీ - ఉపశ్రేణులు - చారిత్రక సంఘటన - కొప్పర్తి వెంకటరమణమూర్తి 31
10.జాతీయోద్యమం దీర్ఘకాలిక వ్యూహం-బిపన్‌చంద్ర 34
11.టాగూర్ జానపదుల మతం - ఉపశ్రేణులు : అనువాదం - మందలపర్తి కిశోర్ 40
12.గ్రాంసీ మాటల్లో.. 47
13.గ్రాంసీ జీవన చిత్రాలు.. జ్ఞాపకాలు 48
14.తెలుగులో గ్రాంసీ భావజాలం.. విస్తరించిన క్రమం - డాక్టర్ బి.రమేష్‌బాబు 50
15.ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు సాధించిన ప్రజా హెజిమోని - డీవీవీఎస్ వర్మ 53
16.భారత వామపక్షాలు గ్రాంసీని ఎందుకు అధ్యయనం చేయాలి? - కొండూరి వీరయ్య 62
17.గ్రాంసీ ఆలోచనల వెలుగులో మనం - కృష్ణుడు 67
18.గ్రాంసీ ఆధిపత్య భావన - మర్ల విజయకుమార్ 70
19.పౌర సమాజంలో ఆధిపత్య రాజకీయాలు - డీవీవీఎస్ వర్మ 73
20.భారతీయ సమకాలీన పౌరసమాజం - సంగిరెడ్డి హనుమంతరెడ్డి 77
21.భారత సమాజం - గ్రాంసీ ఆలోచనలు - మహమ్మద్ అక్బర్ 81
22.గ్రాంసీ:ప్రసారమాధ్యమాల్లో పురుషస్వామ్యం - కోమల్ తుజారె 84
23.ఆధిపత్య సంస్కృతి - గ్రాంసీ వెలుగులో ప్రతిఘటన - కె.శాంతారావు 86
24.ప్రత్యామ్నాయ సాంస్కృతిక సేనాని!- గౌరవ్ 88
25.భావజాల రంగంలో హెజిమోని - డి.సోమసుందర్ 91
26.గ్రాంసీ చిత్రాలు జ్ఞాపకాలు 93
27.వ్యాస రచయితల మాటల్లో గ్రాంసీ భావనలు 94
28.మార్క్స్ కాపిటల్‌కు భిన్నంగా రష్యా విప్లవం 95
29.గ్రాంసీ : ఆందోళన - ప్రచారం 97

## దారి దీపం మాసపత్రిక

ఈ పత్రికకు చందా లేదు. చందాదారులు లేరు. అడిగిన వారికి, ఆసక్తి కలిగిన వారికి పత్రికను ఉచితంగా పంపిస్తున్నాం. ఎవరైనా విరాళం ఇస్తే స్వీకరిస్తున్నాం. విరాళం తప్పనిసరి కాదు.

వివరాలకు సంప్రదించండి

డా॥ బి.రమేష్ చంద్రబాబు, పబ్లిషర్.
34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ, ఫోన్ : 93971 14495

ఈ ప్రత్యేక సంచిక..
విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్ షాపు బ్రాంచీలన్నింటిలోనూ లభిస్తుంది.

# గ్రాంసీ జీవన రేఖలు



గ్రాంసీ 1891 జనవరి 22న జన్మించారు. దక్షిణ ఇటలీలోని సార్డీనియాలోని ఆలెస్ జన్మస్థానం. ఏడుగురి సంతానంలో నాల్గవ వాడు. చిన్నతనం నుండీ అనారోగ్య పీడితుడు. వెన్ను పూసకు సంబంధించిన జబ్బు జీవితాంతం వెంటాడింది. పెరుగుదల ఐదడుగుల లోపు దగ్గరే ఆగిపోయింది. గూని వచ్చింది. 1897లో తండ్రి జైలు పాలు కావడంతో గ్రాంసీ చదువుకు అంతరాయం వచ్చింది. రెండేళ్లపాటు సంపాదన కోసం పనిచేశాడు. తండ్రి తిరిగి వచ్చిన తర్వాత హైస్కూల్ విద్య పూర్తిచేశాడు. 1911లో పేద పిల్లల స్కాలర్‌షిప్ పొంది తురిన్ లోని యూనివర్సిటీలో చేరాడు. అనారోగ్యం, తిండి వసతికి తగిన డబ్బు లేకపోవడంతో చదువుకు అనేక అవరోధాలు వచ్చాయి. 1915లో యూనివర్సిటీ విద్యకు స్వస్తి చెప్పి జర్నలిస్టుగా పని చేశాడు. చదువులో గ్రాంసీకి మక్కువే కాదు, ఆసక్తి కూడా బహురంగాలకు విస్తరించడం కనిపిస్తుంది. హైస్కూల్లో లెక్కలు, సైన్స్ పట్ల ఆసక్తితో ప్రారంభమైంది. యూనివర్సిటీలో వివిధ కోర్సులు తీసుకుని పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. 1926 నుండి జైలులో వున్న గ్రాంసీ 1937 ఏప్రిల్ 27న మరణించాడు.

## గ్రాంసీ రాజకీయ జీవితం

- 1913లో విద్యార్థిగా ఉండగానే సోషలిస్ట్ పార్టీతో సంబంధాలు వచ్చాయి. అప్పటికే ఆయన వ్యాసాలు రాయడం మొదలైంది.
- 1925లో జూలియా రోమ్లో సోవియట్ ఎంబసీలో ఉద్యోగం వచ్చింది.
- 1926 జూన్ వరకు కలిసి వున్నారు. ఇటలీలో పరిస్థితులు మారడంతో గర్భవతిగా వున్న జూలియా తిరిగి మాస్కో వెళ్ళింది. అక్కడ రెండో బిడ్డ జులియానో పుట్టాడు. అప్పటికే జైలుపాలైన గ్రాంసీ బిడ్డ ఫొటో తప్ప చూసే వీలు రాలేదు.
- 1915లో యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చి సోషలిస్టు పత్రికలో చేరాడు. అప్పుడే సోషలిస్ట్ పార్టీ సభ్యుడయ్యాడు
- 1917లో తురిన్ పార్టీ విభాగానికి కార్యదర్శి అయ్యాడు.
- 1918లో సోషలిస్టు పార్టీ సభ జరిగింది. అక్కడే కమ్యూనిస్ట్ గ్రూపు ఏర్పడింది.
- 1921లో సోషలిస్టు మహాసభ జరిగింది. కమ్యూనిస్టులు అక్కడ చీలి పార్టీని ఏర్పాటుచేశారు.
- 1922 కమ్యూనిస్టు పార్టీ 2వ మహాసభ రోమ్‌లో జరిగింది. కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ గ్రాంసీని ప్రతినిధిగా పంపారు. ఆ తర్వాత 1923 కొమింటర్న్ తరపున వియన్నా వెళ్ళాడు. అక్కడ నుంచి ఇటలీ, యూరప్ దేశాల కమ్యూనిస్ట్ పార్టీల సమన్వయ బాధ్యతలు నిర్వహించాడు.
- భాషా శాస్త్రం, ఇటాలియన్ లిటరేచర్, రోమన్ లా, జాగ్రఫీ, గ్రీక్, లాటిన్ గ్రామర్, మోరల్ ఫిలాసఫీ, మోడరన్ హిస్టరీ, గ్రీక్ లిటరేచర్ కోర్సులు చేశాడు. 1915లో ఫిలాసఫీ కోర్సు పూర్తి చేశాడు.
- 1924లో ఇటలీ పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. ప్రిజన్ నోట్స్‌లో ఆయన రచనలలో వైవిధ్యం వచ్చిన తర్వాత పార్టీ కార్యకలాపాలలో వున్నాడు. పార్టీ ప్రధాన విశ్వరూపంగా కనిపిస్తుంది. కార్యదర్శి అయ్యాడు.
- 1922లో పార్టీ ప్రతినిధిగా మాస్కోలో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌కు హాజరయ్యాడు. అక్కడ అనారోగ్యంతో శానిటోరియంలో చేరాడు. అప్పుడు జూలియాతో పరిచయం తర్వాత పెళ్లి, 1924లో మొదటి బిడ్డ డెలియో పుట్టాడు.
- 1925లో ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తెచ్చింది.
- 1926 నవంబర్‌లో గ్రాంసీని అరెస్ట్ చేశారు. దీనితో ఆయన జైలు జీవితం ప్రారంభమైంది. ఈ కాలంలో చేసిన కృషిలో మూడు అంశాలను ప్రస్తావించాలి
- 1.సోషలిస్టు పార్టీలో కమ్యూనిస్ట్ గ్రూపు ఏర్పాటు, అంతిమంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు, మళ్ళీ అంతర్గత పోరాటం, విప్లవ పార్టీ నిర్మాణం
- 2. కార్మికోద్యమ నిర్మాణం – ఫ్యాక్టరీ కౌన్సిళ్ల ఉద్యమం
- 3. రాజకీయ సిద్ధాంతపరమైన అంశాలపై పునాదులు

## జైలు జీవితం

- 1926లో ప్రత్యేక చట్టాల కింద అరెస్టు. ఐదేళ్ల జైలు శిక్ష.
- 1927లో ముస్సోలినిపై హత్యాప్రయత్నం కేసులో ఇరికించారు.
- ప్రత్యేక ట్రిబ్యునల్‌లో విచారణ. ప్రాసిక్యూటర్ వాదిస్తూ... ఈ మనిషి బుర్రను 20 ఏళ్లపాటు పని చేయకుండా నిరోధించాలి. జడ్జి రాజును మించిన రాజభక్తిని ప్రదర్శించాడు. 20 సంవత్సరాల 4 నెలల 5 రోజులపాటు శిక్ష వేశాడు. జైలులో ఆయన పోరాడి సాధించినవి ఉన్నాయి.

రాసుకోడానికి వీలుగా ప్రత్యేకసెల్ - నెల వారీగా ఉత్తరాలు రాసి సంఖ్యను పెంచడం - పుస్తకాలు తెచ్చుకుని చదివే అవకాశం సెన్సార్ నిబంధనల పరిధిలో రాయడానికి అనుమతి సంపాదించుకున్నాడు.

- రచనలకు వదిన తాతియానా నిరంతర ప్రోత్సాహం. రాసిన ప్రతులను భద్రపరిచింది. మరో మిత్రుడు స్రాఫా అవసరమైన పుస్తకాలు తెప్పించుకోడానికి పరిమితి లేని ఖాతాను తెరిచాడు. కారాగారంలో మొత్తం 33 నోట్ బుక్స్ పూర్తి చేశాడు. ఏ అంశాన్ని ఒక పుస్తకంగా రాయలేదు. అనేక అంశాలపై తన అభిప్రాయాలను నోట్ బుక్స్ రూపం ఇచ్చాడు. కొన్నింటిని తిరగ రాశాడు.
- మొత్తం మీద ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని రూపు దిద్దడమే పనిగా పెట్టుకున్నాడు. దీనికి అవసరమైన చారిత్రిక సిద్ధాంత, సాంస్కృతిక పరమైన అంశాలను ఈ నోట్ బుక్స్‌లో వివరించాడు.





**1922లో గ్రాంసీ సోవియట్ యూనియన్‌లో వున్నప్పుడు అక్కడ జూలియాను వివాహం చేసుకున్నాడు.**
**మొదటి కొడుకు దెలియో. 1925-26లో ఇటలీలో కొంత కాలం కలిసి జీవించారు. తర్వాత రెండో కొడుకు గిలియానో**



**టాట్యానా షుక్ట్:** ఇతర వస్తువులతో పాటు గ్రాంసీ 33 జైలు నోట్‌బుక్స్ తీసి జాగ్రత్త చేయగలిగారు. వాటిని ఓ బ్యాంకులో భద్రపరిచి, సంవత్సరం తరువాత రాయబార కార్యాలయం ద్వారా మాస్కోకు పంపించారు. ఆ విధంగా అవి టోగ్లియాటీకి చేరాయి. చాలా నోట్‌బుక్స్‌ని, ఉత్తరాలను పలు సంవత్సరాల తరువాత - **1945**లో ఫాసిస్టు పాలన నుంచి ఇటలీ విముక్తమయ్యాకే ప్రచురించగలిగారు. వాటి ఇంగ్లీషు అనువాదాలు **1957**లో మొదలయ్యాయి. జైలు రచనల నుంచి ఎంపిక చేసినవి **1971**లో పుస్తక రూపంలో వెలువడ్డాయి. జైలు రచనల సంపూర్ణ ఇటాలియన్ ప్రచురణ **1975**లో గాని వెలుగు చూడలేదు. ప్రస్తుతం అవి ఇంగ్లీషులోనికి అనువాదం అవుతున్నాయి.



**పీరో స్రాఫా:** ఈయనకు గ్రాంసీతో తొలినాటి ఇటాలియన్ కమ్యూనిస్టు ఉద్యమంతో ఉన్న సంబంధం దృష్ట్యా, ఇతని ఆర్థిక రచనలకు గల ప్రాచుర్యం దృష్ట్యా ఆధునిక మార్క్సిజంలో ఒక ప్రముఖమైన స్థానం ఉంది. **1918-20** మధ్య 'రెడ్‌టురిన్'లో విద్యార్థిగా ఉండి స్రాఫా ఆర్డినోనోవోలో వ్యాసాలు రాశారు. **1924** నాటికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, దానిలోని విభేదాలను చూసి స్రాఫా ఆ ఉద్యమానికి దూరమయ్యారు. ఆ తరువాత కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఉన్న పీరో స్రాఫా జైలులో ఉన్న గ్రాంసీకి పుస్తకాలు అందించడానికి మిలన్‌లోని ఒక బుక్ షాపులో పరిమితి లేని ఖాతా ఏర్పాటు చేశారు. జైలులో ఉన్న గ్రాంసీకి చాలా పుస్తకాలు అలా అందుబాటులోకి వచ్చాయి. గ్రాంసీ విడుదల కోసం జనాన్ని సమీకరించడంలో ప్రధానంగా పనిచేసింది కూడా స్రాఫాయే.

గ్రాంసీ స్వీయ రచనలు

# నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం



- ఆంటోనియో గ్రాంసీ

**నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం! బతికి వుండడమంటే, అటో ఇటో నిలబడడమేనన్నది నా నమ్మకం. నిజంగా సజీవులుగా వున్న వాళ్ళు పౌరులుగానూ, పక్షపాతులుగా ఉండక తప్పదన్నది నా మరో విశ్వాసం. నిర్లిప్తత, నిరాసక్తత అనేవి - పరాన్నభుక్కులు గానూ, పెడబుద్ధులు గానూ మనుగడ సాగించడమే తప్ప జీవ లక్షణాలు కావు! అందుకే, నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం!!**

నిర్లిప్తత అనేది చరిత్ర మెడలో వేలాడే గుదిబండ! అది చరిత్రను బలంగా కుంగదీస్తుంది. చాలా మెల్లిగా పనిచేస్తుంది కానీ, నిరంతరాయంగా పనిచేస్తూనే వుంటుంది! నిర్లిప్తత నమ్మడానికి వీల్లేని దుర్విధి లాంటిది. మన కార్యక్రమ ప్రణాళికను నాశనం చేస్తుంది. లోతుగా ఆలోచించి రూపొందించిన పథకాలను తలకిందులు చేస్తుంది. మన మేధస్సును శిథిలం చేసే పదార్థం నిర్లిప్తత. మనందరికీ దాపురించే కీడు వాస్తవ రూపం తీసుకోవడానికి మూల కారణమేమిటంటే, జన సమూహాలు పట్టుదల వదిలి పెట్టి నిర్లిప్తులుగా వ్యవహరించడమే! మొదట్లోనే తిరగబడి వుంటే, ఉప్పున ఎగిరిపోయే శాసనాలు, చట్టసభల్లో ఆమోదం పొంది ఏకుమేకవడానికి అవకాశమిచ్చేది ఈ నిర్లిప్తతే! నియంతల నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి పెద్ద ఎత్తున సైనిక పితూరీ లేవదీస్తే తప్ప గత్యంతరం లేని పరిస్థితిని తెచ్చిపెట్టేది ఈ నిర్లిప్తతే!

జనం నిర్లక్ష్యం వల్ల దేన్నీ పట్టించుకోరు. అటు తర్వాత దుర్విధి ఫలితంగా, అన్నింటినీ అందరినీ అదే విధి అణగదొక్కుకుంటూ పోయినట్లు అనిపిస్తుంది. జరిగిపోతున్న దాన్ని ఆమోదించిన వాడికీ అదే గతి - ఎదురొడ్డి నిలబడిన వాడికీ అదే గతి పడుతుంది! తెలిసిన వాడికీ అదేగతి - తెలియని వాడికీ అదే గతి. క్రియాశీలకంగా వ్యవహరించే వాడికీ అదే గతి. ఉదాసీనుడికీ అదే గతి పడుతుంది. కొందరు దీనంగా గొణుక్కుంటారు, మరి కొందరు బూతుల పంచాంగం విప్పి తిట్టుకుంటారు. కానీ, ఒకరో ఇద్దరో తప్పిస్తే ఏ ఒక్కరూ 'నా బుద్ధికి తోచిన విధంగా నేను గట్టిగా నిలబడి వుంటే ఇది ఇలా జరిగి వుండేదా?' అని ప్రశ్నించుకోరు. అందుకు కూడా నాకు ఈ నిర్లిప్తులంటే తగని అసహ్యం! ఈ హద్దుమాలిన అమాయకుల గొణుగుడు నన్నెంతో బాధపెడుతుంది - నిజమే! కానీ, వాళ్ళలో ప్రతి ఒక్కరినీ జరిగిన దానికి బాధ్యులుగానే పరిగణిస్తాను. ప్రతిరోజూ, జీవితం తమ ముందు నిలబెట్టిన కర్తవ్యాన్ని ఈ అమాయక చక్రవర్తులు ఎలా నిర్వర్తించారు? వాళ్ళేం చేశారు ? ముఖ్యంగా, ఏం చెయ్యకుండా నిష్క్రియాపరులుగా నిలుచుండిపోయారు ? దానికి వాళ్ళదే బాధ్యత అంటాను! నా కరుణనూ, వెచ్చని నా కన్నీటినీ అనర్హులపై ఖర్చు పెట్టకుండా, ఈ విషయంలో నిక్కచ్చిగా నిలబడే అధికారం నాకుందనే నేను నమ్ముతున్నాను. నేను పక్షపాతిని, సజీవుణ్ణి!! మా పక్షాన ఉన్న వాళ్లు తమ అంతరాంతరాల్లో నిర్మించనున్న భవిష్యత్ మహా నగరం తాలూకు జీవనాడీ స్పందనలను నేను గ్రహించగలుగుతున్నాను. ఆ మహా నగరంలో సామాజిక సంబంధాలను ఏ కొద్ది మంది భుజాలపైనో వదిలెయ్యడం జరగదు! అక్కడ ఏదీ, కేవలం అదృష్టం కారణంగానో, దురదృష్టం ఫలితంగానో సంభవించదు ! ప్రతి ఒక్క పరిణామమూ తెలివైన పౌరుల చైతన్యవంతమైన కార్యాచరణ ఫలితంగానే జరుగుతుంది. ఆ మహా నగరంలో ఏ ఒక్కరూ, ఎవరో కొద్దిమంది ప్రదర్శించే త్యాగశీలత - కొందరి కాయకష్టం లాంటి దొడ్డిదారుల వంక చూడరు ! నేను సజీవుణ్ణి, పక్షపాతిని ! అందుకే, అటో ఇటో నిలబడలేని వాళ్ళను అసహ్యించుకుంటాను - నిర్లిప్తులంటే నిలువెల్లా అసహ్యం నాకు!!

వాస్తవానికి చరిత్రలో అనేక పరిణామాల వెనుక ఉండిన మూలకారకం ఈ నిర్లిప్తతే! అయితే, సానుకూలమైన అర్థంలో కాదు సుమా! ప్రతి ఒక్కరి పాలబడిన కీడుకు గానీ, అసాధారణ సాహసకృత్యం ఫలితంగా సంభవించిన మేలుకు గానీ, క్రియాశీలురైన కొద్ది మంది చూపించిన చొరవ కారణం కాదు! అంతకుమించి, అత్యధికులు ప్రదర్శించిన నిర్లిప్తత, నిష్కారణంగా కర్తవ్యపాలనకు దూరంగా నిలబడిపోవడమే ఈ పరిణామాలకు ఎక్కువ కారణం. చరిత్రలో జరిగిపోయిన పరిణామాలు కొద్దిమంది కోరుకున్నందు వల్ల సంభవించలేదు. అత్యధిక సంఖ్యాకులు నిష్క్రియాపరులు కావడం వల్లనో, జరిగే దాన్ని జరగనివ్వడం వల్లనో మాత్రమే ఈ సంఘటనలు జరిగాయి. చిక్కుముడులు, పీటముడులు బిగిసిపోనివ్వడాన్ని వాళ్ళు అనుమతిస్తూ పోయారు. ఫలితంగా, దరిమిలా కత్తులో కత్తెరలో ఉపయోగిస్తే తప్ప వాటిని కత్తిరించడం సాధ్యం కాని పరిస్థితి ఎదురైంది. ఈ నిర్లిప్తులు, పెత్తనం చేజిక్కించుకునేందుకు కొందరిని అనుమతించారు. ఇప్పుడు **(మిగతా 17లో)**

# గ్రాంచీ.. ది గ్రేట్




**- తక్కోలు మాచిరెడ్డి**

మేధావులను గురించి ఆంటోనియో గ్రాంచీ అభిప్రాయాలు తెలుసుకునే ముందు ఆయన జీవితాన్ని గురించి రెండు మాటలు : ఇటలీలో 'విప్లవ జాతీయవాదం' పేరుతో ముస్సోలినీ ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రచారం చేసి, జాతికి ఒక శక్తివంతమైన నాయకుడు కావాలని నమ్మబలికి, తానే ఆ నాయకుణ్ని అని ప్రకటించుకున్నాడు. తన పార్టీని జాతీయ ఫాసిస్టు పార్టీగా రూపొందించాడు. 1922 వేసవి కాలం వచ్చేసరికి దాదాపు ఐదు లక్షల మంది ఫాసిస్టు పార్టీ సభ్యులు తయారయ్యారు. రాజ్యాన్ని కూలదోసే కుట్ర చేస్తున్నాడనీ, వర్గ కసిని రగిల్చే రాతలు రాస్తున్నాడనీ గ్రాంచీని 1926 నవంబరు 8వ తేదీన అరెస్టు చేయించాడు ముస్సోలినీ. గ్రాంసీని ఎలాంటి విచారణా లేకుండానే తర్వాత 1928లో 'విచారణ' పూర్తి చేసి గ్రాంసీకి ఇరవై సంవత్సరాల జైలు శిక్ష విధించారు. గ్రాంచీ జైల్లో సరిగా నిద్రపోలేదు. పంటి నొప్పితో బాధపడేవాడు. శిక్ష ముగిసిన వారం రోజులకే, ఏప్రిల్ 27, 1937న గ్రాంసీ మరణించాడు. ఆయనకు గూనె అయినా ఉక్కులాంటి సంకల్పబలంతో వుండే వాడు. జైల్లో గ్రాంచీ ఎప్పుడూ చదువుతూ వుండేవాడు. ముందు నెలల్లో జైలు లైబ్రరీలోని 82 పుస్తకాలు చదివేశాడు. కాని 26 నెలల వరకు పెన్ను, ఇంకు, కాగితం ఇచ్చేవారు కాదు జైలు అధికారులు. జైలులో గ్రాంచీ తన ఆలోచనలను నోటు పుస్తకా ల్లో రాసేవారు. 2,848 పేజీల నోట్స్ (అంటే 32 నోట్‌బుక్స్) రాశాడు గ్రాంచీ. ఆయన మరణానంతరం అవి అచ్చయినాయి. తనను గురించి గ్రాంచీ 1929 డిసెంబరు 19వ తేదీన ఇలా రాసుకున్నాడు. 'నిరాశావాదాన్ని, ఆశావాదాన్ని నా మనసు సంశ్లేషిస్తుంది. వాటిని అధిగమిస్తుంది కూడా. మేధోపరంగా నేను నిరాశా వాదినైనా, ఆశావాదాన్ని నా ఇచ్ఛాశక్తి నాకు ఇచ్చేది. ఏ పరిస్థితినైనా నేను అధిగమిస్తాను. అమితమైన సహనశీలత, నిష్క్రియ సహనం కాదు, పట్టుదలతో నిండిన సహనం నా ఆయుధం". గ్రాంచీ ఆలోచన ఏమిటో కాస్త ఆయ న రాసిన నోట్‌బుక్స్ ఆధారంగా పేర్కొందాం. సామ్యవాద పార్టీ ఆర్థికాన్ని పునాది అనీ, ఉపరితలంలోని రాజనీతి, సంస్కృతి, సాహిత్యం, కళలు అంత ప్రధానం కాదనీ సాధారణంగా భావిం చడం జరుగుతుంటుంది. కాని, గ్రాంచీ ఆర్థికానికి సమానంగా ఉపరితల అంశాలకు ప్రాధాన్యం ఇస్తాడు. మార్క్స్ వాదానికి ఇది ఆయన చేసిన దోహదం. పరిస్థితులకు లోబడాలని గ్రాంచీ ఎప్పుడూ భావించలేదు. ఆయన మాటల్లో 'మనం పరిసరాలకు సర్దుకుపోవాలని అనిపించవచ్చు. కాని పరిసరాల్ని అధిగమి స్తాం. వాటి కింద అణచివేయబడం' 1929-30లో గ్రాంచీ ఆరోగ్యం మరీ దెబ్బతింది. దంతాలు వూడిపోయాయి. రక్తం సరిగా లేక చర్మవ్యాధుల ప్రమాదం వుండేది. కార్మికవర్గానికి, పోరాడే కార్మిక వర్గానికి మేధావులు ఎంతో అవసరం. వారు లేకుండా కార్మికులు అధికారంలోకి రాలేరు. వచ్చినా, నిలుపు కోలేరు. కార్మికవర్గ మేధావులని వివరణ ఇచ్చాడు. కార్మిక వర్గంతోపాటు పేద రైతుల పక్షాన నిలబడతారు మేధావులు అని తలచినాడు గ్రాంచీ. 1931-1932లో గ్రాంచీ ఆరోగ్యం మెరుగవలేదు. క్షమాపణ వేడితే జైలు నుంచి విడుదల చేస్తామని అధికారుల వాదం. ససేమిరా అన్నాడు గ్రాంచీ. 'నా ఆత్మను నేను చంపుకోలేను' అని ఆయన సమాధానం. గ్రాంచీ నోట్ బుక్స్‌లో దాదాపు 250 పేజీలు ఫాసిజం మీద రాశాడు. కేవలం బూర్జువా వర్గపు ఆర్థిక సంక్షోభం దీనికి కారణమని భావించ లేదు గ్రాంచీ. ఫాసిజం మిశ్రమ వర్గాల కలయికగా అభివృద్ధి అయింది. గ్రాంచీ కూడా మొదట ఫాసిజం తీవ్రతను పసిగట్ట లేదు. దాన్నొక పార్టీగానే చూశాడు. సామ్యవాదులు బలపడితే అది అదృశ్యమవుతుంది అని అనుకున్నాడు. కానీ అలా కాలేదు. ఎందుకంటే ఫాసిజం ఒక పార్టీ గాదు. అదొక ప్రజా ఉద్యమం. కాని, వాస్తవంగా అది కార్మికవర్గానికీ, రైతాంగానికీ వ్యతిరేకం గా పనిచేస్తుంది. అది పోవాలంటే, ఫాసిజాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఐక్యమై ఒక సంఘటనగా ఏర్పడి ఎదుర్కొనాలని భావిస్తాడు గ్రాంచీ. ఈ విషయం మన దేశానికి చక్కగా అన్వ యిస్తుంది. మనం ఫాసిస్టు ముప్పును లోతుగా అర్థం చేసుకోవాలి.

గ్రాంచీ మాటల్లో : 'అర్థం చేసుకోవడమంటే ఆచరణకు సిద్ధపడటం'. ఆచరణ అంటే, ఫాసిస్టు శక్తుల్ని అన్ని రంగాల్లోనూ ఓడించడం. దీనికి ఫాసిస్టు వ్యతిరేక శక్తులు ఏకం కావాలి. ఇదే మనం ఆంటోనియో గ్రాంచీ జీవితం నుంచి నేర్చుకోవాల్సిన అంశం. ❑

(గమనిక : గ్రాంచీనే కరెక్టు)



# ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం

(హెజిమోనీ, కౌంటర్-హెజిమోనీ)

**మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ అగ్ర నేత, పిన్న వయసులోనే ఫాసిస్టు ముసోలినీ కర్కశ జైలు శిక్షలో అసువులు బాసిన ఆంటోనియో గ్రాంసీ రచనల్లో అతి ముఖ్యమైన విషయం.. నేటి కాల పరిస్థితుల్లో మనం అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉన్న అంశం.. 'ఆధిపత్యం, ప్రత్యాధిపత్యం' (హెజిమోనీ, కౌంటర్-హెజిమోనీ). హెజిమోనీ అనే పదాన్ని గ్రాంసీ సృష్టించకపోయినా ఒక భావన (కాన్సెప్ట్)కు ఆ పేరు పెట్టింది, లేదా ఆ పేరుతో ఒక భావనను వివరించింది మాత్రం ఆయనే. 11 ఏళ్ల తన జైలు జీవితంలో గ్రాంసీ ఎంతో ప్రయాసకోర్చి రాసిన 'జైలు రచనలు' (ప్రిజన్ నోట్‌బుక్స్)లో హెజిమోనీ, కౌంటర్ హెజిమోనీ అనే భావనను ప్రతిపాదించాడు.**

- ఎస్.వెంకట్రావు



## ఆధిపత్యం (హెజిమోనీ) అంటే ఏమిటి?

ఆధిపత్యం అనే పదాన్ని గ్రాంసీ సాధారణ అర్థంలో వాడలేదు. ఏదైనా పాలకవర్గం తన కింది వర్గాలపై ఎలా పరిపాలన సాగిస్తుంది అని చెప్పడానికి ఈ 'ఆధిపత్యం' (హెజిమోనీ) అన్న పదాన్ని ఉపయోగించాడు. అందువల్ల పాలవర్గాన్ని లేక వర్గాలను కూలదోసి తనదైన వర్గపాలన నెలకొల్పాలనుకున్న వర్గం లేక వర్గాలు తమతో కలిసివచ్చే వర్గాలపై 'ఆధిపత్యం' (హెజిమోనీ) సాధించాలని చెప్పాడు. నిజానికి ఆధిపత్యం అనే భావన మార్క్సిస్టు పరిభాషలో అంతకు ముందు నుంచి వస్తున్నదే. కార్మిక, ఇతర పీడిత వర్గాలకు నాయకత్వం వహించడాన్ని లెనిన్ కార్మికవర్గ ఆధిపత్యంగా వర్ణించాడు. 'వర్తమాన సమాజంలో ఏకైక నిరంతర విప్లవ వర్గంగా కార్మిక వర్గం మొత్తం ప్రజల ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాలి. అంటే మొత్తం శ్రామికులు, దోపిడీకి గురవుతున్న ప్రజలు తమను పీడిస్తున్న, దోపిడీ చేస్తున్న వర్గాలపై జరిపే పోరాటానికి నాయకత్వం వహించాలి' అని లెనిన్ చెప్పాడు. అయితే, గ్రాంసీ ఈ లెనినిస్టు భావనను మరింత పరిపుష్టం గావించాడు. గ్రాంసీ 'ఆధిపత్యం' (హెజిమోనీ) అంటే పీడిత వర్గాలపై పాలకవర్గాల నైతిక, మేధోపరమైన నాయకత్వం అని అర్థం. ఇటువంటి నాయకత్వం

వల్ల పీడిత వర్గాలు పాలకవర్గాల నాయకత్వాన్ని అంగీకరిస్తాయి. 1870 తరువాత పశ్చిమ దేశాల్లో ఏర్పడిన బూర్జువా ప్రభుత్వాలు నిరంకుశ అధికార యంత్రాంగం ద్వారా కాకుండా ఈ విధమైన సైద్ధాంతిక, సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా, ఒక రకంగా తమ పాలనను పీడిత వర్గాలు అంగీకరించేట్లు ఒప్పించడం ద్వారా పరిపాలన సాగిస్తూ వస్తున్నాయని గ్రాంసీ పేర్కొన్నాడు. పశ్చిమ దేశాల్లోనే కాకుండా మన దేశంతో సహా బూర్జువా పాలన స్థిరపడిన దేశాలన్నింటా ఇదే పరిస్థితిని మనం చూడగలం. ఆధిపత్య వర్గాలు సమాజాన్ని రెండు రాజకీయ రూపాల్లో నియంత్రిస్తాయని గ్రాంసీ చెప్పాడు. మొదటిది అణచివేత(డోమినేషన్). ఇందులో నేరుగా ప్రజలను పోలీసులు, సైన్యం ఇతర అధికార యంత్రాంగంతో భౌతికంగా అణచివేస్తుంది. రెండోది ఆధిపత్యం(హెజి మోనీ). ఇందులో సైద్ధాంతికంగా, మరీ ముఖ్యంగా ఒప్పించడం ద్వారా నియంత్రిస్తుంది. ఎంతటి నిరంకుశ ప్రభుత్వమైనా కేవలం రాజ్యాధికారం ద్వారా, పోలీసులు, సైన్యం ద్వారా పరిపాలించలేదు. దీర్ఘకాలంలో అది సుస్థిరంగా ఉండాలంటే ప్రజల సమ్మతినీ, మద్దతునూ పొందాలి. ఈ సమ్మతిని వారిపై సైద్ధాంతిక ఆధిపత్యం (హెజిమోనీ) ద్వారా పాలకవర్గాలు పొందుతాయని గ్రాంసీ వివరించాడు.

గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అంటే కొన్ని విలువలు, ధోరణులు, నమ్మకాలు, నైతికతలను మొత్తం సమాజం మీద రుద్దడం ద్వారా అధికార సంబంధాల్లో యథాతథస్థితిని కొనసాగించడం. అంటే ప్రజల దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లోకీ ఈ విలువలను చొప్పించడం అనేది ఒక నిరంతర కార్యక్రమంగా కలిగి ఉండడం. వాస్తవానికి మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ ఈ విషయాన్ని అంతకు క్రితమే మరో రూపంలో వివరించి ఉన్నాడు. జర్మన్ ఐడియాలజీలో ఆయన దీని గురించి ఈ విధంగా వివరించాడు..

> **'ప్రతి శకంలోనూ పాలక వర్గాల భావాలే పాలక భావాలుగా ఉంటాయి. అంటే సమాజంలోని పాలక భౌతిక శక్తి అయిన వర్గమే ఆ సమయంలో పాలక మేధోశక్తిగా ఉంటుంది. పాదార్థిక ఉత్పత్తి సాధనాలను కలిగి ఉన్న వర్గమే మేధో ఉత్పత్తి సాధనాలపై నియంత్రణ కలిగి ఉంటుంది. అందువల్ల ఏమవుతుందంటే మేధో ఉత్పత్తి సాధనాలు కలిగిలేని వర్గం పాలకవర్గ భావాల ఆధిపత్యం కింద ఉంటుంది. పాలక వర్గాల భావాలు అనేవి ఆధిపత్య భౌతిక సంబంధాలు మినహా మరేమీ కాదు. అంటే అవి భావాల రూపంలో స్వీకరించబడిన ఆధిపత్య భౌతిక సంబంధాలే.'**

ప్రజా సమూహం పాలకవర్గాల చైతన్యాన్ని పుణికి పుచ్చుకోవడం వల్ల అది సమాజమంతటి సాధారణ 'విజ్ఞత'గా మారిపోతుందని గ్రాంసీ వివరించాడు. ఆ విధంగా పాలక వర్గాల తత్వం, సంస్కృతి, నైతిక విలువలు అన్నీ కూడా సహజమైన సామాజిక లక్షణాలుగా మారిపోతాయి. ఆధిపత్యం (హెజిమోనీ)కీ, అణచివేత(డోమినెన్స్), మధ్య తేడా గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అనేది సమాజ ఉపరితలం ద్వారా నియంత్రించే ఒక రూపం. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం సమాజంలోని పునాది ఆర్థిక విషయాలకూ, ఉపరితలం ఆ పునాదిపై ఆధారపడి ఏర్పడే సంస్థలకూ, నమ్మకాల వ్యవస్థకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పిన దాని ప్రకారం సమాజ ఉపరితలాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది, న్యాయ, రాజకీయ రూపాలు. ఇవి అప్పటి ఉత్పత్తి సంబంధాలను వ్యక్తం చేస్తాయి. రెండు చైతన్య రూపాలు. ఇవి ఆయా వర్గాల ప్రాపంచిక దృష్టిని వ్యక్తం చేస్తాయి. మూడు అనేక కార్యకలాపాల ద్వారా ప్రజలు మౌలిక ఆర్థిక వైరుధ్యం పట్ల చైతన్యం పొంది, సమాజ మార్పుకు సిద్ధపడతారు.

గ్రాంసీ సమాజ ఉపరితలానికి సంబంధించి ఈ మార్క్సిస్టు సూత్రీకరణలను మరింత ముందుకు తీసుకుపోయాడు. ఉపరితలాన్ని ఆయన అణచివేత జరిపేవి, ఒప్పించేవి అనే రెండు భాగాలుగా విభజించాడు. ప్రభుత్వం, పోలీసు, సైన్యం, న్యాయ వ్యవస్థ వంటి అణచివేత సంస్థలను రాజ్యం లేక 'రాజకీయ సమాజం' అని పిలిచాడు. ప్రత్యక్షంగా అణచివేతకు పాల్పడకుండా ఒప్పించడం ద్వారా పనిచేసే సంస్థలు అంటే మత సంస్థలు, పాఠశాలలు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు, క్లబ్బులు, కుటుంబం మొదలైన వాటిని 'పౌర సమాజం' అన్నాడు. అయితే, ఆయన దృష్టిలో పాఠశాలలు కొంతవరకు రెండు కేటగిరీల్లోకీ వస్తాయి. ఉదాహరణకు పాఠశాల జీవితంలో కొంత భాగం అణచివేతతో ఉంటుంది. నిర్బంధ విద్య, జాతీయ పాఠ్యాంశాలు, జాతీయ స్టాండర్డ్స్, ఉత్తీర్ణతలు వగైరాలన్నీ ఇందులోకి వస్తాయి. మిగిలినవి అంటే అనియత విద్య, సామాజిక అధ్యయనం వంటివి ఇందులోకి రావు.

గ్రాంసీ జైలు రచనల ప్రకారం పౌర సమాజం(సివిల్ సొసైటీ) ద్వారా పాలక వర్గాల వర్గాధిపత్యం ఒప్పించబడుతుంది. రాజకీయ సమాజం లేక రాజ్యం ద్వారా ప్రత్యక్ష అణచివేత, లేక నియంత్రణ జరుగుతుంది. అంటే ఈ రెండూ రెండు రకాల నియంత్రణా రూపాలన్నమాట. ఒకటి ఒప్పించేది, రెండవది అణచివేసేది. ఇంకో మాటలో చెప్పాలంటే ప్రజలే పాలక వర్గాల అధిపత్యాన్ని అంగీకరించేట్టు ఒప్పించేది హెజిమోనీ (ఆధిపత్యం), అంగీకరించని ప్రజలను బలవంతంగా అణచివేసి ఉంచేది డోమినెన్స్. రెండూ ప్రజలను పాలక వర్గాల నియంత్రణలో ఉంచేవే. కాకపోతే ఒకటి పౌర సమాజంలో ఒప్పించడం ద్వారా

నియంత్రణలో ఉంచుతుంది. రెండోది నిరంకుశ సాధనాల ద్వారా అణచివేసి నియంత్రణలో ఉంచుతుంది. వీటి గురించి గ్రాంసీ ఇంకా విడమరిచి ఇలా చెప్పాడు:

1. 'సామాజిక ఆధిపత్యం' (హెజిమోనీ) అంటే మొత్తం ప్రజానీకం పాలక వర్గాల ఆధిపత్యానికి ఆమోదం తెలపడం. పాలకవర్గాలకు ఈ ఆమోదం 'చారిత్రకంగా' అవి సంపాదించిన ప్రతిష్ఠ ద్వారా లభిస్తుంది. ఉత్పత్తిలో పాలక వర్గాలు సాధించిన స్థానం, అవి నిర్వహించే విధుల ద్వారా ఆ ప్రతిష్ఠ పొందుతాయి.

2. 'రాజకీయ ప్రభుత్వం' అంటే పాలకవర్గాల ఆధిపత్యాన్ని అంగీకరించని గ్రూపులను అణచివేత ద్వారా దారిలోకి తెచ్చుకునేందుకు రాజ్యం చేతుల్లో ఉన్న నిరంకుశాధికార పనిముట్లు. ఈ పనిముట్లు మొత్తం సమాజం మీద నిరంతరం వేలాడుతూ ఉంటాయి. ఎందుకంటే సంక్షోభాలు వచ్చినప్పుడు 'సమ్మతి' విఫలమైతే వీటిని ఉపయోగిస్తారు. అంటే కోర్టులు, చట్టాలు, సైన్యం, పోలీసు, అధికార యంత్రాంగం దీని కిందకు వస్తాయి. గ్రాంసీ ఈ రెంటినీ విడదీసి చెప్పినప్పటికీ ఈ రెండూ అంటే 'సామాజిక ఆధిపత్యం' (హెజిమోనీ), 'రాజకీయ ప్రభుత్వం' (డోమినెన్స్) రెండూ ఒకే 'సమగ్ర రాజ్యం'లో భాగమే.

## పౌర సమాజం (సివిల్ సొసైటీ)

గ్రాంసీ ప్రతిపాదించిన విషయాల్లో పౌర సమాజం అనేది అతి ముఖ్యమైనది. మార్క్సిస్టులు పూర్తిగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది. పౌర సమాజం ద్వారానే సమాజం మీద పాలక వర్గాలు తమ ఆధిపత్యాన్ని (హెనిమోనీ) చెలాయిస్తాయని గ్రాంసీ సూత్రీకరించాడు. రాజ్యం అన్నది రాజకీయ సమాజం, పౌర సమాజాల కలయిక అని ఆయన చెప్పాడు. పౌర సమాజంతో ప్రజలను ఒప్పించడం ద్వారా, రాజకీయ సమాజం లేక రాజ్యంతో ప్రజలను అణచివేయడం ద్వారా పాలకవర్గాలు పరిపాలన సాగిస్తాయి. ఈ రెంటిలో ప్రభుత్వ నిరంకుశ యంత్రాంగంకంటే పౌరసమాజం బలమైందని గ్రాంసీ పేర్కొన్నాడు. 'రాజ్యం బీటలు వారితే దాని వెనుక పౌర సమాజం అనే గట్టి నిర్మాణం బయటపడుతుంది. రాజ్యం అనేది కోట బయట కందకం మాత్రమే. దాని వెనుక అత్యంత బలమైన మట్టి కట్టలు, కోట గోడలు(పౌరసమాజం) ఉంటాయి' అని గ్రాంసీ వివరించాడు. రష్యాలో అక్టోబర్ విప్లవం జరిగినప్పుడు అక్కడ ఫ్యూడల్ సమాజం బలంగా ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతగా ఎదగలేదు. అందువల్ల అక్కడ పౌరసమాజం బలపడలేదు. అక్టోబర్ విప్లవం రాజ్యంపై తిరుగుబాటు చేసినప్పుడు అది ప్రధానంగా ఎదుర్కొన్నది రాజకీయ ప్రభుత్వాన్ని. అంటే నిరంకుశ రాజ్య వ్యవస్థనూ, బలహీనంగా ఇంకా చెప్పాలంటే 'జిగట జిగటగా' ఉన్న పౌర సమాజాన్నీ. కానీ బూర్జువా వర్గం బలప డిన పశ్చిమ దేశాల్లో పౌరసమాజం రాజ్యాన్ని కాపాడేందుకు పటిష్టమైన కోటగోడలా మారిందని గ్రాంసీ వివరించాడు. 'పౌర సమాజం' అనేది చాలా సంక్లిష్టమైన నిర్మాణం. అది ఆర్థిక సంక్షోభాలు, మాంద్యాలు వంటి అనేక ఆర్థిక తుపానులను తట్టుకుని నిలబడ గలదు. సమాజ ఉపరితలంలోని పౌర సమాజం ఆధునిక యుద్ధంలో సైనికులు దాక్కునేందుకు తవ్వుకునే కందకాల (ట్రెంచ్) వ్యవస్థ వంటిది. ఒక్కోసారి యుద్ధంలో భీకరమైన బాంబు దాడులతో శత్రువుల రక్షణ వ్యవస్థలు మొత్తాన్ని తుత్తునియలు చేయవచ్చు గాక కానీ అలా నాశనమయ్యేది బాహ్య వలయం మాత్రమే. కందకాల వ్యవస్థ మాత్రం చెక్కు చెదరదు. అని గ్రాంసీ వివరించాడు.

పౌర సమాజం అనేది సామాజిక ప్రయోజనాలకూ, వ్యష్టి స్వప్రయోజనాలకూ మధ్యస్తం నడిపే ఏజెంట్ అని గ్రాంసీ చెప్పాడు. సరిగ్గా ఈ కారణం వల్లనే సమాజంలో ఘర్షణకు పౌర సమాజం వేదికగా ఉంటుందని చెప్పాడు. పెట్టుబడిదారీ భావాల ఉత్పత్తి, పునరుత్పత్తి పౌర సమాజంలోనే జరుగుతాయి. సామాజిక వర్గాల మధ్య పోటీకీ ఇది మొదటి మెట్టు. సైద్ధాంతిక ఆధిపత్యానికి(హెజిమోనీకి) ఇది మొదటి దశ. ఆ విధంగా పౌర సమాజం అనేది రాజ్యం, ఆర్థిక వ్యవస్థల మధ్య, ప్రయివేటు, సామాజిక రంగాల మధ్య సంబంధాలను పునర్నిర్వచించే వేదిక అని గ్రాంసీ పేర్కొన్నాడు. ఇదంతా ఆధిపత్యం(హెజిమోనీ) రూపంలో వ్యక్తమయ్యే సైద్ధాంతిక పోటీగా సాగుతుంది. ఈ విషయంలో గ్రాంసీ మార్క్సిస్టు మౌలిక సూత్రం నుండి వైదొలగి వర్గ పోరాటాన్ని ఆర్థిక రంగంలో కాకుండా సమాజ ఉపరితలంలోని పౌర సమాజంలోకి తీసుకువచ్చాడని కొందరు వాదిస్తున్నారు. వాస్తవానికి మార్క్స్ ఏనాడూ వర్గ పోరాటంలో సమాజ ఉపరితలం ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అదే సమయంలో గ్రాంసీ రచనలు చదివినప్పుడు ఆయన సమాజిక పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను వదిలిపెట్టి ఉపరితలమే అంతా నిర్ణయిస్తుందనీ చెప్పలేదు. మరి గ్రాంసీని మార్క్సిజానికి అభిముఖంగా నిలబెట్టే ఈ చర్చ ఎందుకు వచ్చింది?

## పునాది ఉపరితలం చర్చ

మార్క్సిస్టు సూత్రీకరణ ప్రకారం ఏ సమాజ నిర్మాణంలోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి పునాది. రెండవది ఉపరితలం. ఒకానొక సమాజంలోని ఉత్పత్తి శక్తులూ, ఉత్పత్తి జరిగేటప్పుడు వాటి మధ్య ఏర్పడే సంబంధాలు అంటే ఆర్థిక సంబంధాలు సమాజపు పునాదిగా ఉంటాయి. ఈ పునాదిపై ఆధారపడిన ఉపరితలంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలు,

భావజాలం అంటే రాజ్యాంగయంత్రం, మతం, సంప్రదాయాలు, సంస్కృతి, కళలు వగైరాలు ఉంటాయి. పునాదికీ, ఉపరితలానికీ మధ్య గతితార్కిక సంబంధం ఉంటుందనీ, వర్గ పోరాటం పునాదిలో తెచ్చే మార్పులు అంతిమంగా ఆ సమాజ గమనానికి కారణమవుతాయని మార్క్స్-ఏంగెల్స్ చెప్పారు. కారల్ మార్క్స్ రాజకీయ ఆర్థిక వ్యవస్థపై విమర్శ అన్న గ్రంధానికి ముందు మాట రాస్తూ...

> **భౌతిక జీవనపు ఉత్పత్తి విధానం సామాజిక, రాజకీయ, మేధోపరమైన అంశాలను సాధారణంగా నియంత్రిస్తుంది. మానవుల చైతన్యం వారి భౌతిక స్థితిని నిర్ణయించదు. దానికి భిన్నంగా వారి సామాజిక జీవనమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అని చెప్పాడు. మనుషుల ఆలోచనలు వారి చైతన్యాన్ని బట్టి ఏర్పడవు. అందువల్ల ఆలోచనల్లో మార్పులు వారి చైతన్యాన్ని బట్టి జరగవు. వారి ఆలోచనల్లో మార్పులకు కారణం వారు జీవించే భౌతిక జీవనంలోని సంఘర్షణలే అంటే సామాజిక ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణే అని చెప్పాడు.**

అయితే, దీన్ని కొందరు మార్క్సిస్టులు యాంత్రికంగా తీసుకుని సమాజ పురోగమనంలో పునాదే, అంటే ఆర్థిక సంబంధాలే ప్రధానం. ఉపరితలంలోని అంశాలన్నీ దానిపై ఆధారపడి నడుస్తాయని చెప్పడం ప్రారంభించారు. అంటే పునాదిలో మార్పులు జరిగితే ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలు వాటంతటవే మారుతాయని భావించారు. అంటే సామాజిక మార్పును వారు 'ఆర్థికవాదం' కిందకు కుదించేశారు. ఉదాహరణకు రెండవ ఇంటర్నేషనల్ కాట్స్కి, బెరీన్ వంటి వారు ఆర్థికరంగంలో మార్పులు వాటంతటవే రాజకీయాల్లో మార్పులు తెస్తాయి వాటి కోసం వేచి చూడమే మన పని అనే స్థితికి వెళ్లిపోయారు. ఇది ఒక రకంగా ఆర్థిక సంక్షోభం కోసం వేచి చూసేధోరణి. గ్రాంసీ ఈ ఆర్థిక వాదాన్ని తీవ్రంగా విమర్శించాడు.

నిజానికి మార్క్స్-ఏంగెల్స్ గానీ తరువాతి కాలంలో లెనిన్ గానీ ఇటువంటి ఆర్థికవాదాన్ని(ఎకనామిజం) లేక నియతి వాదాన్ని (డిటర్మినిజం) ఖండించారు. వాస్తవానికి ఆర్థిక వాదం అనే పదాన్ని మొట్టమొదట లెనిన్ ఉపయోగించాడు. సోషల్ డెమొక్రాటిక్ ఉద్యమంలో మార్క్సిజాన్ని అసభ్యకరమైన స్థాయికి దిగజార్చే ఒక వైఖరే ఆర్థికవాదం అని ఆయన చెప్పాడు. ఇది సామాజిక జీవనంలోని చైతన్యానికి సంబంధించిన అంశాన్ని దిగజార్చేస్తుందని చెప్పాడు. లెనిన్ తను రాసిన 'ఏం చేయాలి?' గ్రంథంలో ఆర్థికవాదానికి వ్యతిరేకంగా వాదించాడు. కార్మిక వర్గానికి బయటి నుండి సోషలిస్టు చైతన్యాన్ని అందించడం కమ్యూనిస్టుల కర్తవ్యమని చెబుతూ ఆ కర్తవ్యాన్ని చైతన్య పూర్వకంగా నిర్వహించకుండా ప్రత్యక్ష కార్యాచరణల వెంటబడి కొట్టుకుపోవడాన్ని ఆయన విమర్శించాడు. అయితే ఆర్థికవాదం ప్రత్యక్ష కార్యాచరణకు సంబంధించిన అంశమే కాకుండా దానికి సైద్ధాంతిక ప్రాముఖ్యత ఉందని గ్రాంసీ వివరించాడు. ఆర్థిక వాదాన్ని పుణికిపుచ్చుకున్న వారు సామాజిక పరివర్తన గురించి చెప్పేటప్పుడు కేవలం ఆర్థిక పునాది మీద కేంద్రీకరిస్తారు. సామాజిక మార్పుకు దోహదం చేసే ఇతర అంశాలు అంటే ఉప రితలంలో ఉండే సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలను విస్మరిస్తారు అని గ్రాంసీ పేర్కొన్నాడు. నిజానికి మార్క్స్ ఏంగెల్స్ కూడా ఉపరితలంలోని చైతన్యానికి సంబంధించిన అంశాల ప్రాధాన్యతను ఏనాడూ తక్కువ అంచనా వేయలేదు.

## మార్క్స్ మరణించిన తరువాత ఏంగెల్స్ 1890లో జె.బ్లాక్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు :

భౌతికవాద పద్ధతిలో చరిత్రను పరిశీలించినప్పుడు చరిత్రలో చివరి నిర్ణయాత్మక అంశం వాస్తవ జీవితపు ఉత్పత్తి, పునరుత్పత్తి అవుతుంది. దీనికిమించి మార్క్స్ గానీ, నేను గానీ ఇంకేమీ చెప్పలేదు. అందువల్ల, ఎవరైనా దీన్ని వక్రీకరించి ఆర్థికాంశం ఒక్కటే నిర్ణయాత్మకమైనది అని అంటే వారు మేము చెప్పిన దాన్ని అర్థం లేని, రూపం లేని, బుద్ధిహీనమైన మాటకింద మార్చేస్తున్నట్లే. ఆర్థిక పరిస్థితే పునాది. కానీ, ఉపరితలంలోని అనేక అంశాలు అంటే వర్గ పోరాటాలు, వాటి ఫలితంగా ఏర్పడే రాజకీయ రూపాలు ఉదాహరణకు, గెలుపొందిన వర్గం రూపొం దించే రాజ్యాంగం వగైరా, న్యాయపరమైన రూపాలు, చివరికి ఈ ప్రత్యక్ష పోరాటాలు అందులో పాల్గొన్న వారి మెదళ్లలో ప్రేరేపించే ఉద్దీపనలు, రాజకీయ, న్యాయ, తాత్విక సిద్ధాంతాలు, మతభావనలూ అవి మూఢనమ్మకాలుగా మారిపోయిన తీరు.. ఇవన్నీ చారిత్రక పోరాటాల మీద ప్రభావం చూపిస్తాయి. అనేక సందర్భాల్లో పోరాట రూపాలను నిర్ణయించడంలో ఇవే ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి. అందువల్ల మార్క్స్-ఏంగెల్స్ గాని, లెనిన్ గానీ సామాజిక ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాం స్కృతిక అంశాల ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అయితే పశ్చి మ దేశాల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థ తన వర్గాధి పత్యాన్ని మొత్తం సమాజం మీద చెలాయించడానికి ఈ ఉపరి తలాంశాలను ఎలా ఉపయోగించుకుంటున్నదో లెనిన్ తరువాతి నాయకత్వం గ్రహించలేకపోయింది. కానీ దీని గురించి గ్రాంసీ ప్రతిభావంతంగా వివరించాడు. ఈ సమాజంలో కార్మికవర్గ విప్లవాలు సాధించాలన్నా, తదనంతరం కార్మికవర్గ రాజ్యం కొన సాగించాలన్నా ఉపరితలంలోని అంశాలపైన కేంద్రీ కరించాలని పేర్కొన్నాడు. ఇందులో భాగంగా ఆయన 'ఆధిపత్యం' (హెజి మోనీ), పౌర సమాజం(సివిల్ సొసైటీ), రాజకీయ సమాజం (పొలిటికల్ సొసైటీ) వంటి భావనలను విస్తృత పరిచాడు.

ఆధునిక కాలంలో పౌర సమాజం వర్గ పోరాటానికి వేదికగా మారిందని, ఇంకో మాటలో చెప్పాలంటే వర్గ ప్రయోజనాలు కాపాడే సాధనంగా మారిందని గ్రాంసీ వాదిస్తాడు. పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని రక్షించేది పౌర సమాజం. పౌర సమాజంపై సైద్ధాంతిక ఆధిపత్యం సాధించే సారవంతమైన నేల రాజకీయ పోరాటాలేనని గ్రాంసీ చెప్పాడు. అందువల్ల పౌర సమాజం అనే క్షేత్రంలో జరిపే ఈ పోరాటాల ద్వారానే తొలుత భావజాల రంగంలోనూ, తదుపరి రాజకీయ రంగంలోనూ ఆధిపత్యం (హెజిమోనీ) సాధించడం జరుగుతుందని తెలిపాడు. ఒకసారి భావజాలరంగంలో ఆధిపత్యం(హెజిమోనీ) కార్మిక వర్గం చేతిలోకి వచ్చేసిందంటే అప్పుడిక పౌర సమాజపు అవసరం, అంటే ఆర్థిక వ్యవస్థకూ, రాజకీయ వ్యవస్థకూ మధ్య సంస్థాగతంగా జోక్యం చేసుకోవలసిన అవసరం ఉండదని గ్రాంసీ వివరించాడు. అంటే వ్యక్తుల ప్రయోజనాలకూ, సామాజిక ప్రయోజనాలకూ మధ్యవర్తిత్వం నడిపేది పౌర సమాజం. సోషలిస్టు సమాజంలో అటువంటి మధ్యవర్తిత్వం నడపాల్సిన అవసరం ఉండదు కనుక పౌర సమాజపు అవసరం ఉండదని వివరించాడు.

పెట్టుబడిదారీ రాజ్యాన్ని ఓడించాలంటే పౌర సమాజంలో ఆ వర్గం తరపున పనిచేసే సంస్థలను గెలుచుకోవాలంటాడు గ్రాంసీ. విలువల్లోనూ, సంస్కృతిలోనూ కొత్త మార్పులు తీసుకురావాలి. ఈ పనిలో కార్మిక వర్గానికి చెందిన కొత్త మేధావులు కీలక పాత్ర నిర్వహిస్తారని చెప్పాడు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య పౌర సమాజంలో రాజ్యానికీ, కార్మికులకూ మధ్య జరిగిన మధ్యస్థాల వల్ల పాలక పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్యాన్ని కార్మికులు ఆమోదించే విధంగా రాజకీయాలు మలచబడ్డాయని గ్రాంసీ వివరించాడు. మత సంస్థలు, యూనియన్లు, పౌర సమాజంలోని ఇతర సంస్థలు రకరకాల లక్ష్యాలతో పనిచేసేవన్నీ కూడా పెట్టుబడిదారీ వర్గ సైద్ధాంతిక ఆధిపత్యానికి కార్మికుల నుండి సమ్మతిని పదేపదే ఉత్పత్తి చేశాయని చెప్పాడు. పెట్టుబడిదారీ వర్గపు "మేధో పరమైన, నైతిక పరమైన ఆధిపత్యం" అనేది పౌర సమాజంలోని వివిధ సంస్థలు వ్యక్తీకరించే సమ్మతి ద్వారా వెల్లడవుతుందని గ్రాంసీ వివరించాడు. అందువల్ల మార్పు కోసం జరిగే వర్గ పోరాటం ఆర్థిక రంగంతో పాటు సైద్ధాంతిక ఆధిపత్యం కోసం, ఇంకో మాటలో చెప్పాలంటే చైతన్యాన్ని ప్రభావితం చేసే పోరాటంలో కేంద్రీకృతమవుతుందని చెప్పాడు. లెనినిస్టు సూత్రం ప్రకారం ఉత్పత్తికి సంబంధించిన భౌతిక పరిస్థితులు పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. అయితే ఈ ఆధిపత్యం (హెజిమోనీ) పౌర సమాజంలోని సంస్థల ద్వారా చెలాయించబడుతుంది. అందువల్లనే పౌర సమాజం రాజ్యంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తుంది గానీ వాస్తవంగా రాజ్యంలో ఇది ఒక అంతర్భాగమేనని ఆయన వివరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాలలు, విశ్వ విద్యాలయాలు, మత సంస్థలు వగైరాలు.. పెట్టుబడిదారీ వర్గపు ఆధిపత్య విలువలను ఉత్పత్తి చేసి పెట్టుబడిదారీ రాజ్యాన్ని రక్షించడం కోసం "బలమైన కోటలు, కందకాల వ్యవస్థగా" రూపొందాయని గ్రాంసీ చెప్పాడు. రెండు ప్రపంచ యుద్ధాల కాలంలో పార్లమెంటరీయిజం, దానికి సంబంధించిన పార్టీలు, యూనియన్ల వ్యవస్థలు విస్తృతమైనాక, విస్తారమైన రాజ్య, 'ప్రయివేటు' అధికార యంత్రాంగం వేళ్లూనుకున్న తరువాత, ఆర్థిక, ఆర్థికేతర 'రాజకీయ' పార్టీలు, ఇతర సంస్థలు నాటి రాజకీయ వ్యవస్థల్లో భాగాలుగా మారాయి. ఆ విధంగా అవి మార్పుకు అడ్డంకిగా మారాయి అని గ్రాంసీ వివరించాడు. రాజ్యం, పౌర సమాజాల మధ్యనున్న సంబంధం, ఈ రెంటికీ బూర్జువా వర్గపు అధిపత్య సిద్ధాంతంతో ఉన్న సంబంధం దాంతోపాటు ఒప్పించే యంత్రాంగం ద్వారా అంటే పాలితుల సమ్మతిని సాధించే పద్ధతి ద్వారా ఈ ఆధిపత్య సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేయడం అనేది గ్రాంసీ సూత్రీకరణల్లోని ప్రధానమైన అంశం. పౌర సమాజంలోని ఏ సంస్థ కూడా, దాని లక్ష్యం ఏదైనా కానీయండి అది నిరంతరాయంగా పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేసే లక్షణం కలిగి ఉంటుంది.

గ్రాంసీ సూత్రీకరణ ప్రకారం పౌర సమాజమూ, దాని సంస్థలూ పెట్టుబడిదారీ వర్గంతోనూ, దాని సైద్ధాంతిక ఆధిపత్యం కిందనూ ఉన్నంత కాలం విప్లవోద్యమాన్ని అడ్డుకుంటూనే ఉంటాయి. పెట్టుబడిదారా వ్యవస్థ తనలోని అంతర్గత వైరుధ్యాల వల్ల కుప్పకూలిపోవడం కోసం వేచి ఉండడం విప్లవ చర్య కాజాలదు. అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల పెట్టుబడారీ వ్యవస్థలు అంతర్గత వైరుధ్యాలతో కుప్పకూలిపోతే వాటిపై నియంత్రణ సాధించడం సాధ్యం కాదు. రష్యాలో "రాజ్యమే అన్నీ అయింది. పౌర సమాజం శైశవ దశలో, పలుచటి బంకలా ఉంది. పశ్చిమ దేశాల్లో రాజ్యానికీ, పౌర సమాజానికీ మధ్య సరైన సంబంధాలున్నాయి. అక్కడ రాజ్యం కుప్పకూలిపోతే వెనువెంటనే పటిష్టమైన పౌర సమాజం అనే బలమైన నిర్మాణం బయట పడుతుంది" అని గ్రాంసీ వివరించాడు. అందువల్లనే "అక్కడ ప్రజా సమూహాలను ఎడ్యుకేట్ చేసి, వారి సమిష్టి చైతన్యాన్ని సమీకరించాలి. వారిలోకి కొత్త విలువలను ఎక్కించి దాన్ని విప్లవం కోసం సిద్ధం చేయాలి. ఇటువంటి చర్య ద్వారా మాత్రమే వారిని కార్యాచరణలోకి దించగలం" అని ఆయన చెప్పాడు. ఈ వివరణ ద్వారా గ్రాంసీ ఒక విషయం స్పష్టం చేశాడు. ప్రత్యామ్నాయ పౌర సమాజాన్ని సృష్టించడం ద్వారా ప్రత్యామ్నాయ రాజ్యాన్ని సృష్టించాలన్నాడు. కార్మికవర్గ విలువలు, లక్ష్యాలను పుణికిపుచ్చుకున్న విప్లవ యంత్రాంగం ద్వారా ఈ పనిచేయాలని ఆయన చెప్పాడు. ఈ విప్లవ

యంత్రాంగం కార్మిక వర్గ విలువలనూ, సైద్ధాంతిక ఆధిపత్యాన్నీ మళ్లీమళ్లీ ఉత్పత్తి చేయగలగాలని చెప్పాడు. దీనికోసం కార్మికవర్గాన్ని అంతర్గతంగా ఎడ్యుకేట్ చేయడం, పెట్టుబడిదారీ పౌర సమాజానికి ప్రత్యామ్నాయ సంఘాలను సృష్టించడం జరగాలన్నాడు. మానవాళి దశల వారీగా తన స్వంత విలువలతో కూడిన చైతన్యాన్ని సంతరించుకుంటుంది. ఈ చైతన్యం మొదట కొద్ది మంది వ్యక్తుల్లో ఏర్పడుతుంది. తదుపరి మొత్తం వర్గం దాన్ని పుణికిపుచ్చుకుంటుంది. దాంతో అప్పటివరకు అణచివేయబడి ఉన్న వర్గం తిరుగుబాటుకు, సామాజిక పునర్నిర్మాణానికి పూనుకుంటుందని చెప్పాడు.

ఆ విధంగా గ్రాంసీ పశ్చిమ యూరప్‌ని పెట్టుబడిదారీ దేశాల్లో అధికార వ్యవస్థలు ఎలా ఉంటాయో చెప్పడమే కాదు, ఆ దేశాల్లో కమ్యూనిస్టు విప్లవాలు జయప్రదం కావాలంటే ఏం చేయాలో కూడా చెప్పాడు. పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి కార్మికవర్గ రాజ్యాన్ని నెలకొల్పాలంటే ఆర్థిక సంక్షోభాలు వస్తేనే సరిపోదని ఆయన వాదించాడు. ఆర్థిక సంక్షోభాలు మాత్రమే పీడిత వర్గాలను పోరాటాల వైపు నెట్టవు. వారిలో బలమైన పోరాటేచ్ఛను పెంపొందించవు. లేక అవి మాత్రమే బూర్జువా వర్గపు ధైర్యాన్ని సడలించలేవు. చివరికి శిథిలాల్లో ఉన్నా కూడా పెట్టుబడిదారీ వర్గాన్ని యుద్ధ రంగం నుండి తరిమి వేయలేవని గ్రాంసీ స్పష్టం చేశాడు. సాయుధ దాడుల ద్వారా మాత్రమే కార్మికవర్గం బూర్జువా వర్గాన్ని కూలదోయలేదని వాదించాడు. 'కేవలం సైనిక నమూనాను నమ్ముకుని కూర్చోవడం వెర్రితనం. ఇక్కడ కూడా సైనిక చర్యల మీద రాజకీయాలే ప్రాధాన్యత వహిస్తాయి. రాజకీయాలు మాత్రమే వ్యూహాత్మకంగా వ్యవహరించడానికీ, ముందుకు కదలడానికీ అవకాశాలు కల్పిస్తాయి' అని చెప్పాడు. గ్రాంసీ దృష్టిలో రాజకీయ పోరాటాలు అంటే వర్గాధిపత్యం కోసం జరిగే పోరాటమే. రాజ్యాధికారాన్ని చేపట్టి రాజ్యాన్ని ఎడ్యుకేటర్గా మార్చేందుకు జరిగే వర్గ పోరాటమే 'ఆధిపత్యం' (హెజిమోనీ) కోసం జరిగే పోరాటం అని ఆయన చెప్పాడు. మొదటి ప్రపంచయుద్ధం తరువాత తలెత్తిన అత్యంత తీవ్రమైన సంక్షోభ పరిస్థితుల్లో కూడా పశ్చిమ ఐరోపా దేశాల్లో కార్మిక వర్గం మొత్తంగా విప్లవ చైతన్యం పెంపొందించడంలో ఎందుకు విఫలమైంది ? పాలనా వ్యవస్థను కూల్చడానికి బదులుగా దానికి అనుగుణంగా ఆలోచించే సంస్కరణ వాదంలో ఎందుకు పడిపోయింది? ఈ ప్రశ్నలకు లెనిన్ 'ఏం చేయాలి' గ్రంథంలో కొంతవరకు వివరణ ఇచ్చాడు. బూర్జువా సిద్ధాంత బలం ఎంతగా ఉంటుందంటే కార్మిక వర్గాన్ని గనుక దాని మట్టుకు దాన్ని వదిలేస్తే దానికి అబ్బేది ట్రేడ్ యూనియన్ చైతన్యం మాత్రమే, అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలోనే తమ జీవన పరిస్థితులను మెరుగుపరుచు కోవాలన్న కాంక్ష మాత్రమే అని లెనిన్ పేర్కొన్నాడు. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో గ్రాంసీ విశ్లేషణ మార్క్సిజానికి మరింతగా తోడ్పడుతుంది. పాలక వర్గాలు ఎలా పాలిస్తున్నాయో, పాలించాలో వివరించడానికి ఇతరుల కన్నా గ్రాంసీ విశ్లేషణ బాగా ఉపయోగపడుతుంది. 'ఆధునిక యువరాజు', 'అమెరికనిజం-ఫోర్డిజం' అన్న వ్యాసాల్లో ఆయన ఈ అంశాలపై మరింత విశ్లేషణ చేశాడు.

## ప్రతి-ఆధిపత్యం (కౌంటర్-హెజిమోనీ)

ద్వారా గ్రాంసీ చెప్పిందే నిజమైతే అంటే పాలక వర్గాలు ప్రజల సమ్మతితోనే తమ వర్గాధిపత్యాన్ని కొనసాగించ గలుగుతుంటే, కేవలం చివరి అస్త్రంగా మాత్రమే వారు ప్రత్యక్ష అణచివేత యంత్రాంగాన్ని ఉపయోగిస్తుంటే అప్పుడు పాలక వర్గాలను అధికారం నుండి తొలగించాలనుకుంటున్న విప్లవ వర్గాలు ఏం చేయాలి? పాలకులకూ, పాలితులకూ మధ్య ఏర్పడిన సైద్ధాంతిక బంధం పాలక పెట్టుబడిదారీ వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించగలుగుతుంటే విప్లవ వర్గాల వ్యూహం ఎలా ఉండాలి? దానికి గ్రాంసీ ఇలా సమాధానం చెప్పాడు: పాలక వర్గాల సైద్ధాంతిక 'ఆధిపత్యం' (హెజిమోనీ)ని ఛేదించాల నుకునే వారు పాలకవర్గాలకు వ్యతిరేకంగా "ప్రతి-ఆధిపత్యం" (కౌంటర్-హెజిమోనీ) నిర్మించాలి. అంటే వారు సమాజ నిర్మాణంలో మార్పునూ, సైద్ధాంతిక మార్పునూ ఒకే పోరాటం లో భాగంగా చూడాలి. వర్గ పోరాటంలో పెట్టుబడికీ, కార్మిక వర్గానికీ ఘర్షణ కేంద్రంగా ఉంటుంది. కానీ, పీడించబడుతున్న వర్గాలు తమను పరిపాలించేందుకు తమ రాజకీయ, ఆర్థిక యజమానులకు ఉన్న హక్కును ప్రశ్నించాలంటే, అలా ప్రశ్నించే చైతన్యం వారికి కలగాలి. అటువంటి చైతన్యం వారిలో సైద్ధాం తిక పోరాటం ద్వారా మాత్రమే వస్తుంది. దానికోసం పౌర సమాజంలో విజ్ఞత (కామన్ సెన్స్) రూపంలో స్థిరపడిపోయిన ప్రజా చైతన్యాన్ని సవాలు చేయాలి. అయితే, ప్రజల్లో స్థిరపడి పోయిన చైతన్యాన్ని అధిగమించడం అంత తేలికైన పని కాదు. ఎందుకంటే పాలక వర్గాల సైద్ధాంతిక ఆధిపత్యం వల్ల సమా జంలో జరుగుతున్న దాన్ని 'విజ్ఞతగా' మెజారిటీ ప్రజలు అంగీ కరిస్తారు. 'సమాజాన్ని నడపడానికి అదొక్కటే మార్గం' అనుకుం టారు. జరుగుతున్న పరిణామాల పట్ల ఫిర్యాదులు, అసంతృ ప్తులు ఉండవచ్చు. ప్రజలు మరింతమెరుగైన పాలన, సంస్కర ణలు కావాలని కోరుకోవచ్చు. కానీ, సమాజంలోని మౌలికమైన నమ్మకాలు, విలువలు తటస్థంగా ఉన్నాయనీ, లేక వర్గ సమా జం అంతటికీ అవి సాధారణంగా వర్తిస్తాయనీ వారు భావిస్తా రు. వాళ్లు రొట్టెల ఫ్యాక్టరీ నాది అనుకోరు. ఒకటో రెండో రొట్టె ముక్కలు అదనంగా లభిస్తే చాలు అనుకుంటారు. ఇలా సామాజిక విజ్ఞత (కామన్సెన్స్) రూపంలో చెలామణీ అయ్యే ఈ 'ఆధిపత్య' భావజాలాన్ని 'ప్రతి-ఆధిపత్య' భావజాలంతో సవాలు చేయాలి. 'ప్రతి-ఆధిపత్యం' అనేది నిజమైన 'ఆధిపత్యం' కాదు.

కార్మికవర్గం లేక విప్లవ వర్గాలు తమ 'ఆధిపత్యాన్ని (హెజిమోనీని) నెలకొల్పడానికి ఆర్థికంగా, రాజకీయంగా, సైద్ధాంతికంగా సిద్ధం కావడమే "ప్రతి-ఆధిపత్యం".

## ప్రతి-ఆధిపత్య నిర్మాణంలో మేధావుల పాత్ర

"ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించడంలో మేధావుల పాత్రకు గ్రాంసీ అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. కార్మికవర్గ విప్లవ పోరాటానికీ, పురోగామి మేధావులకూ ఉండాల్సిన సంబంధాలను గురించి ఆయన విపులంగా చర్చించాడు. పురోగామి మేధావులను ఆయన రెండుగా విభజించాడు. మొదటి రకం, ఇతర వర్గాల నుండి వచ్చే ప్రజాతంత్ర మేధావులు. రెండు, కార్మికవర్గ పోరాటం నుండి పుట్టుకు వచ్చిన మేధావులు. ఈ రెండు రకాలూ కలిసి విప్లవ కార్మికవర్గ ఉద్యమం అవుతారు. బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించే చారిత్రక కర్తవ్యాన్ని కార్మికవర్గం నెరవేర్చాలంటే వారు మూడు రంగాల్లో అంటే ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో సమగ్ర పోరాటాం చేయాలి. ఈ మూడు రంగాల్లో సమగ్రంగా జరిగే పోరాటమే వర్గ పోరాటం. ఏదో ఒక రంగంలో మాత్రమే చేసే పోరాటం పాక్షిక పోరాటం అవుతుంది గానీ సమగ్ర పోరాటం కాదు. ఇలా సమగ్ర పోరాటం చేయకుండా కార్మికవర్గం విప్లవం ద్వారా బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించడం సాధ్యం కాదని ఏంగెల్స్ చెప్పిన మాటలను లెనిన్ ప్రస్తావించాడు. మేధావులు ఒక ప్రత్యేక వర్గం కాదని గ్రాంసీ చాలా స్పష్టంగా చెప్పాడు. వాళ్లు అటు పాలక వర్గంలో గానీ కార్మికవర్గ నాయకత్వంలోని శ్రామిక వర్గంలో గానీ అంతర్భాగంగా ఉంటారు. ఈ రెండు వర్గాల్లో అంటే అటు పాలక వర్గంలో ఇటు పాలిత వర్గంలో ఉండే మేధావుల మధ్య ఐక్యత పోరాటం నిరంతరం సాగుతుంటుంది. ఈ ఐక్యతా పోరాటమే ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం జరిగే పోరాటంలో మేధావుల పాత్రను నిర్ణయిస్తుంది. కార్మికవర్గం 'ప్రతి-ఆధిపత్యాన్ని నిర్మించే పనిని కార్మికవర్గ "సజీవ మేధావుల" ద్వారా సాగించాలని గ్రాంసీ చెప్పాడు. సజీవ మేధావులు ఎవరంటే ఆధిపత్య వర్గాల తరఫున కింది వర్గాలపై సామాజిక ఆధిపత్యం, రాజకీయ పరిపాలన నిర్వహించే వారు. పాలకవర్గాల తరఫున ఇతరులను సమీకరించడం, పరిపాలనసాగించడం, మార్గదర్శకత్వం వహించడం, ఎడ్యుకేట్ చేయడం, నాయకత్వం వహించడం వీరి పని. 'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మిం చే కార్మికవర్గం కూడా ఆ పని కోసం తన స్వంత 'సజీవ మేధావులను' తయారు చేసుకోవాలని గ్రాంసీ చెప్పాడు. ఇక్కడ మేధావులు అంటే గ్రాంసీ ఉద్దేశంలో నాలుగు గోడల మధ్య పుస్తకాలతో కుస్తీపట్లు పడుతుండే అకాడమిక్ మేధావులు కాదు. "ప్రజలందరూ మేధావులే" అని ఆయన రాశాడు. "అయితే సమాజంలో అందరూ మేధావులు పని చేయరు". అంటే ప్రతి ఒక్కరికీ మేధస్సు ఉంటుంది, దాన్ని ఉపయోగిస్తారు గాని అందరూ సామాజిక పని విభజనలో మేధావుల పని చేయరు. ఉదాహరణకు, ఒక వ్యక్తి వంకాయ కూర వండుతాడు, ఇంకొకడు చొక్కాకు బత్తాయిలు కుడతాడు. అంతమాత్రాన వాళ్లను వంట వాడనీ, దర్జీ అనీ అనలేం. ఈ పనులను ప్రత్యేకంగా చేసే వారినే అలా పేర్కొంటాం. మేధావుల విషయం కూడా అంతే అని గ్రాంసీ వివరించాడు. అభివృద్ధి చెందే ప్రతి సామాజిక వర్గం తనతో పాటుగా తన మేధోపరమైన పనులు నిర్వహించే మేధావులను కూడా తయారు చేసుకుంటుంది. వాళ్లు మేనేజర్లుగానో, సివిల్ సర్వంట్లుగానో, పురోహితులుగానో, ఉపాధ్యాయులుగానో, టెక్నీషియన్లు, లాయర్లు, సైంటిస్టులు, డాక్టర్లు వగైరాలుగా పనిచేస్తారు. వాళ్లు పాలక వర్గంతో పాటు కలిసి అభివృద్ధి చెంది పాలక వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తారు. అందువల్ల మేధావులు సమాజంలో వర్గాలకు అతీతంగా తటస్థంగా ఉంటారనడం మిథ్య అని గ్రాంసీ స్పష్టం చేశాడు. పౌర సమాజం ద్వారా పాలక వర్గాల ఆధిపత్యాన్ని పాలితుల చేత ఒప్పించే పని నిర్వహించేది ప్రధానంగా మేధావులు. గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజలచేత కూడా అలా భావించబడేవారు సంప్రదాయ మేధావులు. వాళ్లు స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తారు. సమాజంలో ఎన్ని మార్పులు జరుగుతున్నా ఈ రకం మేధావులు మాత్రం చారిత్రకంగా కొనసాగుతూ వస్తున్నట్లు కనిపిస్తారు. పూజారులు, రాయసగాళ్లు, తత్వవేత్తలు, ప్రొఫెసర్లు ఇలాంటి కోవకు వస్తారు. వీళ్లు పాలక వర్గాల నుండి తాము స్వతంత్రంగా ఉన్నామని అనుకుంటున్నా అదంతా మిథ్య మాత్రమే. ప్రధానంగా వాళ్లు పాలక వర్గంతో ఉండి వారికి సహకరించే పాతకాలపు లేక మితవాద మేధావులు మాత్రమే.

సజీవ మేధావులు రెండో రకం. వీళ్లు ఆధిపత్య వర్గంతోబాటుగానే పుట్టి పెరుగుతారు. వాళ్ల ఆలోచనలకు ప్రతిరూపాలుగా ఉంటూ ప్రజలను సమీకరించే పని చేస్తుంటారు. ఇటువంటి మేధావులు గురించి ఆలోచించడం ముఖ్యం అని గ్రాంసీ చెప్పాడు. సమాజంలో పాలకవర్గాల వ్యవహారాలు చక్కబెట్టడానికి విద్యావిధానం ద్వారా ఈ మేధావులు ఉత్పత్తి చేయబడతారు. వీరి ద్వారానే పాలక వర్గాలు మొత్తం సమాజం మీద తమ 'ఆధిపత్యం'(హెజిమోనీ)ని చెలాయిస్తాయి. పాలకవర్గాలను అధికారం నుండి తొలగించాలనుకునే వారు 'ప్రతి-ఆధిపత్యం' నిర్మించాలి. అంటే చెలామణిలో ఉన్న ఏకాభిప్రాయాన్ని సవాలు చేయాలి, 'విజ్ఞత' పేరుతో సాగుతున్న భావజాలాన్ని ఎదుర్కోవాలి. ఎలా? దీనికి గ్రాంసీ చెప్పిందేమంటే... కార్మికవర్గం సంప్రదాయ మేధావుల్లో గణనీయమైన భాగాన్ని తనవైపు తిప్పుకోవడమే కాకుండా కార్మికవర్గ ఉద్యమం తనదైన 'సజీవ మేధావులను తయారు చేసుకోవాలి. "మానవ జీవితంలోని అన్ని

రంగాల్లోనూ మేధావులకు పని ఉంటుంది" అంతేకాదు, ప్రతి మనిషీ తను చేస్తున్న వృత్తికి బయట ఏదో ఒక రకం మేధో కృషి జరుపుతూనే ఉంటాడు, ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉంటాడు, ఏదో ఒక నైతిక విలువకు కట్టుబడి ఉంటాడు. అందువల్ల అతను తన వంతుగా ప్రాపంచిక దృక్పథానికి తోడ్పడ్డమే కాదు దాన్ని తన దృక్పథానికి అనుగుణంగా మార్చడానికి ప్రయత్ని స్తాడు. ఆ విధంగా కొత్త ఆలోచనా విధానాలను ఉనికిలోకి తెస్తుంటాడు. అంటే, ప్రజలకు ఆలోచించే సామర్థ్యాలు ఉంటా యి. అయితే, సమస్యంతా ఆ సామర్థ్యాలను ఎలా బయటకు తీయాలి అన్నదే. కార్మికవర్గంలో ఇటువంటి సామర్థ్యాలను బయటకు తీసి తనదైన 'సజీవ మేధావులను' తయారు చేసుకో వాలనీ, సంప్రదాయ మేధావుల్లో నుండి సాధ్యమైనంత ఎక్కువమందిని విప్లవ పోరాటంలోకి లాక్కోవాలనీ గ్రాంసీ బోధించాడు. తను నిర్వహించిన 'కొత్త శకం' పత్రిక ద్వారా అటువంటి మేధావులను ఆకర్షించడానికి ప్రయత్నించాడు. ఈ పత్రికకు 'వారం వారం సోషలిస్టు సంస్కృతి పై సమీక్ష' అనే ఉపశీర్షిక పెట్టాడు. 1919లో టురిన్ నగరంలో పెద్ద ఎత్తున పారిశ్రామిక సమ్మెలు, మిలిటెంట్ రాజకీయ కార్యకలాపాలు సాగుతున్న సమయంలో ఆయన ఈ పత్రిక నడిపాడు. గ్రాంసీ సైద్ధాంతిక పోరాటం గురించి చెప్పిన విషయాలు కేవలం చైతన్యాన్ని పెంపొందించడానికి మాత్రమే పరిమితం కాలేదు. చైతన్యాన్ని మార్చాలని, సోషలిస్టు చైతన్యాన్ని సృష్టించాలని చెప్పాడు. కార్మికవర్గ దైనందిన జీవితానుభవాల ద్వారా అటువంటి చైతన్యం పొందేందుకు తోడ్పడాలని చెప్పాడు. అందువల్ల మేధావుల కృషి ఎక్కడో నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల దైనందిన జీవితంలో భాగంగా సాగాలని చెప్పాడు. "కొత్త మేధావులను ఎంతబాగా విషయాలు చెప్పగలుగుతున్నారన్న దాన్నిబట్టి కాకుండా దైనందిన జీవితంలో నిర్మాతలుగా, ఆర్గనైజర్స్ వారి పనిని బట్టి నిర్ణయించాలి. నిరంతరం వెంటబడి పనులు జరిగేట్లు చూసేవారే గానీ కేవలం ఉపన్యాసాలు చెప్పేవారు సజీవ మేధాలు కాదు" అని ఆయన వివరించాడు.

దైనందిన జీవితంలో చురుకుగా పాల్గొనే కార్మికవర్గ మేధావులను తయారు చేసుకోవడం ద్వారా ప్రస్తుత సామాజిక సంబంధాలను బద్దలుగొట్టే "ప్రతి-ఆధిపత్యం" ఏర్పాటుకు తోడ్పడాలి అని చెప్పాడు. ఆ విధంగా ఆయన సిద్ధాంతాన్ని ఆచరణకు ముడిపెట్టాడు. కార్మికవర్గం నుండి ఇతర పీడిత వర్గాల నుండి మేధావులను తయారు చేయడంలో అనియత విద్య ఎంతగానో తొడ్పడుతుందని గ్రాంసీ చెప్పాడు. అందువల్లనే గ్రాంసీ జైలు రచనల్లో ఎక్కువ భాగం విద్యా విధానం ఎలా ఉండాలి అన్నదానికి కేటాయించాడు.

## వర్తమాన సమాజం-గ్రాంసీ బోధనల ప్రాముఖ్యత

గ్రాంసీ తక్కువ కాలమే 46 సంవత్సరాలు జీవించాడు. (పుట్టుక: 1891 జనవరి 22, మరణం: 1937 ఏప్రిల్ 27 అందులోనూ చివరి 11 ఏళ్లు (1926 నుండి 1937 వరకు) తీవ్రమైన అనారోగ్యంతో ఫాసిస్టు ముస్సోలినీ జైల్లో మగ్గాడు. అయినప్పటికీ ఆయన బయట జరుగుతున్న పరిణామాలను తెలుసుకుంటూనే ఉన్నాడు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య పశ్చిమ ఐరోపాలోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలు కార్మికవర్గంపై ఎలా తమ ఆధిపత్యాన్ని (హెజిమోనీ) నెలకొల్పు తున్నాయో గమనించడమే కాదు ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న వ్యవస్థాగత మార్పుల గురించి కూడా "అమెరికనిజం, ఫోర్డిజం". "కొత్త యువరాజు" అనే రచనల్లో హెచ్చరికలు చేశాడు. అమెరికాలో జరుగుతున్న మార్పులు పెట్టుబడిదారీ వ్యవస్థకు "కొత్త ముఖాన్ని" సమకూరుస్తున్నాయని చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో అమెరికన్ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో తెచ్చిన మార్పులు, అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్ ప్రారంభించి తదుపరి అధ్యక్షులు కొనసాగించిన 'న్యూ డీల్' చర్యలు అమెరికా లోనే కాకుండా మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలోని కార్మిక వర్గంలో భ్రమలు సృష్టించింది. ఈ చర్యలన్నీ అప్పటికే రష్యాలో కార్మికవర్గ నాయకత్వంలో ఏర్పడిన కమ్యూనిస్టు రాజ్యం నుండి పశ్చిమ దేశాల కార్మికవర్గ దృష్టిని మళ్లించేందుకు, సోషలిజానికి ప్రత్యామ్నాయంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త రూపు సంతరిం చుకుంటోందని చెప్పడానికీ ఉపయోగపడ్డాయి. సిపిఐ(ఎం) అగ్రనాయకుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఈ విషయంలో గ్రాంసీ ముందు చూపు గురించి ఈ విధంగా చెప్పారు: "అక్టో బర్ విప్లవం తరువాత 80 ఏళ్లు గడిచినా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఒక్క దాన్లో కూడా విప్లవం రాకపోగా సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలే సోషలిజం నుండి వెనక్కు మళ్లి ఆర్థంగా పెట్టుబడిదారీ వ్యవస్థ నూ, రాజకీ యంగా బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కౌగలించుకు న్నాయంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి క్రమంలో వచ్చిన మార్పుల ప్రాముఖ్యత అర్థమవుతుంది. సోషలిజాన్ని తుపాకుల తో ఓడించలేదు.. లెనిన్ ఊహించినట్లు ఆర్థిక ఉత్పత్తి విధానం లో జరిగిన చారిత్రక పోరాటంలో అది ఓడించబడింది. అమెరి కాకు చెందిన అణ్వస్త్రాలు కాదు సోవియట్ను దెబ్బతీసింది. కొత్త శాస్త్ర-సాంకేతిక విప్లవం తాత్కాలికంగా నైనా, సోషలిజం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ మెరుగైనది అన్న భావన కలిగించింది. ..విశేషమేమంటే, ఆంటోనియో గ్రాంసీ తన జైలు రచనలు (ప్రిజన్ నోట్ బుక్స్)లో 'అమెరికనిజం, ఫోర్డిజం' అన్న రచనలో ఈ విషయాలను ముందుగానే గ్రహించగలిగాడు."

వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త శకంలోకి – ద్రవ్య పెట్టుబడి చోదిత ప్రపంచీకరణ యుగంలోకి

ప్రవేశించింది. అది పెంచి పోషిస్తున్న వినిమయదారీ విధానం ప్రపంచ వ్యాపితంగా కొత్త విలువలను సృష్టిస్తోంది. ప్రజల్లో గతంలో ఉన్న భావాలకు అర్థాలను మార్చేస్తోంది. వ్యష్టి నుండి సమిష్టికి మారడం, సంపదను అందరికీ పంచడం వంటివి ఒక నాడు ఆర్థిక సంస్కరణలు అంటే ప్రజల్లో ఉండే భావన, గ్రాంసీ పరిభాషలో చెప్పాలంటే ప్రజల్లో పాలకవర్గాలు కల్పించిన సాధారణ 'విజ్ఞత' (కామన్ సెన్స్). కానీ నేడు సంస్కరణలంటే ప్రజల సంపదను ప్రయివేటు పరం చేయడం, లేనివానిపై భారాలు మోపి, ఉన్న వాని బొక్కసాలు నింపడం. సంపద సృష్టికి కార్మికుని శ్రమ మూలం అనే భావన స్థానంలో పెట్టుబడులే సంపదను సృష్టిస్తాయన్న భావన బలపడింది. అప్పులు చేస్తే తిప్పలొస్తాయనే భావం పోయి అప్పు మనిషి గొప్పకు చిహ్నంగా మారిపోయింది. కాయకష్టం చేసేవారు రోజురోజుకీ మరింత పేదరికంలోకి పోతున్నా, కుబేరులు మరింత కుబేరులవుతున్నా వ్యవస్థను ప్రశ్నిండం పిచ్చితనంగా మారిపోతున్నది. ద్రవ్య పెట్టుబడి దోపిడీని ప్రశ్నించడం తెలివి తక్కువతనం కిందా, ఎన్ని రాయితీలైనా ఇచ్చి దాన్ని ఆకర్షించేవాడు తెలివైన వాడు గానూ చెలామనీ అవుతోంది. విద్యారంగంలోనూ ఇంకా అనేక జీవన రంగాల్లోనూ సృష్టించబడుతున్న కొత్త భావజాలం అంతా పాలితులపై పాలక వర్గాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోడానికి తోడ్పడుతున్నాయి. మితవాద భావజాలం, మన దేశంలో మతతత్వ మితవాద భావజాలం కొత్త తిరోగమన విలువలను సృష్టిస్తున్నాయి. ప్రజల ఆలోచనలపై మతతత్వ ఆధిపత్యం సాధించగలిగింది గనుకనే నేడు మతం, కులం, ఇతర మూఢ భావాల పేరుతో ఎన్ని దురాగతాలకైనా పాలకులు పాల్పడగలుగుతున్నారు.

ఈ ఆధిపత్య భావజాలం ప్రజలను పాలకుల నుండి వస్తున్న నిజమైన కష్టాల నుండి దృష్టి మళ్లించగలుతున్నది. ఇది మన దేశంలోనే కాదు అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలతో సహా ప్రపంచవ్యాపితంగా జరుగుతున్న పరిణామం. అమెరికాలో పెంచిపోషించబడుతున్న తెల్లజాతి దురహంకారం, యూరప్లో వలసదారులకు వ్యతిరేకంగా తలెత్తుతున్న సంకుచిన భావజాలం. ఇటలీతో సహా అనేక దేశాల్లో నయా-ఫాసిస్టు శక్తులకు ఆదరణ లభించడం ఇవన్నీ కూడా దీనికి ఉదాహరణలే. ఇలాంటి పరిస్థితుల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ సమాజంలో విప్లవాలను జయప్రదం చేయడానికి మార్క్సిస్టు మహోపాధ్యాయుల రచనలకు తోడుగా గ్రాంసీ బోధనలు కార్మికవర్గానికి ఎంతగానో తోడ్పడతాయన్న దాంట్లో సందేహం లేదు. ❑

# నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం

**(7వ పేజీ తరువాయి)**

సైనిక పితూరీ ద్వారా మాత్రమే వారిని పదవీభ్రష్టులు చెయ్యడం సాధ్యమయ్యే పరిస్థితి ఏర్పడింది! చరిత్రలో కొట్టొచ్చినట్లు కనిపించే ఘోరమైన నష్టాలన్నీ ఈ నిర్లిప్తతా, నిష్క్రియాపరత్వాల పర్యవసానంగా జరిగినవే. చీకటి మాటున, తెరచాటు వ్యవహారాలెన్నో జరిగిపో యాయి. సమష్టి జీవనరంగాన్ని నిర్ణయిస్తున్న శక్తులెవరనే విషయమే ఎవరికీ పట్టకుండా పోయింది. చివరికి, అసలేం జరిగిపోయిందో జనానికి తెలియకుండానే అంతా అయి పోయింది! తదనంతర కాలంలో, జరిగిన కుట్రలన్నీ వెలుగు లోకి వచ్చాయి. చీకటిమాటున మొదలుపెట్టిన సాలెగూటి అల్లకం నెమ్మదిగా పూర్తయింది! ప్రతి ఒక్క రంగాన్నీ, ప్రతి ఒక్క వ్యక్తినీ ప్రమాదం కమ్ముకుపోయింది. చివరికి తీవ్రమైన ప్రకృతి వైపరీత్యంగా – ఓ అగ్ని పర్వతం బద్దలవడమో, ఓ భూకంపమో మాదిరిగా మిగిలిపోయింది చరిత్ర. మనమందరం ఆ వైపరీత్య బాధితులుగా మిగిలాం!! ఈ పరిణామం సంభవించాలని కోరుకున్న వాళ్ళూ, వద్దని వాంఛించిన వాళ్ళూ ఇది ఇలా జరుగుతుందని తెలిసిన వాళ్ళు. ఆ జాడే అంతుబట్టని వాళ్ళూ క్రియాశీలులూ, నిర్లిప్తులూ అందరూ బాధితులే ఇవాళ! అంతా అయిపోయిన తర్వాత, ఈ నిర్లిప్తులకు పౌరుషం పొడుచుకొస్తోం దిప్పుడు– జరిగిపోయిన పరిణామాల తాలూకు పర్యవసానాలతో తమకే సంబంధం లేదని వాళ్ళంటున్నారు. ఈ పరిణామాలు ఇలా సంభవించాలని తాము కోరుకోలేదంటున్నారు. అందుచేత, జరిగిన దానికి తాము బాధ్యులం కామనీ అంటున్నారు.

వాళ్ళలో కొందరు దీనంగా గొణుక్కుంటారు. మరి కొందరు బూతుల దండకాలు విడేస్తారు. కొద్ది మందైనా, నా కర్తవ్యం నేను నిర్వర్తించి వుంటే, నా గొంతు స్పష్టంగా వినిపించాలనుకుని వుంటే, నేను ఏం చెయ్యాలనుకున్నానో అదే చేసి వుంటే ఇలా జరిగి వుండేదా??" అనే ప్రశ్న వేసుకుని వుండరు! తమ నిర్లిప్తతే, తమ అవిశ్వాసమే, ఈ దుష్పరిణామాలను నిరోధించేందుకు, మంచిని సాధించేందుకు పోరాడుతున్న ఆర్థిక రాజకీయ బృందాలకు నైతిక, భౌతిక మద్దతు ప్రకటించడంలో తాము విఫలం కావడమే తమ లోపమని ఒకరయినా భావించి వుండరు ! పైపెచ్చు. ఇలాంటి వ్యక్తులు ఫలానా భావన విఫలం చెందడం గురించీ, ఫలానా కార్యక్రమ ప్రణాళిక విఫలం కావడం గురించి మాట్లాడాలని చూస్తారు. తమ నిర్లిప్తతనూ, విశ్వాసరాహిత్యాన్ని కొనసాగిస్తారు!! ❑ (1916, ఆగస్టు)


# గ్రాంసీ తత్వం - మేధావులు



రావు కృష్ణారావు

**నేను ఎంచుకున్న 'మేధావులు' భావన గ్రాంసీ తత్వంలో విడిగా దొరకదు. ఆయన తత్వ లక్ష్యం 'మానవ విముక్తి'. దాన్ని సాధించే అనేక దశల్లో ఒక ప్రధాన దశ 'పీడితుల హెజమనీ' సాధించడం. సానుకూల, ప్రతికూల హెజమనీల్లో క్రియాశీల పాత్రధారులు ఈ 'మేధావులు'. ఈ మేధావులు భావన కూడా స్వతంత్రంగా కనిపించదు. సమాజం, సామాజిక బృందాలు, సంస్కృతి, సమ్మతి, పార్టీ మొదలైన అనేక ఇతర భావనలతో విడదీయలేనంతగా అల్లుకుపోయి ఉంటుంది.**

20వ శతాబ్దపు అతి గొప్ప మేధావులు కొద్ది మందిలో గ్రాంసీ అగ్రగణ్యుడు. మార్క్స్‌తత్వాన్ని 'ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్' అంటారు చాలా మంది. ఆ నిర్వచనం ప్రకారం గ్రాంసీని 'ప్రాక్సిస్ తత్వ వేత్త' అంటారు. ఆయన రెండవ ఇంటర్నేషనల్, లెనిన్ అనంతరం సోవియట్ మేధావులు మార్క్సిజానికి చెప్పిన భాష్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. కొన్ని సందర్భాలలో మార్క్స్ తత్వానికి కొత్త భాష్యాలు చెప్పాడు. అన్నిటినీ మించి గ్రాంసీ తత్వం సంక్లిష్టమైనది. సమస్తత, అన్నిటినీ పరస్పర సంబంధంలో మాత్రమే చూడటం అనేవి మార్క్స్ తత్వంలో ప్రధాన నియమాలు. మార్క్స్ విశ్లేషణల్లో అవి మనల్ని ఇబ్బంది పెట్టేంత స్పష్టంగా కనిపించవు. గ్రాంసీ విశ్లేషించే ఏ భావన కూడా మనకు విడిగా దొరకదు. అనేక ఇతర భావనలతో అల్లుకుపోయి మన బుర్రకు గట్టి పని పెడుతుంది.




గ్రాంసీ కొంత భిన్నమైన విప్లవకారుడు. ఆయన తత్వంలో 'విప్లవం' భావన హెజమనీ భావనతో సన్నిహితంగా ముడిపడి ఉంది. విప్లవం అంటే 'కార్మిక వర్గ హెజమనీ' రూపొందే ప్రక్రియ. హెజమనీ అంటే ఐడియాలజీ, లేదా ఆధిపత్యానికి సమానం కాదు. అది ఒక రాజీ పరిస్థితి. 'హెజమనీ' అంటే బలాత్కారపు ఒత్తిడి లేకుండా అధికారం చలాయించడం. అంటే పాలక వర్గం సాంస్కృతిక సాధనాల ద్వారా సమాజ మేధో జీవితాన్ని నియంత్రించడం. దీనర్థం ఏమిటంటే కార్మికవర్గం రాజకీయాధికారం సాధించాలంటే మొదట సాంస్కృతిక సాధనాలన్నిటినీ స్వాధీనం చేసుకొని వాటిలో కొన్నిటిని ధ్వంసం చెయ్యాలి. కొన్నిటిని రూపాంతరీకరించాలి. కొన్నిటిని సర్దుబాటు చెయ్యాలి. దీనిద్వారా సామాజిక జీవితంపై మేధో నియంత్రణ అంటే హెజమనీ సాధించాలి. అందుకోసం, అంటే కార్మిక వర్గ సంస్కృతిని సృష్టించడానికి, సమాజంలో 'భావజాల ఆధిపత్యం' లోకి రావడానికి, రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోవడానికి కార్మిక వర్గానికి ఆర్గానిక్ మేధావులు కావాలి. గ్రాంసీ దృష్టిలో పెట్టుబడిదారీ వర్గ అధికారాన్ని కూలదోసి కార్మిక వర్గం అధికారంలోకి రావడం మాత్రమే విప్లవం కాదు. అధికారం చేపట్టాక అందరి సమ్మతి పొందడం, విప్లవకారులను భవిష్యత్ నాయకులుగా సన్నద్ధం చేయడం కూడా విప్లవంలో భాగమే. వివిధ దేశాలలో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టులు ఈ రెండో భాగాన్ని పూర్తి చెయ్యడంలో విఫలమవ్వడమే ఆయా వ్యవస్థలు కూలిపోవడానికి, దారితప్పడానికి ప్రధాన కారణం అనిపిస్తుంది. ఇక్కడే కమ్యూనిస్టు పార్టీ, కార్మిక వర్గ మేధావుల ప్రాధాన్యతంతా ఇమిడి ఉంది. విప్లవానికి నాయకత్వం వహించ డానికి కార్మికవర్గ మేధావులే అత్యుత్తములని గ్రాంసీ విశ్వాసం.

## మేధావులు అంటే ఎవరు?

'మనుషులందరూ మేధావులే. కాని సమాజంలోని మనుషులందరూ మేధావుల విధిని నిర్వర్తించరు.' అన్నాడు గ్రాంసీ. మనం వాడుకలో మేధావులు, మేధావులు కాని వారు అని విభజిస్తున్నామంటే దానర్థం వారు సమాజంలో నిర్వర్తిస్తున్న విధులను బట్టి మాత్రమే. అంటే వారు శారీరక శ్రమ చేస్తున్నారా, లేక మానసిక శ్రమ చేస్తున్నారా? అనే దాన్ని బట్టి మాత్రమే. నిజానికి మేధావులు కాని వారు అంటూ ఎవరూ ఉండరు. ఎందుకంటే మానవ కార్యాచరణ ఏదీ కూడా అతని మేధస్సు ప్రమేయం లేకుండా జరగదు. శరీరం, మనసుల ఏక మొత్తమే మనిషి. ప్రతీ మనిషి రోజులో తన వృత్తిపరమైన శ్రమ ముగిసిన తర్వాత అనేకరకాల మానసిక కార్యకలాపాల్లో నిమగ్నమవుతాడు. అతనికో జీవన తత్వం ఉంటుంది. తన పని పట్ల శ్రద్ధ ఎక్కువున్న వాడైతే పనిని సులభం చేసే పనిముట్ల గురించి ఆలోచించవచ్చు. అతని అభిరుచిని బట్టి అప్పటికే వ్యాపించి ఉన్న భావాలను సమర్థించి బలోపేతం చేయవచ్చు. వాటిలో కొన్ని మార్పులు చేసుకోవచ్చు. మొత్తంగా వాటిని తిరస్కరించి కొత్త ఆలోచనలు చెయ్యవచ్చు. అందుచేత మేధావు లు, కాని వారు అనే విభజన అఖండమైనది. అంతిమమైనది కాదు. 'మనుషులు అందరూ మేధావులే' అని ప్రతిపాదించడం ద్వారా గ్రాంసీ మనుషులను తెలివైన వారు, తెలివి తక్కువవారు అని శాశ్వతంగా, సార్వత్రికంగా విభజించడాన్ని తిరస్కరిస్తున్నాడు. అంతకంటే మరీ ముఖ్యంగా మనుషులందరూ సంపూర్ణ మానవులుగా ఎదగడం సాధ్యమేనని హామీ ఇస్తున్నాడు.

మన దేశ చరిత్ర చూస్తే ఇటీవలి కాలం వరకూ తరతరాలుగా పాలక వర్గాల మేధావుల ఉత్పత్తులకు సమాంతరంగా సామాన్య ప్రజలు తమ పనిముట్లు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పురాణాలు, దేవతలు, సంస్కృతిని సృష్టించుకున్నారు. కొన్ని సందర్భాలలో పాలకుల పోషణలో జీవించిన మేధావులకంటే గొప్ప కళలను, తత్వాలను సామాన్యులు సృష్టించారు. రెక్కాడితేగాని డొక్కాడని కష్టజీవులు తమ జీవన పోరాటంలో కొట్టుమిట్టాడుతూనే ఈ సృజనంతా సాగించారనే విషయం గ్రహిస్తే గ్రాంసీ చెప్పిన మాటలు బాగా అర్థమవుతాయి.

మేధావుల గురించిన గ్రాంసీ భావన చాలా విస్తృతమైనది. మేధావులకు తమ సొంత వర్గం ఉండదు. అయితే ప్రతీ వర్గానికి దాని సొంత మేధావులు ఉంటారు. ఒక మనిషి తనకున్న ప్రజ్ఞా పాటవాల ఆధిక్యత వల్ల మేధావి కాదనీ, సామాజిక హెజమనీ వ్యవస్థీకరణలో అతను నిర్వహించే విధుల వల్ల మాత్రమే మేధావి అవుతాడనీ గ్రాంసీ చెబుతాడు. గ్రాంసీ చెప్పిందాన్ని బట్టి మన అవగాహనను మరికొంత విస్తరించుకోవచ్చు.

సమాజంలో అనేక సామాజిక బృందాలు ఉంటాయి. అన్నిటికి వాటికే చెందిన మేధావులు ఉంటారు. ఇక్కడ మనం వారి సామర్థ్యాలను, సంఖ్యను పరిగణించడం లేదు. ఈ బృందాలలో ఉత్పత్తి సంబంధాలలో వున్న యజమానులు, శ్రామికులు ప్రధాన వర్గాలుగా ఉంటారు. సమాజంలో ఈ వర్గాలకు చెందిన మేధావులే అధికంగా, ప్రధానంగా ఉంటారు. అది కూడా యజమానులు, పాలకవర్గాల తరపున పనిచేసే మేధావులే అత్యధికం. ఈ రోజుల్లో స్వతంత్ర మేధావులుగా చలామణీ అవుతున్నవారు ఎక్కువే. కాని, వీరు వీలైనంత వరకూ పరోక్షంగా, వీలు కానప్పుడు ప్రత్యక్షంగా పాలక వర్గాలను సమర్థిస్తారు. ఒక వర్గంతో సజీవ సంబంధాలలో ఉంటూ, ఆ వర్గం, వర్గ సభ్యుల లక్ష్యాలతో మమేకమై వాటికోసం పనిచేసే వారిని ఆ వర్గానికి చెందిన ఆర్గానిక్ మేధావులు అని అర్థం చేసుకోవాలి.

మేధావులంటే కేవలం పండితులు, కళాకారులు మాత్రమే కాదు. సాంస్కృతిక రంగంలో పనిచేసేవారు, సాంకేతిక నిపుణులు, కార్యనిర్వాహకులు, ఉన్నతోద్యోగులు, పరిశ్రమల మేనేజర్లు, రాజకీయవేత్తలు మొదలగు చాలామంది ఉంటారు. గ్రాంసీ వీరందరినీ నిలువుగా, అడ్డంగా రెండు రకాలుగా విభజిస్తాడు. నిలువు విభజనలో పెట్టుబడిదారుల కోసం పరిశ్రమను నిర్వహించే 'ప్రత్యేక నిపుణులు' వివిధ అంతస్థులలో ఉంటారు. మొత్తం సమాజాన్ని నడిపించే వారు కూడా ఈ విభాగంలోనే ఉంటారు. అడ్డంగా చేసిన విభజనలో రెండు రకాల మేధావులు ఉంటారు. ఒకరకం సంప్రదాయ మేధావులు కాగా, రెండోరకం ఆర్గానిక్ మేధావులు. సంప్రదాయ మేధావులు సంప్రదాయంతో, గత కాలపు మేధావులతో ముడిపడి ఉంటారు. వీరు తాము నివసిస్తున్న సమాజపు ఆర్థిక నిర్మాణంతో మరీ అంత నేరుగా సంబంధం కలిగి ఉండరు. వీరు తాము ఏ వర్గానికి చెందమని, తమకు ఎవరిపట్ల పక్షపాతం లేదని, రాజకీయాల పట్ల ఆసక్తి లేదని భావిస్తారు. పౌర సమాజంలో ముఖ్యులైన సంప్రదాయ మేధావులు ఉనికిలోని వ్యవస్థను సమర్థిస్తూ ప్రజలతో వాదించి వ్యవస్థను సమ్మతించేలా ప్రయత్నిస్తారు. సంప్రదాయ మేధావులు ఒకప్పుడు అధికారంలోకి వస్తున్న వర్గానికి ఆర్గానిక్ మేధావులే అయినా ఇప్పుడు ఆ వర్గం నుంచి స్వతంత్రులుగా కనిపిస్తారు. మరోవైపు ఆర్గానిక్ మేధావులు తమ సమాజపు ఆర్థిక నిర్మాణంతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంటారు. ఆర్థిక ఉత్పత్తిలో తన వంతు ఆవశ్యక కర్తవ్యాన్ని నెరవేర్చడం నుండే ప్రతీ ఒక్క సామాజిక బృందం పుట్టుకొస్తోంది. అలా పుట్టుకొచ్చిన ప్రతీ బృందం దానికే సొంతమైన మేధావులను సృష్టించుకొంటుంది. వారే ఆర్గానిక్ మేధావులు. వీరు తమ బృందం, లేదా వర్గానికి సజాతీయతను కల్పించి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తన విధుల గురించిన స్పృహను(ఎరుకను) ఆ వర్గానికి కలిగిస్తారు. ఆధిపత్య వర్గంలో భాగమైన ఆర్గానిక్ మేధావులు

రాజకీయ సమాజపు బల ప్రయోగ అంగాలకు (పోలీసు, మిలట రీ, న్యాయస్థానాలు మొ.) మందీ, మార్బలం సమకూరుస్తారు. హెజమనీ సాధించాలని ఆకాంక్షించే వర్గం చేసే పోరాటంలో ఆ వర్గం సృష్టించిన ఆర్గానిక్ మేధావులు నేరుగా ప్రజల సమ్మతిని పొందేందుకు విడవకుండా వెంటపడతారు. నియంతృత్వాలలో మాత్రం అటువంటి ప్రయత్నం బలాత్కారంతో కూడి ఉండ వచ్చు. గ్రాంసీ అభిప్రాయం ప్రకారం మేధావులు ఆధిపత్య బృందానికి ప్రతినిధులు. వారు రాజకీయ పాలన, సామాజిక హెజమనీ విధులను నిర్వర్తిస్తారు. ప్రత్యేకంగా ఆర్గానిక్ మేధావులు మరీ ముఖ్యమైన వారు. ఎందుకంటే వీరే ఆర్గానిక్ ఐడియాల జీని వివరించి వ్యాపింపచేస్తారు. రాజకీయాల్లో ఈ మేధావుల పాత్ర చాలా ముఖ్యమైనది. చారిత్రికంగా, వాస్తవికం గా అభ్యుద యకర వర్గానికి చెందిన ఆర్గానిక్ మేధావులు సర్వ సాధారణం గా ఇతర వర్గాల మేధావుల మీద ఆధిక్యత సాధించ గలరు. తద్వారా ఒక సౌభ్రాతృత్వ వ్యవస్థను సృష్టించగలరు. అభ్యుదయ వర్గం ఎంతకాలం అభ్యుదయకరంగా ఉంటుందో అంతకాలం ఆ సౌభ్రాతృత్వం నిలుస్తుంది. 'ఆవిర్భవిస్తున్న ప్రతీ సామాజిక బృందం, తనతోపాటు సజీవ సంబంధాలతో ఒకటి, లేదా అంతకంటే ఎక్కువ దొంతరల మేధావులను సృష్టించు కుంటుంది' అని గ్రాంసీ చెప్పాడని చెప్పు కున్నాం. ఎలాగంటే కేపిటలిజం అభివృద్ధితోబాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, బ్యూరోక్రాట్లు, వ్యాపార న్యాయవాదులు, ఆర్థికవేత్తలు, ఇంజనీర్లు, పారిశ్రామిక సాంకేతిక నిపుణులు పుట్టుకొచ్చారు. వీరిలో చివరి వారి నుండి(ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు) శ్రామికోద్యమానికి ఆర్గానిక్ మేధావులు తయారయ్యే అవకాశం ఉందని గ్రాంసీ అభిప్రాయం. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక విద్య పారిశ్రామిక శ్రమతో సన్నిహితంగా ముడిపడి ఉంది కాబట్టి అది కొత్త రకం మేధావులను తయారు కావడానికి ప్రాతిపదిక అయి తీరుతుందని గ్రాంసీ నమ్మకం. ఉత్పత్తిలో పాల్గొనే సాంకేతిక నిపుణులను, మేనేజర్లను ఎక్కడా బెసగకుం డా పెట్టుబడిదారీ వర్గం తన వారిని చేసుకొంది. వీరికి అధిక వేతనాలు, షేర్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ శ్రామికవర్గానికి శత్రుస్థానంలో నిలపగలుగుతోంది. వీరినుండి శ్రామిక వర్గ ఆర్గానిక్ మేధావులు వచ్చే పరిస్థితులు లేవు. గ్రాంసీ సిద్ధాంతాల వయసు సుమారు 90 ఏళ్ళు. ఈ కాలంలో పెట్టుబడిదారులు కొత్తగా చాలా నేర్చుకున్నారు, మార్చుకున్నారు. నేర్చుకోవలసిం ది శ్రామిక వర్గమే! అయితే ఆర్గానిక్ మేధావులకు సాంకేతిక పరిజ్ఞానం ఉంటే సరిపోదు. హెజమనీకై జరిగే పోరాటంలో పాల్గోవడానికి వారు సంసిద్ధులై ఉండి తీరాలి. ఇలా జరగాలంటే ఆర్గానిక్ మేధావి తనకున్న ప్రత్యేక రంగ జ్ఞానాన్ని రాజకీయ పరిజ్ఞానానికి విస్తరిం చగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. ఆర్గానిక్ మేధావి కేవలం గొప్ప ఉపన్యాసకుడైతే చాలదు. వాస్తవ జీవితంలో క్రియాశీలం గా జీవించాలి. అతను నిర్మాతగా, ఆర్గనైజరుగా, నిరంతరం విడవకుండా ప్రజల వెంట ఉంటూ వారిని ప్రేరేపించే వానిగా ఉండాలి. దీనర్థం పాత జ్ఞానాన్నంతటినీ తిరస్కరించాలని కాదు. దాన్నంతటినీ సొంతం చేసుకోవాలని. గ్రాంసీ దృష్టిలో కార్మిక వర్గ ఆర్గానిక్ మేధావి అంటే ట్రేడ్ యూనియన్, లేదా పార్టీ క్రియాశీల కార్యకర్త అని అర్థమవుతుంది. మన దేశంలో ఉన్న తోద్యోగులు రాజకీయాల్లో ప్రవేశించి పాలకవర్గాల సేవలో తరిస్తున్నారు.

కేపిటలిజంలో కేపిటలిస్టు మేధావులకంటే రైతు వర్గ మేధావులు తక్కువ మంది ఉంటారు. వారి ప్రభావం కూడా చాలా తక్కువ. ప్రతీ సామాజిక వ్యవస్థలోను ఏది తార్కికమో, ఏది నిజమో ఆధిపత్య వర్గమే నిర్ణయిస్తుంది. అందుచేత ఆధిపత్య వర్గ మేధావులే నిజమైన మేధావులుగా చలామణీ అవుతారు. ఉల్లిపాయలు, కూరగాయల ధరలు పెరిగినప్పుడు గగ్గోలు పెట్టే మేధావులు, మీడియా, పారిశ్రామిక ఉత్పత్తుల ధరల పెరుగుదలను పాచిపోయిన వార్తలా మాత్రమే ఇస్తారు. అందుచేత ఉల్లిపాయ, కూరగాయలు మాత్రమే ధరల పెరుగుదలకు సూచికగా తయారయ్యింది. కూరగాయల ధరల పెరుగుదలలో డీజిల్, ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలి రేట్లు పెరుగుదల ఇమిడి ఉంటాయనే కనీస స్పృహ కలగనీయకుండా జాగ్రత్త పడుతున్నారు. దీన్ని బట్టి రైతు మేధావుల ప్రభావం ఎంత తక్కువ వుందో, పాలక పెట్టుబడిదారీ వర్గ మేధావులు, మీడియాల ప్రభావం ఎంత ఎక్కువ ఉందో అర్థమవుతుంది. ప్రస్తుతం మన దేశంలో మెజారిటీ మధ్య తరగతి వర్గం పీడిత వర్గాల పట్ల వ్యతిరేకతతో ఉంది. నిజానికి జీవన స్థితిగతుల రీత్యా ఈ మధ్య తరగతి ప్రజలు సామాన్య ప్రజలకు దగ్గరగా ఉంటారు. అయితే వీరు ధనికులను ఆరాధనా భావంతో చూస్తూ, పేద శ్రామిక జనాన్ని శత్రువులుగా చూస్తున్నారు. పెట్టుబడిదారులు చేసే దుర్మార్గపు పనులు ఎన్ని తెలిసినా వాటిని విస్మరించి పాలక వర్గాన్ని సమర్థిస్తున్నారు. మేధావుల పాలకవర్గ విధేయత, స్వార్థం, అవకాశ వాదం, మీడియా విష ప్రచారం మధ్య తరగతి ప్రజల మనసుల్ని విషపూరితం చేసేస్తున్నాయి. శ్రామిక జన ఆర్గానిక్ మేధావులు కొంత మంది ఉన్నారు. వారు తమ వర్గ ప్రజల జీవన స్థితిగతులను గమనించి పాలక వర్గ భావాలూ, తమ జీవిత పరిస్థితులూ ఎలా విరుద్ధమైనవో విశ్లేషించి ప్రజలకు ప్రపంచాన్ని గురించిన రాడికల్ అవగాహన కల్పిస్తారు. ఈ మేధావులు సామాజిక, రాజకీయ ఉద్యమంలో భాగం కాకుండా విడి వ్యక్తులుగా ఎంత ప్రచారం చేసినా, ఆ భావాలు త్వరలోనే బలహీనమై, గాల్లో కలిసిపోతాయి. ఇలా పీడిత వర్గాల ప్రజల నిజ జీవితాల్లోకి తమకు తాముగా ప్రవేశించి వారిని సంఘ టితం చేస్తూ, ఆర్గనైజర్లుగా, వారిని వదలని ప్రేరేపకులుగా పనిచేసే మేధావులను గ్రాంసీ 'కొత్త మేధావులు' అన్నాడు. వీరు

ప్రజల బాధల్ని కొంతమేరకైనా తగ్గించడానికి, వారి చైతన్యాన్ని విస్తరించడానికి, వారిని ప్రజా పోరాటాల్లోకి మరింతగా సమీకరించడానికి పనిచేస్తారు. వీరిలో అత్యధికులు మార్క్సిస్టులే అయినా అందరూ వారే కావాల్సిన పని లేదు. అయితే కొత్త మేధావులు కచ్చితంగా కేపిటలిజానికి వ్యతిరేకులై ఉండాలి. గ్రాంసీ తత్వంలో సమాజం గురించి రెండు భావనలున్నాయి. మొదటిది 'సివిల్ సొసైటీ'. ఇది ప్రజల ప్రయివేటు జీవితానికి (నేరుగా ప్రభుత్వ జోక్యం లేని) సంబంధించినది. రెండవది 'పొలిటికల్ సొసైటీ' అంటే రాజ్యం. ఈ రెండు జీవిత రంగాల్లోను ఆధిపత్య బృంద హెజమనీ సాగుతుంది. సర్వ సాధారణంగా ప్రజల సమ్మతి ద్వారానే హెజమనీ ఏర్పడి కొనసాగుతుంది. కాని పొలిటికల్ సొసైటీ, అంటే చట్టం, పోలీసు, కోర్టులు మొ.వాటి ద్వారా బలప్రయోగంతో అయినా ప్రత్యక్ష ఆధిపత్యం ఉంటుంది. ఈ సామాజిక హెజమనీని నిర్వర్తించడంలో మేధావులు ఆధిపత్య బృంద ప్రతినిధులుగా పనిచేస్తారు. ప్రజల సంస్కృతి, భావాలను తమ హెజమనీని అంగీకరించే విధంగా మలచటం ద్వారా ఆధిపత్య బృందం సివిల్ సొసైటీ పై హెజమనీని సాధిస్తుంది. ఇలా మలచటంలో మేధావుల పాత్ర కీలకం. సాధారణంగా వీరు ప్రజల మేలు కోరే వారుగా, స్వతంత్రులుగా పైకి నటిస్తుంటారు.

## విప్లవంలో మేధావుల పాత్ర

విప్లవానికి గ్రాంసీ ప్రతిపాదించిన ప్రాథమిక సూత్రం ఏమంటే కార్మిక వర్గ ఆర్గానిక్ మేధావులతో ఒక మేధో-నైతిక కూటమిని రూపొందించాలి. ఈ కూటమిని ఆయన 'మోడర్న్ ప్రిన్స్' అన్నాడు. ఈ మోడర్న్ ప్రిన్స్ లేదా పార్టీ రాజకీయ చర్య తీసుకొనేలాప్రజలను చైతన్యవంతులను చేస్తుంది. హెజమనీకై జరిగే వర్గ పోరాటంలో ఆర్గానిక్ మేధావులు చాలా కీలకమైన వారు. అధికార పోరాటంలో నిమగ్నమైన ఏ బృందమైనా సంప్రదాయ మేధావుల్ని భావజాల పరంగా జయించి జీర్ణించుకొంటుంది. వారిని జయించడం, కలుపుకోవడం అనేవి సమర్ధవంతంగా, త్వరగా జరగాలంటే ఆ వర్గం తన సొంత ఆర్గానిక్ మేధావుల్ని విస్తరించుకోవాల్సి ఉంటుంది. ఈ సంప్రదాయ మేధావులు ప్రజలు సామాజిక వ్యవస్థను తమకు తామే సమర్ధించేలా చేయడంలో గొప్ప సహాయకులనే విషయం గుర్తుంచుకోవాలి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో పారిశ్రామిక కార్మిక వర్గం నాయకత్వం కోసం సంప్రదాయ మేధావులపై ఆధారపడిందని (దీనివల్ల నష్టం జరిగిందని) గ్రాంసీ అభిప్రాయం. దీనికి పరిష్కారం కార్మికులకు విద్య గరపడమే అని అన్నాడు.

'మేధావులు, శ్రామిక వర్గం, రైతాంగం మిళితం కావలసిన అవసరం ఉంది' అనే లెనిన్ భావనను గ్రాంసీ స్వీకరించి విస్తరించాడు. రాడికల్ సామాజిక మార్పుకు 'పౌర సమాజ' మార్పు ముందస్తు షరతని గ్రాంసీ భావించాడు. మేధావులు ప్రజలపై తమ ఆలోచనలను రుద్దడం కాక వారి సమ్మతి పొంది ప్రపంచాన్ని మార్చాలి. మేధో జీవితం నిజమైన ప్రజా రూపంగా అభివృద్ధి చెందాలి. హెజమనీ సాధించే విషయంలో మేధో జీవితం ఒకానొక బేరసారాల రూపమని గ్రాంసీ అభిప్రాయం. కొత్తగా ఆవిర్భవిస్తున్న సోషలిజం వంటి ఆలోచన అప్పటికే ఉన్న భావాలను ఎదుర్కొంటుంది. అప్పటికే ఉన్న భావాలు గత పాలక వర్గాలవి మాత్రమే కాదు, ప్రజల 'కామన్ సెన్స్' కూడా. ఈ ఘర్షణలో తాత్కాలిక సమతౌల్యం ఏర్పడుతుంది. ఈ భావాల ఘర్షణలో విజయానికి హామీ ఏమీ లేదు. ఇది నెమ్మదిగా జరగవచ్చు, లేదా చివరికి ఓడిపోవచ్చు కూడా.

ప్రజలకు విద్య గరిపే ప్రక్రియ మేధావులకు, ప్రజలకు మధ్య సంభాషణగా (ఒకరి నుంచి మరొకరు తెలుసుకునేది) సాగితే మంచిదని గ్రాంసీ అభిప్రాయం. మేధావులు ప్రజల సంస్కృతిలోకి ప్రవేశించడమే కాక, దాన్నర్ధం చేసుకొని దాన్నే ఉపయోగించాలి. మేధావులు వారికి వారుగా ఒక వర్గం కాదు. ఏ వర్గం నుంచి వారు రూపొందారో ఆ వర్గ మూలాలు కలిగి ఉంటారు. వారు తమ వర్గానికి నిబద్ధులై ఉండవచ్చు, ఉండక పోవచ్చు. సొంత ప్రయోజనాల కోసం తమ విధేయతను మార్చుకోవచ్చు. పీడిత వర్గంలో పుట్టకపోయినా జరుగుతున్న అన్యాయాల పట్ల వారికి జరుగుతున్న ఆగ్రహంతో, ఆక్రోశంతో పీడిత జన పక్షపాతిగా మారి ఉండవచ్చు. బడుగు వర్గాల నుండి వచ్చినా తమ వర్గాన్ని దోచుకుంటూ, అణచివేసే పాలక వర్గాల పంచను చేరే మేధావులే ఎక్కువగా కనిపిస్తారు. వర్గ స్పృహ తక్కువగా ఉన్న మన దేశంలో కులం పేరు చెప్పి ఆ కులస్తులను కూడగట్టి వ్యక్తిగతంగా లబ్ది పొందే అనేక దొంతరల మేధావులు చాలా ఎక్కువ.

**"ఒక చారిత్రిక పనిని కేవలం సమిష్టి మానవుడు మాత్రమే చేయగలడు" - గ్రాంసీ.**

కార్మిక వర్గ ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని అధిగమించడానికి దోహదపడటమే సోషలిస్టు విప్లవ పార్టీ ప్రథమ లక్ష్యమని లెనిన్ చెప్పిన దాన్ని స్వీకరించిన గ్రాంసీ తనదైన భాష్యం చెప్పాడు.

గ్రాంసీ పరిభాషలో 'మోడర్న్ ప్రిన్స్' అంటే ఆధునిక విప్లవ పార్టీ, లేదా కమ్యూనిస్టు పార్టీ. ఇది ఏ ఒక్క వ్యక్తిలోనూ మూర్తీభవించదు. మోడర్న్ ప్రిన్స్ (క.పా) లక్ష్యం పెట్టుబడిదారీ సమాజ నిర్మాణాలు, సంస్థల ద్వారా అబ్బిన తాత్కాలిక స్వార్ధ కాంక్ష యొక్క అవశేషాలను కార్మిక వర్గం అధిగమించడం. అంతకుమించి జాతీయ స్థాయిలో సమిష్టి ఇచ్ఛను/సంకల్పాన్ని రూపొందించడం. సమిష్టి ఇచ్ఛ అంటే దేశంలోని అన్ని

సామాజిక దొంతరలను ఆవహించే ఒక చైతన్యదశ. ఈ చైతన్యం ఏదైనా ఒక రాజకీయ చొరవకు అవకాశం కలిగిస్తుంది. సంక్లిష్ట సామాజిక సంబంధాలలో తారతమ్యాలున్న వివిధ సామాజిక బృందాలను తాకగలదు. ఆ విధంగా అది 'పరిశుద్ధ కాలం/దశ' అంటే అవలక్షణాలను వదిలించుకొని సమిష్టి సంకల్పాన్ని ఏర్పరచుకొన్న దశ. అదే పార్టీ ప్రాథమిక లక్ష్యంగా కనిపిస్తుంది. అందుచేత పార్టీ అనేది పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ సంస్థల వంటిది కాదు. ప్రస్తుతం భాజపా 'హిందుత్వ', 'దేశభక్తి'పేరుతో ఒక సమిష్టి ఇచ్ఛను రూపొందించే ప్రయత్నంలో ఉందనిపిస్తుంది.

అయితే ప్రజల్లో వాటికవిగా ఉండే/పుట్టే ఫీలింగ్స్‌ను పట్టించుకోకుండా పార్టీ పైనుండి తన ఏకపక్ష చర్యల ద్వారా ఈ సమిష్టి ఇచ్ఛను ప్రేరేపించలేదని గ్రాంసీ భావన. ప్రజల ఫీలింగ్స్‌ను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయరాదని ప్రజల అనుభూతుల విషయంలో ప్రజలకు విద్య గరపాలి, వారికి మార్గదర్శకం కావాలి, మొత్తం మీద వారి అనుభూతులను శుద్ధి చేయాలని ఆయన రాశాడు. ఈ 'సమిష్టి ఇచ్ఛ' అనేది గ్రాంసీ చెప్పే 'మేధో–నైతిక సంస్కరణ'తో సజీవ సంబంధంలో మాత్రమే రూపొందుతుంది. పార్టీ కేవలం రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులకోసం పోరాడితే సరిపోదు. అది సాంస్కృతిక విప్లవం కోసం, కొత్త సంస్కృతిని సృష్టించడానికి, అభివృద్ధి చేయడానికి కూడా పోరాడాలి. దానికున్న విస్తృతార్థంలో కల్చర్, లేదా సంస్కృతి అంటే ప్రజలను నడిపించే ఆధిపత్య భావాలు, చైతన్యం, కామన్ సెన్స్‌ల సమ్మిళిత వ్యక్తీకరణ. ఈ మొత్తం వ్యవహారంలో కార్మికవర్గ ఆర్గానిక్ మేధావుల పాత్ర అత్యంత కీలకం.

గ్రాంసీ పార్టీ అంతర్గత నిర్మాణం గురించి కూడా విస్పష్టంగా చెప్పాడు. ఈ నిర్మాణం మూడు దొంతరులుగా ఉంటుంది. 1. క్రమశిక్షణ, పార్టీ పట్ల విధేయత కలిగిన సగటు, సాధారణ మనుషులు. 2.పొందికైన, ఆర్గనైజు చేసే, పార్టీ నాయకత్వం. 3.సాధారణ సభ్యులకు నాయకత్వానికి మధ్యంతరంగా (వారధిగా) పనిచేసేవారు. వీరు అటు నాయకుల, ఇటు సాధారణ సభ్యుల లక్షణాలను రెండింటినీ ప్రదర్శిస్తుంటారు. కొంత వరకూ గ్రాంసీ తన శ్రద్ధను నాయకత్వంపై నిలిపాడని చెప్పవచ్చు. పార్టీ నాయకులను ఆయన జనరల్స్‌తో పోల్చాడు. 'జనరల్స్ రుపొందడం కంటే ఒక సైన్యాన్ని కూర్చడం సులభం' అని రాశాడు. ఈ జనరల్స్ కార్మిక వర్గ ఆర్గానిక్ మేధావుల నుండే రావాల్సి ఉందని వేరే చెప్పనక్కరలేదు. గ్రాంసీ వార్తా పత్రికకు చాలా ప్రాధాన్యత ఉందన్నాడు. పత్రికను పార్టీగా గాని, పార్టీలో ఒక విభాగంగా గాని, పార్టీ నిర్వర్తించాల్సిన విధిగా గాని భావించాలని నొక్కి చెప్పాడు. పత్రిక ప్రయోజనకరంగా నడవాలంటే మళ్ళీ కార్మిక వర్గ ఆర్గానిక్ మేధావులు కావాలి. మన దేశంలో పెట్టుబడిదారీ వర్గం ఆధునిక విద్య నభ్యసించిన మేధావులను ప్రోత్సహించి జాతీయోద్యమాన్ని నడిపింది. ప్రజలలో జాతీయస్ఫూర్తిని నింపింది. ఆ మేరకు అది అభ్యుదయ పాత్రను నిర్వహించింది. కాని ఆ వర్గం బలపడే కొలదీ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ఆ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఏకమవకుండా తన ఆర్గానిక్ మేధావుల ద్వారా అన్ని రకాల చర్యలూ తీసుకొంటూ ఈ నాటి వరకూ సఫలమవుతున్నది.

నేడు మనదేశంలో పాలక వర్గాల ఆర్గానిక్ మేధావుల్లో, ముఖ్యంగా మీడియాలో పనిచేసే వాళ్ళలో ఎక్కువ మంది కిరాయి గూండాల వంటివారు. ప్రజల తరపున ప్రభుత్వాలతో పోరాడే వారు మీడియాలోను, బయటా ఉన్నారు. వారిని ప్రభుత్వం వెంటాడి వేటాడుతున్నది. వీరిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. సాధారణంగా పెట్టుబడిదారీ పాలక వర్గం తన లాభాల కోసం, వస్తు వ్యామోహం లాంటివి పెంచడం కోసం ఒక రకమైన అహేతుక తర్కాన్ని ఆశ్రయిస్తుంది. దీన్ని సహేతుకంగా ఆలోచించేవారు విమర్శిస్తారు. ఇది ఒక మేధోపరమైన వాతావరణంలో జరుగుతుంది. ప్రస్తుతం మన పాలక వర్గం శాశ్వత అధికారం కోసం అత్యంత అహేతుకమైన భావాలను ప్రచారం చేస్తున్నది. ఈ భావాలకు తర్కం వర్తించదు. జ్ఞానంతో పనిలేదు. నిజానికివి గుడ్డి నమ్మకాలు మాత్రమే. హేతువుకు అసలు స్థానం ఉండదు. మేధావులకు నో ఎంట్రీ. అంతా వన్ వే ట్రాఫిక్. దీనివల్ల కార్మికవర్గ మేధావుల పని మరింత క్లిష్టంగా తయారయ్యింది. వారు పెట్టుబడి తర్కాన్ని విశ్లేషించడం, విమర్శించడం సరిపోదు. మానవ వివేచననే తిరస్కరిస్తున్న పాలకుల ఎత్తుగడల్ని ఎలా ఎదుర్కోవాలో గంభీరమైన చర్చ జరగాలి. దీనికి అర్జంటు పరిష్కారం నిజ జీవిత సమస్యల వైపు ప్రజల దృష్టి మళ్ళించే మార్గాలను అన్వేషించడమే!

ఇక కార్మిక సంఘాలు, వామపక్షాలలో పనిచేసే మేధావులు చాలా చాలా తక్కువగా ఉన్నారు. ఈ మేధావుల స్థాయి కూడా తక్కువగానే ఉంది. కాస్త బుర్ర వున్న వాళ్ళనీ, చొరవగల వారినీ పెట్టుబడిదారీ వర్గం అనేక ప్రలోభాలతో ఆయా సంఘాల నుండీ, పార్టీల నుండీ దూరం చేస్తున్నది. వీళ్ళంతా పెట్టుబడిదారీ వర్గానికి కావలసిన వారని చెప్పలేము. ఈ పార్టీలకు లేకుండా చెయ్యటం ప్రధాన ఉద్దేశ్యంగా కనబడుతున్నది. పార్టీల్లో మేధావులకు ఒక ప్రజాస్వామ్యయుత వాతావరణం కల్పించాలి. మేధావులను పెంపొందించుకునే చర్యలు చేపట్టాలి. పార్టీ సభ్యులు, కార్యకర్తలకు సైద్ధాంతిక అవగాహన కల్పించడానికి తగిన కార్యక్రమాలు రూపొందించుకోవాలి. ❑


# గ్రాంసీ ఆలోచనల్లో కీలకం 'లోక జ్ఞానం'



- హెచ్చార్కె

**ఆంటోనియో గ్రాంసీ పేరు వినగానే గుర్తుకొచ్చే అద్భుత శాస్త్రీయ భావన 'లోక జ్ఞానం'. ప్రజాభ్యుదయం కోసం పై నుంచి కాకుండా అట్టడుగు నుంచి పనిచేయడం ఎంత అవసరమో స్పష్టం చేసే భావన 'లోక జ్ఞానం'. ఆ దిశగా ఎలా పనిచేయాలో విశదం చేసే భావన 'లోక జ్ఞానం'. శాస్త్రీయ భావన అంటున్నాం గాని ఇది ఎగ్జిస్టెన్షియలిజం, రియలిజం, సర్రియలిజం వంటి క్లిష్టమైన తత్వ శాస్త్రాంశం కాదు.**

లోక జ్ఞానం అనే పదానికి మన రోజు వారీ జీవితాల్లో ఏ అర్థం వున్నదో సరిగ్గా ఆ అర్థంలోనే దాన్ని ఇక్కడ వాడుతున్నాం. లోక జ్ఞానం అంటే లోకుల్లో ఉండే సాధారణ జ్ఞానం. కాకపోతే దీనికి తత్వశాస్త్రానికి సంబంధం ఉంది. ఆ సంబంధం ఏమిటనేది కాస్త ఆలోచించాల్సిన ప్రశ్న. ఇది ప్రగతి కోసం ప్రజా చర్యలను కాంక్షించే వారందరికీ అవసరమైన ఆలోచన.




ఇతర శాస్త్రాలకు తత్వశాస్త్రానికి మధ్య ఒక తేడా ఉంది. జీవితం గురించిన లోతైన జ్ఞానాన్ని శాస్త్రవేత్తలు ఒక క్రమ పద్ధతిలో, పకడ్బందీ చట్రంలో అమర్చి ఉంచుతారు. శాస్త్రవేత్త కాకపోతే ఆయన తరపున మరెవరో ఆ పనిచేస్తారు. వృక్ష శాస్త్రంలో చెట్టు చేమ గురించి జ్ఞానం, జంతు శాస్త్రంలో జంతు జాలం గురించి, రసాయనిక శాస్త్రంలో రసాయనిక పదార్థాల గురించిన జ్ఞానం ఉంటాయి. ఊరికే ఉండవు. ఒక క్రమ పద్ధతిలో, గట్టి చట్రంలో అమర్చి ఉంటాయి. మనుషుల తరువాత మనుషులకు ఈ చట్రం ఒక 'వాచికం'గా అందుతుంది. లిఖితమైనా, మౌఖికమైనా వాచికం వాచికమే. తన సమయానికి ఉన్న వాచికం ఆధారంగా మనిషి కొత్త అన్వేషణలు, కొత్త పరిశోధనలు చేసి మరింత జ్ఞానాన్ని పోగుచేస్తాడు. శాస్త్ర చట్రంలో చేరుస్తాడు. లేదా, ఉన్న జ్ఞాన అంశాలలో ఒకటి రెండు (లేదా అన్నీ) తప్పు అయితే, అవి తప్పు అని నిరూపిస్తాడు. ఆ అంశాలకు బదులు కొత్తగా పరీక్షకు నిలుస్తున్న జ్ఞాన అంశాలను ప్రతిష్ఠిస్తాడు. ఆ విధంగా.. నిరంతర వెరిఫికేషన్ (సరిచూడడం), ఫాల్సిఫికేషన్ (తప్పు అని గుర్తించడం) అనే ప్రక్రియల ద్వారా జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. పోగు పడుతుంది. దాన్ని ఆధారం చేసుకుని జీవితం అభివృద్ధి చెందుతుంది.

ఏ శాస్త్రంలోనైనా జరిగే ఈ నిరంతర ప్రక్రియయే తత్వశాస్త్రంలోనూ జరుగుతుంది. తత్వశాస్త్రం చెట్టు చేమకు, జంతు జాలానికి, వస్తు జాలానికి సంబంధించినది కాదు. అది మనిషి ఆలోచనలకు సంబంధించినది. మనిషి ఆలోచనలే తత్వ శాస్త్రం అధ్యయనాంశం. ఊరూరా తిరిగి, అదే పనిగా వృక్ష విశేషాల్ని సేకరించే వాడికి, లేక జంతువులను కోసి, లోపలి అవయవాల్ని పరిశీలించే వాడికి సేకరణ పనిముట్లు, ప్రయోగ శాల అవసరం. ఆలోచించడానికి అవసరమైన పరికరం ఒక్కటే. అది ఆలోచించే తలకాయ. అనుభవాల్ని తీసుకునే మానవ దేహం. ఇవి లేని మనిషి ఎవరూ ఉండరు. వేరే శాస్త్రాలకు సంబంధించి ప్రతి మనిషీ శాస్త్రజ్ఞుడేనని అంత సులభంగా అనలేం. కుదరదు. ఒక మనిషికి ఏవో కొన్ని వృక్ష, జంతు, వస్తు విశేషాలు తెలిసినా, అతని జానాన్ని ఫలానా శాస్త్రం అని

అనలేం. కాని ఆయన 'తాత్వికంగా ఆలోచిస్తున్నాడు', ఆయన 'తత్వమే అంత' లాంటి మాటలు మన వ్యావహారంలో బాగానే వినిపిస్తాయి. ప్రతి మనిషీ ఇతరుల ఆలోచనలను వింటాడు. చదువొస్తే చదువుతాడు, తానుగా ఆలోచిస్తాడు. తన ఆలోచనల్ని ఇతరులకు చెబుతాడు. అందుకే 'ప్రతిమనిషీ తత్వవేత్తయే' అనే భావన చిరకాలంగా ఉంది. బహుశా, 20వ శతాబ్దంలో కమ్యూనిస్టుల ముందుకొచ్చిన పలు ప్రశ్నలకు చాలా ఆలోచనీయమైన జవాబులు అందించినవాడు, ఇటాలియన్ కమ్యూనిస్టు ఆంటోనియో గ్రాంసీ. 'ప్రతి మనిషీ తత్వవేత్తయే' నన్న పాత వాక్యాన్ని తరచి చూసి, దాన్ని చాలా ఆచరణాత్మక భావనగా మలచాడాయన.

గ్రాంసీ ఇలా అంటాడు : 'ఫిలాసఫీ ఒక చిత్రమైన, కష్టమైన పని అని, అది సంఘంలో కొందరు మేధావులు, ప్రత్యేక నైపుణ్యం కలిగిన స్పెషలిస్టులు, ఒక క్రమపద్ధతిలో ఆలోచించే వృత్తి నిపుణులు చేసే పని అని.. ఒక అభిప్రాయం బలంగా ఉంది. ఈ అభిప్రాయాన్ని తీసి పక్కన పడేయాల్సి వుంది. దానికదే తయారయ్యే 'యాదృచ్ఛిక తత్వశాస్త్రం' (స్పాంటేనియస్ ఫిలాసఫీ) లక్షణాలను, దాని పరిమితులను అర్థం చేసుకుని, 'మనుషులందరూ తత్వవేత్తలే' అని నిరూపించాల్సి వుంది. ఈ 'యాదృచ్ఛిక తాత్వికత' ప్రతి మనిషిలోనూ ఉంటుంది' మరి, ప్రతి మనిషీ తత్వవేత్త అయితే, తత్వ శాస్త్రం సంఘంలో దానికదే యాదృచ్ఛికంగా (స్పాంటేనియస్‌గా) పుడుతున్నట్టయితే, అది ఎలా పుడుతుంది. పుట్టినది ఎక్కడ ఉంటుంది? ఎవరూ రాయని పుస్తకాల్లోనా? ఔను, దాదాపు అంతే, ఎవరూ రాయని పుస్తకాల్లోనే అని చెప్పకతప్పదు. ఎందుకంటే, 'తత్వశాస్త్రం అనేది మనం నిత్యం వాడే భాషలోనే ఉంటుంది. భాష అంటే వ్యాకరణయుక్తమైన నిస్సార పదజాలం కాదు. ఏ భాష అయినా పలు నిశ్చిత అభిప్రాయాలూ, భావనల సమాహారమే. తత్వ శాస్త్రం మనుషుల లోకజ్ఞానంలో (కామన్ సెన్స్‌లో), సద్బుద్ధిలో (గుడ్ సెన్స్‌లో) కూడా ఉంటుంది. ప్రజలు ఆమోదించే (పాపులర్) మతంలో, ఇంకా, వారి నమ్మకాలూ మూఢ నమ్మకాల్లో, అభిప్రాయాలూ పలుకుబడుల్లో, ప్రవర్తనా రీతుల్లో తత్వశాస్త్రం ఇమిడి ఉంటుంది. ఇవన్నీ జానపదం (ఫోక్లోర్) అనే మాట కిందికి వస్తాయి' అంటాడు గ్రాంసీ. ఈ మాటలకు పెద్దగా వివరణ అక్కర్లేదు.

చెర్నాకోల అనేది వ్యవసాయదారులు బండికి కట్టిన ఎద్దులను తోలే కొరడా వంటి సాధనం. చెర్నాకోల అనే పదంలో ఎందరో సేద్యగాళ్ల జ్ఞానం ఇమిడి ఉంది. దాని తయారీలో ఒక పరంపర ఉంది. కర్ర తయారీ, తాడు తయారీ, తోలు తయారీ పనులు అందులో ఇమిడి ఉన్నాయి. ఏ పదమైనా చూడండి. చాలా అమాయకంగా కనిపించే ఒక పదంలో, ప్రాంతీయంగా దాని భిన్నరూపాల్లో, దాని అర్థ పరిణామాలలో.. చాలా చరిత్ర, జ్ఞానం ఉంటాయి. ఊళ్లలో మనుషులు చెప్పుకునే కథలూ గాథల్లో, నానుడులూ సామెతల్లో, ఇతర తెలివి మాటల్లో, ప్రజలు చాలా యాదృచ్ఛికంగా పాటించే ఆచార వ్యవహారాల్లో 'లోక జ్ఞానం' ఉంటుంది. ఇది మంచి, ఇది చెడు అని ప్రజలు తమలో తాము చెప్పుకునే, హెచ్చరించుకునే బుద్ధి మాటల్లో కేవలం జ్ఞానమే కాకుండా మంచి చెడు వివక్ష ఉంటుంది. ప్రజలు నిత్య జీవితంలో ఉపయోగించే ఈ 'సద్బుద్ధి' (గుడ్ సెన్స్) లోక జ్ఞానంలో భాగమే. సద్బుద్ధిని పెంచుకుని దుర్బుద్ధిని తుంచుకునే క్రమంలోనే మనుషులు తమ మధ్య మరింత సామరస్యాన్ని, సహ జీవన రీతులను పెంచుకుంటారు. జీవితం రాను రాను సుఖమయం అవుతుంది. ముందుకు సాగుతుంది.

**గ్రాంసీ ఇలా అంటాడు :**

> **'జనం దృష్టిలో తత్వం అంటే ఏమిటో.. కొన్ని పలుకుబడులను బట్టి గ్రహించవచ్చు. ఇంగ్లీషులో 'బీయింగ్ ఫిలసాఫికల్ అబౌటిట్' అనే పలుకుబడి ఉంది. ఈ మాటకు 'వాస్తవికతతో రాజీ', 'ఓపిక పట్టే ధోరణి' అనే అర్థాలు వస్తాయి. ఏం జరుగుతున్నదో అది హేతుబద్ధం, దాన్ని హేతుబద్ధ వాస్తవంగా తీసుకుని, అలాగే ఎదుర్కొనాలనే వైఖరి దీని వెనుక ఉందని నా (గ్రాంసీ) అభిప్రాయం. అలాంటి వైఖరితోనే మనిషి తన చుట్టూ ఘటనల గురించి హేతుబుద్ధితో ఆలోచించాలి. అంతేగాని, తన మానసికోద్వేగాలకు ఎలా అనిపిస్తే అలా, తన బుద్ధికి ఎలా తోస్తే అలా చేయగూడదు. పాపులర్ సాహిత్యంలో రచయితలు వాడే 'ఫిలాసఫీ', 'ఫిలాసఫికల్లీ' వంటి మాటలు కూడా ఇలాంటివే. అంటే, ఫిలాసఫీ(తత్వశాస్త్రం), ఫిలాసఫికల్లీ (తాత్వికంగా) అనే మాటలకు జన వ్యవహారంలో నిర్దిష్టమైన అర్థాలు ఉన్నాయని అర్థం.'**

లోక జ్ఞానం ప్రాముఖ్యం తెలుసుకుంటే చాలదు. దాని పరిమితులనూ తెలుసుకోవాలి. నిరంతరం దాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరాన్ని, అభివృద్ధి చేసుకునే విధానాలనూ తెలుసుకోవాలి. గ్రాంసీ ఆ దిశగా చేసిన ఆలోచనలు ఆశ్చర్యపరుస్తాయి. 'చైతన్యయుతంగా దిశా నిర్దేశాలు చేసుకోవడం మానవ కార్యకలాపాలకు అవశ్యం. ఈ ఆవశ్యకతకు సంబంధించిన స్పృహ వల్లనే మనం మనలోని అట్టడుగు, జంతు సహజ ఉద్వేగాలను అధిగమించి సమస్యలను చూడగల్గుతున్నాం. ఇది లోక జ్ఞానంలోని కీలక విషయం. లోక జ్ఞానం (కామన్ సెన్స్)లోని ఈ కీలక భాగాన్ని 'సుజ్ఞానం' (గుడ్ సెన్స్) అనొచ్చు. సుజ్ఞానాన్ని మరింత సమగ్రం, మరింత సుబద్ధం చేసుకోవాలి. అందువల్ల ముక్కలు ముక్కలుగా, ఏవో కొన్ని అభిప్రాయాలూ భావాలుగా కనిపించే జన సామాన్యంలోని సామాన్య తాత్వికత నుంచి

శాస్త్రీయ తాత్వికతను వేరు చూసి చూడలేం" అంటాడు గ్రాంసీ. అంటే ఏమిటి ? లోక జ్ఞానం అనేది ఏదో పూజ చేసుకునే పటం కాదు. దాని మీద అతి ఆరాధన అక్కర్లేదు. దానిలో మంచి చెడులను చూసి, దాన్ని పూర్తి తత్వశాస్త్రం దిశగా మలచుకునే పని కూడా జరగాలన్న మాట. లేకుంటే సహజాతాల (ఇన్‌స్టింక్స్) వద్ద, జంతుస్థాయిలో ఉండిపోతామని గ్రాంసీ హెచ్చరించాడు.

భాష లోకజ్ఞానానికి పాత్ర, వాహిక. ఒక భాష అభివృద్ధి స్థాయిని బట్టి ఆ ప్రజల ప్రాపంచిక దృక్పథం ఎంత సరళమో లేక ఎంత క్లిష్టమో తెలుసుకోవచ్చు. ఇతర ప్రాంతాల ప్రజలతో సంపర్కంలోనికి వెళ్తూ వారి నుంచి నేర్చుకుంటూ వారికి నేర్పుతూ ఉన్న భాష త్వరగా వృద్ధి చెందుతుంది. 'సంపన్నం' అవుతుంది. అందుకే మనిషి మాండలికాల స్థాయిలో పిడుచగట్టుకుపోరాదని గ్రాంసీ అంటారు. తమ ప్రాంతానికి పరిమితమైన చిన్న చిన్న భాషలనులేదా యాసలను అతిగా అభిమానించే వారికి ఈ భావన అంతగా నచ్చక పోవచ్చు. స్థానిక మాండలికాలతో, అవ్వ తాతలు కూడా వాడడం మరిచిపోయిన 'ప్రాచీన' పదాలతో తయారయ్యే సాహిత్యానికి ఈ గ్రాంసీ భావన వర్తిస్తుందది. ఈ విషయంలో గ్రాంసీ భావాల నుంచి మనం నేర్చుకోవాలి.

స్థానికత్వం ఒక అస్తిత్వం కూడా. ఇటీవలి అస్తిత్వ పోరాటాలు.. రాజకీయార్థిక రూపాలతోపాటు.. స్థానిక భాషాభివృద్ధి రూపం ధరిస్తున్నాయి. ఇది మంచిదే. కాస్త ముందుగా వ్రాత, చదువు మొదలెట్టిన ఒక ప్రాంతం వాళ్లు ఇతర ప్రాంతాల మీద తమ పెత్తనం కోసం, వారిపై తమ మాండలికాన్ని రుద్దబోతారు. దానికి నిరసన పెరుగుతున్నది. సొంత అస్తిత్వాల సగర్వ ప్రకటనగా 'వెనుకబడిన' ప్రాంతాలు తమ మాండలికాల్ని 'గౌరవించుకోవడం' ఎక్కువయ్యింది. ఇది సహజమైనదీ, సరైనది. ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గి అందరూ ఒక స్థాయికి చేరే కొద్దీ.. ప్రజలందరి మధ్య సంబంధాలు, వాణిజ్య వ్యవహారాలు పెరిగే కొద్దీ.. యాసల మధ్య ఆదాన ప్రదానాలు పెరిగే కొద్దీ.. మరో మాటలో, అభివృద్ధి జరిగే కొద్దీ.. మాండలికాలు కరిగిపోయి ఒక ప్రామాణికమైన ప్రజల భాష ఏర్పడుతుంది. ఇప్పటి కిప్పుడు మాండలికాన్ని 'దేశభక్తి' వంటి 'భక్తి భావన'తో చూసే వాళ్లు ప్రజలకు మేలు చేస్తున్నారా అనేది ఆలోచించాల్సిన విషయం.

## గ్రాంసీ ఇలా అంటాడు

**'ఒక మనిషి తన మాండలికంలోనే మాట్లాడుతూ ప్రామాణికి భాషను అర్థం చేసుకోడం లేదని అనుకుందాం. అప్పుడు ప్రపంచం గురించి ఆయన అవగాహన కూడా అలా అరకొరగానే ఉండిపోతుంది. ప్రాంతీయతా పరిమితుల్లోనే (ప్రొవిన్షియల్ గానే), ఎదుగు బొదుగు లేకుండా ఎక్కడున్నది అక్కడే ఉండిపోతుంది. ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న పలు ముఖ్యమైన ఆలోచనలతో సంబంధం లేకుండా, చారిత్రకంగా వెనుకబడి ఉండిపోతుంది"**

అలా వెనుకబడినా సరే మన భాష, మన మాండలికం పరిరక్షణే మనకు ముద్దు అనుకునే వాళ్లు మన మధ్య బాగానే ఉన్నారు. వారు గ్రాంసీ చెప్పిన ఈ కోణం గురించి ఆలోచించాలి. ఘెట్టో మనస్తత్వం వొదిలేయాలి. (ఘెట్టో మనస్తత్వం అంటే ఇతర్లు బలిమిని మన ల్ని ఘెట్టోలలో ఉంచడం వల్ల ఏర్పడే మనస్తత్వం, అదే గొప్ప అనుకునే సంకుచిత మనస్తత్వం కూడా).

గ్రాంసీ ముందుకు తెచ్చిన మరో గొప్ప భావన 'ఆచరణ-తత్వశాస్త్రం' (ఫిలాసఫీ అఫ్ ప్రాక్సిస్). లోకజ్ఞానం యాదృచ్ఛికమైన ప్రజల తత్వశాస్త్రం. ఇది ఆచరణ-తత్వశాస్త్రం అభివృద్ధిలో ముఖ్య భాగం. ఆచరణ-తత్వశాస్త్రంలో ఆచరణకు, ఆలోచనకు సంబంధించిన రెండు ప్రాపంచిక దృక్పథాలూ కలిసి ఉంటాయి. సహజీవనం చేస్తాయి. ఆచరణ భాగం మనుషుల చేతల్లో.. ఉద్యమాల్లో, ఆచార వ్యవహారాల్లో కనిపిస్తుంది. ఆలోచన భాగం ప్రజల మాటల్లో.. భాషల్లో, యాసల్లో, పాటల్లో, పద్యాల్లో, కథల్లో కనిపిస్తుంది. చాలా సార్లు ప్రజల చేతలకు, వారు వ్యక్తం చేసే భావాలకు మధ్య తేడా ఉంటుంది. వాళ్లు తమ భావాలుగా చెప్పే వాటికీ, వాళ్లు వాస్తవంగా చేసే పనులకు/ప్రవర్తనలకూ మధ్య తేడా ఉంటుంది. దీనికి కారణం ఆత్మవంచన కాదు అంటాడు గ్రాంసీ. 'కొందరు వ్యక్తుల విషయంలో, కొన్ని చిన్న చిన్న గుంపుల విషయంలో ఆ తేడాకు కారణం ఆత్మవంచన కావొచ్చు. విశాల ప్రజానీకం (మాసెస్) విషయంలో ఈ తేడా ప్రజల సాంఘిక చారిత్రిక పరిస్థితుల్లోని తేడాకు ప్రతిబింబం" అంటాడాయన. "ఆ సాంఘిక బృందానికి తనదైన సొంత ప్రాపంచిక దృక్పథం.. బీజప్రాయంగానైనా.. ఉండొచ్చు. ప్రజల కార్యాచరణలో ఆ దృక్పథం అప్పుడప్పుడు మెరుపులా మెరవచ్చు. ప్రజా సమూహం ఒక సజీవ(ఆర్గానిక్) సమూహంగా ప్రవర్తించే సమయంలో ఈ మెరుపులు మరింత స్ఫుటంగా కనిపిస్తాయి. అయితే ఆ బృందం తన మేథాపరమైన ఉపశ్రేణి (ఇంటలెక్చువల్లీ సబాల్టర్న్) పరిస్థితి వల్ల పైవర్గాలకు తలొంచి జీవిస్తుంది. బీజప్రాయంగానైనా తనలో ఉన్న సొంత దృక్పథాన్ని కాకుండా పైవర్గాల నుంచి అరువు తెచ్చుకున్న దృక్పథాన్ని అనుసరిస్తుంది. మూగగా అనుసరించడమే కాదు, అరువు తెచ్చుకున్న దృక్పథాన్ని బలపరుస్తుంది, అదే తన దృక్పథమని స్వయంగా నమ్ముతుంది కూడా." అని వివరించాడు గ్రాంసీ. ఈ మాటలు విన్నప్పుడు మన గ్రామసీమలు, మన సమాజంలోని పేద ప్రజలు మనకు జ్ఞాపకం రావాలి.

**ఒక దళిత కులస్థుడు, ఒక అగ్రకులస్థుడు కలిసి తిరిగే సమయంలో అగ్రుడు కలుపు గోలుగా ఉన్నా, దళిత కులస్థుడు దూరం దూరం ఉండే సందర్భాలు ఉంటాయి. పొరపాటున ఒకరినొకరు ముట్టుకుంటే దళిత కులస్థుడే కోప్పడి, 'కొంచెం చూసుకో, నువ్వు నన్ను తాకగూడదు' అని అగ్రుడికి జ్ఞానం అందించే ప్రయత్నం చేస్తాడు.**

అక్కడ దళిత కులస్థుడు ఊరి జనుల ప్రాపంచిక దృక్పథాన్ని తనకు తెలీకుండానే అరువు తీసుకుంటున్నాడు. దాన్నే తన ప్రాపంచిక దృక్పథంగా నమ్మి పక్కన ఉన్న మనిషికి కూడా పంచుతున్నాడు. "ఆ బృందం 'మామూలు సమయాలలో' అనుసరించే దృక్పథం ఆ అరువు తెచ్చుకున్న పైవర్గాల దృక్ప థమే. 'మామూలు సమయాలు' అంటే తనకు తాను స్వతం త్రంగా కాకుండా, పై వర్గాలకు తలొంచి, ఉపశ్రేణి (సబాల్టర్న్) బృందం గా వ్యవహరించే సమాయాలన్నమాట. సరిగ్గా ఇందుకే, తత్వశాస్త్రాన్ని రాజకీయాల నుంచి వేరు చేసి చూడలేం. ఒక దృక్పథం వైపు మొగ్గును, లేదా విమర్శను కూడా రాజకీయాం శంగానే చూడాల్సి ఉంటుంది" అంటాడు గ్రాంసీ. మనుషులు 'మామూలు సమయాల్లో' పైవర్గాల భావజాలం కింద నలుగు తూ, తమదైన దృక్పథాన్ని వొదులుకుని పాలక దృక్పథాన్ని అరువుతెచ్చుకుని ప్రవర్తించినా, 'సజీవ(ఆర్గానిక్) బృందంగా ప్రవర్తించే సమయాల్లో' తమ దృక్పథంతో తాము ఎంత గొప్పగా కనిపిస్తారో గ్రాంసీ చెబుతున్నప్పుడు... డబ్ల్యు.బి. యేట్స స్మృతి గీతం 'ఈస్టర్ 1916', అందులో యేట్స్ కీర్తించిన సామాన్యులు మన కళ్లకు కడతారు

### "ఈస్టర్ 1916

.... ....
అదిగో నేను చూసిన ఇంకో మనిషి
తాగుబోతు, గప్పాలు కొట్టే మనిషి
నాకు చాలా ఆత్మీయులైన వాళ్లకు
చాలా కష్టం నష్టం కలిగించాడు కూడా
అయినా అతడి గురించి పాడుతాన్నేను
బతుకు ప్రహసనంలో అతడు కూడా తన
వంతు వేషం తాను వేసిన వాడే, అయినా
అతడు చాలా చాలా మారిపోయాడు
తనకు తాను పూర్తిగా మారిపోయాడు:
భయంకర సౌందర్యం ఒకటి జనించింది"

అవీ సాధారణ ప్రజలు తమ 'లోకజ్ఞానం' లోని 'సుజ్ఞానం' (గుడ్ సెన్స్)తో ప్రవర్తించే సమయాలు. అయితే వీటి వెనుక కూడా చాలా బౌద్ధిక శ్రమ ఉంటుంది. లోకజ్ఞానాన్ని తమ కాలపు పురోగామి తత్వశాస్త్రం స్థాయికి పెంచి, 'ఆర్గనైజ్' చేసి వారితో కలిసి నడుస్తూ, వారిని నడిపించే తత్వశాస్త్రం, మేధావులు దాని వెనుక ఉంటారు. లేకుంటే ప్రజలు లోకజానం లోని దుర్బుద్ధితమను ఎటు నడిపితే అటు నడిచిపోతారు. అలనాడు హిట్లర్, ఇప్పుడు సామ్రాజ్యవాదులు, ఇండియాలో మతవాదులు.. జాతి, మతం, ఎల్లలు లేని సుఖవాదం, దైవభక్తి, మోక్షం వంటి 'లోకజ్ఞాన అంశాలు' ఆధారంగానే ప్రజలను అమానవీయ మార్గాలలో నడిపించారు, నడిపిస్తున్నారు. దీనికి విరుగుడు తిరిగి.. లోకజ్ఞానాన్ని అత్యంత పురోగామి తత్వ శాస్త్రమైన మార్క్సిజం వైపు నడిపించడమే.

ఈ పని పైనుంచి జరిగేది కాదు. అంటే మేధావులు, వృత్తి నిపుణుల వద్ద వున్న అధికారిక తత్వ శాస్త్రజ్ఞుల వల్ల జరిగేది కాదు. తాము చెప్పే వాళ్లు, జనం విధేయంగా వినే వాళ్లు అనే పాత భావనను... వామపక్షీయులు సైతం వదులుకోవాలి. ఇదే లోకజ్ఞానం మీద ఆంటోనియో గ్రాంసీ భావనల సారాంశం. లోక జ్ఞానాన్ని సువ్యవస్థిత తత్వశాస్త్రం స్థాయికి అభివృద్ధి చేయడం.. ఆచరణ తత్వశాస్త్రంగా మార్చడం అదేమంత సులభం కాదు, దాని కోసం పట్టుదలగా పని చేయాలంటాడా యన: "ఒక సాంస్కృతికోద్యమం తన కాలానికి ఉన్న లోకజానాన్ని, అందులోనిపాత భావనలను త్రోసిరాజని, ఆ స్థానాన్ని ఆక్రమించాలంటే అది కొన్ని పనులు చేయాలి.

1.తన వాదనలను ఏ మాత్రం ప్రాలుమాలకుండా పదేపదే చెప్పాలి (చెప్పే విధానాలలో రూప వైవిధ్యాలను అనుసరించాల్సి ఉన్నప్పటికీ). తిరిగి తిరిగి చెప్పడం అనే బోధన పరికరం విశాల ప్రజానీకం మీద చాలా బాగా పనిచేస్తుంది.

2. అంతకంతకు పెరుగుతున్న ప్రజా సమూహపు ఆలోచనల స్థాయిని పెంచి, రూపరహితంగా ఉన్న ఆ ప్రజా సమూహానికి ఒక వ్యక్తిత్వం కల్పించడం కోసం నిరంతరం పని చేయాల్సి ఉంటుంది. అంటే, ఆ ప్రజా సమూహం నుంచి మేధావులు నిరంతరం పుట్టి పెరగాలి. అలా పుట్టి పెరిగిన మేధావులు నిరంతరం ప్రజా సమూహ స్పర్శలో ఉండాలి. ఆ సమూహానికి వెన్నెముకలా పనిచేయాలి. ఈ రెండో అంశం సంతృప్తికరంగా పని చేస్తే, అది ఒక యుగం తాత్విక చిత్రపటాన్నే మార్చేస్తుంది." మన యుగం తాత్విక చిత్ర పటాన్ని, దరిమిలా రాజకీయార్థిక చిత్రపటాన్ని మౌలికంగా మార్చే పనిలో మనకు గ్రాంసీ ఆలోచనలు కరదీపికలుగా పనిచేస్తాయి.

ఆయన బహుథా వివరించిన ఆధిపత్యం, పౌరసమాజం, ఫ్యాక్టరీ కౌన్సిల్స్, నిశ్శబ్ద విప్లవం (ప్యాసివ్ రెవల్యూషన్) వంటి భావనలన్నిటికీ తొలి పాఠం 'లోక జ్ఞాన'మే అనుకుంటాను. ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్, పార్టీ తదితర పలు అంశాలలో మన ఆలోచనలను పదును పెట్టుకోడానికి ఆకురాయిగా లోక జ్ఞానం భావన ఉపయోగపడుతుందని అనుకుంటాను. ❑


# ఆధిపత్య భావజాల స్థావరాలను బద్దలు కొట్టాల్సిందే



అశోక్ కుంబము

**విద్య, బోధనా పద్ధతుల మీద గ్రాంసీ ఆలోచనలు అర్థం కావాలంటే వాటిని అతని మొత్తం రచనలతో కలుపుకోని విశ్లేషించుకుంటే కాని అర్థం కావు. జ్ఞానమంటే ఏమిటి ? అసలు మేధావులు ఎవరు? సమాజంలో సంస్కృతి ఎట్లా నిర్మాణ మవుతుంది ? ఎట్లా ప్రజల జీవితాల్లోకి ఇంకిపోతుంది? ఆధిపత్యం ఏ విధంగా సర్వసాధారణ విషయంగా మారిపోతుంది ? ఈ పక్రియల్లో రాజ్యం, పౌర సమాజం ఎలా పనిచేస్తాయి? వీటన్నింటిని అర్థం చేసుకుంటేనే గ్రాంసీ విద్య గురించి చేసిన పరిశీలనలు అర్థమవుతాయి.**

కవి అన్నట్లు ఆయనేమీ బాంబులు పంచలేదు. శత్రువు మీదికి గురి చూసి తుపాకి పేల్చలేదు. అతను చేసిందల్లా దోపిడీ, అణిచివేతలకు బలాన్నిచ్చే ఆధిపత్య భావజాలాన్ని ధ్వంసం చేసే కొత్త రాజకీయ, సాంస్కృతిక భావాలను, విలువలను నిర్మాణం చేశాడు. మార్క్సిజం వెలుగులో చరిత్రకు కొత్త భాష్యం చెప్పాడు. అంతటితో ఆగక ఆ చరిత్ర నిర్మాణంలో భాగమయ్యాడు. ప్రజా పోరాటాలలో నాయకుడై ముందు నిలిచాడు. అందుకే దేశంలో "అంతర్యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నాడని" అతణ్ని ఫాసిస్టు ప్రభుత్వం నిర్బంధించింది. అతని మెదడు చాలా ప్రమాదకరమైనదని ఫాసిస్టు కోర్టు ప్రకటించింది. ఇరవై ఏండ్ల జైలు శిక్ష విధించింది. రాజ్యం అతణ్ని భౌతికంగా బందీ చేయగలిగింది. తాను అమితంగా ప్రేమించే ప్రజలకు దూరం చేయగలిగింది. జైలు హింసతో ఆరోగ్యాన్ని నాశనంచేసి 'శాస్త్రీయంగా చంపగలిగింది' (scientific killing). కానీ, అతడు సృష్టించిన భావ విస్ఫోటనాన్ని ఆపలేకపోయింది. అతను ఇటాలియన్ మార్క్సిస్ట్ మేధావి ఆంటోనియో గ్రాంసీ. గ్రాంసీ తన 46వ ఏట చనిపోయే నాటికి (27 ఏప్రిల్, 1937) రాజ్య నిర్బంధంలో పదకొండేళ్లు గడిపాడు. తన చివరి క్షణం వరకు ప్రజాయుద్ధం (విశాల అర్థంలోనే) కోసం జ్ఞానయుద్ధం చేశాడు. జ్ఞానం కేవలం మేధోసంపద పోగేసుకోవడం కోసం కాదు. వ్యక్తి బతుకు దెరువుకు మార్గం మాత్రమే కాదు. భుజకీర్తులు తగిలించుకోవడం కోసం కాదు. అస్తిత్వాన్ని ప్రకటించుకోవడం కోసం కాదు. భజనపరుల మెప్పు కోసం కాదు. జ్ఞానం ఆధిపత్య భావజాల విధ్వంసం కోసం. ఆ క్రమంలో జరిగే సమాజ పరివర్తన కోసం. ఈ ఆచరణ సిద్ధాంతాన్ని (Theory of Praxis) మార్క్సిజం వెలుగులో ముందుకు తీసుకొచ్చాడు. ఆధిపత్య భావాల నిర్మాణంలో దోపిడీ పాలక వర్గాలు విద్య, మీడియా, మతం వంటి వాటిని ఆయుధాలుగా వాడుకుంటాయని విశ్లేషించాడు. ముఖ్యంగా విద్యా విధానం మీద గ్రాంసీ అనేక సూక్ష్మ పరిశీలనలు, ప్రతిపాదనలను చేశాడు. వాటిలో కొన్నింటినైనా అర్థం చేసుకునే ప్రయత్నమే ఈ వ్యాసం.




విద్య, బోధనా పద్ధతుల మీద గ్రాంసీ ఆలోచనలు అర్థం కావాలంటే వాటిని అతని మొత్తం రచనలతో కలుపుకోని విశ్లేషించుకుంటే కాని అర్థం కావు. జ్ఞానమంటే ఏమిటి? అసలు మేధావులు ఎవరు? సమాజంలో సంస్కృతి ఎట్లా

నిర్మాణమవుతుంది ? ఎట్లా ప్రజల జీవితాల్లోకి ఇంకిపోతుంది? ఆధిపత్యం ఏ విధంగా సర్వసాధారణ విషయంగా మారిపోతుంది ? ఈ ప్రక్రియల్లో రాజ్యం, పౌర సమాజం ఎలా పనిచేస్తాయి? వీటన్నింటిని అర్థం చేసుకుంటేనే గ్రాంసీ విద్య గురించి చేసిన పరిశీలనలు అర్థమవుతాయి. ఎందుకంటే గ్రాంసీ దృష్టిలో విద్య కేవలం తరగతి గదులకు, పాఠ్యాంశాలకు పరిమితమైనది కాదు. గ్రాంసీకి విద్య సంస్కృతిలో భాగం. అది తనలోని తనను (inner self) ఎట్లా అర్థం చేసుకోవాలో, ఎట్లా క్రమశిక్షణలో పెట్టుకోవాలో నేర్పుతుంది. ఆ క్రమంలో తన వ్యక్తిత్వం ఏమిటో తనకు తెలిసొచ్చేలా చేస్తుంది (స్వీయ స్పృహ అనేది గ్రాంసీ తనమీద ఉన్న హెగేలియన్ ప్రభావంతో అన్న మాట). దాని ద్వారా సమాజంలో తన స్థానం, విలువ ఏమిటో అర్థమయ్యేలా చేస్తుంది. సంఘజీవిగా బతకడమంటే ఏమిటో తెలియచేస్తుంది. జీవిత ప్రయోజనాన్ని బోధిస్తుంది. అంతేకాదు, తన చుట్టూ సంస్కృతి పేరిట నిర్మితమైన గోడల గురించి తెలుసుకునే పరికరాలను ఇస్తుంది. చివరిగా ఆ గోడలను కూల్చే శాస్త్రీయ, చారిత్రక ఆయుధాలను అందిస్తుంది. మొత్తంగా తన వ్యక్తిగత, సామూహిక జీవితసారాన్ని అర్థం చేసుకొనే జ్ఞానాన్ని అందిస్తుంది. ఆ జ్ఞానమే సామాజిక పరివర్తనలో భాగమయ్యే రాజకీయ చైతన్యాన్ని కల్గిస్తుంది. దోపిడీ, పీడనల సందర్భంలో చైతన్యాన్ని పొందిన ప్రజలే విప్లవ మార్గాన్ని ఎంచుకుంటారని, చివరి వరకు చరిత్ర నిర్మాణంలో నిలబడుతారని గ్రాంసీ అభిప్రాయం. అయితే జ్ఞానం నుండి ఆచరణలోకి మారే క్రమం ఒక సరళ రేఖలో జరుగదు. ఎందుకంటే విద్య అనేది ఒక భావ సంఘర్షనా ప్రక్రియ. మన నిత్య జీవితంలో వివిధ సామాజిక సంస్థల ద్వారా (విద్యా సంస్థలు, మతం, కుటుంబం, రాజ్యం, రాజకీయ పార్టీలు, సామాజిక సమూహాలు/క్లబ్బులు, యూనియన్లు), అనేక సాంస్కృతిక రూపాలు, వ్యవహారాల ద్వారా మనం పొందే జ్ఞానం, అనుభవమంతా విద్యలో భాగమే. అటువంటి విద్యా పద్ధతుల్లో అనేకరకాల భావాలు కలబడుతాయి. కొన్ని ఓడి గెలుస్తాయి. మరికొన్ని గెలిచి ఓడుతాయి. ఆ గెలుపు ఓటములు ఆయా స్థల, కాలాల పరిధిలో జరుగుతాయి. అవి వాటిని ప్రభావితం చేసే రాజకీయార్థిక అంశాలు, వాటి చుట్టూ నిర్మితమైన సంస్కృతి మీద ఆధారపడుతాయి.

వాస్తవానికి ఏ భావజాలమైనా ఆధిపత్య స్థాయికి చేరడానికి విద్య చాలా ప్రధానమైనది. ఆ విద్యే ఒక విషయం పట్ల సమ్మతినో, వ్యతిరేకతనో కల్గిస్తుంది. ఒక విషయం ప్రశ్నించలేనంత సమ్మతిని కూడగట్టగలిగిందంటే అది ఆధిపత్యస్థాయికి చేరినట్లే. ఈ అర్థంలో గ్రాంసీ దృష్టిలో అన్ని ఆధిపత్య ప్రక్రియలలో విద్య అనివార్యమయినది. Every relationship of hegemony is necessarily an educational relationship అని అంటాడు గ్రాంసీ. అందుకే విద్యావిధానం మీద గ్రాంసీ చేసే మొట్టమొదటి ప్రతిపాదనేమంటే విద్య వ్యక్తికి ఒక విషయాన్ని విమర్శనాత్మకంగా ఆలోచించి, అర్థం చేసుకునే స్థాయిని కలిగించేలా ఉండాలి(the fundamental power to think). ప్రశ్నించే తత్వమే సమాజ పురోగతికి ఇంధనమని భావించాడు. అది సైన్స్ అయినా, చరిత్ర అయినా ప్రశ్నల సమ్మెట దెబ్బలు తింటేనే సత్యం బయటపడుతుందని నమ్మాడు. ఏ విషయంలోనైనా అతి కీర్తనలు పనికిరావని చెప్పాడు. చరిత్రను అర్థం చేసుకోవడానికి అందులోని కొన్ని ఘటనలను, కొందరు వ్యక్తులను కీర్తించడం కాకుండా (దీన్నే గ్రాంసీ fetishistic history అంటాడు. ఈ భావనను తర్వాత వాల్టర్ బెంజమన్ ఇంకా అభివృద్ధి చేశాడు) ఆ చరిత్ర నడిచిన సంక్లిష్ట సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అంటాడు.

పాలక వర్గాలు, జాతులు (భారతదేశ సందర్భంలో దోపిడీ కులాలు) విద్యను ఒక సాధనంగా వాడుకుంటాయి. తమ ఆధిపత్యాన్ని విద్య ద్వారా అందరి మెదళ్లలోకి ఎక్కిస్తాయి. పీడిత వర్గాలు, జాతులు, కులాలు ఆ ఆధిపత్య భావాలు మావే అనుకునేటట్లు చేస్తాయి. అట్లా ఆధిపత్యాన్ని మామూలు విషయంగా మార్చడానికి దోపిడీ వర్గాలు, కులాలు తమ చేతిలోని రాజ్యయంత్రాంగాన్ని, దాని అజమాయిషీలో నడిచే అన్ని వ్యవస్థలను, సంస్థలను వాడుకుంటాయి. ఇందులో వాటి ముఖ్య ఉద్దేశం సమాజంలోని ఒక పెద్ద భాగాన్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకోవడం. అందుకోసం అవసరమైనచోట సమ్మతి కోసం ప్రయత్నిస్తారు. అది వీలుకాకపోతే బలాన్ని వాడుతారు. అందుకే గ్రాంసీ చేసిన సూత్రీకరణ ఏమంటే ఆధిపత్యం, సమ్మతి, బల ప్రయోగం. ఈ సూత్రీకరణ మాకియవెల్లి రాసిన “ది ప్రిన్స్” అనే గ్రంథంలో రాజు ఏ విధంగా కపట బుద్ధిని, బలాన్ని ఉపయోగించి ప్రజలను అదుపులో ఉంచాలో రాసిన పద్ధతి నుండి గ్రహించాడన్నది ఒక పరిశీలన. ఈ విషయాన్ని చెప్పడానికి మాకియవెల్లి గ్రీక్ పురాణాల నుండి సగం (పై భాగం) బుద్ధిగల మనిషి, మరో సగం (కింది భాగం) బలం గల గుర్రం రూపంలో ఉండే సెంటూర్ అనే జంతువును ప్రతీకగా వాడాడు. సమ్మతి, బల ప్రయోగాలను విడివిడిగా చూసేవాళ్ళు ఉన్నారు. కానీ, నిజమైన గ్రాంసియన్ స్ఫూర్తిలో (ముఖ్యంగా ఫాసిస్టు సందర్భంలో) అవి కలగలిసే వుంటాయి.

నిజానికి విద్యా వ్యవస్థలో సమ్మతి, బలప్రయోగం కలిసే ఉంటాయి. ప్రధానంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో విద్యను పెట్టుబడికి ఒక అనుబంధంగా (appendage) మార్చిన తరువాత పెట్టుబడి తన అభివృద్ధికి పనికొచ్చే జ్ఞానాన్ని మాత్రమే జ్ఞానంగా పరిగణిస్తుంది. ఈ వాతావరణంలో విద్య అంటే మార్కెట్‌లో విలువను క్రియేట్ చేసే ఒక సాధనం అనే ఒక

సమ్మతి నిర్మితమైంది. దానికి అనుకూలంగానే బోధన జరుగుతుంది. ఈ సందర్భంలో విమర్శనాత్మక ఆలోచనలను, సృజనాత్మకను పెంచే బోధనా పద్ధతులను, పాఠ్యాంశాలను తగ్గించడం, తక్కువ చేయడం సర్వసాధారణమైంది. ఒకవైపు ఇలాంటి విద్యా సంస్కృతిని పెంచిపోషిస్తూనే, మరోవైపు పీడిత వర్గాల, జాతుల, కులాల అధ్యాపకుల మీద, విద్యార్థుల మీద అనేక రూపాలలో పెత్తనం కొనసాగుతుంది. వీటికి తోడు అధ్యాపకులు ఏమి బోధించాలో, ఎలా బోధించాలో పెట్టే నిబంధనలు విద్యా వ్యవస్థలో కొనసాగే బల ప్రయోగంలో భాగమే. అంతేకాదు, కోట్లాది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోవడం పాలక వర్గాలు అమలు చేసే వ్యవస్థీకృత బల ప్రయోగంలో భాగమే. భూస్వామ్య, అర్ధ-భూస్వామ్య సమాజాల్లో ఎవరు ఏం చదువుకోవాలి ? ఎట్లా చదువుకోవాలి ? అని పెట్టే కట్టుబాట్లలో సమ్మతి, బలం కలిసి దాడి చేస్తాయి.

ఫ్రెంచ్ తత్వవేత్త రూసో ప్రతిపాదించినట్లు విద్యను కేవలం వ్యక్తి అభివృద్ధి కేంద్రంగా కాకుండా, సమాజ రాజకీయార్థిక కోణం నుండి చూడాలంటాడు గ్రాంసీ. రూసో ప్రకారం ప్రతి విద్యార్థికి జ్ఞాన సమపార్జన మీద సహజమైన ఆసక్తి వుంటుంది. కాబట్టి వాళ్ళను సహజ, స్వేచ్ఛా వాతావరణంలో, ఎలాంటి ఒత్తిడి లేకుండా చదువు నేర్చుకునే విధంగా విద్యావ్యవస్థ ఉండాలని ప్రతిపాదించాడు. గ్రాంసీ రూసోతో కొంత అంగీకరించినప్పటికీ సహజసిద్ధ వాతావరణంలో స్వేచ్ఛగా విద్యార్థులు అభ్యసిస్తారనే విషయంలో గ్రాంసీకి అంగీకారం లేదు. ఎందుకంటే అన్ని వర్గాలకు ఒకే రకమైన వాతావరణం ఉండదు. ఒక వర్గ సమాజంలో అందరూ ఒకే రకమైన స్వేచ్ఛతో పుట్టరు, పెరుగరు. తాము పెరిగే వర్గ వాతావరణం బట్టి వారి ఆశలు, జీవిత ఆశయాలు, వారికొచ్చే అవకాశాలు నిర్ణయించబడుతాయి. ముఖ్యంగా ఫాసిజం విజృంభిస్తున్న సందర్భంలో ఏ వాతావరణం స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఉండదు. కాబట్టి విద్య ఎప్పుడైనా అసమానతలను ప్రశ్నించే విధంగా, ఆధిపత్య భావజాలాన్ని బద్దలు కొట్టే విధంగా ఉండాలంటాడు గ్రాంసీ. ఆ ప్రయత్నం ఉద్దేశ పూర్వకంగానే చేయాలంటాడు. గ్రాంసీకి విద్యంటే సంపూర్ణ జ్ఞాన ప్రక్రియ. అందులో ఒక సంఘజీవికి కావాల్సిన అన్ని విలువలు ఉండాలి. ఆ ప్రక్రియలో సమత, మానవతావాద దృష్టి ఏర్పడాలి. అటువంటి విద్య అందరికి సమానంగా అందుబాటులో ఉండాలి. అటువంటి యూనిటరీ స్కూల్స్ ఏర్పడాలని కోరుకున్నాడు. తరాలుగా వెనుకబాటుతనానికి గురైన సబాల్టర్న్ విద్యార్థులకు కొంత నిర్బంధంగానైనా ఉన్నత ప్రమాణాలున్న విద్య అందించాలని అంటాడు. ఆ విద్యార్థులు తమ సామాజిక లక్ష్యాల గురించి ఆలోచించగలిగే స్పృహ కల్పించాలని, తమపై స్వీయ నియంత్రణ (self-discipline) కలిగి వుండే విధంగా వాళ్ళను తయారు చేయాలంటాడు గ్రాంసీ. 'తయారు చేయడం' అనే మాటను సాంప్రదాయ విద్యా పద్ధతిగా విమర్శించేవాళ్ళు వున్నారు. అయితే గ్రాంసీ తన విద్యా పద్ధతులలో ఎక్కడ ఒక ప్రమాణీకరింపబడిన సిలబస్ కాని, ఒక విషయాన్ని ముక్కలు ముక్కలు చేసి ఒక్కో ముక్కలో 'నిపుణుడు' అని చెప్పే ఒకేషనల్ విద్యనో ప్రతిపాదించలేదు. ఎందుకంటే అలా చేయడం ద్వారా పాఠశాలల నుండి కంపెనీలకు నడిచి వెళ్ళే సుశిక్షిత గొరిల్లాలను (trained gorillas) తయారు చేస్తామే కానీ ఒక సంపూర్ణ మానవున్ని నిర్మాణం చేయలేమంటాడు. ఆ 'ప్రొఫెషినల్' గొరిల్లాలు తమ సమాజంలో జరుగుతున్న సంగతుల, సంఘర్షణల గురించి కాదు కదా తమ గురించి కూడా తెలుసుకునే స్థితిలో ఉండరు. అటువంటి వాళ్ళు తమ మెదళ్లను పాలక వర్గాలకు తాకట్టు పెట్టి ఎలాంటి సామాజిక బాధ్యత లేకుండా బతికేస్తుంటారు. అందుకే విద్యంటే కేవలం learning for work. learning to engage critically with work అంటాడు. మొత్తంగా విద్య పౌరసమాజంలో engaged citizens తయారుచేసే విధంగా ఉండాలని కోరుకున్నాడు.

సోక్రటీస్ ఆచరించిన టీచర్-విద్యార్థి సంభాషణా పద్ధతులతో గ్రాంసీ ప్రభావితమయ్యాడు. కార్మికోద్యమంలో రాజకీయ పాఠశాల నడిపినా, జైలులో తోటి ఖైదీలకు పాఠాలు చెప్పినా అదే పద్ధతిని (a pedagogy of the masses) పాటించాడు. ఊకదంపుడుగా సాగే సుదీర్ఘ ఉపాన్యాసాల మీద, ప్రజలకు అర్థంకాని భాషలో రాసే రాతల మీద గ్రాంసీకి ఏ మాత్రం గౌరవం లేదు. అది ఒక ప్రజాస్వామిక పద్ధతి కాదంటాడు. ప్రజలకు అర్థం కానిది ఏదైనా వ్యర్థమే అంటాడు. వాళ్ళకు అర్థమయ్యే విధంగా చెప్పడమంటే వాళ్ళ జీవితాలతో మమేకం కావడం, వాళ్ల భాషను, భావాలను పట్టుకోవడం, వాటి ఆధారంగానే కొత్త జ్ఞాన ప్రక్రియను మొదలుపెట్టడం. అలా చేయడం ద్వారానే వాళ్ళ మీద రుద్దబడే ఆధిపత్య భావజాలాన్ని passiveగా స్వీకరించకుండా దానితో సంఘర్షించగలుగుతారు. ఆ భావ సంఘర్షణ, counter-hegemony లేకుండా ఎన్ని పోరాటాలు చేసినా అవి సమాజంలో ఒక passive revolutionను అంటే కొన్ని సంస్కరణలు మాత్రమే తీసుకురాగల ఒక స్థితిని తేగలుగుతాయే తప్ప మొత్తం సమాజంలో మౌలికమైన మార్పులు తేగలిగే నిజమైన, నిలబడగలిగిన విప్లవం రాదని గ్రాంసీ గట్టి అభిప్రాయం.

గ్రాంసీ ఫాసిజాన్ని ఓడించి విప్లవాన్ని విజయవంతం చేయడానికి రెండు గతితార్కిక వ్యూహాలను ప్రతిపాదించాడు.

అందులో మొదటిది War of Position గ్రాంసీ దృష్టిలో ఫాసిజం రూపంలో కొనసాగే పెట్టుబడిదారి రాజ్యాన్ని కేవలం సాయుధ తిరుగుబాటుతో కూల్చడం అసాధ్యమైన పని. ఎందుకంటే దోపిడీ రాజ్యం పౌరసమాజాన్ని తన వివిధ సంస్థల ద్వారా మభ్యపెట్టి, మాయ చేసి మెజారిటీ ప్రజలను తన కబ్జాలో ఉంచుకుంటుంది. దాని ద్వారా ఎంతో కొంత సాధికారతను కూడగట్టుకుంటుంది. దాని మూలంగా రాజ్యపూజ, రాజ్యాంగ పూజ చేసే సందర్భంలో ఒక్కసారిగా తిరుగుబాటుతో రాజ్యాన్ని కూల్చే పని జరిగేది కాదు. కాబట్టి ముందు దోపిడి రాజ్యంపై పౌరసమాజ భ్రమలను ధ్వంసం చేయాలి. అది జరగాలంటే విద్య, సాంస్కృతిక రంగాలలో ఆధిపత్య భావజాలాన్ని ఎదుర్కొనే ప్రతివ్యూహాలను నిర్మాణం చెయ్యాలి. అలా చెయ్యడం ద్వారా ఆధిపత్య భావజాలాన్ని ఓడించడమే కాదు, రేపు అంతిమంగా జరగబోయే సాయుధ తిరుగుబాటుకు పౌరసమాజాన్ని సిద్దం చేయడం. అంతేకాదు భావజాల రంగంలో చేసే జ్ఞానయుద్ధం ద్వారా పౌరసమాజంలో ప్రజలలో కలిసిపోయి (దీనినే గ్రాంసీ పౌరసమాజంలో కందకాలు తొవ్వడమని మెటఫారికల్ గా అంటాడు. దానినే Trench Warfare అని గ్రాంసీ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తారు) రేపు అంతిమంగా జరగబోయే సాయుధ పోరాటానికి ఉపయోగపడుతుందని అంటాడు. ఇక రెండవది War of Maneuver. విప్లవ ప్రజానీకం సాయుధంగా రాజ్యాన్ని కూలదోయడం. ఈ సందర్భంలో గ్రాంసీ స్పష్టం చేసిన అంశాలేమంటే కేవలం భావజాల రంగంలో ఆధిపత్యాన్ని కూల్చడం ద్వారా సమసమాజం రాదు. కచ్చితంగా కార్మికవర్గం పెట్టుబడిదారి రాజ్యాన్ని కూల్చి అధికారాన్ని చేజిక్కించుకోవడం ద్వారానే సామ్యవాద సమాజ నిర్మాణానికి అడుగులు పడతాయని చెప్పాడు. అయితే గ్రాంసీ ప్రతిపాదించిన రెండు విప్లవ వ్యూహాలు ఒకటి విజయవంతమైన తర్వాత మరొకటి అమలు చెయ్యాలని తాను భావించలేదు. ఎందుకంటే విప్లవం విజయం కాకుండ భావజాల రంగంలో ఆధిపత్యంపై పూర్తి పట్టు సాధించడం కార్మిక వర్గానికి సాధ్యమయ్యే పని కాదని స్పష్టం చేశాడు. దానర్థం ఆ రెండు వ్యూహాలు ఏకకాలంలో ఒకదానికొకటి పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగొచ్చు అని.

గ్రాంసీ పదేపదే చెప్పిన మాటేమంటే ఒక సత్యాన్ని చెప్పకూడని పరిస్థితి సమాజంలో ఉండకూడదు. అటువంటి పరిస్థితి ఉన్నప్పుడు సత్యం చెప్పడం కూడా విప్లవమే! సత్యాన్ని ఆవిష్కరించడమంటే విప్లవంలో భాగం కావడమే. ఆ క్రమంలో చేసే జ్ఞానయుద్ధం కేవలం స్వీయ జ్ఞానం కోసం కాదు. సమాజ నిచ్చెన మెట్లు ఎక్కించే సాధనం మాత్రమే కాదు. అది మొత్తం సమాజాన్ని అన్ని రకాల పీడనల నుండి విముక్తి చేయగల ప్రజా ఉద్యమాలకు ఇంధనం లాంటిది. పేట్రేగుతున్న హిందుత్వ ఫాసిజం సందర్భంలో భారతదేశంలో విద్యా విధానాన్ని అర్థం చేసుకోవడానికి గ్రాంసీ ఎంతో ఉపయోగపడుతాడు. సంఘ్ పరివార్ శక్తులు తమ ఆధిపత్య భావజాలంతో దేశంలో అనేక రకాల మందలను తయారు చేస్తున్నది. ఆ తయారీ కోసం భావ జాల రంగంతోపాటుగా బల ప్రయోగాన్నీ వాడుతున్నది. తన లక్ష్యమైన హిందూరాజ్య స్థాపనలో భాగంగా సంఘ్ పరివార్ తన శత్రువులని ప్రకటించుకున్న అన్ని రాజకీయ, సామాజిక సమూహాల మీద దాడి చేస్తున్నది. ఆ దాడులను సమర్థించుకో వడం చరిత్రను వక్రీకరిస్తున్నది. అసత్యాలను ప్రచారం చేస్తు న్నది. పుక్కిటి పురాణాలకు శాస్త్రీయతను అంటగడుతున్నది. అశాస్త్రీయతే విశ్వగురువుగా ప్రచారం చేస్తున్నది. ఇవన్నీ సజావుగా జరగాలనే ప్రశ్నించే గొంతుకలను నిర్బంధిస్తున్నది. ఆ ప్రశ్నలను పుట్టించే వ్యవస్థలను (విద్యా వ్యవస్థతో సహా) ధ్వంసం చేస్తున్నది.

ఇప్పుడు భావజాల రంగంలో సంస్కృతి, జీవన విధానం పేరిట ప్రజల మెదళ్లను ఆక్రమించిన బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చాల్సిన అవసరం ఎంతో వుంది. ఎందుకంటే పార్లమెంట్‌లో ఫాసిస్టు పార్టీలు ఓడిపోవచ్చు. కానీ, సంస్కృతి ముసుగులో సూక్ష్మ ఫాసిస్టులు మనచుట్టూ ఉంటారు. మనలోనూ ఉంటారు. కాబట్టి ఫాసిజాన్ని అన్ని రూపాల్లో ఓడించడానికి జ్ఞానయుద్ధం చేయాల్సిన అవస రం రోజురోజుకు పెరుగుతుంది. మాట మాట్లాడితే 'మనో భావాలు' దెబ్బ తిన్నాయని దాడులు చేస్తున్న సందర్భంలో మనోభావాలను ఏ శక్తులు, ఏ భావజాలం నిర్మాణం చేస్తుందో ఆలోచించాలి. అమానవీయ మనువాదాన్ని ఎత్తిపడుతూ మనోభావాలు దెబ్బ తిన్నాయని బొబ్బలు పెట్టడం ఆధిపత్య హింసలో భాగమే. కాబట్టి పౌరసమాజంలో దోపిడీ రాజ్యానికి, దాని వెనుకాల ఉండి నడిపించే ఫాసిస్టు శక్తులకుండే సాధికారితను తుడిచేయడానికి భావజాల రంగంలో చేయాల్సిన కృషి ఎంతో ఉంది. ఆ పని ఎంత చిన్నదైనా సరే మన కర్తవ్యంగా చేయాల్సివుంది.

ఈ వ్యాసాన్ని ముందుగా చదివిన ఒక మిత్రుడు 'నీ వ్యాసంలో కొన్ని బ్రాహ్మణీయ పదాలు వచ్చాయి' అని చెప్పాడు. ఆ పదాలను తెలిసో, తెలియకనో వాడాను. ఆ వాడుక నాకు విద్య ద్వారానో, నేను పెరిగిన వాతావరణం ద్వారానో 'మామూలు' విషయమైంది. ఒక ఆధిపత్య భావనను మామూలు విషయంగా మార్చడంలోనే దోపిడీ వర్గాలు, కులాలు విజయం సాధిస్తాయి. నా మిత్రుని విమర్శను స్వీకరిస్తూ ఇక మీదట (గ్రాంసీ భాషలో చెప్పాలంటే) సబాల్టర్న్ సోయితో ప్రజల భాషలో రాసే ప్రయత్నం చేస్తాను. బహుశా అలా చెయ్యడమే గ్రాంసీకి ఇచ్చే నిజమైన నివాళి అని భావిస్తాను. ❑


# గ్రాంసీ - ఉపశ్రేణులు - చారిత్రక సంఘటన



కొప్పర్తి వెంకటరమణమూర్తి

**ఆంటోనియో గ్రాంసీ ప్రస్తావించిన సాంకేతిక పదాలలో ఉపశ్రేణులు ప్రత్యేకమైంది, విస్తారంగా చర్చకు గురైంది. సాధారణంగా సాంకేతిక పదానికి ఒకే అర్థం లేదా నిర్వచనం ఉంటాయి. కానీ సామాజికాంశాల్ని విశ్లేషిస్తూ వచ్చిన గ్రాంసీ వేర్వేరు సందర్భాలలో వేర్వేరు శ్రేణుల్ని ఉపశ్రేణులుగా గుర్తించాడు, ప్రస్తావించాడు. కమ్యూనిస్టు అయిన కారణంగా ఫాసిస్ట్ జైలులో నిర్బంధితుడై మార్క్సిజంను వ్యాఖ్యానించ పూనుకున్న గ్రాంసీ జైలు సెన్సార్‌ను తప్పించుకోవడానికి వర్గానికి ప్రచ్ఛన్నపదంగా దీన్ని ప్రయోగించాడంటారు. కొన్ని సందర్భాల వరకు అది నిజమే అయినా అనేక ఇతర సందర్భాలలో సమాజంలో అణచివేతకు గురైన అన్ని వర్గాలను ఉద్దేశించే ఈ ప్రయోగం చేసినట్టు స్పష్టమౌతుంది.**

మార్క్సిజం కు philosophy of praxis అనే మారు వేషం వేసిన గ్రాంసీ ప్రొలిటేరియట్‌కు లేదా శ్రామికవర్గానికి కట్టిన బహురూప వేషమే subalterns లేదా ఉపశ్రేణులు. గ్రాంసీ మార్క్సిజంను చూసిన దృక్కోణం ఉపశ్రేణుల నిర్వచనంలో సూక్ష్మ రూపమై కనిపిస్తుంది. మార్క్సిజానికి ఆచరణలో గ్రాంసీ చూపిన వెసులుబాటు ఉపశ్రేణుల్లోకి చేర్చుకున్న వర్గాల విస్తృతిలో ప్రతిఫలి స్తుంది. గ్రాంసీ విప్లవంలో అధికారం చేజిక్కించుకునే శ్రామిక వర్గంగా ఉపశ్రేణుల్ని ప్రస్తావించినా వారిని కార్మిక వర్గానికి పరిమితం చెయ్యలేదు.




గ్రాంసీ మార్క్సిజం మీద చేసిన నిర్మాణాత్మకమైన విమర్శ ఇక్కణ్ణుంచే ప్రారంభమౌతుంది. రష్యాలో ఫ్యూడల్ వ్యవస్థ మిగిలి ఉండగానే విప్లవం సంభవించడాన్నీ, పెట్టుబడి అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లో విప్లవం రాకపోవడాన్ని గ్రాంసీ గుర్తించాడు. రష్యాలో విప్లవం రావడానికీ పశ్చిమ యూరప్‌లో రాకపోవడానికీ వెనుక రష్యాలో రాజ్యవ్యవస్థ తన సంప్రదాయ అణచివేత సాధనాల్ని మాత్రమే ఉపయోగించగా, పశ్చిమ దేశాలు అణచివేత సాధనాలతోపాటు పౌరసమాజ అంగీకారం పొందడం వల్ల సాధ్యమైందని అర్థం చేసుకున్న గ్రాంసీ దానినే హెజిమొనీ అన్నాడు. హెజిమొనీని పడగొట్టడానికి ప్రజలలో కౌంటర్ హెజిమొనీ నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తించిన గ్రాంసీ అందుకు కార్మికవర్గం ఒక్కటే సరిపోదనీ అణచివేతకు గురైన రైతులు మొదలుకుని మహిళలు, మైనారిటీలు, సాంస్కృతిక వివక్షకు గురైన ప్రాంతాల, సమూహాలనన్నిటినీ కలుపుకోవాలని సంకల్పించాడు. ఈ వర్గాలనన్నిటినీ కలిపే ఉపశ్రేణులన్నాడు. ఆర్థికం ప్రాతిపదికగా మార్క్స్ చేసిన వర్గ విభజనకు వివిధ రూపాల అణచివేతనూ వివక్షనూ జత చేసి ప్రొలటేరియట్‌ను విస్తృతపరిచాడు గ్రాంసీ. ఉపశ్రేణుల్ని అర్థం చేసుకోవడంలో గ్రాంసీకి చారిత్రక దృక్పథం ఉంది. ఒక సమాజంలో ఆధిపత్య వర్గాల చేత ఆ సమాజపు చరిత్ర సంస్కృతుల నిర్మాణంలో వ్యక్తులుగా, జాతి పౌరులుగా భాగస్వామ్యం నిరాకరింపబడిన వర్గాలను ఉపశ్రేణులంటూ గ్రాంసీ మరో నిర్వచనం ఇచ్చాడు. ఫాసిస్ట్ ముస్సోలిని చేత అతని అనుచరుల చేత ఈ రకమైన వివక్షకు గురిచేయబడిన కార్మికులు, రైతులు ఉపశ్రేణులుగా

తొలి దశలో గ్రాంసీ దృష్టిలో ఉన్నారు. ప్రిజన్ నోట్ బుక్స్‌లో ఉపశ్రేణుల చారిత్రక పరిణామం గురించి ఉపోద్ఘాతం రాస్తూ గ్రాంసీ, ఉపశ్రేణుల నిర్వచనంలోనే అసంఘటిత తత్వం ఉందనీ ఆ రీత్యా అవి సంఘటితమై ఉండవనీ రాజ్యంగా రూపొందే వరకూ అవి సంఘటితం కాజాలవనీ అన్నాడు. అవి పౌర సమాజంతో అంతర్గతంగా ముడిపడి ఉంటాయని తత్ఫలితంగా రాజ్యంతో కూడా అదే స్థితి కలిగి ఉంటాయనీ అన్నాడు. ఉపశ్రేణుల ఈ స్థితినీ, ఇటలీలో వాటి చారిత్రక క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఆరు అంశాల అధ్యయనాన్ని ప్రతిపాదించాడు.

- మొదటిది ఉత్పత్తి రంగంలో వచ్చే మార్పులు శ్రేణుల నిర్మాణంపై చూపే ప్రభావాన్ని గమనించడం.
- రెండవది అవి ఆధిపత్య రాజకీయ వర్గాలతో చురుకుగానో లేక సాత్వికంగానో సంకీర్ణమై వారి కార్యక్రమాల్ని ప్రభావితం చెయ్యడం.
- మూడవది ఉపశ్రేణులను అణచి ఉంచడానికి కొత్త పార్టీలు ఆధిపత్య వర్గాలు పుట్టుకు రావడం.
- నాల్గవది పాక్షికంగానైనా తమ ప్రయోజనాలు నెరవేర్చు కోవడానికి ఉపశ్రేణులే సమీకరణల్ని రూపొందించడం.
- ఐదవది పాత సమీకరణల్లో ఉపశ్రేణుల స్వయం ప్రతిపత్తిని కాపాడే కొత్త సమీకరణల మీద అవగాహన ఏర్పరచుకోవడం.
- ఆరవది ఉపశ్రేణుల అంతర్గత స్వయంప్రతిపత్తిని కాపాడే సమీకరణలను అధ్యయనం చెయ్యడం. ఈ నేపథ్యంలో ఉపశ్రేణుల చరిత్ర ఆధిపత్య వర్గాలతో ముడిపడి ఉంటుం దన్న గ్రాంసీ దీర్ఘకాలం పట్టినా రాజ్యాధికారం చేజిక్కించు కోవడం ద్వారానే వాటికి శాశ్వత విముక్తి కలుగుతుందని రాశాడు. అందుకు ఆధిపత్య వర్గ సాంస్కృతిక హెజిమొనీ నుంచి ఉపశ్రేణులు బయటపడాలని ఆకాంక్షించాడు.

రష్యా విప్లవం సంభవించి రెండు నెలలు తిరక్కుండా 1917 డిసెంబర్‌లో రాసిన వ్యాసంలో పెట్టుబడికి భిన్నంగా రష్యాలో విప్లవం సంభవించడాన్ని గుర్తించాడు గ్రాంసీ. మార్క్సిజంలోని భావ సాంద్రతను స్వీకరించిన బోల్షివిక్‌లు పరిస్థితులు పెట్టుబడి గ్రంథంలో చెప్పినట్టు యాంత్రికంగా జరిగే వరకు ఆగలేదనీ చలనశీలత కలిగిన మనుషులుగా అందివచ్చిన పరిస్థితుల్లో నుంచి విప్లవించారని విశ్లేషించాడు. అంతకు ముందు ప్రపంచ యుద్ధం వల్ల విధ్వంసమైన రష్యాలో ప్రజలు 'భూమి కోసం, శాంతి కోసం' చేసిన నినాదాల్లో మొదటిది గ్రాంసీ దృష్టి నుంచి తప్పించుకోలేదనుకోవాలి. ఇదంతా ఎందుకంటే గ్రాంసీ ఉప శ్రేణుల విభాగంలో కార్మికులతోపాటు రైతాంగానికి పెద్ద చోటు కల్పించాడని చెప్పడానికే. అరెస్టు కావడానికి ముందు 1926లో రాసిన 'దక్షిణాది సమస్య: కొన్ని అంశాలు' అనే అసంపూర్ణ వ్యాసంలో మొదటిసారి కార్మిక కర్షక సంఘటనను ప్రస్తావిం చాడు. ఈ వ్యాసంలోనే ఇటలీలోని ఉత్తరాది కార్మిక వర్గానికీ, దక్షిణాది రైతాంగానికి అవసరమైన సయోధ్యను ప్రస్తావించాడు. ఇది వర్గపరమైన కలయికే కాదు, ప్రాంతీయమైంది కూడా. దక్షి ణాది రైతుల్ని అమాయకులుగా, మేదకులుగా పరిగణించిన మేధావుల్ని (సోషలిస్టు మేధావులతో సహా) తీవ్రంగా ఖండించిన గ్రాంసీ ఈ పరిగణన ఎట్లా ప్రాంతీయ వర్గ ఐక్యతకు ప్రతి బంధకంగా మారిందో చెబుతాడు. ఇటువంటి విశాల ప్రాతి పదిక లేకపోవడమే మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఇటలీ లో బూర్జువా వర్గాలు అధికారం చేజిక్కించుకోవడానికి కారణ మైందంటాడు. ఈ వ్యాసంలోనే గ్రామీణ బూర్జువా వర్గానికి చెందిన మధ్య, క్రింది తరగతి మేధావుల గురించి ప్రస్తావిస్తూ వారిని ఉపశ్రేణులు గానే వర్గీకరించాడు. తదనంతర కాలంలో ప్రిజన్ నోట్ బుక్స్‌లో విస్తరించిన సవర్గ మేధావుల భావనకు అంకురార్పణ ఈ సందర్భంగానే జరిగింది. గ్రాంసీ ఉపశ్రేణుల భావన ఆయన ఆలోచనలన్నిటిలోకి విస్తరించి ఉంది. ఉపశ్రేణు ల నుంచే ఆవిర్భవించే సవర్గ మేధావి వర్గం ప్రజల లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చడంలో కీలక పాత్ర వహించాలనీ అందులో సాహిత్య సాంస్కృతిక రంగాలు ముఖ్య భూమిక వహించాలని గ్రాంసీ ఆకాంక్షించాడు. అంతే కాదు, ఉపశ్రేణుల కు నాయకత్వం వహించే కార్మిక వర్గం అందరి ఆకాంక్షలకు ప్రాతినిథ్యం వహించాలని నిర్దేశించాడు. పాలకవర్గాల హెజిమొనీ కి ప్రత్యామ్నాయంగా రూపొందాల్సిన కౌంటర్(ప్రజా) హెజి మొనీ నిర్మాణంలో ఉపశ్రేణీ నాయకులు పాలకవర్గం ఇవ్వజూపే ప్రయోజనాలకు ప్రలోభపడితే బాస్టర్డ్ హెజిమొనీ ఏర్పడుతుం దని హెచ్చరించాడు. గ్రాంసీ సవర్గ మేధావుల భావన గురించి మాట్లాడనిదే ఉపశ్రేణుల చర్చ పూర్తి కాదు. మనుషులందరూ మేధావులే కానీ అందరూ మేధో కర్తృత్వం నెరపలేరు అన్న గ్రాంసీ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడంలో పాలక వర్గాల ఆధిపత్యం నెలకొనడంలో ఆ వర్గానికే చెందిన మేధా వులు కారణమైనట్టు ఉపశ్రేణులు నిర్మించాల్సిన కౌంటర్ హెజిమొనీలో వారి నుంచి వచ్చిన మేధావులే ముఖ్య పాత్ర వహించాల్సి ఉంటుందన్నాడు. ఒక నిర్దిష్ట ఉపశ్రేణి నుంచే దాని కి చెందిన సవర్గ మేధావులు ఆవిర్భవిస్తారని గ్రాంసీ నిక్కచ్చిగా చెప్పలేదుకానీ వారు ఆ వర్గ తాత్వికతకు విప్లవాత్మకతకు ఎక్కువ అనుకూలంగా ఉంటారనీ, ఆ వర్గ ప్రజల లోకజ్ఞానంతో మౌలిక అనుబంధం కలిగి, ప్రాపంచిక సమస్యలకు సైద్ధాంతిక తాత్వి కతకు మధ్య సమన్వయం చెయ్యగలరనీ భావించాడు. తమని తాము ప్రత్యేకవర్గంగా భావించుకునే సంప్రదాయ మేధావి వర్గం నుంచి కొంతమందినైనా సైద్ధాంతికంగా గెలుచుకోవ లసిన అవసరం సవర్గ మేధావులకు ఉందనీ, ఎంతగా ఒక ఉప శ్రేణి సవర్గ మేధావులను రూపొందిం చుకోగలదో అంతగా సం ప్రదాయ మేధావులను తనలో కలుపు కోగలదనీ భావించాడు.

గ్రాంసీతో ప్రారంభమైన ఉప శ్రేణుల భావన చరిత్ర అధ్యయనంలోకి ప్రవేశించి అక్కణ్ణుంచి అనేక ఇతర సామాజిక శాస్త్రాలకూ, సాహిత్య రంగానికీ విస్తరించి ఒక గ్లోబల్ తాత్వికతగా మారింది. ఉపశ్రేణుల కోణం నుంచి చరిత్ర అధ్యయనాన్ని ప్రారంభించిన సుప్రసిద్ధ చరిత్రకారుడు రంజిత్ గుహ, 1982 లో రాసిన 'వలస భారతదేశ చరిత్ర రచన : కొన్ని అంశాలు' అనే వ్యాసంలో అప్పటి దాకా చరిత్ర రచన శిష్ట వర్గ (elitist) కోణం నుంచే జరిగిందనీ చరిత్ర నిర్మాణం లో రైతులు, గిరిజనులు, స్త్రీల వంటి ఉపశ్రేణులు విస్మరణకు గురయ్యాయనే విమర్శ లేవనెత్తి history from the belowకు అంకురార్పణ చేశాడు. గ్రాంసీ నుంచి ఉపశ్రేణుల భావనను స్వీకరించినట్లు చెబుతూ సబాల్టర్న్ అంటే 'కింది తరగతి' అనే ఆక్స్ ఫర్డ్ నిఘంటు అర్థాన్ని ఉటంకిస్తూ అది వర్గ, కుల, వయో, లింగ, హోదాలన్నిటికీ వర్తిస్తుందనే అర్థం చెప్పాడు. క్రింది తరగతి అనేది పైతరగతితో అనివార్యంగా ముడిపడి ఉన్న అంశమని అంటూ తమ అధ్యయనంలో శిష్ట వర్గాన్ని ఆధిపత్య వర్గానికి ప్రత్యామ్నాయంగా పరిగణించామనీ అన్నాడు. శిష్టవర్గంలో వలస పాలకులతోపాటు దేశీయ భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, పెద్ద వ్యాపారస్థులు, ఉన్నతాధికారులు ఉంటారని చెబుతూ ఈ వర్గానికి చెందని వారంతా ఉప శ్రేణులేనని నిర్వచించాడు. ప్రాంతీయ, స్థానిక స్థాయిల్లో గ్రామీణ పెత్తందార్లు, భూములు కోల్పోయిన భూస్వాములు, ధనిక రైతులు మొదలైన వర్గాలు ఉపశ్రేణులే అయినప్పటికీ ఆధిపత్య వర్గాల ప్రయోజనాలు కాపాడడానికి పనిచేస్తాయని గుర్తించాడు.

ఈ వ్యాసంతో ప్రారంభమైన దక్షిణాసియా చరిత్ర, సమాజాల ఉపశ్రేణీ అధ్యయనం Subaltern Studies పేర 1982-2005 మధ్య 12 వ్యాస సంపుటులుగా వచ్చింది. ఈ క్రమం ఉపశ్రేణుల్ని ప్రజలకు ప్రత్యామ్నాయంగా మార్చింది. ఉపశ్రేణీ రాజకీయాలు ప్రజా రాజకీయాలయ్యాయి. ప్రజలకు ప్రజలే ప్రతినిధులయ్యారు. తమ చరిత్ర నిర్మాతలు తామేనని వారు గుర్తించారు. తొలి ఆరు సంపుటుల వరకు శిష్ట వర్గానికి భిన్నంగా ఉపశ్రేణుల్ని నిలబెట్టడానికీ, చరిత్రలో వారికి స్వయం ప్రతిపత్తి గల ఆవరణను నిర్మించడానికి కృషిజరిగింది. గాయత్రి స్పివక్ ప్రవేశంతో ఈ అధ్యయనంలో ముఖ్యంగా అట్టడుగు పేద మహిళల పాత్ర చర్చకు వచ్చింది. ఆమె రాసిన Can the subaltern speak ? వ్యాసం సంచలనం సృష్టించింది. అక్కణ్ణుంచి ఈ అధ్యయనం మలుపు తిరిగి, చరిత్రలో ఉపశ్రేణుల పాత్రను పునర్నిర్మించడానికి అవసరమైన ఆధారాలు మిగలలేదని గుర్తింపు వచ్చింది. శిష్ట వర్గ వాచక(text)మే ఆధారం కావడంతో ఆ వాచకం కప్పుకున్న ముసుగును తొలగించి వాస్తవాల్ని గ్రహించాల్సి వచ్చింది. క్రమంగా తొలి దశలో మార్క్స్ గ్రాంసీలు నడిపించిన ఈ ఆలోచనల్ని మలి దశలో ఫుకో వంటి ఉత్తరాధునికులు (post-modern) ప్రభావితం చేశారు. క్రమంగా వలసోత్తరవాద(post-colonial) ప్రభావం పడడంతో ఉపశ్రేణీ-ఆధిపత్య వర్గాల నిర్వచనాలు విస్తృతమయ్యాయి. మొత్తం ఒక జాతి అంతా ఉపశ్రేణి అయి దాన్ని పాలించిన వలసవాదులు శిష్టవర్గంగా భావించబడ్డారు. సాంస్కృతిక మూలాలూ, సంప్రదాయమూ ఉపశ్రేణిత్వం కాగా ఆధునికత శిష్టత్వం అయింది. మూడో ప్రపంచ దేశాలు ఉపశ్రేణులుగా యూరప్ అమెరికాలు శిష్టవర్గంగా పరిగణింపబడ్డాయి. ఉప శ్రేణుల భావన చరిత్ర నుంచి రాజనీతి, మానవ నిర్మాణ, సమాజ శాస్త్రాలకూ, సాహిత్య విమర్శకూ, సంస్కృతీ అధ్యయనాలకు విస్తరించింది. వీటిల్లో సాహిత్య సాంస్కృతిక రంగాలు గ్రాంసీ మూల భావనల్లో చోటు చేసుకున్నాయి. ఉపశ్రేణుల చరిత్ర భవిష్యత్ పాత్రల మీద లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లో విస్తారంగా పరిశోధనలు జరుగుతున్నాయి.

1980ల తర్వాత భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఉపశ్రేణీ చైతన్యం పెరిగింది. అనేక రాజకీయ సమీకరణల్లో వివిధ ఉపశ్రేణుల కలయిక అనివార్యమౌతోంది. మార్క్సిస్ట్ భావజాలం సాంస్కృతిక వివక్షను ఉపేక్షించిందని భావించి దూరమైన దళిత బహుజనులు తమలాగా సాంస్కృతిక వివక్షకు గురైనవారిలో అత్యధికులు ఆర్థికంగా వెనుకబడ్డవారే కావడంతో ఆర్థిక అసమత్వ నిర్మూలనకు వామపక్ష అవగాహన అవసరమని గుర్తించారు. అట్లాగే మార్క్స్ తన దృష్టిని కేవలం వర్గదృష్టికి మాత్రమే కుదించలేదని, వర్గ ప్రాతిపదికలేని అనేక అణచివేతల్ని ముఖ్యంగా జాతి, తెగ, లింగ వివక్షల్నీ వాటికి వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనల్నీ పరిగణన లోకి తీసుకున్నాడని గుర్తిస్తున్న వామపక్షీయులు కుల అస్తిత్వాన్ని అంగీకరిస్తున్నారు. ఇది గ్రాంసీ ప్రతిపాదించిన పునాది (base) ఉపరితలాల (superstructure) గతితార్కిక ఐక్యతను, సిద్ధాంతానికి ఆచరణకు మధ్య ఉండాల్సిన వెసులుబాటును సూచిస్తున్నది. భిన్నమైన చారిత్రక సందర్భంలో ఆర్థికవాదానికి (economism) దూరంగా జరిగి కార్మికవర్గం ఉపశ్రేణులతో జతకట్టడాన్ని చారిత్రక సంఘటన (historical bloc)గా నిర్వచించాడు గ్రాంసీ. సమకాలీన భారతదేశంలో లాల్-నీల్ ఐక్యత ఈ గ్రాంసీ ఆలోచననే తలపిస్తున్నది. అయితే కేవలం మారిన సామాజిక ఆర్థిక పరిస్థితులు రాజకీయవ్యవస్థలో మార్పులు తేలేవనీ, అట్లాగే కేవలం సామాజిక శక్తుల ఐక్యత చారిత్రక సంఘటన కాజాలదనీ ఆయా శక్తుల రాజకీయ చైతన్యస్థాయీ వాటి మధ్య నెలకొన్న అనుబంధాల గాఢతలను బట్టి రాజ్యాధికారం చేజిక్కుతుందన్న గ్రాంసీ ఇప్పుడు వర్తమాన భారతానికి దిక్సూచిగా నిలుచుని ఉన్నాడు. ❑


# జాతీయోద్యమం దీర్ఘకాలిక వ్యూహం



బిపన్ చంద్ర

**భారత జాతీయోద్యమం వలసపాలనకు వ్యతిరేకంగా జరిపిన సుదీర్ఘ పోరాటంలో అమలు జరిపిన వ్యూహం రీత్యా ఉద్యమ గమనంలో చాలా మార్పులు సంభవించాయి. ప్రజలు పోరాటం చేయగలిగే శక్తి, వారు ఉద్యమాన్ని అర్థం చేసుకొని సాధించే ఆధిక్యతపైనేగాక పోరాటం అనుసరించే వ్యూహం, ఎత్తుగడల పైన ఆధారపడి వుంటుంది. జాతీయోద్యమంపై లభ్యమవుతున్న రచనలు జాతీయోద్యమం అమలు జరిపిన వ్యూహాన్ని చర్చించడంలో విఫలమయ్యాయి.**

జాతీయోద్యమాన్ని సమగ్రమైన వ్యూహం లేని వివిధ పోరాటాల సమ్మేళనంగాను లేక గాంధీజీ నాయకత్వం వహించిన దశలో అహింసలాంటి సూత్రాలు, సత్యాగ్రహం పికెటింగులాంటి కొన్ని పోరాట రూపాలుగాను పరిగణించడం జరిగింది. లభ్యమయ్యే రచనలలోని ఈ వైఫల్యానికి ఒక కారణం జాతీయవాద వ్యూహం యొక్క సిద్ధాంతపరమైన స్వభావాన్ని వ్యక్తీకరించ లేకపోవడమే. రష్యా-చైనా విప్లవ నాయకులలాగా భారత జాతీయోద్యమ నాయకులు సిద్ధాంతం పట్ల ఆసక్తి చూపలేదు. వారి రాజకీయ వ్యూహానికి విస్పష్టమైన రూపమిస్తూ గ్రంథాలు, యితర రచనలు చేయలేదు. రాజ్యాంగబద్ధమైన కార్యక్రమాలు, నిర్మాణాత్మక కార్యక్రమాలు, రాజకీయ నిర్ణయాలు-లాంటి పోరాటం వివిధ దశలను, అహింస సత్యాగ్రహం లాంటి పోరాట రూపాలను జాతీయోద్యమం యొక్క ప్రధానమైన వ్యూహంలోని అవిచ్ఛిన్నమైన భాగాలుగా చూడకపోతే వాటిని సరిగ్గా అర్థం చేసుకొనడం, చారిత్రకంగా అంచనా వేయడం సాధ్యపడదు.




## భారత స్వతంత్ర పోరాటం 1857-1947

జాతీయవాద వ్యూహంలోని చాలా అంశాలు ఉద్యమం యొక్క మితవాద, అతివాద దశలో రూపకల్పన చేయబడ్డాయి. గాంధీజీ నాయకత్వం వహించిన దశలో అవి ఆచరణలోకి వచ్చాయి. సమకాలీన వ్యాఖ్యాతలలాగానే చరిత్రకారులు, ఇతర సామాజిక శాస్త్రవేత్తలు గాంధీజీ యొక్క జీవితదార్శనికత పట్ల కేంద్రీకరించడంపై మొగ్గు చూపారు. కాని ఆయన జీవిత దార్శనికత ప్రజలపై పరిమితమైన ప్రభావమే చూపింది. ఆయన రాజకీయ నాయకుడిగా రాజకీయ వ్యూహం, పోరాట ఎత్తుగడల ద్వారా లక్షలాది మందిని రాజకీయ కార్యరంగంలోకి నడిపించారు. బ్రిటిషు పాలన యొక్క అలాగే వలసరాజ్యం యొక్క ప్రత్యేక స్వభావంపై జాతీయవాద వ్యూహం ఆధారపడివుంది. భారతీయ నాయకులు వలస పాలన యొక్క దోపిడీ స్వభావాన్ని పూర్తిగా గ్రహించారు. వలస రాజ్యం సగం అధికార విధేయతని సమర్థించే స్వభావం, సగం ఆధిపత్యం వహించే స్వభావం గలదని గుర్తించారు. అది హిట్లర్ జర్మనీ లేక జారిస్టు రష్యా లేక చాంగ్కై షేక్ చైనా, బాటిస్టా క్యూబా లాంటిది కాదు. దాని స్వభావాన్ని చట్టబద్ధమైన అధికారవాదంగా చెప్పవచ్చు. వలసరాజ్యం బల ప్రయోగంతో స్థాపించబడింది. దీనితోనే పాలన సాగించింది. శాంతియుతమైన ఉద్యమాల్ని అణచివేసేందుకు తరచుగా బలం ప్రయోగింపబడింది. కాని వలస పాలన కేవలం

**ఈ సంచికలో ప్రచురించిన.. 1) జాతీయోద్యమ దీర్ఘకాలిక వ్యూహం, 2) టాగూర్ : జానపదుల మతం, 3) ఆంధ్రలో కమ్యూనిస్టులు సాధించిన ప్రజా హెజిమనీలో ప్రస్తావించిన ఉద్యమాలకు గ్రాంసీ భావజాలంతో ప్రత్యక్షంగా సంబంధం లేదు. గ్రాంసీ భావజాల నేపథ్యంగా ఆ ఉద్యమాలను విశ్లేషించిన అపురూప వ్యాసాలు.**
**- సం.**

బలం మీద మాత్రమే ఆధారపడలేదు. ఎన్నుకోబడిన అసెంబ్లీలు, స్థానిక ప్రభుత్వ సంస్థలు, కోర్టులు, పాఠశాలలు, కాలేజీలు– అన్నింటినీమించి చట్టబద్ధ పరిపాలనపై ఆధారపడింది. ఉద్యమాలు చేపట్టని కాలంలో ఒక మేరకు పౌరహక్కులు కల్పించబడ్డాయి. తరచుగా ప్రజా వ్యతిరేకతని అణచివేసేటప్పుడు అది కొన్ని చట్టపర మైన నియమాలను, పాలనాపరమైన పద్ధతులను పాటించింది. మరొకవిధంగా చెప్పాలంటే అది అర్ధ ప్రజాస్వామ్యం, అర్ధ నియంతృత్వం వలస పాలన చాలాకాలంగా ప్రజల్ని రెండు ధోర ణులకు అలవాటు చేసి భారతప్రజల ఆమోదంతో పాలించడం పై చాలా ఎక్కువగా ఆధారపడింది. **ఒకటి :** బ్రిటిషు పాలకులు ఉదారులు. న్యాయపాలన చేస్తారు. వారు ప్రజలకు తల్లిదండ్రులు. వారు భారతదేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి పరుస్తున్నారు లేక భారతదేశాన్ని ఆధునీకరిస్తున్నారు. **రెండవది:** వలసపాలకులు అజేయులు, వారిని వ్యతిరే కించడం నిష్ప్రయోజనం. వారిని జయప్రదంగా ఎదుర్కొనగలిగినంత బలం, ఐక్యత భారతీయులలో లేదు. వారు అనుమతించిన మేరకు వ్యతిరే కతను సహిస్తారు. మించితే అణచివేస్తారు. కాబట్టి వారిని ప్రతిఘ టించడం రాజ్యాంగ పద్ధతులలోనే జరగాలి. వలస పాలకులు కేవలం అణచివేతపైనే ఆధార పడకుండా రాజ్యాంగపరమైన, ఆర్థిక పరమైన ఇంకా ఇతర రాయితీలను ఇచ్చారు. వారు దాన దండోపా యాల్ని ప్రయోగించే పద్ధతిని అనుసరించారు. ఈ నేపథ్యంలో సగం ఆధిపత్యం, సగం నియంతృత్వ స్వభావంగల వలస రాజ్యా నికి వ్యతిరేకంగా జాతీయోద్యమం క్రమంగా వ్యూహాన్ని, ఎత్తుగడల ను రూపొందించుకొన్నది. జాతీయోద్యమం యొక్క ప్రాథమిక వ్యూహం దీర్ఘకాలిక ఆధిపత్యపోరాటం సాగించడం – గ్రాంసీ పరిభాషలో war of position (అంటే అంతిమ సమరానికి సన్నద్ధమయ్యే స్థితికి చేరడం –సం) ఆధిపత్యపోరాటం అంటే వివిధ మార్గాల ద్వారా ఉద్యమం యొక్క వివిధ దశల ద్వారా జాతీయవాద ప్రభావం ప్రజలలో నిరంతరం పెరిగి స్త్రీ, పురుషులు హృదయా లలో రగిలే ఘర్షణ.

ఉద్యమాలు రెండు రకాలుగా చేపట్టబడ్డాయి. **ఒకటి:** చట్టాన్ని ఉల్లంఘించి చేపట్టే ప్రజా ఉద్యమాల దశలు. **రెండు:** చట్టం నాలుగు గోడల పరిమితులలో సాగే ఉద్యమాల దశలు. ఇవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలుగా చేపట్టబడ్డాయి. ప్రజలలో జాతీయోద్యమ ప్రభావాన్ని విస్తరించేందుకు రెండు దశలు ఒకదానికొకటి అనుసంధానం చేయబడ్డాయి. జాతీయోద్యమం యొక్క ప్రాథమిక వ్యూహం క్రమబద్ధమైన సంస్కరణల వ్యూహం. ఇది వలస పాలకుల నుండి అధికారాన్ని కైవశం చేసుకొనే లక్ష్యంతో సాగిన పోరాట వ్యూహం. జాతీయ వాద వ్యూహం యొక్క సమర్థత క్రమబద్ధత ఉద్యమంలో ప్రజల చురుకైన భాగస్వామ్యంతో ముడిబడి వుంది. కాబట్టి ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంచాలి. ఉత్సాహంగా ఉద్యమంలో పాల్గొనేలా చేయాలి. వలస పాలకులు ప్రజలలో – ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల ప్రజలలో రాజకీయ నిర్లిప్తతని ఒక అలవా టుగా చేసి పెంచి పోషించారు. వలసపాలన స్థిరపడడానికి ఇది ప్రధాన కారణం. ఈ **ప్రజల్ని చురుకైన రాజకీయాలలోకి రాజ కీయ కార్యక్రమాలలోకి తీసుకొని రావడంగా ఉద్యమాల ప్రధాన లక్ష్యం.** గాంధీజీ చాలాసార్లు ప్రకటించినట్లు 'ప్రజలు తీసుకొ నగలిగిన శక్తి సాధించినప్పుడు అడిగితే స్వరాజ్యం వస్తుంది.'

**జీవితంలోని అన్ని రంగాలలో వలసపాలకుల ఆధిపత్యాన్ని లేక సైద్ధాంతిక పలుకుబడిని కొంచెంకొంచెంగా తుడిచిపెట్టడం జాతీయవాద వ్యూహం యొక్క రెండో లక్ష్యం.** బ్రిటిషు పాలకులు బల ప్రయోగంతోనేగాక జాగ్రత్తగా పొందుపరచబడిన విశ్వా సాల విధానంతో పాలన సాగిస్తున్నారు గనుక ఈ విశ్వాసాల విధానాన్ని బలహీనపరచి త్రోసివేయాలి. అంటే ఆలోచనాపర మైన యుద్ధం జరగాలి. జాతీయవాద భావాల్ని అధికాధికంగా ప్రజలచే ఆమోదింపజేయడం లక్ష్యం. వలసవాద సిద్ధాంతం యొక్క ప్రధానమైన లక్ష్యం నిజమైన శత్రువు యొక్క ముఖాన్ని– అంటే వలసవాదాన్ని దాచిపెట్టడం. అంటే భారత ప్రజల ప్రయోజనాలకు వలసవాదానికి మధ్యగల ప్రాథమిక వైరుధ్యాన్ని దాచిపెట్టడం. కాబట్టి ప్రత్యామ్నాయ జాతీయవాద ఉద్యమం యొక్క ప్రాథమిక కర్తవ్యం వలసవాద శత్రువు యొక్క ముఖాన్ని, ప్రాథమిక వైరుధ్యాన్ని బహిర్గతపరచడం. కాబట్టి జాతీయవాద వ్యూహం ప్రధానమైన అంశం సైద్ధాంతిక రాజకీ య కార్యక్ర మాన్ని చేపట్టడం. అన్నిటినిమించి దీని అర్థం బ్రిటిషుపాలన ఉదారత, అజేయం భావాలను బలహీనపరచడం. బ్రిటిషు ఔదార్యాన్ని బలహీన పరచి మేధాపరమైన నమూ నాని సృష్టించి అద్భుతంగా ముందుకు తీసుకొనిపోయిన వారు దాదా భాయి నౌరోజి, జస్టిస్ రనడే, ఆర్.పి.దత్ ఇతర మిత వాదులు. ఈ క్రమాన్ని అతివాదులు గాంధేయశకంలో దిగువ మధ్య తరగతులలోకి తీసుకొనిపోయారు.

19వ శతాబ్దం చివరి కాలం నాటికి స్వేచ్ఛగా పనిచేయగల వార్తా పత్రికలు, ఫిరోజిషా మెహతా, గోపాలకృష్ణ గోఖలే లాంటి నాయకులు చట్టసభలలో చేసిన కృషి, లోకమాన్య తిలక్, అర విందఘోష్ అతివాదులు సాగించిన సాహసోపేతమైన ప్రచారం, మృత్యుభయాన్ని సైతం లక్ష్య పెట్టని టెర్రరిస్టుల విప్లవాత్మక కార్యక్రమాలు – వలసవాద రాజ్యం అజేయభావాన్ని సవాలు చేశాయి. కాని 1918 తరువాత కాలం నాటి చట్టాన్ని ఉల్లంఘించిన ఉద్యమాలు భారత ప్రజలలో నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని నిర్వహించాయి. ఈ ఉద్యమాల ప్రాథమిక కర్తవ్యం బ్రిటిషు పాలన ప్రశ్నించడానికి వీలుపడనిదనే భావనని ధ్వంసం చేయడం ధైర్య సాహసాలతో పోరాడి త్యాగాలు చేసేందుకు ప్రజల్ని సంసిద్ధుల్ని చేయడం, ప్రజలు తమ అంగీకారం లేకుం

డా పాలింపబడరనే భావాన్ని పాలకులకు కలిగించడం.

**కాంగ్రెస్ వ్యూహంలోని మూడో లక్ష్యం** వలస రాజ్యం యొక్క యంత్రాంగంపై సివిల్ ఉద్యోగులు, పోలీసులు, సాయుధ దళాలపై రాజ్యం యొక్క పట్టును బలహీనపరచడం. ఈ లక్ష్య సాధనలో జాతీయవాద ఉద్యమం చాలావరకు జయప్రదమైంది. క్రమంగా పోలీసుల జైలు అధికారుల ప్రవర్తనలో చాలా మార్పువచ్చింది. చాలా మంది అధికారులు అన్ని రకాల అధికారులు 1942 ఉద్యమానికి తాము ఎదుర్కొనబోయే విపత్కర పరిస్థితుల్ని లక్ష్యపెట్టకుండా సహాయపడ్డారు. ఇంతకుముందు మనం గమనించినట్లు 1945 తరువాత పోలీసులలో, సైన్యంలో, అధికార వర్గంలో విధేయత క్షీణించడం, ఫలితంగా బ్రిటిషు పాలనా యంత్రాంగం అస్తవ్యస్తమవడం-భారతదేశాన్ని వదలి వెళ్ళాలని బ్రిటిషు పాలకులు చేసిన నిర్ణయానికి ప్రధానమైన కారణాలు. జాతీయోద్యమం ప్రారంభం నుండి బ్రిటన్‌లో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి వలసవాద ఆధిపత్యాన్ని బలహీనపరచే ప్రయత్నాలు చేసింది. 1890 నుండి విలియం డిగ్బీ, విలియం వెడర్బర్న్, యితరుల సేవలను ఇండియా లీగ్ కొరకు వినియోగించుకొనేలా నేషనల్ కాంగ్రెస్ బ్రిటిషు కమిటీ కృషి చేస్తూ వచ్చింది. అందుకు వి.కె.కృష్ణమీనన్ ఫెన్నర్ బ్రాక్వే చురుకుగా పనిచేశారు. దీనితోపాటు భారతదేశంలో కాంగ్రెసేతర నాయకుల మద్దతు పొందడం, ప్రజాభిప్రాయం కూడగట్టడం జాతీయవాద నాల్గవ లక్ష్యం సాధించడానికి తోడయ్యాయి.

**జాతీయవాద నాల్గవ లక్ష్యం:** ప్రజాస్వామ్య రాజకీయ అవకాశాన్ని నిరంతరం విస్తరింపజేయడం చట్టబద్ధమైన కార్యకలాపాలు, శాంతియుత ప్రజా ఉద్యమాల నిర్వహణకు ప్రస్తుతం వున్న అవకాశాల్ని పరిమితం చేయకుండా వలసవాద పాలకుల్ని నిరోధించడం. జాతీయవాద వ్యూహంలోని రెండవ ప్రధానమైన అంశం ఆధిపత్యం కొరకు సాగిన పోరాటం యొక్క దీర్ఘకాలిక స్వభావం. 'పోరాటం సంధి పోరాటం'గా uglines వర్ణించదగిన ఈ వ్యూహంలో వలసపాలనని ప్రత్యక్షంగా ప్రతిఘటించే చట్టానికతీతమైన తీవ్రమైన ప్రజా ఉద్యమ దశ దానివెంటనే ప్రత్యక్ష ప్రతిఘటన విరమించి వలసపాలన నుండి రాజకీయ రాయితీలు పొందే దశ – అసమగ్రంగా వున్నట్లు భావించబడింది. కాని ఈ సాత్వికదశలో చట్టపరమైన రాజ్యాంగపరమైన పరిమితులలో ప్రజలలో చురుకైన రాజకీయ సైద్ధాంతిక కార్యక్రమం చేపట్టి అంతకంటే ఉన్నతమైన మరొక ప్రజా ఉద్యమం కొరకు బలాలు సమీకరించబడ్డాయి. 'పోరాటం-సంధి-పోరాటం' వ్యూహం ముగింపుగా క్విట్ ఇండియా పిలుపు, ఆపై స్వాతంత్ర్య సాధన జరిగాయి. ఉద్యమం రెండు దశలు వలసవాద ఆధిపత్యాన్ని బలహీనపరచేందుకు, జాతీయవాద కార్యకర్తల్ని ఎంపిక చేసుకొని శిక్షణ ఇచ్చి ప్రజల పోరాట పటిమని పెంచేందుకు ఉద్యమ అవసరాల్ని బట్టి వినియోగించు కోబడ్డాయి. 'పోరాటం-సంధి-పోరాటం' యొక్క రాజకీయ క్రమం ఉన్నత దశకి అభివృద్ధి చెందే క్రమం. ఈ వ్యూహం వివిధ దశల ద్వారా పురోగమించింది. ప్రతి దశలో అంతకు ముందు దశలో కంటే పురోగతి వున్నది. అదే సమయంలో అధికార మార్పిడి జరిగే వరకు జాతీయవిముక్తి కర్తవ్యం మిగిలి వున్నట్లేనని గుర్తించబడింది. రాజ్యాంగ సంస్కరణల ఉన్నతదశ అంటే కూడా స్వేచ్ఛ పాక్షికంగా బదిలీ చేయబడడం కాదు. స్వేచ్ఛ అనేది సమగ్రమైనది మొత్తంగా వుంటుంది. దానిని పూర్తిగా సాధించాలి. దానిలో పాక్షికత ప్రస్తావన లేదు. ఇందుకు భిన్నమైన ఏ ఇతర దృక్పథమైనా, ఉద్యమం యొక్క సంస్కరణ దశలలో భారతీయుల్ని వలసవాదం భాగస్వాములకు చేయూత నిస్తుంది. వలసవాదం జాతీయవాదాన్ని తనలో ఇముడ్చుకొనే ప్రయత్నం చేసింది. భారత జాతీయవాదులు ప్రజా ఉద్యమాలు చేపట్టని దశల్ని రాజకీయ వలసవాద వ్యతిరేక పోరాట దశలుగా పరిగణించడం ద్వారా వలసపాలకుల వలలో చిక్కుకోలేదు. సంస్కరణల పని వలస వ్యవస్థ పనితో సమానం చేయబడలేదు. జాతీయవాద వ్యూహంలోని ప్రాథమిక అంశం: వలసవాదం ప్రతి దశని వ్యతిరేకించి పోరాడుతున్న జాతీయవాదం వలస రాజ్యం చేత ఇముడ్చుకొనబడకుండా ఒక దశ నుండి మరొక దశకి ఎదిగింది. పోరాట రూపాన్ని మాత్రమే మార్చింది. చట్టానికి అతీతంగా ప్రజా ఉద్యమాలు నడిపే దశలలో చట్టాలు అతిక్రమించబడ్డాయి. సహాయ నిరాకరణ అమలు జరుపబడిం ది. ప్రజా ఉద్యమాలు చేపట్టని నిర్లిప్త దశలలో ప్రజాందోళనలు, నాయకుల విస్తృతమైన పర్యటనలు పెద్దస్థాయిలో బహిరంగ సభలు, కార్మికులు, రైతుల, విద్యార్థుల, యువకుల సంఘాల నిర్మాణం-వాటి పోరాటాలు 1920, 1930 దశాబ్దాలలో ముఖ్యంగా వామపక్షాలచే నిర్వహింపబడ్డాయి. ఈ రెండు దశలు సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యూహంలోని భాగాలు ఒకే రకమైన సామ్రాజ్యవాద వ్యతిరేక తీవ్రతని కలిగివున్నాయి. రాజకీయ పోరాటం నిరంతరాయంగా సాగింది. కాని పోరాట రూపాలు మార్పుచెందాయి. గాంధీజీ చెప్పినట్లు సహాయ నిరాకరణ ఆపివేయడమంటే యుద్ధం ఆపివేయడం కాదు. భారత దేశం తాను తయారు చేసుకొన్న రాజ్యాంగం కలిగివున్నప్పుడే పోరాటం అంతమవుతుంది. 'పోరాటం – సంధి – పోరాటం' వ్యూహానికి సంబంధించిన ప్రాథమిక ప్రశ్న: జాతీయోద్యమంలో రెండు దశలు ఎందుకు వుండవలసి వచ్చింది? చట్టానికతీతమైన ప్రజా పోరాటదశని ప్రజా ఉద్యమేతర దశ అనివార్యంగా ఎందుకు అనుసరించి వుండాలి? జాతీయోద్యమం స్వాతంత్ర్యం సాధించే వరకు ఒక నిరంతర ప్రజాపోరాట రూపం ఎందుకు తీసుకోలేకపోయింది? అలాచేస్తే అంతకంటే ముందే స్వాతంత్ర్యం సాధించబడి వుండేది గదా! గాంధీజీ నాయకత్వంలోని జాతీయవాద వ్యూహాన్ని అనుసరించి ప్రజా

ఉద్యమం స్వభావరీత్యా సుదీర్ఘకాలం నిర్వహించడం సాధ్యపడదు. ఉద్యమం కాస్త ముందూ వెనుకగా వెనుకపట్టు పడుతుంది. ప్రజా ఉద్యమాలు స్వల్పకాలికమైనవిగానే వుండి తీరాలి. తరువాత మరలా చేపట్టబోయే పోరాటానికి బలాన్ని కూడబెట్టుకొనేందుకు, ఉద్యమం ఊపిరిపోసుకొని పూర్వ వైభవాన్ని పొందేందుకు కొంత విరామం అవసరమవుతుంది. ప్రజా ఉద్యమంలో పాల్గొనే ప్రజలు అనివార్యంగా కొంతకాలం వ్యవధి తరువాత అలసిపోతారు. జైలు నిర్బంధాలు, పాశవిక మైన లాఠీ ఛార్జీలు, చెల్లించలేని జరిమానాలు, ఇళ్ళు, పొలాలు ఇతర ఆస్తుల జప్తులు-లాంటి ప్రతికూల పరిస్థితులలో ప్రభుత్వా న్ని, ప్రభుత్వ అణచివేతని ప్రతిఘటించే శక్తి పరిమితంగానే వుంటుంది. త్యాగాలు చేయగలశక్తి పరిమితంగానే వుంటుంది. ప్రజలు వలసవాద నిర్బంధాన్ని ఎదుర్కొని త్యాగాలు చేయగల శక్తిని పెంచేందుకు జాతీయ నాయకత్వం సైద్ధాంతిక కార్యక్రమం ద్వారా నిరంతర ప్రయత్నాలు చేసింది. అదే సమయంలో బాధలు భరించగల శక్తికి వుండే పరిమితుల్ని గుర్తించింది. అందువలన శక్తికి మించిన భారాన్ని వారిపై మోప లేదు. అంతేగాక వలసవాద ప్రభుత్వం కనీసం 1945 వరకు అస్తవ్యస్తంగా లేదు. పాలనా యంత్రాంగం ప్రభుత్వానికి విధేయంగానే వుంది. 1932-33, 1942లలో లాగానే ఉద్యమాన్ని అణచివేయగల శక్తి కలిగి వుంది. ఈ వాస్తవాన్ని గమనంలోకి తీసుకొని జాతీయవాద నాయకత్వం తన ఎత్తుగడలను రూపొందించింది.

ప్రజా ఉద్యమానికి సర్వ సన్నద్ధంగా వుండే సైన్యం లేక పూర్తి కాలం పనిచేసే చట్రం యొక్క అవసరం వున్నప్పటికి, ప్రజా ఉద్యమం పూర్తిగా వారిపై ఆధారపడి మాత్రమే పనిచేయలేదు. ఈ అవగాహనతో జాతీయోద్యమంలో రెండు దశలు వుండాల న్నది వ్యూహం. ఉద్యమానికి నిర్ణయాత్మక శక్తి ప్రజల నుండే లభిస్తుంది. జాతీయోద్యమం సర్వస్వం జాతీయపోరాటానికి అంకితం చేసిన వేలాదిమంది పూర్తికాలం పనిచేసే కార్యకర్తల్ని తయారుచేసింది. ఈ కార్యకర్తలు వారి జీవితాన్ని జైళ్ళలో, ఆశ్రమాలలో, ఖాదీ భాండార్లలో, ట్రేడ్ యూనియన్, కిసాన్ సభ కార్యాలయాల్లో గడిపారు. ప్రజల్ని సమీకరించడంలో, నిర్మాణం లోకి తీసుకురావడంలో వారు కీలకపాత్ర వహించినప్పటికీ ఉద్యమం ప్రజలపై ఆధారపడింది. వలసరాజ్యాన్ని ప్రతిఘటించే ప్రజా ఉద్యమం చేపట్టడం, ప్రతిఘటించని దశకి ఉద్యమాన్ని మార్చుకొనడం - ప్రజలపై ఆధారపడిన రాజకీయ పోరాట వ్యూహంలోని అంతర్భాగం. ఆ విధంగా ప్రజలు, ప్రభుత్వం వెళ్ళగలిగిన పరిమితులు అవగాహనతో గాంధేయవాదం రూపొందింపబడింది. ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించడం, దానిని మరొక దశకి మార్చడం - ప్రజా ఉద్యమ వ్యూహంగా గుర్తించబడిన తరువాత ఒక దశనుండి మరొక దశకి మార్చే నిర్ణయం ఎత్తుగడ అయిందిగాని సూత్రంకాదు. అప్పుడు ఎదురైన ప్రశ్న: వాస్తవ పరిస్థితుల్ని గమనంలో పెట్టుకొని మార్పు నిర్ణయం ఎప్పుడు చేయాలి ? తన రాజకీయ ఆచరణని గాంధీజీ సిద్ధాంతబద్ధం చేసిన రెండు అరుదైన సందర్భాలలో నాయకత్వ పాత్రని గురించి ఆయన ఎలా ఆలోచిస్తాడో సూచన ప్రాయంగా చెప్పారు. 1938లో ఆయన యిలా వ్రాశాడు. 'తెలివైన సేనాని తాను పూర్తిగా తుడిచిపెట్టబడే వరకు నిరీక్షిం చడు. అతడు నిలబెట్టుకోలేని స్థానం నుండి సరియైన సమ యంలో క్రమబద్ధంగా వెనక్కి తగ్గుతాడు', 1939లో 'సమర్థుడైన సేనాని తనకనువైన సమయంలో తాను ఎంపిక చేసుకొన్న ప్రాతిపదికపై పోరాడతాడు. ఈ అంశాలపై చొరవ తాను అట్టిపెట్టుకొంటాడు. శత్రువు చేతుల్లోకి పోనీయడు. 'సత్యాగ్రహ ప్రచారంలో పోరాటపద్ధతి ఎత్తుగడల ఎంపిక అంటే ముందుకు పోవాలా, వెనక్కి తగ్గాలా, పౌర ప్రతిఘటన ఇవ్వాలా లేక నిస్వార్థమైన మానవసేవ నిర్మాణాత్మక కార్యక్రమాలలో అహింసాయుతమైన బలాన్ని కూడగట్టాలా? పరిస్థితుల అవసరాలను బట్టి నిర్ణయింపబడతాయి.

మరొక విధంగా చెప్పాలంటే ఒక ఉద్యమాన్ని ప్రారంభించే లేక విరమించే సమ యానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు ఉద్యమం బలాబలాల ప్రాతిపదికన ప్రజలు నిలబడగలిగే శక్తి మీద, ప్రభుత్వ రాజకీయ పాలనాపరమైన శక్తి మీద ఆధారపడి గాంధీజీ జాతీయ నాయకత్వం చేత చేయబడ్డాయి. ప్రభుత్వంతో రాయబారాలు జరపాలా ? వద్దా ? అన్నది సమస్య కాదు. రాయబారాలు జరిపేటప్పుడు సరైన సమయాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలి ? ఎలా రాయబారాలు జరపాలి ? దేనిని గురించి రాయబారాలు జరపాలి ? ఒప్పందం కుదిరితే ఎలాంటి షరతులు కంగీకరించి ఒప్పందంపై సంతకాలు చేయాలి ? అనేది సమస్య. కాంగ్రెస్ విధానంపై ఎ.ఐ.సి.సి. 1945 సెప్టెంబర్ 22 ఆమోదించిన తీర్మానం ఇలా పేర్కొన్నది. 'శాంతియుత విధానం యొక్క కీలకాంశం అయిన చర్చలు రాజీ పద్ధతిని కాంగ్రెస్ ఎప్పుడూ విడనాడదు. కాబట్టి కాంగ్రెస్ మార్గదర్శక సూత్రం: అవకాశం ఉన్నప్పుడు 'చర్చ-అంగీకారం' అవసరమైనప్పుడు సహాయ నిరాకరణ-ప్రత్యక్ష చర్య'. గాంధేయ (గాంధీజీకి ముందు కాలం లో సైతం) వ్యూహంలో నిర్మాణాత్మకమైన పని చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. ఖద్దరు ప్రోత్సాహం, నూలు తీయుట, గ్రామీణ పరిశ్రమలు, జాతీయ విద్య, హిందూ ముస్లిం ఐక్యత, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం, హరిజనోద్ధరణ, విదేశీ వస్త్రాల్ని, విదేశీ మద్యాన్ని బహిష్కరించుట- లాంటి సమస్యలపై నిర్మాణాత్మక కార్యకలాపాల రూపకల్పన జరిగింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో వందలాది ఆశ్రమాలు నిర్మాణాత్మక పనికి చిహ్నాలుగా వెలిశాయి. Cord ప్రజా ఉద్య

మాలు చేపట్టని దశలో సహాయ నిరాకరణ విరమించుకొనడం వలన ఏర్పడిన రాజకీయపరమైన ఖాళీని నింపడంలో నిర్మాణాత్మకమైన పని చాలా కీలకమైన పాత్ర నిర్వహించింది. ప్రజా ఉద్యమాలు చేపట్టని దశలో కార్యకర్తలకు పని కల్పించి చురుకుగా వుంచే సమస్యని నిర్మాణాత్మకమైన పని పరిష్కరించింది. నిర్మాణాత్మక కార్యక్రమాలు పెద్దసంఖ్యలో ప్రజల్ని భాగస్వాముల్ని చేశాయి. పార్లమెంటరీ మేధాపరమైన పనిచేసేందుకు కొద్దిమంది వ్యక్తులు చాలు. కాని నిర్మాణాత్మక కార్యక్రమాలకు లక్షలాది మంది జోక్యం అవసరం. అంతేగాక అందరూ జైళ్ళకు వెళ్ళలేరు. కాని నిర్మాణాత్మకమైన పని అందరికీ అందుబాటులో వుంది. నిర్మాణాత్మక కార్యక్రమాలకు చెందిన ముఖ్యులు సహాయ నిరాకరణోద్యమానికి పెద్దసంఖ్యలో కార్యకర్తల్ని సరఫరా చేశారు. వారు గాంధీజీయొక్క ఇనుప చట్రం లేక రిజర్వు సైన్యం. భారత జాతీయవాద సవాలుని ఎదుర్కొనేందుకు వలసవాద వ్యూహం, రాజ్యాంగ సంస్కరణల్ని చట్టసభల్ని ఏర్పాటు చేసింది. చట్టసభలకు దీటైన వైఖరిని భారతీయులు తమలో కలుపుకొనేందుకు లేక దారి తప్పించేందుకు వలసవాదానికి సాధనాలుగా చేపట్టవలసివచ్చింది.

ఒకవైపు రాజ్యాంగ చట్రం, రాజ్యాంగ సంస్కరణలు జాతీయోద్యమాన్ని పనిచేశాయి. మరొకవైపు అవి జాతీయోద్యమం పని చేయగల ప్రజాస్వామ్య అవకాశాల్ని పెంచడం ద్వారా భారత ప్రజలు సాధించిన వలసవాద వ్యతిరేక పోరాట ఫలితాలకు ప్రాతినిధ్యం వహించాయి. రాజ్యాంగ సంస్కరణలు జాతీయ కాంక్షని ప్రజలలో వ్యాపింపచేయటాన్ని అడ్డుకొంటాయనిబీ రాజ్యాంగబద్ధం – రాజ్యాంగేతర, మితవాద వామపక్షవాద ప్రాతిపదికన జాతీయవాద శ్రేణులలో అసమ్మతిని, చీలికల్ని ప్రోత్సహిస్తాయని వలసపాలకులు ఆశించారు. వలసవాద వ్యూహాన్ని ఎదుర్కొనడంలో జాతీయనాయకులు రాజ్యాంగ సంస్కరణల తర్కాన్ని, వలస పాలకుల వ్యూహపరమైన తర్కాన్ని అనుసరించవలసి వచ్చింది. వలసవాదం అనివార్యంగా కొంత రాజకీయ అవకాశాన్ని కల్పించవలసి వచ్చింది. జాతీయవాదం ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని వలసవాదానికి వ్యతిరేకంగా రాజకీయ సైద్ధాంతిక పోరాటం జరిపింది. సంస్కరణలు రూపొందింపబడాలి. ఎలా రూపొందింపబడాలి? – అనేది సమస్య. జాతీయవాద శ్రేణులలో తీవ్రమైన చర్చ జరిగిన మీదట సంస్కరణల రూపకల్పన సామ్రాజ్యవాదుల అంచనాల్ని తలక్రిందులు చేసేది గాను, జాతీయవాదుల ఆకాంక్షని ముందుకు తీసుకొని పోయేదిగాను వుండాలి. వాస్తవంగా 1880 నుండి జాతీయ నాయకత్వం కౌన్సిళ్ళను వలసవాద ఆధిపత్యాన్ని బలహీనపరచేవిగా పరిగణించింది. అణగారిన ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు, వారిని వారు పాలించుకోగలరని ప్రజలలో విశ్వాసం కల్పించేందుకు, కాంగ్రెస్ యొక్క జాతీయోద్యమం యొక్క ప్రతిష్టని పెంచేదిగాను చట్టసభలలో, మున్సిపల్ సంస్థలలో, 1937 తరువాత మంత్రివర్గాలలో చేసిన కృషి వినియోగించుకోబడింది. చాలాకాలం రాజకీయాధికారం నుండి దూరం చేయబడిన ప్రజలు, వలసవాదానికి గురిచేయబడి, రాజకీయాధికారం వినియోగించుకోలేని అశక్తులుగా వున్న ప్రజలు, వలసపాల కుల్ని సవాలు చేయడం, చట్టసభలలో ఒక ఫిరోజ్, ఒక జి.కె. గోఖలే, ఒక సిఆర్.దాస్, ఒక మోతీలాల్ నెహ్రూల శక్తివంత మైన ఉపన్యాసాలు, చట్టసభలలో 1920లలో ప్రభుత్వ ఓటమి, చాలా నగరాలలో, పట్టణాలలో, జిల్లాలలో జాతీయవాదులు మున్సిపల్ అధికారులపై సాధించిన పట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. వారి శక్తి సామర్థ్యాల్ని తెలియజెప్పి చట్టసభలలో రాజ్యాంగ సంస్కరణలలో జాతీయవాద వ్యూహం గణనీయమైన కార్యకలాపాలు రాజకీయ శూన్యాన్ని నింపాయి. చట్టసభలలో మునిసిపల్ సంస్థలలో విజయాల్ని నమోదుచేసింది. జాతీయోద్యమం బలం పుంజుకొంటున్నప్పుడు చట్టసభలలోని పనిచేసిన వారు వలసరాజ్యం తనలో ఇముడ్చుకొనడానికి చేసిన ప్రయత్నాలకు లోబడలేదు. వలసవాద డొల్లతనాన్ని బహిర్గత పరచారు. భారతదేశం బ్రిటిషు వారి అరాచక చట్టాల సహాయంతో బ్రిటన్ నుండి పాలింపబడుతుంది. 1907లో సూరత్ చీలిక నేర్పిన గుణపాఠాలతో జాతీయ కాంగ్రెస్ ఆ తరువాత చీలికల్ని జయప్రదంగా నివారించగలిగింది. 1919 తరువాత కాంగ్రెస్ వాదులందరు రాజ్యాంగ సంస్కరణల రాజకీయాల పట్లగాక ప్రజా రాజకీయాల పట్ల నిబద్ధులై వున్నారు గనుక ఇది సాధ్యపడింది. ప్రజల తిరుగుబాటు వచ్చిన ప్రతి సందర్భంలోనూ కాంగ్రెస్ నాయకులు చట్టసభల్ని వదిలిపెట్టి ప్రజా ఉద్యమాలలోకి దూకారు. వారు చట్టసభల్ని వలసవాద చట్రంలో క్రమబద్ధమైన సంస్కరణల్ని తెచ్చిపెట్టే సాధనాలుగాగాక వలసరాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం జరిపే వేదికలుగా భావించారు. ప్రయోజనాల చూపారు. గాంధీజీకి అహింస ఒక సూత్రం. కాని కాంగ్రెస్‌లోని ఆయన సమకాలికులు – సి.ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అజాద్, సర్దార్ పటేల్, ఆచార్య నరేంద్రదేవ్ – లాంటి వారికి అదొక విధానం. ఒక విధానంగా రాజకీయ ప్రవర్తనా రూపంగా జాతీయ కాంగ్రెస్ వ్యూహంలో అదొక ముఖ్యమైన భాగమైంది. విస్తృత ప్రజా సమీకరణపై ఆధారపడిన జాతీయోద్యమ స్వభావంలో అహింస అంతర్భాగమైంది. దాని ప్రాథమిక అంశాలలో ఒకటైంది. అహింసాయుత పోరాట పద్ధతుల కారణంగా ప్రజలు విరివిగా పాల్గొ న్నారు. హింసాయుత పద్ధతులలో పోరాడివుంటే అంతగా పాల్గొని వుండేవారు కాదు. పోరాటాలలో స్త్రీల భాగస్వామ్యానికి ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. సాయుధ పోరాటంలో మహిళలు పెద్దసంఖ్యలో చేరడం కష్టమయ్యేది. బాధల్ని భరించడం, లాఠీఛార్జీల్ని ఎదుర్కొనడం, గంటల కొలది పికెటింగు జరపడం–లాంటి చర్యలలో బహుశా స్త్రీలు పురుషులకంటే

బలాఢ్యులు. పోరాటరూపంగా రాజకీయ ప్రవర్తనగా అహింస వలసరాజ్యం యొక్క సగం ఆధిపత్య, సగం నియంతృత్వ స్వభావానికి బ్రిటన్ రాజకీయాల ప్రజాస్వామ్య స్వభావానికి అనుసంధానం చేయ బడింది. అహింస అంటే అన్నిటినిమించి నైతికబలం ప్రాతిపదికగా పోరాడటం. అహింసాయుత ప్రజా ఉద్యమాలు వలస పాలకులను ఒక మూలకు నెట్టివేశాయి. శాంతియుతంగా సత్యాగ్రహం సాగించే వారిపై పాలకులు సాయుధ దళాన్ని ప్రయోగించినప్పుడు వలసరాజ్యం పాశవిక బలంపై ఆధారపడి పనిచేస్తుందనే వాస్తవాన్ని బయటపెట్టింది. అహింసాయుత ప్రజా ఉద్యమం పాలకుల్ని సందిగ్ధంలో నిలబెట్టింది. శాంతి యుతంగా వుంది గనుక అణచివేసేందుకు సందేహించారు. ప్రతిఘటించే వారు వలసవాద చట్టాల్ని ఉల్లం ఘించారు గనుక వారి ఆధిపత్యంలో గల ముఖ్యమైన భాగాన్ని కోల్పోయారు. ఉద్యమకారులపై చర్య తీసుకొనకపోవడం అంటే పాలనాపరమైన బాధ్యతల్ని త్యజించడం, పరిపాలించడానికి అవసరమైన బలం లేదని ఒప్పుకోవడమైంది. ఉద్యమాన్ని బల ప్రయోగంతో అణచివేస్తే అప్పటికీ వారు పరాజితులే. శాంతి యుత ఉద్యమాన్ని, అహింసాయుతంగా శాసనోల్లంఘన చేసే వారిని బల ప్రయోగంతో అణచివేతని సమర్థించుకొనడం నైతికంగా చాలా కష్టమైంది. వారు ఏ విధంగానూ గెలవలేని స్థితిలో వున్నారు. మరొకవైపు జాతీయోద్యమం గెలిచే వ్యూహం కలిగివుంది. ప్రజల మద్దతు గల అహింసాయుత ప్రజా ఉద్య మానికి అర్ధ ప్రజాస్వామ్య పాలన వద్ద జవాబులేదు. వలస పాలకులు రెండింటి మధ్య ఊగిసలాడి అణచివేతని ఆశ్రయిం చారు. అహింసాయుత ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయోగిం చిన బలప్రయోగం స్పష్టంగా బహిర్గతమవడంతో వలస పాలకుల ఆధిపత్యం క్రమక్రమంగా క్షీణించింది. నైతికపునాది కొంచెం కొంచెంగా ధ్వంసమైంది. అహింసా పద్ధతి అమలు జరపడం 'నిరాయుధులైన ప్రజలకు ప్రత్యామ్నాయం వుండదు' –అనే వాస్తవంతో ముడిపడింది. వలసరాజ్యం తనకుగల విస్తృతమైన వ్యవస్థతో భారత ప్రజలను 1858 నుండి నిరాయు ధుల్ని చేసింది. ఆయుధాలు సేకరించడం, శిక్షణ పొందడం దాదాపు అసాధ్యంగా మారింది. బలమైన వలస రాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసేందుకు అవసరమైన భౌతిక వనరులు భారతీయులకు లేవని జాతీయోద్యమ నాయ కులు మొదటి నుండి గుర్తించారు. అహింసాయుత ప్రజా పోరా టంలో నిరాయుధులుగా చేయబడిన భారత ప్రజలు ప్రతికూల పరిస్థితులలో లేరు. మరొక నైతిక బలానికి, కూడగట్టబడిన ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత లభించింది. ఇక్కడ విధంగా చెప్పాలంటే ప్రజా ఉద్యమం యొక్క అహింసాయుత విధానం రాజకీయ వనరుల్ని సమీకరించుకొన డంలో సాయుధ వలస రాజ్యానికి దీటుగా వుంది. ఈ సందర్భంగా హింసా ప్రయోగం పై వలస పాలకుల అవగాహనని చేసుకొనడం అవసరం. నిరా యుధులుగా చేయబడిన భారత ప్రజలు ప్రభుత్వంసాగించే తీవ్ర నిర్బంధకాండని తట్టుకోలేరు. హింసాయుత పద్ధతులకు దిగు తారు. ప్రజలు హింసాయుత పద్ధతులకు దిగితే ప్రభుత్వం అణచివేత చర్యలు చేపట్టడాన్ని సమర్థించుకొనడానికి అవకాశం లభిస్తుంది. తీవ్ర నిర్బంధకాండ ప్రజల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తుంది. ప్రజల రాజకీయ స్తబ్దతకి దారితీస్తుంది.

ప్రజా ఉద్యమం హింసాయుత రూపం తీసుకొంటుందా? లేక జవహర్‌లాల్ నెహ్రూ, భగత్ సింగ్ సంక్షిప్తంగా భావగర్భితంగా ప్రస్తావించినట్లు కార్యకర్తలు చేపట్టే ఉద్యమాలకు భిన్నంగా లక్షలాది మంది ప్రజలు భాగస్వామ్యం వహించే ప్రజా ఉద్య మాలు స్వభావరీత్యా శాంతియుతంగా వుంటాయా? రెండవది: భారతదేశంలో అహింసా పోరాటం స్వభావరీత్యా ఇతర దేశాల లోని సాయుధ పోరాటాలంత విప్లవాత్మకమైనది. జాతీయవాద వ్యూహం స్వభావం లక్ష్యాల్ని అవగతం చేసుకొన్న తరువాత, ప్రజలే చరిత్ర నిర్మాతలని వారికి తెలియజెప్పి వారి హృద యాల్ని, మనసులను ఆకట్టుకొని ఉద్యమంలో చురుకైన భాగ స్వాముల్ని చేసేందుకు జాతీయోద్యమం రెండు దశలు సమా యత్తం చేయబడాలని గుర్తించిన తరువాత ఉద్యమం యొక్క ప్రాథమిక వ్యూహాన్ని, ఉద్యమం యొక్క వివిధ దశలలోని విజ యాల్ని పరాజయాల్ని నూతన పద్ధతిలో అంచనా వేయవలసి వుంటుంది. భారత ప్రజలపై వలసవాద ఆధిపత్యం ఏ మేరకు బలహీనపరచబడింది, ప్రజలు ఏ మేరకు రాజకీయ చైతన్యంతో పోరాటానికి సన్నద్ధం చేయబడ్డారు– అనేవి ఉద్యమం యొక్క విజయానికి లేక వైఫల్యానికి గీటురాళ్ళు. ఈ దృక్కోణం నుండి పరిశీలిస్తే వరుసగా వచ్చిన ప్రజా ఉద్యమ కెరటాలు, సంధి దశలు లక్ష్యాల్ని సాధించినట్లు గమనిస్తాము. ప్రజా ఉద్యమాలు అణచివేయబడినప్పుడు (1932, 1942) విరమించినప్పుడు (1922) విస్మరించబడి అణచివేయబడినప్పుడు (1940–41) లేక రాజీతో ముగిసినప్పుడు (1930–31), సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యంగా పెట్టుకొని సాధించలేకపోయినప్పుడు – అన్ని సందర్భా లలో ఆధిపత్యం సాధించడంలో విజయవంతమయ్యాయి. రాజకీయ చైతన్యాన్ని పెంచడంలో విజయవంతమయ్యాయి.

భారత జాతీయోద్యమ వ్యూహం యొక్క ఆచరణకు – ప్రత్యే కించి గాంధీజీ నాయకత్వం వహించిన కాలంలో ఆచరణకి ప్రపంచచరిత్రలో బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా, క్యూబా, వియ త్నాం విప్లవాలతో పోల్చదగిన ప్రాధాన్యత వుంది. కాని భారత దేశం మాత్రమే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య దేశంగా అవతరించి మనగలిగింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంపై అధ్యయనం రాజకీయ కార్యకర్తకి, చరిత్రకారునికి చారిత్రక క్రమంపై లోతైన అవగాహన కల్పించగలుగుతుంది. ❑

# టాగూర్ : జానపదుల మతం - ఉపశ్రేణులు

## భారతీయ లౌకిక తత్వ శక్తి సామర్థ్యాలు


అనువాదం : మందలపర్తి కిషోర్



అరుణ్.కె.పట్నాయక్

**బెంగాల్లోని ఉపశ్రేణుల్లోకి లెక్కకొచ్చే కులాలు అనుసరించే మతాచారాలను విశ్లేషించేందుకు రవీంద్రనాథ్ టాగూరు చేసిన ప్రయత్నాలను ఈ పరిశోధన పత్రం పరిశీలిస్తోంది. మత జీవనంలోని ప్రధాన స్రవంతి క్రతువుల్లో ఉపశ్రేణులుగా లెక్కకొచ్చే కులాలు పాల్గొనకుండా నిరోధించే కుల-వర్గ వ్యవస్థపై తిరుగుబాటుగా తలెత్తిన నిరసన ఉద్యమాలుగా, జానపదుల మతాలను పరిగణిస్తూ ఉంటారు. ఉదాహరణకు, విగ్రహారాధన క్రతువుల్లో దళితులను పాల్గొననివ్వకుండా నిరోధిస్తుంది ఆలయ అర్చన వ్యవస్థ. ఇది, ఉపశ్రేణుల్లోకి లెక్కకొచ్చే కులాల్లో అనేక విధాలైన ప్రతిస్పందనలను కలగచేస్తుంది.**

దళితులను ఆలయాల్లోకి ప్రవేశించనివ్వాలనే డిమాండ్ మొదలుకుని, అసలు విగ్రహారాధననే వ్యతిరేకించడం వరకూ అనేక రూపాల్లో ఈ ప్రతి క్రియ వ్యక్తమవుతుంది. 'మానవ మతం' అనే రచనలో ఈ విషయాలను టాగూరు, ప్రస్తావిం




చారు. పెళ్ళిళ్ళు, ప్రార్థన స్థలాలూ, శ్మశానాల్లాంటి అనేక విషయాల్లో చర్చ్ వ్యవస్థ కూడా దళితులను నిరోధించడం కద్దు. దేవుడితో హృదయ పూర్వకమైన మమేకత్వం ప్రకటించే కొన్ని అంశాల విషయంలో మసీదులు సైతం వివక్ష ప్రదర్శిస్తూ వుండేవని టాగూరు రాశారు. మతం విషయంలో పెరియార్ ప్రతిపాదించిన 'సమధర్మం' (మతం విషయంలో అందరూ సమానులే) అనే భావన, గాంధీజీ చెప్పిన 'సర్వధర్మ సమభావన' (అన్ని మతాలూ సమానమే అనే భావన)కు భిన్నమైనది. అయితే, ఇవి రెండూ, భారతీయ లౌకికవాదంలో రెండు ప్రధాన సిద్ధాంతాలనే మాట మాత్రం నిజం! ఉప శేణుల్లోకి లెక్కకొచ్చే కులాలు అనుసరించే జానపద మతాన్ని గురించిన టాగూరు రచన చదువుతూంటే - మేధావుల మతానికి భిన్నమైన సామాన్య జానపదుల మతంలో భాగమైన - ఈ జంట భావనలు తలపునకు రావడం సహజం. కాగా, ఈ జంట సమానత్వ భావనల్ని పరస్పరం పోల్చి విశ్లేషించేందుకు చేసిన ప్రయత్నమే ఈ పరిశోధన పత్రం. వీటిల్లో ఒకటి 'భిన్న మతాల మధ్య సమానత్వం' గురించి చెప్పేది కాగా, మరొకటి 'ఒకే మతంలోని విభిన్న శ్రేణుల మధ్య సమానత్వం' గురించి చెప్పేది. భారతీయ లౌకికవాద స్రవంతిలోని ఈ ప్రధాన సిద్ధాంత ప్రతిపాదనల గురించి టాగూరు తన రచనలో ప్రస్తావించారే గానీ తగినంత లోతుగా విశ్లేషించలేదనేది వాస్తవం! ఆయన రచన పరిధిలోనే ఈ పరిశోధన పత్రంలోని విశ్లేషణ సాగుతుంది!

గ్రాంసీ జైల్లో ఉండగా రాసుకున్న 'నోట్ బుక్స్'లో సామాన్య ప్రజల మతాన్నీ, మేధావులు-లేదా, తాత్వికుల-మతాన్నీ వేరు చేసి ప్రస్తావించిన విషయం కీలక ప్రాధాన్యం కలిగి వుంది. మరీ ముఖ్యంగా, మన దేశంలోని మేధావులు మతం గురించి ప్రతిపాదించిన సిద్ధాంతాలను అర్థవంతంగా బోధపరుచుకునే సందర్భంగా ఈ మార్క్సిస్టు సిద్ధాంత ప్రతిపాదన కీలక ప్రాధాన్యం వహిస్తోంది. టాగూరు లాంటి చింతకుడు, మేధావి ప్రతిపాదించిన 'మానవ ధర్మం' అనేది సామాన్య ప్రజల ధర్మం

గురించీ, ఉపశ్రేణుల గురించీ ప్రస్తావించిన సిద్ధాంత ప్రతిపాదనే! గ్రాంసీ విశ్లేషణ పద్ధతికి కట్టుబడి ఆలోచిస్తే, 'ప్రతి మేధోపరమైన అంశమూ, రాజకీయ స్వభావం కలిగివుండే అంశమే' అనాలి! భావజాలపరమైన ప్రతి స్రవంతీ, ఒక రాజకీయ స్రవంతిని సృష్టిస్తుందనీ అనక తప్పదు. అంచేత - గ్రాంసీ మార్గంలో మనమూ పోతే - టాగూరు ప్రస్తావించిన సామాన్య ప్రజల మతం - ముందు ముందు - సమకాలీన భారతదేశంలో రాజకీయ లౌకికవాదాన్ని బలపరుస్తుందనీ చెప్పక తప్పదు. సామాన్య ప్రజల మతం గురించి ఠాగూరు ప్రస్తావించిన విషయాల మేధోపరమైన విశ్లేషణ, సమ కాలీన భారతదేశానికి సంబంధించిన కొన్ని రాజకీయ నిర్ణయాల దిశగా మనల్ని నడిపించాలి. ఈ నేపథ్యంతో మనం ముందుగా సామాన్య ప్రజల మతానికీ, మేధావుల-లేదా, తాత్వికుల-మతానికీ గ్రాంసీ చూపించిన వ్యత్యాసాన్ని పరిశీలిద్దాం! గ్రాంసీ నడిచిన పరిశోధన మార్గంలోనే, మనం కూడా సాగి, టాగూరు ప్రస్తావించిన సామాన్యుల మతం అనే భావనలో ఇమిడివున్న సంక్లిష్టమైన అంశాలు కొన్నింటిని విశ్లేషించుకుందాం!!

## సామాన్యుల మతం - మేధావుల మతం

సామాన్యుల మతానికి - మేధావుల మతంతో వున్న పోలికలూ తేడాలూ గుర్తించడానికి కొన్ని గీటురాళ్ళను, ప్రాతి పదికలను గ్రాంసీ ప్రతిపాదించారు. వాటిల్లో మొదటి గీటురాయి ఈ మతం పుట్టుక. రెండోది, అది అభివృద్ధి చెందిన క్రమం. మూడోది అధికార బంధాల ద్వారా ఏర్పడే అంతస్సంబంధాలు.

1. పుట్టుకకు సంబంధించినంత వరకూ సామాన్యుల మతం నాటు-మోటు భౌతికవాదంలా కనిపిస్తుందంటాడు గ్రాంసీ. అయితే, ఈ నాటు భౌతిక వాదమే సామాన్యుల్లో-ఉప శ్రేణుల్లో ప్రచురంగా కనిపిస్తుందనీ అంటాడాయన. కాగా, వామపక్ష శ్రేణుల్లోనూ, మతం తాలూకు సమాజ శాస్త్ర పరిశోధకుల్లోని సంప్రదాయికుల్లోనూ ఓ భావన ప్రచురం గా కనిపిస్తుంది. మేధావుల మతాన్ని వడగడితే మిగిలే అవక్షేపం లేదా సారమే నాటు భౌతిక వాదమని వాళ్ళ నమ్మకం. అయితే, వాళ్ళనుకున్నట్లుగా, "మేధావుల మత సారం నాటు భౌతికవాదం కాదని గ్రాంసీ వివరించారు. నృత్య నాటికలూ, భక్తి కవుల-వాగ్గేయకారుల గీతాలు తదితర ప్రజా కళారూపాలూ, జానపద కళారూపాల ద్వారా వ్యక్తమయ్యే, నిరసన సంప్రదాయమే సామాన్యుల మతం. ఇది, ఉపశ్రేణులకు చెందిన ప్రజా సమూహాలపై జరిగే మతపరమైన ఆధిపత్యం పట్ల నిరసనగా తలెత్తింది.
2. ఉపశ్రేణుల ఉనికికి భిన్నమైన చోటనే సామాన్యుల మతం రూపుదిద్దుకుంటుందని అర్థమవుతుంది. సామాన్యుల మతంలో, మేధావుల మతం తాలూకు మూలపదార్థాలు కొన్ని కనిపించవచ్చు. కానీ, అదే దాని సంపూర్ణ స్వభావ కాన్ని ఆవిష్కరించజాలదని గ్రహించాలి. ఉపశ్రేణుల చైతన్యం - ఆచరణల గురించిన గ్రాంసీ సిద్ధాంత ప్రతిపాద నల్లో కీలకమైన ప్రాధాన్యం కలిగిన ప్రతిపాదన ఇది! కొన్ని నిర్వచనాలను గ్రాంసీ మాటల్లోనే విందాం- 'సామాన్యుల మతంలోని నమ్మకాలూ-అభిప్రాయాలూ-దృష్టి కోణాలూ-ఆచరణా-మూఢవిశ్వాసాల ఆవరణం మొత్తం మనం జానపద అని పిలిచే దానిలో దర్శనమిస్తుం'దన్నాడు గ్రాంసీ. గ్రాంసీ చెబుతున్న జానపదుల మతం-సాధారణంగా-ధార్మిక, సాంస్కృతిక మూల పదార్థాల సమ్మేళనమై వుండే మాట నిజమే. కానీ, ఆయన చెప్పే 'జానపద విజ్ఞానం'లో, మతపరమైన అంశాల అవిభాజ్యమైన భాగాలై వుండక పోవచ్చునని కూడా అంటాడు ఫుల్టన్.
3. జానపదుల మతం "సామాన్య ప్రజల కట్టుబాట్లూ, మూఢ నమ్మకాలూ, వినోదాంశాలూ పురాగాథలూ, కర్మ కాండల్లో ఉనికిలో ఉంటుందన్నాడు గ్రాంసీ. అయితే, మేధావుల - వ్యవస్థీకృతమైన - మతం మాత్రం ఇందుకు భిన్నమైన భాగాలతో కూడుకునివుంటుంది. అది మతాధిపతుల-మతాధిపతుల-బోధకుల-ప్రచారకులతో కూడిన విస్తృత వ్యవస్థగా రూపుదిద్దుకుని ఉంటుంది. మళ్ళీ అందులోనూ సామాన్య ప్రజానీకం ఓ భాగమై వుంటారు! ఓ పద్ధతి ప్రకారం వ్యవస్థీకృతమై వుండే మతాలను మేధావుల మతాలుగా మనం పరిగణిస్తాం. ఈ విభిన్నమైన రాజ్యాల మధ్య విభజన రేఖ స్పష్టంగానూ, స్ఫుటంగానూ కనిపిస్తోంది క్కడ. కానీ, నిజానికి ఇది ఎంతో క్లిష్టమైన, ఫులుముకు పోయిన సరిహద్దులతో కూడివుండడం కద్దు! కార్యాచరణ-అధికారం అనే జంట అంశాల చేత ఈ రెండు ప్రపంచాలూ ముడిపడి వుంటాయి. ఈ రెండు ప్రంచాలనూ ముడివేసే మరో రెండు అంశాల గురించి గ్రాంసీ "నిర్మాణ కౌశలం - ప్రాప్తకాలజ్ఞత" (తక్షణం చేసే ఆలోచన). అనే జంట మాటల ద్వారా సూచించాడు. ఆయన భావనల్లో ప్రచుర మైన వాటిల్లో ఇది ఒకటి! "ఉపశ్రేణుల చరిత్ర" గురించి మన దేశంలో జరిగిన చర్చకు ఈ భావన కేంద్రబిందువుగా వుండేది.

టాగూరు ప్రతిపాదించిన మానవ ధర్మం, లేదా మానవ మతం గురించి, అందులో ఇమిడివున్న తాత్విక - రాజకీయ అంశాల గురించి చర్చించే సందర్భంగా ఈ విషయాలను తిరిగి ప్రస్తావించుకుందాం. ప్రస్తుతానికి వాటినలా వుంచండి! గ్రాంసీ

సూచించిన మార్గదర్శక సూత్రాలకు కట్టుబడి, సామాన్య ప్రజల – జానపదుల మతాన్ని అర్థం చేసుకునే క్రమంలో కొనసాగుదాం.

సామాన్య ప్రజల, జానపదుల మతాన్ని స్థూలంగా నిర్వచించ గలిగాం ఇప్పటికి! సామాన్య ప్రజల–జానపదుల మతాన్ని అర్థం చేసుకునే క్రమంలో దృష్టిలో ఉంచుకోవలసిన నాలుగు సూక్ష్మ మైన అంశాలను సూచించాడు గ్రాంసీ. వాటిపై కేంద్రీకరిద్దాం ఇక ముందు.

## మతపరమైన వ్యవహార జ్ఞానానికీ, మేధావుల మతానికీ మధ్యలో వుండేదే జానపదుల మతం

గ్రాంసీ తన నోట్‌బుక్స్‌లో ఎన్నెన్నో కొత్త పారిభాషిక పదాలు ప్రయోగించారు. వాటన్నిటినీ ఆయన ఆయా సందర్భాల్లో నిర్వచిస్తూ వచ్చారు. అలాంటి వాటిల్లో సామాన్యుల, జానపదుల మతం–మేధావుల మతం–మతపరమైన వ్యవహార జ్ఞానం ముఖ్యమైనవి. చివరి రెండింటికీ మధ్యన 'సామాన్యుల మతం' ఉంటుందన్నాడు గ్రాంసీ'. సామాన్యుల మతం అనేది మతపరమైన వ్యవహార జ్ఞానంకన్నా అటు చైతన్యంలోనూ – ఇటు ఆచరణలోనూ పటిష్ఠంగా వుంటుందన్నాడు గ్రాంసీ. కానీ, మతపరమైన వ్యవహారజ్ఞానం అనేది మాత్రం కొన్ని భావాలను అడ్డదిడ్డంగా కట్టగట్టిపెట్టిన మోపులాంటిది. దానికి నిర్దిష్ట నిర్మాణ స్వరూపం వుండదు! ఈ మతపరమైన వ్యవహారజ్ఞానం, దైనందిన చైతన్యం – దాన్లో అనేక వైరుధ్యాలూ, వైపరీత్యాలూ, విరోధాభాసలూ, ఓ కొలిక్కి రాని నమ్మకాలూ–ఆచారాలూ కుప్పగా పడి వుంటాయి. దీంతో పోలిస్తే–జానపదుల మతం మరింత పటిష్ఠమైన నిర్మాణ స్వరూపం కలిగిన, పరస్పరం పొసిగే, ధార్మిక విశ్వాసాల రాశిగా ఏర్పడి వుంటుంది. ఈ రెండింటిలో మొదటి దానికి – మతపరమైన వ్యవహార జ్ఞానానికి – ఉపశ్రేణుల్లో భాగంగా వుండే సజాతి మేధావులే రూపురేఖలు దిద్దుతారు. జానపదుల మతాన్ని మాత్రం, ఉపశ్రేణుల్లోని ప్రతి సభ్యుడూ ఎంతోకొంత ప్రభావితం చేస్తాడు. 'జానపదుల మతం – మతపరమైన వ్యవహార జ్ఞానంతో పోలిస్తే–మరింత విస్తృతమైన ధార్మిక కార్యకలాపం"గా అభివర్ణించాడు గ్రాంసీ. "జీవితానికి సంబంధించిన క్రియాశీలకమైన భావన"గా దాన్ని ఆయన నిర్వచించాడు. సాంకేతిక పరిజ్ఞానం కలిగివున్న–లేదా–లేని ఉపశ్రేణులకు చెందిన మేధావులు జానపదుల మతానికి ఆసరాగా నిలుస్తారని గ్రాంసీ చెప్పాడు. అయినప్పటికీ మేధావుల–తాత్వికుల–మతంలో కనిపించేంత పటిష్ఠమైన, విస్తృతమైన నిర్మాణం జానపదుల మతంలో కనిపించదు. అంచేత, ధార్మిక చైతన్య ప్రమాణాల ప్రాతిపదికగా చూస్తే జానపదుల మతానిది మధ్యమ స్థానం. అది, మతపరమైన వ్యవహార జ్ఞానంకన్నా మెరుగైన స్థానంలోనూ, మేధావుల మతం కన్నా తక్కువ స్థానంలోనూ నడిమధ్య వుంటుంది. ఓ వైపు రెండు పక్కలా ఉన్న వాటికి మూలాధారంగా ఉంటూనే, మరో వైపు అటుపక్క నుంచీ ఇటుపక్క నుంచీ వనరులను అందిపుచ్చు కునే లక్షణం జానపదుల మతానికి వుంటుంది. అంచేత దాన్ని అటు మేధావుల, తాత్వికుల "సమగ్ర" మతవ్యవస్థతో గానీ, ఇటు మతపరమైన వ్యవహారజ్ఞానంతో గానీ సరిసమానంగా జమకట్టడం పొరబాటవుతుంది.

## సామాన్యుల మతం–నాజూకు లేని 'నాటు భౌతికవాదం'

గ్రాంషీ చెప్పిన సామాన్యుల మతం, టాగూరు చెప్పిన జానపదుల మతం అనే భావనకు అతి సన్నిహితంగా వున్న విషయాన్ని ఇక్కడ మనం పరిశీలిద్దాం. గ్రాంసీ చెప్పినట్లుగా "జీవితానికి చెందిన క్రియాశీలకమైన దృక్పథానికి సం బంధించినదే సామాన్య–జానపద మతం. ప్రకృతికీ, సంస్కృతికీ మధ్య జరిగే ప్రతిక్రియకు సంబంధించినదే సామాన్య – జానపద మతం. వ్యావసాయిక ఉత్పత్తికీ, మానవ పునరుత్పత్తికి సంబంధించినదిది. ప్రకృతినీ, సహజ వనరులనూ, తమ సొంత జీవితాలనూ ఉపశ్రేణులకు చెందిన జనసమూహాలు దర్శించే తీరుకూ– సృజనాత్మకంగా వాటికి సంబంధించిన నమ్మకాల రాశిని నిర్దేశించుకునే రీతికీ సంబంధించినదే జానపద మతం! ప్రకృతికీ, సమాజానికీ మధ్య శాఖోపశా ఖలుగా అల్లుకున్న సంబంధాల గురించి ఇది తెలియచేస్తుంది. ప్రకృతికీ, సమాజాని కి సంబంధించిన భావనల తాలూకు క్లిష్టమైన కూర్పు, ఇందులో మనకు కనిపించవచ్చు. సమాజంలోనూ, ప్రకృతిలోనూ ఉప శ్రేణులుగా తమ ఉనికిలోనే ఈ "జీవితానికి సంబంధించిన క్రియాశీలక దృక్పథం" పాదుకొనివుంది. అలా జరగడంలోనే, ప్రత్యామ్నాయ ఆధిపత్య సంస్క ృతులకు అది పునాదిగా మారుతోంది. ఈ ప్రత్యామ్నాయ ఆధిపత్య సంస్కృతులు రూపొందకపోతే సామాన్య జనాభిప్రాయంతో లౌకిక–సోషలిస్టు ప్రత్యామ్నాయాలకు సమన్వయం రూపుదిద్దుకోజాలదు!

## సామాన్యుల మతం - అనేక ఉపశ్రేణుల మతం

ఉపశ్రేణులు అనేకరూపాల్లో – స్త్రీలూ, రైతులూ, కార్మికులూ, మధ్యతరగతి వగైరా రూపాల్లో ఉంటాయన్నాడు గ్రాంసీ. దళితులూ, ఆదివాసులూ, నల్లజాతి ప్రజలను ఈ ఉపశ్రేణుల్లో చేర్చడం గ్రాంసీ స్ఫూర్తికి విరుద్ధమనిపించుకోబోదు. "ప్రతి మతమూ, వాస్తవానికి, పరస్పరం భిన్నమైన తరచూ విరుద్ధమైన– మతాల కూర్పుగానే వుంటుంది. ఇది క్యాథలిక్ మతానికి సైతం వర్తిస్తుంది. నిజానికి ఈ సూత్రీకరణ ప్రత్యేకించి క్యాథలిక్ మతం విషయంలో మరింత వాస్తవం! విభిన్న జాతీయ చర్చ్ వ్యవస్థలుగా చీలిపోకుండా నామమాత్రంగానైనా ఒకే

అంతర్జాతీయ మతంగా కనబడే నిమిత్తం- కెథాలిసిజం పడరాని పాట్లు పడుతోంది! మధ్య తరగతి కెథాలిసిజం వేరుగా, నగరాల్లో పనిచేసే కార్మికుల కెథాలిసిజం వేరుగా, మహిళల కెథాలిసిజం వేరుగా, మేధావుల కెథాలిసిజం వేరుగా - పరస్పరం భిన్నంగానూ, ఏ సంబంధమూ లేకుండానూ - మనుగడ సాగిస్తున్నాయని గ్రాంసీ ఏనాడో చెప్పాడు.

## సామాన్యుల మతాన్ని ప్రభావితం చెయ్యవచ్చు గానీ - నిర్మూలించడం అసాధ్యం !

జానపదులు-మేధావుల జంటకూ, కార్యాచరణ-అధికారం అనే జంటకూ మధ్య ఉండే సంబంధాన్ని గుర్తించాల్సిన అవసరం వుంది. సామాన్య, జానపదుల మతం అధికార సంబంధాల చేత నియంత్రితమ వుతుంది. ఆ సంబంధాలను పాలక వర్గాలూ-మరీ ముఖ్యంగా, మేధావుల మతాలూ- నియంత్రిస్తాయి. అలా, బాహ్యశక్తుల చేత, ముందు ముందు జరిగే మేధాభివృద్ధి చేత జానపదుల మతం ప్రభావితమవుతుంది. నైతిక, మేధాసాధనాల ద్వారా జానపదుల మతం అభివృద్ధి చెందకుండా బయటినుంచి అరికట్టేందుకు ఆధిపత్యంలో వున్న వర్గం ప్రయత్నిస్తుంది. దీంతో, ఉన్నత నైతిక ప్రాతిపదికనూ, తాత్విక వృద్ధినీ జానపదుల మతం సాధించ లేదు. ఫలితంగా, జానపదుల మతానికీ, మేధావుల మతానికీ మధ్య ఐక్యత కేవలం బయటి పొరల్లోనూ-పైపై పొరల్లోనూ మాత్రమే సాధ్యమవుతుందే తప్ప ఆంతరికమైన- వాస్తవి కమైన ఐక్యత మాత్రం ఎన్నటికీ సాధ్యం కాదు. ఆధిపత్యం ఎంత విస్తృతంగా ప్రయత్నించినప్పటికీ, ఉపశ్రేణుల్లో జానపద మతం ఉనికి తొలగించజాలదు! ఆధిపత్య స్థితి నెలకొనివున్నంత కాలం ఉపశ్రేణుల్లో జానపద మతం ఉనికి బలపడుతూ నేవుంటుంది!! సామాన్య-జానపద మతం పునఃపునః పుడుతూ-పెరుగుతూ ఉండడమే ఆధిపత్యం యొక్క అవసరంగా ఉన్నంతకాలం, దాన్ని నిర్మూలించడమూ సాధ్యంకాదు!! గ్రాంసీ రూపొందించి, ప్రతిపాదించిన రాజకీయ సిద్ధాంతాలో ఇది మరొకటి.

## ఠాగూరు - వామపక్ష విమర్శ

సామాన్య-జానపదుల మతం అధ్యయన రంగంలో ఠాగూరు చేసిన కృషిని, గ్రాంసీ మార్గదర్శక సూత్రాల పరిధిలో పరిశీలిం చవలసివుంది. గ్రాంసీ పరిశోధన పద్ధతిని అర్థం చేసుకోవడం లో ఠాగూరు రచన మన సామర్థ్యాన్ని ఏమన్నా పెంచుతుందా? కనీసం పరిశోధన రంగంలో గ్రాంసీ అంచనాలతో ఠాగూరు పరిశోధన సరితూగుతుందా? లేక, సామాన్య-జానపద మతం అధ్యయన రంగంలో టాగూరు కృషి, గ్రాంసీ కృషి కన్నా వెనకబడివుందా? లేదా, టాగూరు పరిశోధన ఈ మూడు ఫలితాలనూ పాక్షికంగా సాధించిందా? అన్న విషయాన్ని పరిశీలిద్దాం. ఠాగూరు ప్రతిపాదించిన సామాన్య-జానపదుల మతం గురించి వ్యాఖ్యానించే సందర్భంగా, వామపక్ష మేధా వులు వ్యక్తం చేసిన మేధోపరమైన లోటుపాట్లను మనం ముందుగా పరిశీలించవలసివుంది. సామాన్య-జానపదుల మతం గురించి, బెంగాల్ విభజనకు ముందూ-ఆ తర్వాతా కూడా దళితుల జీవనం గురించి ఠాగూరు చేసిన రచనలను ఠాగూరు సాహిత్య అధ్యయనశీలురు గానీ, ఆయన జీవిత చరిత్రల రచయితలు గానీ తగినంతగా పట్టించుకోలేదు!

సబ్యసాచి భట్టాచార్య రచించిన ఠాగూరు జీవిత చరిత్రలో 'బావుల్ సంస్కృతి' గురించిన ప్రస్తావనలు ఉన్నాయి కానీ, సామాన్య - జానపదుల మతం గురించీ, నామశూద్రుల గురించీ టాగూరు చేసిన రచనలపై విస్తృత చర్చ కనిపించక పోవడంతో ఆశ్చర్యపోయాను! భట్టాచార్య రూపొందించిన ఠాగూరు మేధోజీవిత చరిత్రలో, మతం గురించి ఠాగూరు అభిప్రాయాలకే ప్రత్యేకంగా ఓ అధ్యాయం కేటాయించిన మాట నిజమే- కానీ, ఆ పుస్తకంలో ఎక్కడా నామశూద్రుల ప్రస్తావన కనించదు!! ఇది టాగూరు స్ఫూర్తికి భిన్నమయిందని చెప్పక తప్పదు. అలాగే, నామశూద్రుల గురించి స్వతంత్రంగా ఓ పుస్తకమే రాసిన శేఖర్ బంద్యోపాధ్యాయ్ తన రచనలో ఎక్కడా -"హృదయ-జీవిత ధర్మాల సరిహద్దుల్లో వికసించిన"- బావుల్ సంస్కృతి అభివృద్ధిలో నామశూద్రులు చూపించిన చొరవ గురించి ప్రస్తావించకపోవడం మరో విడ్డూరం!! అలాగే, హిందూమతంలోని ఛాందసవాదులు దళితులను విగ్రహారాధనకు అనుమతించకుండా నిరోధించడాన్ని నామశూద్రులు నిరసించా రనే విషయం ఈ పుస్తకంలో స్థానం దక్కించుకోలేకపోయింది. కాగా ఈ అంశం గురించి, ఠాగూరు తన రచనల్లో చర్చించడం గమనార్హం. మతం గురించి ఠాగూరు చేసిన రచనల్లో, పేర్కొన్న ఓ వాస్తవాన్ని శేఖర్ బంద్యోపాధ్యాయ్ తన రచనలో ఎక్కడా మాటమాత్రంగానైనా ప్రస్తావించలేదు. నామశూద్రుల్లో బావుల్ సంస్కృతి, గీతాలు, సంగీతం ప్రాచుర్యాన్ని సంపాదించుకోగలిగా యన్నదే టాగూరు పేర్కొన్న వాస్తవం. 1872-1947 మధ్య కాలంలో బెంగాల్లో ప్రాచుర్యం కలిగివున్న మతం గురించి టాగూరు చెప్పిన విషయాలను శేఖర్ బంద్యోపాధ్యాయ్ రాసిన టాగూరు జీవిత చరిత్ర ఎక్కడా ప్రస్తావించనే లేదు!

బావుల్ సంస్కృతి గురించి ఒకప్పుడు బెంగాల్ అంతటా అత్యంత విస్తృతంగా ప్రాచుర్యంలో వుండిన బావుల్ ధార్మిక ధోరణి గురించి ఉమా దాస్‌గుప్తా రాసిన టాగూరు జీవిత చరిత్రలో ఎక్కడా ప్రస్తావనే కనిపించదు! అయితే, మత సంస్కరణల గురించి టాగూరు ప్రతిపాదనలపై ఏకపక్షంగానే

చేసినప్పటికీ - దాస్‌గుప్తా తన రచనలో అద్భుతమైన చర్చ చేసిన విషయం వాస్తవం. బావుల్ గురించిన టాగూరు ప్రతిపాదనలపై చర్చకు పునః ప్రాణం పోసే భారం, జ్ఞాన్ ఓపెన్హా భుజాలపై పడింది. బావుల్ సంస్కృతి గురించిన టాగూరు ఆదర్శాలపై ఆమె చక్కని చర్చ చేశారు. నిజమే కానీ, టాగూరు రచనలను ఓపెన్ లోతుగా అధ్యయనం చేయలేదన్నదీ వాస్తవమే!! కడుపులో చల్ల కదలకుండా కాలం గడిపే మధ్య తరగతి భద్రజీవులు - భద్ర లోకం - బావుల్ సంస్కృతి గురించి ఏర్పర్చుకుని, వ్యాపింపచేసిన కథనాల చట్రం నుంచి టాగూరు బయటపడ్డారని, సబ్యసాచి భట్టాచార్య మాదిరిగానే, ఓపెన్ షా కూడా వ్యాఖ్యానించారు. వాళ్ళిద్దరూ చర్చించని విషయం ఒకటుంది - కోల్‌కతాలోని మధ్యతరగతి భద్రజీవులకు వ్యతిరేకంగా మాత్రమే కాకుండా, గ్రామీణ కులవాదానికి నిరసనగా కూడా నామశూద్రులు భావప్రకటన చేశారనే విషయాన్ని వాళ్లు చర్చించనేలేదు. హిందూ మత చట్రం ఆమోదం పొంది వుండిన - మతాంతర్గత ఆధిపత్యంలో భాగమైన- కుల పెత్తనానికి నిరసనగా ఆ కాలంలో సాగిన ధిక్కార ధోరణిగా బావుల్ సంస్కృతి గురించి ఈ రచయితలు స్పష్టంగా చర్చించ లేదు. ఆ నేపథ్యంలో పట్టణ-గ్రామీణ నాగరికతల మధ్య వైరం అనే యుగళ వైరుధ్యంలో భాగంగానే టాగూరు వ్యక్తం చేసిన నిరసనను ఈ రచయితలిద్దరూ పరిగణించారు. అయితే, వాళ్ళ రచన తాలూకు ఉద్దేశం అదేననడానికి వీల్లేదు! అది వాళ్ళ వాదనల వల్ల సాధ్యమయ్యే ఫలితం మాత్రమేనని చెప్పాలి. భట్టాచార్యతో పోలిస్తే ఓపెన్ షా చేసిన చర్చ మరింత విస్తృతంగా సాగిందని అనక తప్పదు. 1931 నాటి టాగూరు రచన గురించి ఆమె ప్రస్తావించిన మాట నిజమే కానీ, నామ శూద్రుల ఉద్యమం గురించిన ప్రస్తావన కూడా ఆమె చెయ్యలేదన్నదీ వాస్తవమే మరి!

## 'మానవ మతం' - టాగూరు పాఠం

1931 నాటి టాగూరు రచన 'మానవ మతం' పాఠం గురించిన చర్చతోనే మన విశ్లేషణను మొదలుపెట్టడం భావ్యంగా వుంటుంది. ముఖ్యంగా, టాగూరు-సేన్ పాఠంగా పేర్కొనే భాగాన్ని పరిశీలించడంతో మన చర్చ ప్రారంభిద్దాం. ఇది పూర్తిగా టాగూరు ఒక్కడి రచనే కాదు - మొదటి అనుబంధంగా వున్న వ్యాసాన్ని కె.సి. సేన్ -విడిగా- రచించారు. ఆయన అనుమతితో, ఆ వ్యాసాన్ని తన రచనకు అనుబంధంగా చేర్చుకున్నారు టాగూరు. తన రచనే, ఆ పుస్తకంలో ప్రధానభాగం అయినప్పటికీ, టాగూరు తనను 'సహ రచయిత'గానే పేర్కొన్నారు. అంచేత ఈ పుస్తకాన్ని, 'టాగూరు-సేన్ పాఠం'గా పేర్కొనడమే భావ్యం. మూడు దశాబ్దాల సృజనాత్మక జీవనంలో భాగంగా టాగూరు కవిగా, కథకుడిగా, నాటక రచయితగా, గీత రచయితగా, సంగీతకర్తగా, చింతన శీలిగా, సమాజ సంస్కర్తగా, పెయింటర్‌గా కూడా రాణించిన బహుముఖ ప్రజ్ఞావంతుడు. సామాన్య ప్రజల్లో ప్రచురంగా విస్తరించివున్న మతం గురించి టాగూరు విస్తృతంగా రాశారు. దాన్నే గ్రాంసీ "ప్రజల మతం" అన్న సంగతి మనకు తెలుసు.

టాగూరు-సేన్ పాఠం బావుల్ సంస్కృతి గురించీ, నామశూద్రుల గురించీ, ప్రజల్లో ప్రచురంగా విస్తరించివున్న మతం గురించీ సంక్లిష్టమైన వ్యాఖ్యానం మనముందుంచిందని నా అభిప్రాయం. నామశూద్రుల్లో అత్యధికులు పడవలు నడిపే బోయలు, కొద్దిమంది రైతులు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న పశ్చిమ బెంగాల్లోని అనేక జిల్లాల్లో నామశూద్రులు ఎక్కువగా కనిపిస్తారు. ఆయా జిల్లాల జనాభాలో నామశూద్రుల వాటా మూడు నుంచి ఎనిమిది శాతంగా వుంటుంది. 1905లో, బెంగాల్ విభజన అనంతరం, పెద్ద సంఖ్యలో నామశూద్రులు భారతదేశంలోకి వలస వచ్చేశారు. ఒడిశాలోని దండకారణ్య అటవీ ప్రాంతాల్లో వాళ్ళలో అత్యధికులు స్థిరపడ్డారు. అయితే, ఇప్పటికీ నామశూద్రులనేకులు బంగ్లాదేశ్‌లో కనిపిస్తూ ఉంటారు. ఆ దేశంలో నామశూద్రుల సంఖ్యాపరమైన ప్రాధాన్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అలాగే, వాళ్ళు విభిన్న మతబృందాల్లో చేరివుండడమూ కనిపిస్తుంది. బావుల్ కళాకారులు వేర్వేరు కులాలకు చెందిన వారై వుండడంకద్దు. ఎక్కువ మంది నిమ్న కులాలకు చెందిన వారు కావడం కనిపిస్తుంది. బెంగాల్లోని రెండు భాగాల్లోనూ ఈ బావుల్ కళాకారులు, కలగలిసిన మతబృందాల వారై వుండడమూ కనిపిస్తుంది. బావుల్ కళాకారుల్లో గురుశిష్య పరంపర కనిపిస్తుంది. కానీ, ప్రత్యేకించి వారికంటూ ఓ విద్యావ్యవస్థ-అధ్యయన రీతి లాంటివి మాత్రం లేవు. అటు సంసార్లలోనూ, ఇటు సన్యసించిన వారిలోనూ కూడా బావుల్ కళాకారులు ఉంటారు. వాళ్ళలో చాలామంది కవులూ-గాయకులూ సంగీతకర్తలూ అయివుండి, సామాన్యుల్లో తమ ఆదర్శాలను వ్యాపింపచేస్తూ వుంటారు. నిమ్న జాతుల్లో, ముఖ్యంగా నామశూద్రుల్లో, బావుల్ కళాకారులకు అధిక ప్రాచుర్యం దక్కుతూవుంటుంది. పట్టణాల్లో నివసించే మధ్యతరగతి భద్రజీవుల్లో బావుల్ కళాకారుల పట్ల వ్యతిరేకత కనిపిస్తూ వుంటుంది. బావుల్ కళాకారులను, ఈ భద్రజీవులు పిచ్చివారిగా పరిగణిస్తూ వుంటారు. "నేనో పిచ్చి బావుల్ని!" అనేది బెంగాల్లో ఎగతాళిగా అనుకునే మాట! అయితే, బావుల్ కళాకారులు తక్కువేం తినలేదు- పట్టణాల్లో కేంద్రీకృతం అయివున్న మధ్యతరగతి భద్రజీవుల సంస్కృతినీ, జీవనసరళినీ వాళ్ళు విమర్శిస్తూ వుంటారు. మధ్యతరగతి భద్రజీవులు నివసించే ఒకే ఒక్క ప్రాంతంలో బావుల్ కళను సంస్కార సహితమైన ఆదర్శాలకు ఆలవాలంగా చూస్తారని

ఓపెన్ రాసిన మాట నిజం! ఆ ప్రాంతమే 'శాంతినికేతన్'. ఠాగూరు కృషి పుణ్యమా అని బావుల్ కళకు ఆ గౌరవం అక్కడైనా దక్కిందని ఓపెన్ అన్నమాట మరింత వాస్తవం!!

బ్రాహ్మణీయ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్నో నిరసన ఉద్యమాలను–పందొమ్మిదో శతాబ్దిలోనూ, ఆ తర్వాతా కూడా – ఒకదాని వెంట మరొకటిగా నడిపించారు నామశూద్రులు. హిందూ ఆలయాల్లో అందరికీ సమానమైన అవకాశాలు కల్పించాలనే నినాదం మొదలుకుని, విగ్రహారాధనకూ, వ్యక్తి లక్షణాలు కలిగిన దేవుడనే భావనకూ వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ఉద్యమాల వరకూ ఎన్నింటికో నామశూద్రులు నాయకత్వం వహించారు. అయితే, వ్యక్తిగత లక్షణాలు కలిగిన దైవాన్ని నామశూద్రులు వ్యతిరేకించిన సందర్భంలో కూడా వేదాల్లో చెప్పిన వ్యక్తిమాత్రుడు కాని దైవభావనను వాళ్ళు సమర్థించడం గమనార్హం. ఆ దైవం గుళ్ళూ గోపురాల్లో కాక, మనుషుల మనసుల్లోనూ హృదయాల్లోనూ ఉంటాడని వైదికార్యులు భావించారంటారు. దైవం నివసించేది మనుషుల దేహాల్లోనేనని టాగూరు వివరిస్తారు. కులమతాల భేదాలతో నిమిత్తం లేకుండా, మనుషులు సాటి వారిపై ప్రేమాభిమానాలు కురిపిస్తే, ఏ అర్చకుడి మధ్యవర్తిత్వమూ అక్కర్లేకుండానే, ఈ దైవంతో సునాయాసంగా మమేకం కావచ్చునని వేదకాలం నాటి మనుషులు భావించారు. పందొమ్మిదో శతాబ్దిలో, బెంగాల్లో, ఆవిర్భవించిన బావుల్ సంస్కృతికి అమరిన చారిత్రక నేపథ్యం ఇదీ! నామశూద్రుల్లో వ్యక్తమయిన ఈ ప్రసిద్ధ ధోరణిని ఠాగూరు చక్కగా సిద్ధాంతీకరించారు. కానీ, నామశూద్రులూ–బావుల్ కళాకారుల్లో వ్యక్తమైన అనేక ఇతర పోకడలను ఆయన పట్టించుకున్నట్లు లేరు. ఈ పోకడలు ఆలయాలు కేంద్రంగా ఉండే అర్చన వ్యవస్థలో అందరికీ సమానంగా అవకాశం దక్కాలని వాదించాయి!

టాగూరు స్థితిమంతులైన బ్రహ్మ సామాజికుల కుటుంబంలో పుట్టినవాడు. ఆయనకు ఆ సిద్ధాంతాలు సుపరిచితాలు. అందుకే, బావుల్ సంస్కృతిలో అటువంటి ధోరణులు – వ్యక్తిమాత్రుడు కాని దైవభావన లాంటివి – కనిపించగానే ఆయన పసిగట్టగలిగారు. ఠాగూరు తాత ద్వారకానాథ్ టాగూరు కాలం నుంచీ, వాళ్ళ కుటుంబానికి బ్రహ్మసమాజ భావాలు సుపరిచితమే. బ్రహ్మసామాజికులు దైవాన్ని వ్యక్తిమాత్రంగా పరిగణించరు. ప్రతి ఒక్కరి దేహంలోనూ ఆత్మలోనూ దేవుడంటాడన్నది వాళ్ళ నమ్మకం. బావుల్ కళాకారులు గీత సంగీతాల్లోనూ అలాంటి తాత్వికభావాలే వ్యక్తం కావడాన్ని టాగూరు గుర్తించగలి గారు. అంతకుమించి బ్రహ్మ సామాజికులకు ఉండే భావజాల పరమైన అడ్డంకులను–అన్నింటినీ కాకున్నా కొన్నింటినైనా – ఆయన అధిగమించగలిగారు. సమకాలీన బ్రహ్మ సామాజికులకు భిన్నంగా, నామశూద్రులు తమ బావుల్ గీత సంగీతాల్లో కులవాదాన్ని విమర్శించడాన్ని టాగూరు గుర్తించారు. నాటి–నేటి బ్రహ్మ సామాజికులు హిందూ మతోన్మాదాన్ని బలపరచడం తెలిసిన విషయమే! బాబరీ మసీదు కూల్చివేతను దక్షిణ కలకత్తాలోని మధ్యతరగతి బ్రహ్మ సామాజికులు బాహాటంగా సమర్థించారని శిబాజీ బందోపాధ్యాయ అనే మిత్రుడు – 1996లో నాకో లేఖ రాస్తూ– వెల్లడించారు. అటు పెరియార్ 'సమధర్మం' (మతంలో అందరూ సమానులే!) అనే భావనగా పిలిచినదాన్నీ, ఇటు గాంధీజీ 'సర్వమత సమభావం' (అన్నిమతాలూ సమానమే!) అనేభావనగా పిలిచినదాన్నీ కూడా బావుల్ సంస్కృతి బోధించింది. ఈ రెండు లౌకికవాద సిద్ధాంతాలూ మన రాజ్యాంగానికి పునాదిరాళ్ళుగా మారాయి!

బావుల్ కళాకారుల పాటల్లో టాగూరు తాత్వికతను చూశారు. గుడి–గోపురాలు, దేవుడు, ప్రకృతి, కులాల నిచ్చెనమెట్లు, మానవత్వం, స్వ–పర అస్తిత్వాలు, తదితరాలను తాత్వికాంశాలుగా ఠాగూరు గుర్తించారు. సొంత అస్తిత్వం – సామాజిక అస్తిత్వాల సంయోగం, ప్రాకృతిక – సొంత అస్తిత్వాల సంయోగం, దేవుడు – మనిషి అనే అస్తిత్వాల సంయోగం లాంటి అద్వైత వేదాంత భావనలను బావుల్ సంస్కృతికి చెందిన గీత సంగీతాల్లో ఆయన గుర్తించగలిగారు. మేధో స్థాయిలో అద్వైత వేదాంతం సాధించిన దాన్ని మామూలు మనుషులస్థాయిలో బావుల్ సంస్కృతి సాధించింది. సొంత – సామాజిక అస్తిత్వాల మధ్య వైరం, ప్రాకృతిక – సొంత అస్తిత్వాల మధ్య వైరం, దేవుడు – మనిషి అనే అస్తిత్వాల మధ్య వైరం లాంటి ద్వంద్వాల నుంచి సామాన్యుణ్ణి బావుల్ సంస్కృతి విముక్తి చేసిందని టాగూరు భావించారు. ప్రతి మని షిలోనూ దైవం వుందనీ, దైవకృపకు పాత్రమయ్యే నిమిత్తం ప్రతిమనిషినీ గౌరవించమనీ, బావుల్ సంస్కృతి చెప్తుంది. ప్రతి మనిషికీ, దైవం దృష్టిలో ప్రాధాన్యం వుందన్నది బావుల్ సంస్కృతి భావన. "ప్రజావాణి దైవవాణి" అన్న రూసోతో బావుల్ సంస్కృతి నూటికి నూరుపాళ్ళూ ఏకీభవిస్తుందనిపిస్తుంది!

"ప్రతి ఒక్కడి 'అంతస్సు' లోనూ దైవం వుంది", "ప్రకృతి ఒడిలోనే వ్యక్తిగత అస్తిత్వం ఉంది", "అటు సొంత అస్తిత్వమూ–ఇటు ప్రకృతి పరస్పర ప్రగతికి సాధనాలు. అవి రెండూ కలిసి పనిచేయకపోతే రెండూ అభివృద్ధి చెందలేవు!" అనేవి బావుల్ సంస్కృతి భావనలు. కానీ, భారతీయ–బెంగాలీ–మధ్యతరగతి భద్రజీవుల జ్ఞానయుగ భావన ప్రకారం, "ప్రకృతి మానవ ప్రగతికి ఉపయోగపడే సాధనం" మాత్రమే. ప్రకృతిని ఇలా ఓ పరికరంగా మాత్రమే భావించే వాదంపై బావుల్ సంస్కృతి తిరుగుబాటు ప్రకటించింది. మనలో ప్రతి ఒక్కరం

ప్రకృతి మంచిచెడ్డలను చూసుకోవలసి ఉందన్న బాధ్యతా యుతమైన భావాన్ని ఈ వాదం దూరం చేస్తున్నదని బావుల్ సంస్కృతి భావన. బావుల్ సంస్కృతికి కట్టుబడివున్నవాళ్ళు – కులమత భేదాలకు అతీతమైన– గురుశిష్య పరంపరను పాటి స్తారు. బావుల్ గురువు నామశూద్రుడై వుండొచ్చు– అతగాడి శిష్యుడు ఓబీసీ కులానికి చెందిన తెలికల కులానికి చెందిన వాడో, వద్లాబత్తుల కులానికి చెందినవాడో అయివుండొచ్చు లేదా అటుది ఇటైనా కావచ్చు! అయితే, బావుల్ సంస్కృతి కులమత భేదాల అడ్డుగోడలను అధిగమించి వుండొచ్చు కానీ, ఆ క్రమంలో మహిళలకు పాత్రలేదని ఓపెన్షా వాదన!

బావుల్ సంస్కృతి స్వభావరీత్యా పురుష సంస్కృతి. ఠాగూరు బావుల్ సంస్కృతి పట్ల ఎంత ప్రేమాభిమానాలు ఒలకబోసినా ఆ సంస్కృతిని పాటించేవారు స్త్రీ పురుషుల మధ్య అడ్డుగోడలను అధిగమించేలా చెయ్యలేకపోయారన్నది ఓపెన్ షా విమర్శ. దాని మాటెలావున్నా, బావుల్ సంస్కృతిని పాటించేవారు, సంక్లిష్ట మైన రుగ్వేద సందేశాన్ని సామాన్య ప్రజలకు చేరవేయగలిగిం దని ఠాగూరు గుర్తించగలిగారు. ఒక రంగంలో సామాజిక సమానత్వమనే భావన అమల్లోకి వచ్చిన తర్వాత, అది స్త్రీ పురుషుల మధ్య సమానత్వంలాంటి అన్ని రంగాలకూ క్రమంగా పాకడం కాలగతిలో ముందో వెనకో జరిగిపోతుంది. గీత సంగీతాల ద్వారా బావుల్ కళాకారులు తాత్విక భావనలను సామాన్యులకు చేరవేయగలిగారన్న వాస్తవం తెలిసివుంటే గ్రాంసీ ఎంతో సంతోషించేవాడు. ఆధిపత్యం – ప్రత్యాధిపత్యం అనే క్రమాల్లో ఏదో ఒకదానిలో భాగంగా, సామాన్యులకు గొప్ప తాత్విక భావనలను గీత సంగీతాల ద్వారా చేరవేయడానికి మించిన చారిత్రక లక్ష్యం వేరే లేదనే గ్రాంసీ భావించి వుండేవాడు. ఆధిపత్య భావనకున్న బలం గురించి గ్రాంసీ అంతగా నొక్కిచెప్పారు మరి! అంతకుమించి, బావుల్ కళాకారుల గురించి తెలుసుకుని, వారిలోని ప్రత్యాధిపత్య భావనల గురించి అధ్యయనం చేసే విషయంలో ఠాగూరు పెట్టిన కృషిని గ్రాంసీ కచ్చితంగా ప్రశంసించి వుండేవారు.

జానపదుల మతాలను గురించీ, గ్రామీణ సమాజాల గురించీ ఠాగూరు ప్రకటించిన ప్రేమాభిమానాలకున్న బలాబలాల గురించి రెండు ముక్కలు చెప్పాల్సి వుంది. రాజకీయ స్వాతంత్ర్యం గురించి చెప్పుకుని సంబరపడిపోవడాన్ని ఠాగూరు తిరస్కరించారు. రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే మన నాగరికత అభివృద్ధికి సమగ్రమైన ప్రోత్సాహం కలిగించలేదనే ఆయన భావించారు. భారతదేశం ఆత్మిక–ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం కూడా సాధించవలసివుందని ఠాగూరు భావించారు. స్వరాజ్యం అనే భావన ద్వారా రగుల్కొనే రాజకీయ స్వాతంత్ర్యానికి మాత్రమే కాక, దేశం నీతి–నిజాయితీలనే విలువలకు సైతం కట్టుబడి వుండాలని ఆయన నమ్మారు. ఈ విషయం వింటే, సామాజిక స్వాతంత్ర్యంకన్నా మించి, రాజకీయ స్వాతంత్రానికి అధికతర ప్రాముఖ్యమిచ్చినందుకు అంబేడ్కర్ గాంధీని–కాంగ్రెస్‌ను విమర్శించడం గుర్తుకు రావాలి. అంబేడ్కర్ సామాజిక స్వాతంత్ర్యం అన్న దాన్నే, ఠాగూరు ఆత్మిక–ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం అన్నారు. ఆ రకంగా ఆత్మిక–ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం కావాలని నినదించడం ద్వారానూ, జాతివాదం పట్ల బావుల్ సంస్కృతిలో వ్యక్తమైన ధిక్కారం గురించి విశ్లేషించడం ద్వారా కూడా ఠాగూరు, అంబేడ్కరు చెప్పిన సామాజిక స్వాతంత్ర్యానికి చేరువయ్యారని చెప్పాలి. భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యం గురించి సాగించిన శోధననూ, మన నాగరికత మూలాలనూ విశ్లేషణాత్మకంగా గుర్తించడానికీ ఒక రకమైన సాహసం, నిజాయితీ, కట్టుబాటూ అవసరం! ప్రస్తుతం దేశంలో సాగుతున్న అంబేడ్కరైట్ ఉద్యమ నేపథ్యంలో చూస్తే, ఆత్మిక–ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం గురించి ఠాగూరు ఇరవయ్యో శతాబ్ది మూడో దశకంలో చేసిన శోధన ప్రాధాన్యం పెరుగుతోంది.

మరో విషయం ఏమిటంటే– టాగూరు చర్చించింది మానవ ధర్మం లేదా మానవాళి మతం గురించి. బావుల్ సంస్కృతిలో హృదయాన్నీ – జీవితాన్నీ ముడివేసే మతభావనలు ఉన్నాయని ఠాగూరు గుర్తించారు. అయితే, ఆయన తను గుర్తించిన భావనలను చూసుకుని మురిసిపోయి, ముగ్ధులైపోయారు. మేధావులకు ఎంతమాత్రం పనికి రానిది ఆత్మ ముగ్ధత్వం! ఠాగూరు, తాను చెయ్యరాని పనే చేశారు! మనిషినీ–దేవుణ్ణి ఒకే తాటిన ముడివేసే బావుల్ సంస్కృతి నామశూద్రుల్లో ప్రచురమైన ధోరణిగా పాతుకునివుంది. అదే రోజుల్లో వారిలో మరో ధోరణి – 1870 దశకం నుంచీ బెంగాల్లో వ్యాపిస్తూవుండిన దళితుల దేవాలయ ప్రవేశం కోసం ఉద్యమించే ధోరణి– కూడా వేరుతన్నుకుంటోంది. ఈ ధోరణి గురించి టాగూరు పల్లెత్తి పలకలేదు! ఈ పోకడ మనలో ఓ భావం కలిగిస్తుంది– టాగూరులోని బ్రహ్మ సమాజ భావుకత, ఆయన్ని బావుల్ సంస్కృతిలోని వ్యక్తి మాత్రుడు కాని దైవభావన దిశగా ఆకర్షితులను చేసినట్లుంది. అదే నామశూద్రుల్లో సమాంతరంగా వ్యాపిస్తూ వుండిన సమధర్మ భావనను టాగూరు గుర్తించలేక పోయారు. మానవారోపితమైన దైవ భావన విషయంలో కూడా అందరికీ సమానమైన అవకాశం వుండాలన్నది దళితుల దేవాలయ ప్రవేశ నినాదం సారం. ధర్మ నిరపేక్షత అనే లౌకికవాదంలో అటు రూపనామాలు లేని దైవ భావనకూ, ఇటు అన్నీ వున్న దేవతామూర్తులకూ కూడా స్థానం వుంది. గాంధీ–నెహ్రూలు ఇద్దరూ తమ ప్రజాజీవితంలో ఇటువంటి

ఉదారవాదాన్నే అవలంబించారు. వ్యక్తిగత విశ్వాసాల విషయానికి వస్తే, వాళ్ళిద్దరూ నామరూపాలూ, రాగ ద్వేషాలున్న దైవభావనను అంగీకరించరు. అయినప్పటికీ, ఇతరులకు ఉన్న ఇటువంటి విశ్వాసాలను వాళ్ళిద్దరూ గౌరవించేవారు. ఈ విషయంలో గాంధీ-నెహ్రూ ఠాగూరు భావాలను అధిగమించి ముందుకువెళ్ళారు. అదేవిధంగా, విశాల మత విశ్వాసాల విషయానికి వచ్చేసరికి ఇద్దరూ కూడా, ఏ రాజకీయ అసహనానికీ తావివ్వకుండా సామాన్య ప్రజల మత విశ్వాసాలనూ, మతపరమైన వ్యవహార జ్ఞానాన్నీ ఆదరించారు.

నామరూపాలూ రాగద్వేషాలూ లేని దైవ భావనను ఠాగూరు ఆదరించారు. కానీ, అలా చెయ్యగలగడం లౌకిక రాజకీయవాదుల శక్తికి మించినది! ఇంతకు ముందు అనుకున్నట్లుగా, ఠాగూరు బ్రహ్మ సమాజం బోధించే దృక్పథానికి ఎన్నడో దూరమయ్యారు. భారతీయ లౌకికవాదానికి సంబంధించినంత వరకూ, ఠాగూరు చింతన, తాత్విక దృక్పథం ఎప్పటికీ ప్రాముఖ్యం వహిస్తూనే వుంటాయి. ❑

(Tagore, Folk - religion and Subaltrns: Potentialities for Indian Secularism - by Arun K Patnaik)

---

## గ్రాంసీ మాటల్లో..




- పాత ప్రపంచం అంతరిస్తోంది. కొత్త ప్రపంచం అవతారమెత్తడానికి గింజుకుంటోంది. ఈ అసుర సంధ్య దశ రాక్షసులకు అనువయింది !

- జరిగిపోయే పరిణామాలన్నీ, ఏదో కొంతమంది కోరుకున్నదానికి అనుగుణంగా సంభవించినవి కావు. అత్యధిక సంఖ్యాకులయిన పౌరులు తమ విధులను నిర్వర్తించకుండా, నిర్లిప్తంగా వుండిపోయినందు వల్లనే ఇవన్నీ సాధ్యమయ్యాయి!!

- నూతన సంస్కృతి కోసం జరిగే పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాల్సిందే! నూతన జీవిత దర్శనంతో గాఢంగా ముడిపడి వున్న నూతన నైతిక జీవనం కోసం జరిగే పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాల్సిందే! ఈ నూతన సంస్కృతి, ఈ నూతన నైతిక జీవనం వాస్తవాన్ని గ్రహించే - అనుభూతిగా మలచుకునే ప్రక్రియగా మారేంత వరకూ మనం ఆ పోరాటానికి మద్దతివ్వాల్సిందే!!

- నిజం చెప్పడాన్ని మించిన విప్లవాత్మకత వేరేదీ లేదు!!

- తల గోడకేసి బాదుకుంటే, కచ్చితంగా బద్దలయ్యేది మన తలే. గోడ ఎన్నటికీ బద్దలవదు!!

- పెద్ద మనిషి అంటే మర్యాద పూర్వకమైన ప్రవర్తన తెలిసిన వాడు మాత్రమే కాదు! తన ఆలోచనల తూకం తప్పకుండా నియంత్రించు కోగలిగిన వాడూ, తను జీవించే సమాజం తాలూకు విస్తృత ప్రయోజనాలకోసం తన స్వార్థ ప్రయోజనాలను స్వచ్ఛందంగా వదులుకోగలిగేవాడూ మాత్రమే పెద్దమనిషి అని పించుకోగలడు!

- ప్రతి మనిషి ఎంతో కొంత మేధావే! కానీ, సమాజంలో మేధావులు నిర్వర్తించాల్సిన విధులనూ కర్తవ్యాలనూ ప్రతి మనిషి నిర్వర్తించలేడు!

- ఆధునిక మానవుడు భ్రమలతోనూ జీవించకూడదు - నిస్పృహ చెందనూ కూడదు. అదే ఆధునికత మన ముందుంచే సవాలు!!

- రాజ్యాధికారాన్ని గెల్చుకోవడానికి ముందే ప్రతి సామాజిక బృందమూ, నాయకత్వ లక్షణాలను లవర్చుకుని తీరాలిబీ వాస్తవానికి ఇది రాజ్యాధికారాన్ని గెల్చుకోవడానికి ఒక ప్రధానమయిన షరతు కూడాను! అధికారం చెలాయించే దశలో ఈ లక్షణమే ప్రాముఖ్యం వహిస్తుంది. అధికారాన్ని కట్టుదిట్టంగా చేతపట్టుకుంటూన్న దశలో సైతం ఈ బృందం మొత్తం సమాజానికి నాయకత్వం వహించి, ముందుకు నడిపించాలి!!

15. సంస్కారం అంటే ఏమిటని ఎవరయినా నన్నడిగితే నేనీ నిర్వచనం చెప్తానుః ఆలోచనలను లోతుగా మథించడంబీ ప్రాథమికమయిన భావనలను తెలుసుకునివుండడంబీ ఏ విషయాన్ని ఆలోచిస్తున్నప్పటికీ, కార్యకారణ సంబంధాలను ముడిపెట్టి ఆలోచించగలిగే అలవాటు అభ్యాసం చేసుకోవడంబీ ఏ కార్యాచ రణలో ఉన్నప్పటికీ చక్కగా కర్తవ్యాన్నినిర్వర్తించడమే సంసాక్రం కలిగివుండడం అంటాన్నేను!

- ప్రతి రాజ్యమూ ఒక అర్థంలో నియంతృత్వమే!

# గ్రాంసీ జీవన చిత్రాలు - జ్ఞాపకాలు










# గ్రాంసీ జీవన చిత్రాలు - జ్ఞాపకాలు









# తెలుగులో గ్రాంసీ భావజాలం విస్తరించిన క్రమం





Dr.B.రమేష్‌చంద్రబాబు


**1926 నవంబర్ 8వ తేదీ రోమ్‌లో ఆంటోనియో గ్రాంసీని ఫాసిస్టు ప్రభుత్వం అరెస్టు చేసి 'ఈ మెదడును 20 సంవత్సరాలపాటు పనిచేయనియ్యరాదని" కోర్టులో వాదించింది. అనేక ప్రత్యేక చట్టాలతో న్యాయస్థానం 20 సంవత్సరాల నాలుగు నెలల ఐదు రోజులు జైలు శిక్ష విధించింది. తరువాత పదేళ్లపాటు జైలులో శారీరక, మానసిక బాధలను అనుభవిస్తూ 1937 ఏప్రిల్ 27న మెదడులో రక్తస్రావం వలన గ్రాంసీ మరణించాడు.**


గ్రాంసి మేదస్సు పనిచేయనేకూడదని భావించిన పరిస్థితుల్లో కూడా క్రియాశీలంగా పనిచేస్తూనే ఉంది. జైలులో ఆంటోనియో గ్రాంసి తన ఆలోచనలను 32 నోట్‌బుక్స్‌గా నిక్షిప్తం చేశాడు. అవే 'ప్రిజన్ నోట్స్'గా ఇప్పుడు ప్రాచుర్యంలో వున్నాయి. తొలుత ఇటలీ భాషలోనే ప్రచురితం కావడంతో గ్రాంసీకి అంతర్జాతీయంగా గుర్తింపు రాలేదు. 1970 దశకంలో గ్రాంసీ జైలు నోట్ బుక్స్ ఇంగ్లీషు అనువాదం వచ్చిన తర్వాత ఆయన రచనలమీద ప్రపంచ వ్యాపితంగా చర్చ ప్రారంభమైంది. మార్క్సిస్టు భావజాలానికి కొంత విస్తృతిని, కొత్త కోణాలను, కొత్త చూపునీ ఇచ్చిన వానిగా గుర్తింపుపొందాడు. ఇప్పుడు ప్రపంచ మంతటా గ్రాంసీపై విస్తృత చర్చలు జరుగుతున్నప్పటికీ, భారత దేశంలో అంతంతమాత్రంగానే వుంది. అరుదుగా ఉపశ్రేణుల విశ్లేషణలలో మాత్రమే గ్రాంసీని ఉటంకిస్తున్నారు. దేశంలో ప్రధాన స్రవంతి రాజకీయ చర్చలలో గ్రాంసీ భావజాలానికి తగిన స్థానం నేటికీ దక్కడం లేదు.






గ్రాంసీ భావజాలంపై వెలువడిన పుస్తకాలు..

తెలుగు నేలకు గ్రాంసీ రాక మరింత ఆలస్యం అయింది. తొలుత గ్రాంసీని తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యడానికి రెండు చిన్న పుస్తకాలు 20 శతాబ్ది చివరిలో వచ్చాయి. కాని అవి గ్రాంసీని ఇక్కడ స్థిరపరచకుండానే కనుమరుగయ్యాయి. (సుశీ తారు రచించిన 'గ్రాంసి జీవితం – కృషి' హెచ్చార్కె అనువాదం-మరో పుస్తకం పొట్లూరి వెంకటేశ్వరరావు తెలుగు లోకి అనువాదం చేసిన ఆంటోనియో గ్రాంసీ జైలు రాతలు-మేధావులు, విద్య).

తణుకు స్టడీ సర్కిల్ చర్చలలో డివివియస్ వర్మ గారు పలు సందర్భాలలో గ్రాంసీని ప్రస్తావించడంతో ఆయన భావజాలాన్ని అధ్యయనం చెయ్యడం, ప్రచారంలోకి తేవడం అవసరమని మా బృందం భావించింది. దాని పర్యవసానంగా వర్మ గారి ఆహ్వానంతో 2019 ఏప్రిల్ 28వ తేదీన తణుకులో గ్రాంసీ భావజాలంపై మిత్రుల సమాలోచన సమావేశం జరిగింది (ఏప్రిల్ 27 గ్రాంసీ 82వ వర్ధంతి) ఈ సమావేశానికి గ్రాంసీని అధ్యయనం చేస్తున్న వారు, చేయాలనే ఆసక్తి గలవారు వచ్చారు. గ్రాంసీ రచనల అధ్యయనం ఆవశ్యకతను ఈ సమావేశం అందరిలోనూ కల్పించింది. ఈ సమావేశానికి



**2019 ఏప్రిల్ 28న తణుకులో గ్రాంసీ భావజాలంపై సమాలోచన తొలి సమావేశం**

వచ్చిన జెవి సత్యనారాయణ మూర్తి గారు విశాఖపట్నంలో గ్రాంసీ రచనలపై సమాలోచన సమావేశం నిర్వహించారు. గ్రాంసీ భావజాలం నేపథ్యంలో "ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు" పేరుతో డివివియస్ వర్మ రాసిన పుస్తకం 2020 సెప్టెంబరు 1వ తేదీన వెలువడింది. దానికి విశేష ఆదరణ ప్రచారం లభించింది. నెల తిరగకుండానే 2000


# దారి దీపం

## ఆర్థిక సహకారానికి విజ్ఞప్తి

- దారి దీపం పత్రికను ప్రారంభించి 6 సంచికలను విడుదల చేశాం. ఈ 7వ సంచికను 100 పేజీలతో ప్రత్యేక సంచికగా మీ ముందుకు తెస్తున్నాం.
- పత్రికను కోరిన వారికి, ఆసక్తిగల వారికి ఉచితంగా పోస్టులో పంపుతున్నాం. వార్షిక చందాలు, చందాదారులు లేని పత్రికగా నడుపుతున్నాం. ప్రస్తుత పరిస్థితులలో ఇలా పత్రికను నడపడం కష్టమని మాకు తెలుసు.
- సాధారణ సంచికకు కేవలం టైపింగు, ప్రింటింగు, పోస్టింగులకు రూ.30,000/ ఖర్చు వస్తుంది. ప్రత్యేక సంచికకు రూ.70,000 పెట్టాల్సి వస్తుంది. ఎలాంటి overhead ఛార్జీలు ఇందులో లేవు. వ్యాపారం, లాభాపేక్ష అణు మాత్రం లేదు.
- ప్రస్తుత దేశ పరిస్థితులలో తెలుగులో ఇలాంటి పత్రిక అవసరమని భావించి ఈ భారాన్ని తలకెత్తుకున్నాం. ఈ పత్రికకు చందా కడతామని, ఆర్థికంగా తోడ్పాటు ఇస్తామని కొందరు మిత్రులు తెలిపారు. మాకు అవసరమైనప్పుడు, మేము కోరినప్పుడు విరాళం పంపమని వారికి చెప్పాం. ఇప్పుడు దారి దీపం పత్రికకు మీ ఆర్థిక తోడ్పాటు అవసరం.
- మీరు, మీ మిత్రులు ఇవ్వగలిగినంత విరాళం ఇవ్వండి.
- మీరు నిర్వహిస్తున్న విద్య, వైద్య, వ్యాపార రంగాల సంస్థల పేరుతో అడ్వర్‌టైజ్ మెంట్లు రూపంలో తోడ్పాటు అందించండి.
- ఈ పత్రిక నిరాఘాటంగా కొనసాగడానికి మీ సహకారం అందిస్తారని ఆశిస్తున్నాం.

**మీ విరాళాలను ఈ అక్కౌంట్‌కు పంపండి**

Daari Deepam
Union Bank of India
Branch : TANUKU
A/C No: 0554 1101 0000 054
IFSC code: UBIN0805548

- మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495
- అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చేవారు పై నంబరును సంప్రదించండి.

- సంపాదక వర్గం :
**డీవీవీఎస్ వర్మ, కొప్పర్తి వెంకటరమణ మూర్తి, మందలపర్తి కిషోర్, డి.సోమసుందర్, డా॥ బి.రమేష్ చంద్రబాబు**



2021 మార్చిలో తణుకులో శ్రీ కలిదిండి భీమరాజు జయంతి సభ.. గ్రాంసీ భావజాల సమాలోచన గోష్టిని ప్రారంభిస్తున్న డీవీవీఎస్ వర్మ

కాపీలతో మలి ముద్రణ వెయ్యాల్సి వచ్చింది. జెవి సత్యనారాయణ మూర్తి గారి ప్రయత్నం ఫలితంగా సుశీ తారు పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించి తెలుగు పాఠకులకు గ్రాంసీ జీవితమూ-కృషిని అందుబాటులోకి తెచ్చింది.

తెలుగు పాఠకులకు గ్రాంసీ భావజాలంలోని పలు భావనలను పరిచయం చేయటానికి గ్రాంసి 130వ జయంతి సందర్భంగా మా సంపాదక బృందం సారథ్యంలో జాతీయ స్ఫూర్తి పత్రిక ప్రత్యేక సంచిక నవంబర్ 2020లో వెలువడింది. అన్ని వామపక్ష స్రవంతులకు చెందిన 17 మంది ప్రముఖ రచయితల వ్యాసాలతో 100 పేజీల ప్రత్యేక సంచిక రాష్ట్రంలో సంచలనం కలిగించింది. మార్క్సిస్టు మాసపత్రికకు ప్రస్తుతం సంపాదకులుగా వున్న ఎస్.వెంకట్రావు గారి స్వతంత్ర రచన 'మార్క్సిస్టు మేధావి-ఆంటోనియో గ్రాంసీ' పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ చేసిన ప్రచురణతో తెలుగులో మరో పుస్తకం అందుబాటులోకి వచ్చింది.

2021 మార్చిలో మేము తణుకులో శ్రీ కలిదిండి భీమరాజు గారి జయంతి సభలో గ్రాంసీ భావజాల సమాలోచనపై జరిగిన గోష్టులకు అనూహ్య స్పందన లభించింది. వివిధ జిల్లాల నుండి పలురంగాల ప్రముఖులు పాల్గొని చర్చలలో భాగస్వాములయ్యారు. తిరిగి 2023 మార్చి 19న తణుకులో జరిగిన కలిదిండి భీమరాజు జయంతి సభలో 'గ్రాంసీ భావజాలం వెలుగులో" భారతీయ ఫాసిజం ప్రత్యేకతలు - ప్రతిఘటన మార్గాలు" అనే అంశంపై చర్చా గోష్టులు జరిగాయి. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరుకావడమే కాదు దాదాపు 30 మంది చర్చలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవ తెలంగాణ, ప్రజాపక్షం దినపత్రికలలో, మార్క్సిస్టు, కమ్యూనిజం, వీక్షణం మాసపత్రికలలో, కొలిమి అంతర్జాల పత్రికలలో గ్రాంసీ భావజాలంపై వ్యాసాలు వస్తున్నాయి. ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ, నన్నయ యూనివర్సిటీల పొలిటికల్ సైన్స్‌లో రాజకీయ ఆలోచనాపరుల పాఠ్యాంశంలో గ్రాంసీ చోటు దక్కించుకున్నాడు. ఇప్పుడు తెలుగు గడ్డ మీద గ్రాంసీ భావజాలాన్ని సీరియస్‌గా అధ్యయనం చేస్తున్న వారి సంఖ్య, వ్యాసాలు రాస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇప్పుడు గ్రాంసీ 86వ వర్ధంతి సందర్భంగా దారిదీపం పత్రిక ప్రత్యేక సంచిక వెలువడుతోంది. తెలుగు నేల మీద గ్రాంసీ భావజాలం తొలి అడుగుల దశను దాటి నిస్సందేహంగా నడక ప్రారంభించింది. నిరంతర విస్తరణ క్రమంలో ముందుకు సాగుతున్నది.త్వరలోనే కొత్త తరహా ప్రజా ఉద్యమాలకు గ్రాంసీ భావజాలం దారి దీపం అవుతుందని ఆశిద్దాం. ❑




2023 మార్చి 19 తణుకులో కలిదిండి భీమరాజు జయంతి సభ. గ్రాంసీ భావజాలం నేపథ్యంగా భారతీయ ఫాసిజం ప్రత్యేకతలు - ప్రతిఘటన మార్గాలపై చర్చా గోష్టి

# ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు సాధించిన ప్రజా హెజమనీ



**డీవీవీఎస్ వర్మ**

స్వాతంత్ర్యం వచ్చే నాటికి ఆంధ్ర ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో భాగంగా వుండేది. 1952లో వయోజన ఓటింగ్ ప్రాతిపదికగా తొలి ఎన్నికలు జరిగాయి. ఆంధ్ర ప్రాంతానికి వున్న 140 అసెంబ్లీ స్థానాలలోనూ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసి 40 స్థానాలు పొందింది. కేవలం 60 స్థానాలకు మాత్రమే పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీ 41 స్థానాలను గెలిచింది. మిగిలిన స్థానాలను ఇతర పార్టీలు పంచుకున్నాయి. ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువ సీట్లు సాధించిన కమ్యూనిస్టు పార్టీ ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. ఈ అద్భుత విజయంపై రకరకాల విశ్లేషణలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీలో చీలికలు, అంతర్గత ముఠా తగాదాల వల్ల కమ్యూనిస్టు పార్టీ గెలిచిందన్నది ఒక విశ్లేషణ. మద్రాసు రాష్ట్రంలో భాగంగా వున్న తెలుగు ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా వేరు చేయాలన్న నినాదంతో




సాగిన ఉద్యమంలో కమ్యూనిస్టులు వహించిన ప్రముఖ పాత్ర వల్ల ప్రజల్లో కలిగిన ప్రాంతీయాభిమానం వారిని గెలిపించింది అన్నది మరో విశ్లేషణ. 1948–51 మధ్య కమ్యూనిస్టు పార్టీని నిషేధించి చాలా మంది కమ్యూనిస్టు నాయకులను కాల్చి చంపడంతో ప్రజలలో పెరిగిన సానుభూతి వారిని గెలిపించింది అన్నది ఇంకో విశ్లేషణ. కమ్యూనిస్టుల విజయాల వెనక ఈ అన్నింటి పాత్ర వుంది. అయితే వారు నిర్మించిన ప్రజాసంఘాలు సాగించిన బహుముఖ కార్యకలాపాలు ఒక ఉన్నత స్థితికి చేరి విజయాలను అందించగల శక్తిగా రూపొందింది. కమ్యూనిస్టులకు విజయాలను అందించిన ఈ అసాధారణ శక్తి రూపాన్ని ఎవరూ పసిగట్టలేకపోయారు. వారి విజయ రహస్యం ఈ అసాధారణ శక్తిలో దాగి వుంది. దానిని మనం ఆవిష్కరించుకోవాలి. దీనికి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నేపథ్యాన్ని, అది సాగించిన ఉద్యమాల ప్రత్యేకతలను విశ్లేషించుకోవాలి.

## ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నేపథ్యం

భారత కమ్యూనిస్టు పార్టీ 1925లోనే ఏర్పడింది. కాని ఆంధ్ర ప్రాంతంలో తొలి కమ్యూనిస్టు బృందం దాదాపు ఒక దశాబ్దం తర్వాత 1934లో ఏర్పడింది. అప్పటికి ఆంధ్ర ప్రాంతంలో వున్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలి. కాంగ్రెస్ సారథ్యంలో సాగుతున్న జాతీయోద్యమం తీరుతెన్నులపై చాలా మంది యువకులలో అసంతృప్తి వుంది. 1930 దశకంలో శాసనోల్లంఘనంలో జైలుకు వెళ్లిన యువకులకు అక్కడ విప్లవకారులతో పరిచయం వచ్చింది. వారి నుంచి పొందిన కమ్యూనిస్టు, సోషలిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. 1917లో సోవియట్ విప్లవం జరిగింది. దాని ప్రభావం ఆంధ్రప్రాంతంలో బాగా విస్తరించింది. ఆ విప్లవాన్ని శ్లాఘిస్తూ, పత్రికలలో అనేక వ్యాసాలు వచ్చాయి. ఈ విప్లవం సాధిస్తున్న విజయాలపైన, దోపిడీ వ్యవస్థ రద్దు ఫలితాలపైన, విద్య, ఆరోగ్యం అందరికీ అందిస్తున్న తీరుపైన, మహిళల సమానత్వం పైనా వ్యాసాలు వెలువడ్డాయి. లెనిన్ మీద,

కమ్యూనిస్టు భావజాలం మీద పుస్తకాల ప్రచురణ జరిగింది. ఈ విప్లవ ప్రభావం తెలుగు సాహిత్యం మీద విశేషంగా పడింది. మాలపల్లి నవల వచ్చింది. గోర్కీ అమ్మ నవల అనువాదం అందుబాటులోకి వచ్చింది. తెలుగు కవిత్వం కొత్త పుంతలు తొక్కింది. ఫ్యూడల్ భావజాలంపైనా, ఛందస్సుపైనా, గ్రాంధిక భాషపైన తిరుగుబాటు కవిత్వం ప్రారంభమైంది. 1934లోనే శ్రీశ్రీ మహా ప్రస్థానం గేయం యువతరాన్ని విశేషంగా ఆకట్టు కుంది. దీనికి తోడు ఈ ప్రాంతంలో జరిగిన సంఘ సంస్కరణో ద్యమాల ప్రభావం యువత మీద పడింది. వీరేశలింగం ప్రభృతులు సాగించిన సంఘ సంస్కరణ కార్యకలాపాలు స్త్రీ విద్యా వాప్తికి సాగించిన కృషితోపాటు మరోపక్క బ్రాహ్మణేతర తరగతుల ఆత్మగౌరవ పోరాటం, మత విశ్వాసాల మీద, మూఢనమ్మకాల మీద తిరుగుబాటు భావాలను పెంచింది. ప్రత్యామ్నాయ వివాహ పద్ధతులు పౌరోహిత్యాలు ఆచరణ రూపం ధరించాయి. దేశంలో నెలకొన్న ఆర్థిక మాంద్యం రైతుల, కూలీల, మధ్య తరగతి ప్రజల నిత్యజీవనాన్ని దిగజార్చింది. వారు వర్గసంఘాల వైపు, ఉద్యమాల వైపు అడుగులు వేసే స్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ రూపుదిద్దుకుంది. కమ్యూనిస్టులు జాతీయోద్యమంతోపాటు, ఈ సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సంస్కరణల ఉద్యమాల నేపథ్యం నుండి వచ్చారు. తొలితరం కమ్యూనిస్టులు ఈ స్రవంతుల మేలు కలయికకు ప్రతినిధులుగా వున్నారు. దేశభక్తులుగా, విప్లవ కారులుగా, సంఘసంస్కర్తలుగా సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతినిధులుగా వున్నారు. కమ్యూనిస్టు పార్టీ వివిధ ప్రజా సమూ హాల వర్గపరమైన పోరాటాలకే పరిమితం కాకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ఒక ప్రత్యేక తరహా ఉద్యమాలకు, ప్రజాసంఘాల నిర్మాణానికి ద్వారాలు తెరిచింది

## ఐక్యసంఘటన కాలంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ

1934లోనే ఆంధ్రప్రాంతంలో తొలి కమ్యూనిస్టు గ్రూపు ఏర్పడింది. అప్పటికి కమ్యూనిస్టు పార్టీపై నిషేధం వుంది. బహిరంగ కార్యకలాపాలకు అవకాశం లేదు. కమ్యూనిస్టు పార్టీ పేరు మీద కాకుండా ప్రజా సంఘాల రూపంలో కార్యకలాపాలు సాగించారు. కార్మిక సంఘాలను ఏర్పాటుచేశారు. కూలి రక్షణ సంఘాల పేరుతో కొన్ని పట్టణాలలో కార్యకలాపాలు నిర్వహించారు. 1936 నాటికి పరిస్థితి మారింది. కొమింటర్న్ సూచన మేరకు జాతీయోద్యమంలో భాగంగా పనిచేయాలన్న నిర్ణయాన్ని జాతీయ పార్టీ తీసుకుంది. అప్పటికే కాంగ్రెస్‌లో భాగంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. అదే సంవత్సరంలో ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తొలి మహాసభ కాకినాడలో జరిగింది. అప్పటికి 40 మంది పార్టీ సభ్యులున్నారు. 10 మంది ప్రతినిధులతో జరిగిన ఈ మహాసభ ఐక్య సంఘటనా మార్గాన్ని ఆమోదించింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీలో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరి పని చేయాలని నిర్ణయించింది. దీంతో బహిరంగంగా పనిచేసే అవకాశం వచ్చింది. కాంగ్రెస్ సంస్థను సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తిగా బలోపేతం చేయడానికి వివిధ వర్గాల ప్రజలను ప్రజా సంఘాల లో సంఘటిత పర్చే కార్యక్రమంతోపాటు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పేరుతో సోషలిజాన్ని ప్రచారం చేయడానికి అవకాశం వచ్చింది. కాంగ్రెస్‌లోని అతివాదులతోనూ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులతోనూ పని చెయ్యడం ద్వారా వచ్చిన సంబంధాలను కమ్యునిస్టు సిద్ధాంతాల వైపు మళ్లించడానికి వీలు కలిగింది.

## 1936-40 మధ్య కమ్యూనిస్టు పార్టీ విస్తరించిన తీరును రేఖామాత్రంగా క్రోడీకరించుకుందాం

1. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో భాగంగా కమ్యూనిస్టులకు బహిరంగంగా పనిచేసే అవకాశం వచ్చింది. సంస్థాగత నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించడం ద్వారా కాంగ్రెస్‌లో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జిల్లా స్థాయి, తాలూకా స్థాయి పదవులకు ఎంపికయ్యారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ సోషలిస్టుల పార్టీకి సుందరయ్య గారే ప్రధాన కార్యదర్శి అయ్యారు.
2. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తరపున నిర్వహించిన బహిరంగ సభలలో జాతీయ నాయకులు ప్రసంగాలతో ఉత్తేజితులైన యువకులు కమ్యూనిస్టు భావజాలంవైపు ఆకర్షితులయ్యారు. వీరికి రాజకీయ పాఠశాలలు నిర్వహించి సోషలిస్టు చైతన్యాన్ని కల్పించారు. కొత్తపట్నం తర్వాత మంతెనవారి పాలెంలో నిర్వహించిన పాఠశాలలకు హాజరైన వారంతా తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు.
3. కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న నవశక్తి పత్రిక, దాని ప్రచురణలు కమ్యూనిస్టు సాహిత్యాన్ని అందించటంలో కీలకపాత్ర వహించింది. రష్యన్ విప్లవ పైన, సోషలిస్టు వ్యవస్థ ఆవశ్యకతపైనా చేసిన ప్రచురణలు జాతీయోద్యమంలో పాల్గొంటున్న ఇతరులను కూడా ప్రభావితుల్నిచేశాయి.
4. జాతీయోద్యమాన్ని విస్తృతపరిచే లక్ష్యంలో భాగంగా వివిధ ప్రజాసంఘాల నిర్మాణం జరిగింది. కాంగ్రెస్‌లో అంతర్భాగంగానే AITUC AIKS తర్వాత AISF సంస్థలు ఏర్పడినా అవి కమ్యూనిస్టుల ప్రభావం కిందే పనిచేశాయి. జాతీయోద్యమ ప్రచారంతోపాటు, ఆయా తరగతుల వర్గ సమస్యలపై ప్రచారం ఆందోళనలు సాగించాయి. ఈ తరగతుల విముక్తి సోషలిస్టు సమాజం ఏర్పాటుతోనే జరుగుతుందన్న ప్రచారం జోడించబడింది. అంటరానితనంపైనా, మహిళా సమానత్వంపైనా, ప్రచారంతోపాటు, మత మూఢవిశ్వాసాలపైన, సాంఘిక దురాచారాలపైనా, ఫ్యూడల్ సంప్రదాయాలపైనా

ప్రచారాలను నిర్వహించారు.

5. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నిర్వహణలు, ప్రజాసంఘాల నిర్వహణలో ఐక్య సంఘటన సూత్రాలను పాటించి అందరితో నూ కలిసి పనిచెయ్యడం, తమ ప్రాబల్యంలో వున్న ప్రజాసంఘాలలో అందరికీ ప్రాతినిథ్యం కల్పించడం ద్వారా బలమైన ఐక్యప్రజా ఉద్యమాలకు పునాదులు వేశారు.

## స్వతంత్రంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ దశ

- 1940 దశకంలో కమ్యూనిస్టు పార్టీ రెండు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నది.
- 1939లో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. కమ్యూనిస్టులు యుద్ధవ్యతిరేక నినాదాన్ని తీసుకున్నారు. కాంగ్రెస్ యుద్ధ వ్యతిరేకతను ప్రకటించినా అచేతనంగా వుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని ప్రకటించాలని కమ్యూనిస్టులు డిమాండ్ చేశారు. యుద్ధవ్యతిరేక ప్రచారాన్ని సాగించారు.
- 1940లో సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని ఏర్పాటుచేశారు. బోస్ అనుయాయులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి వైదొలిగారు. కమ్యూనిస్టుల విస్తరణ గిట్టని మితవాద సోషలిస్టులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి కమ్యూనిస్టులను బహిష్కరించారు. అప్పటికి ఇంకా కమ్యూనిస్టుపార్టీపై నిషేధం కొనసాగుతూనే వుంది.
- మరోపక్క 1941లో ఫాసిస్టు హిట్లర్ రష్యాపై యుద్ధం ప్రకటించాడు. కమ్యూనిస్టు పార్టీ యుద్ధం వ్యతిరేక నినాదం సందిగ్ధంలో పడింది. ఫాసిజానికి వ్యతిరేకంగా సోషలిస్టు రాజ్యాన్ని కాపాడుకోవడం ప్రధానం అన్న భావనతో రష్యా సాగించే యుద్ధాన్ని 'ప్రజాయుద్ధం'గా ప్రకటించింది. రష్యా కూటమిలో వున్న బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడ చేస్తున్న యుద్ధ సన్నాహాలను బలపర్చాలని నిర్ణయించింది.
- ఇదే సమయంలో 1942లో కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ దానిని వ్యతిరేకించింది. ఈ ఉద్యమం ఫాసిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రభుత్వ యుద్ధ సన్నాహాలను బలహీనపరుస్తుందని భావించింది. దీంతో కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమం నుండి వేరుపడింది. కాంగ్రెస్‌లో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో భాగంగా సాగిన ఐక్య సంఘటనా దశ ముగిసింది. కమ్యూనిస్టు పార్టీ ఒంటరిగా తన కార్యకలాపాలను రహస్యంగా సాగించే స్థితి వచ్చింది.
- ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి కొందరు బోసు అనుయాయులు ఫార్వర్డ్ బ్లాక్‌గా, ఎం.ఎన్.రాయ్ అనుచరులు కొందరు వేరుపడ్డారు. ఆంధ్రలో మొత్తం మీద కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కమ్యూనిస్టు పార్టీగా రూపాంతరం చెందింది. ప్రజాసంఘాల నాయకత్వం కొద్ది మినహాయింపులతో కమ్యూనిస్టుల ప్రాబల్యం కిందికి వచ్చింది.
- 'ప్రజాయుద్ధం' నినాదంతో ప్రభుత్వ యుద్ధ సన్నాహాలకు సహకరించే విధానాన్ని చేపట్టడంతో 1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించారు. మరోపక్క క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలను ప్రభుత్వం అరెస్టు చేసి జైళ్ళలో పెట్టింది. కాంగ్రెస్ కార్యకలాపాలపై నిషేధాన్ని ప్రకటించింది.
- జాతీయోద్యమ వ్యతిరేకులుగా, బ్రిటిష్ ప్రభుత్వం అనుకూలురుగా రష్యా ఏజంట్లుగా కమ్యూనిస్టు పార్టీపై విద్వేష ప్రచారం సాగింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రంలో వివిధ ప్రజా సంఘాలను నిర్మించింది. 1942-46 మధ్య కాలంలో అది ఒక అసాధారణ శక్తిగా ఎదిగింది. దానికి వారు చేపట్టిన కార్యకలాపాలు, అనుసరించిన ఎత్తుగడలను లోతుగాఅధ్యయనం చెయ్యాలి.

## కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర కార్యకలాపాలు

- కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగిపోవడంతో 1942 నుండి రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ బహిరంగ కార్యక్రమాలు మొదలయ్యాయి. విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజాశక్తి వారపత్రిక తిరిగి వెలుగులోకి వచ్చింది. రాజకీయ, సాహిత్య పుస్తకాల ప్రచురణ మొదలైంది. రష్యా, చైనాలో పరిణామాలపైనా పుస్తకాలు వెలువడ్డాయి.
- 1943లో విజయవాడలో పార్టీ 3వ మహాసభ జరిగింది. పూర్వం కొన్ని వందల సంఖ్యలో వున్న పార్టీ సభ్యత్వం ఈ మహా సభ నాటికి 3,250కి పెరిగింది. 2000 కాపీలతో ప్రారంభమైన ప్రజాశక్తి 9,500 కాపీలకు చేరింది . 1900 గ్రామాలకు పంపిణీ జరిగేది. పార్టీ పిలుపుమేరకు చాలామంది తమ ఆస్తులను అమ్మి విరాళంగా ఇచ్చారు.
- ఈ మహాసభ నాటికి 70,000 రైతు సంఘ సభ్యత్వం, 24000 ట్రేడ్ యూనియన్ సభ్యత్వం, 40,000 మంది యూత్లీగ్ సభ్యత్వం, 24,000 మంది వ్యవసాయ కార్మిక సంఘ సభ్యత్వం వున్నట్లు మహాసభ నివేదిక వెల్లడించింది.
- అంతర్జాతీయంగా ఫాసిజంపై పోరాటానికి ప్రభుత్వ యుద్ధ సన్నాహాలకు తోడ్పాటునిస్తూనే కమ్యూనిస్టు పార్టీ కొన్ని కీలకమైన రాజకీయ డిమాండ్లను తన ప్రచార, ఆందోళనా కార్యక్రమాలలో భాగం చేసింది. జైళ్లలో వున్న కాంగ్రెస్ నాయకులను విడుదల చెయ్యాలని, దేశ ప్రజలంతా యుద్ధ ప్రయత్నాలకు సహకరించే విధంగా కాంగ్రెస్ లీగ్ - కమ్యూనిస్టులతో కూడిన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేసింది. పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో ఈ నినాదాలు ప్రముఖ స్థానం పొందాయి. ఈ నినాదాలు కమ్యూనిస్టులు జాతీయోద్యమానికి

వ్యతిరేకులు అన్న ప్రచారం ప్రజల మీద పెద్దగా ప్రభావం చూపకుండా నిరోధించగలిగాయి. ఈ కాలంలో కమ్యూనిస్టులు వివిధ ప్రజాసంఘాలలో పనిచేసిన తీరుని, అనుసరించిన ఎత్తుగడలను విశ్లేషించుకోవాలి. అప్పుడే కమ్యూనిస్టులు సాధించిన అసాధారణ ప్రజా ఉద్యమ విస్తరణ మనకి అవగతం అవుతుంది.

## ప్రజాసంఘాలలో కమ్యూనిస్టు పార్టీ

కార్మిక సంఘాలు 'ప్రజాయుద్ధం' నినాదం ప్రకారం కార్మిక సంఘాలు సమ్మెలను నివారించాలి. ఉత్పత్తిని పెంచాలి. దీనిని యధాతథంగా అమలు చేస్తే ఉన్న కార్మిక సంఘాలు కూడా దూరం అయ్యేవి. ప్రజాయుద్ధం నినాదాన్ని ప్రచారం చేస్తూనే కార్మికులు ఉత్పత్తిని పెంచాలంటే వారు ఇష్టపూర్వకంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కమ్యూనిస్టుపార్టీ డిమాండ్ చేసింది . కార్మికుల వేతనాలను 25 శాతం పెంచాలని, కరువు భత్యం పెంచాలని, పరిశ్రమలలో పని పరిస్థితుల మెరుగుకు కార్మికుల భాగస్వామ్యంతో కమిటీలు వెయ్యాలని, వారానికి 48 గంటల పనిని పాటించాలని, మహిళలకు సమానపనికి సమానవేతనం, ప్రసూతి సెలవులు ఇవ్వాలనే డిమాండ్లతో కార్మికులను సమీకరించింది. ప్రభుత్వం ఈ డిమాండ్ల పట్ల సానుకూలంగా వుండాలని డిమాండ్ చేసింది. ఉత్పత్తిని పెంచాలనే నినాదంతో కార్మికుల్ని యజమానులకు కట్టు బానిసల్ని చెయ్యకుండా ఆ నినాదాన్ని కార్మికుల నిత్యజీవిత సమస్యల పరిష్కారంలోకమ్యూనిస్టులు భాగం చేశారు. కార్మికుల ఆకాంక్షలను పెంచి వారిని కార్మిక సంఘాలలోకి ఆకర్షించారు.

## కార్మిక సంఘాల పరిధిలో ఉపశ్రేణులు

ఆంధ్ర ప్రాంతంలో పారిశ్రామికరంగం అంతగా అభివృద్ధి చెందలేదు. పరిశ్రమలలో కార్మికసంఘాల ఏర్పాటుతోపాటు, ప్రభుత్వరంగ సంస్థలుగా వున్న రైల్వేలు, పోర్టులు, ప్రభుత్వ పాలనాశాఖలలో వున్న మున్సిపల్ కార్మికులను AITUC సంఘాలుగా సమీకరించారు. అలాగే కులం ప్రాతిపదికగా వున్న చేనేత, గీత కార్మికుల్ని వృత్తి సంఘాలుగా నిర్మించారు. యజమానులు లేకపోయినా కొన్ని హక్కులకోసం, పరస్పర సహకారం కోసం తోపుడుబళ్ల సంఘాలు తాపీ,టైలరింగ్ తదితర సంఘాలు నిర్మించారు. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవసాయేతర రంగంలో శ్రామికులందరినీ సమీకరించే వేదికగా AITUCకి విశాల ప్రాతిపదికను ఇచ్చారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం లో భాగంగా తొలి శ్రామిక విప్లవం సాధించిన రష్యా మీద, అక్కడ శ్రామికులు, మహిళల స్థితిగతుల మీద విస్తృత ప్రచారం చేశారు. శ్రామిక రాజ్యం ఏర్పాటుతోనే కార్మికవర్గ విముక్తి జరుగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రాత్రి పాఠశాలలు నిర్వహించారు. కార్మిక వర్గంలో వర్గ చైతన్యాన్ని పెద్దఎత్తున కల్పించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం

- 1942-46 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ గ్రామాలలో బలమైన వ్యవసాయ కార్మికసంఘాన్ని నిర్మించింది.
- రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పెరిగిన ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెంపుదలకు ఉద్యమాన్ని చేపట్టింది. వీలైనచోట్ల ఒప్పందాల ద్వారా కూలిరేట్లు పెంపును సాధించింది. గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో రైతు సంఘాలు వుండడం దీనికి దోహదం చేసింది. అలాంటి ఒప్పందాలు రానిచోట్ల సమ్మెలు నిర్వహించి పెంపుదల సాధించింది. దీనికితోడు పేదల కోసం చౌకధరల దుకాణాలు ఏర్పాటు చెయ్యాలనే ఉద్యమాన్ని చేపట్టింది.
- ప్రభుత్వం ఇచ్చిన ఆహారధాన్యాల అధికోత్పత్తి నినాదాన్ని ఆధారం చేసుకుని వ్యవసాయ కూలీలకు పేదరైతులకు ప్రభుత్వం బంజర్లను, జమీందారీ బంజర్లను పంపిణీ చెయ్యాలని ఆందోళన చేసింది. ప్రభుత్వ బంజర్ల పంపిణీని చాలచోట్ల సాధించింది. పేదల ఆకలియాత్రలు నిర్వహించింది. బ్లాక్ మార్కెట్‌లో అక్రమ నిల్వలను వెలికితీసి ప్రభుత్వ ధరలకు అమ్మించే కార్యక్రమాలు నిర్వహించింది.
- కాంగ్రెస్ వాదులు, షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వారు ఈ పేదలను సమీకరించే ప్రయత్నాలు చేశారు. కమ్యూనిస్టు పార్టీ దీనికి ప్రతిగా ఐక్యసంఘటన నినాదాన్ని ముందుకు తెచ్చింది. ఏ పార్టీకి చెందిన వారైనా ఆ పార్టీలోనే వుంటూ అందరి ప్రయోజనాల కోసం ఒకే కూలి సంఘంలో చేరి పనిచేయాలని ఇచ్చిన పిలుపు అందరినీ ఆకర్షించింది. కాంగ్రెస్ వాదులు, అంబేద్కరిస్టులు ఈ సంఘాలతో కలిసి పనిచేశారు.
- కమ్యూనిస్టు కార్యకర్తలు ఈ పేదల పేటలలో నివసించారు. కుల భేదం లేకుండా వారి ఇంటనే తిన్నారు. రాత్రి పాఠశాలలు నిర్వహించారు. చదువుతోపాటు రాజకీయాలు, సోషలిజంపై పాఠాలను చెప్పారు. కులభేదాలను వారు పాటించకపోగా ఈ కార్యకర్తల్లో చాలా మంది కులాంతర వివాహాలు చేసుకున్నారు. వాటిని ప్రోత్సహించారు. మత ఛాందసాల మీద, అణచివేత సాంప్రదాయాల మీద తిరుగుబాటు భావాలు నూరిపోశారు.
- వందలాది గ్రామాలలో వ్యవసాయ కూలిసంఘాలు ఏర్పడ్డాయి. గ్రామాలలో కులాల మధ్య నినాదాలను ఈ సంఘాలే పరిష్కరించేవి. పేదలు తమ కుటుంబ సమస్యల నుండి, కూలి సమస్యలు, పాలేర్ల సమస్యలు వగైరా అన్ని సమస్యల కు వ్యవసాయ కార్మికసంఘం తలుపుతట్టే పరిస్థితి వచ్చింది. గ్రామాలలో కులపెద్దల స్థానాన్ని వ్యవసాయ కార్మిక సంఘాలు ఆక్రమించాయి.

- 1944 విజయవాడలో జరిగిన అఖిలభారత రైతు మహాసభ బహిరంగ సభకు 15,000 మంది వ్యవసాయ కూలీలు వచ్చారు. మహాసభ నిర్వహణకు 4000 మంది వలంటీర్లు వుండగా అందులో 1000 మంది వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన వారున్నారు. ఇలా గ్రామాలలో ఏకైక సంఘంగా వ్యవసాయ కార్మికసంఘం రూపొందింది. గ్రామాలలో ఈ సంఘాలు కమ్యూనిస్టు పార్టీకి పెట్టని కోటలయ్యాయి.

## రైతు సంఘం

- కమ్యూనిస్టు పార్టీకి తొలిదశలో ఆకర్షితులైన వారిలో అత్యధికులు రైతు కుటుంబాల నుండి వచ్చారు. రైతు ఉద్యమం వారికి బాగా తెలిసిన కార్యరంగం అయింది.
- 1942లో పార్టీపై నిషేధం తొలగిన తర్వాత రైతు ఉద్యమం మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. అన్ని జిల్లాలలో, తాలూకాలలో రైతు సంఘాల నిర్మాణం చేశారు.
- యుద్ధకాలంలో ప్రభుత్వం 'ఆహార ధాన్యాల అధికోత్పత్తి' నినాదాన్ని ఇచ్చింది. దానిని కమ్యూనిస్టు పార్టీ తనదైన రీతిలో అందిపుచ్చుకుంది.
- ఆహార ధాన్యాల అధికోత్పత్తికి రైతులకు అందించాల్సిన ప్రోత్సాహకాలను రైతు ఉద్యమ డిమాండ్లుగా చేసింది. వ్యవసాయ రుణాలపై మారిటోరియం ప్రకటించాలని, రైతులకు రుణ సదుపాయం పెంచాలని, పంటలను గిట్టుబాటు ధరలకు ప్రభుత్వం కొనుగోలు చెయ్యాలని కోరుతూ రైతు ఉద్యమాలను సాగించింది. బ్లాక్ మార్కెట్లకు తరలిపోయే ఎరువులను పట్టుకుని కంట్రోలు ధరలకు అమ్మించింది
- మరో పక్క కమ్యూనిస్టులు జమీందారీలలో భూమి హక్కు కోసం రైతుల్ని సమీకరించారు. జమీందారులు తమ భూముల నుండి సాగు చేస్తున్న రైతులను వెళ్ళగొట్టే ప్రయత్నాలను ప్రత్యక్షంగా ప్రతిఘటించారు. దున్నేవానికి భూమి అన్న నినాదంతో రైతు సత్యాగ్రహాలు నిర్వహించారు. జమీందారీలలో వున్న బంజర్ల ఆక్రమణలకు వ్యవసాయ కూలీలను పేద రైతులను సమీకరించారు. జమీందారీ రద్దు పోరాటాన్ని విస్తృత పరిచారు.
- ఆహార ధాన్యాల అధికోత్పత్తిలో భాగంగా సాగునీటి వసతుల కోసం ఎక్కడికక్కడ కార్యాచరణ సాగించారు. చెరువుల పూడిక తీతల కోసం ఇరిగేషన్ కాలవల తవ్వకాల కోసం, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రైతులను సమీకరించి ఆందోళనలు చేశారు.
- కమ్యూనిస్టు పార్టీ సారధ్యంలో రైతు సంఘాల తరపున వివిధ జిల్లాలలో పంట కాలవల తవ్వకాలు సాగించారు. కమ్యూనిస్టు నాయకులు స్వయంగా ఈ కార్యక్రమాలలో పాల్గొని రైతు నాయకులుగా పేరు తెచ్చుకున్నారు.
- 1943 నాటికే రాష్ట్రంలో రైతు సంఘం సభ్యత్వం 70,000 దాటింది. 1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత కిసాన్ సభలో పాల్గొన్న 2 లక్షల మందిలో అత్యధికులు రైతులే పాల్గొన్నారు. ఈ రైతు ఉద్యమం కమ్యూనిస్టు పార్టీకి, ప్రజాసంఘాలకు చాలా మంది నాయకుల్ని అందించింది. రైతులను సమీకరించే ఏకైక సంస్థగా రైతు సంఘం ఆవిర్భవించింది.

## విద్యార్థి ఫెడరేషన్

- 1942-46 మధ్య కాలంలో విద్యార్థి ఫెడరేషన్ అత్యంత బలమైన విద్యార్థి సంఘంగా విస్తరించింది. విద్యార్థి ఉద్యమాన్ని విశాల ప్రాతిపదికపై అందరినీ కూడగట్టే ఉద్యమంగా నిర్వహించాలని తలపెట్టింది.
- యుద్ధ సన్నాహాలను బలపరుస్తూ, ఫాసిజం ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రచారం సాగిస్తూ, సోషలిస్టు రష్యాలోని సోషలిస్టు వ్యవస్థను ఆదర్శంగా ప్రకటిస్తూ విద్యార్థులలో ప్రచారం చేసింది. జైళ్లలో వున్న కాంగ్రెస్ నాయకులను విడుదల చెయ్యాలని, అన్ని పార్టీలతో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలన్న డిమాండ్లకు విస్తృత ప్రచారం కల్పించింది.
- విద్యార్థులను వారి తక్షణ సమస్యలపై సమీకరించి ఉద్యమాలు, స్థానిక ఆందోళనలు చేపట్టింది. విద్యా సంస్థలలో ఫీజులు తగ్గించాలని, గ్రంథాలయాలు, హాస్టలు సౌకర్యాలు కల్పించాలని, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లు చెయ్యాలని అన్నిచోట్ల విద్యార్థులతో ఆందోళనా కార్యక్రమాలు సాగించింది. విద్యార్థులకు తానే స్వయంగా ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు, వ్యాసరచన-వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఆకర్షించింది.
- విద్యార్థి ఫెడరేషన్ మహాసభలకు కమ్యూనిస్టులు కాని ప్రముఖులను, కవులను, రచయితలను ఆహ్వానించి దానికి ఒక ఉమ్మడి ఉద్యమరూపాన్ని ఇచ్చింది. ఫెడరేషన్ నాయకత్వంలో కమ్యూనిస్టులతోపాటు ఇతరులకు ప్రాధాన్యతనిచ్చి వారిని ఉద్యమంలో భాగస్వాములను చేసింది.
- చురుకైన విద్యార్థి కార్యకర్తలకు రాజకీయ పాఠశాలలు నిర్వహించి వారిని కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షించింది. ఈ కార్యకర్తలు అనేక గ్రామాలలో రాత్రి పాఠశాలలు నిర్వహించి, పేదలలో రాజకీయ చైతన్యానికి కృషి చేశారు.
- 1946 నాటికి రాష్ట్రంలో మొత్తం కాలేజీలు, హైస్కూళ్ల విద్యార్థులలో 25శాతం మంది ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. విద్యార్థులు పలు గ్రామాలకి, పలు వర్గాలకి చెందిన వారు కావడంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో విద్యార్థి ఉద్యమం కీలకపాత్ర పోషించింది.

## యూత్ లీగ్స్

- గ్రామాలలో పెడమార్గంలో వున్న యువతను నిర్మాణ కార్యక్రమాలలోకి రాజకీయ కార్యకలాపాలలోకి మళ్లించడానికి కమ్యూనిస్టు పార్టీ యూత్లీగ్స్ ఏర్పాటుకు పూనుకుంది.
- 1942లో గుంటూరులో యూత్ లీగ్స్ మహాసభ జరిపి దాని కార్యకలాపాలకు నిర్దిష్ట రూపం ఇచ్చింది.
- గ్రామాలలో యువతను ఆకర్షించడానికి ఆటలు, సాంస్కృతిక కార్యకలాపాలను చేపట్టింది. ప్రతిఏటా ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించింది. యువకుల మానసిక, శారీరక వికాసం పట్ల ఆసక్తిని పెంచింది. విజ్ఞాన యాత్రలు, విహార యాత్రలను నిర్వహించింది.
- గ్రామాలలో ప్రతి చిన్న పనికి ఎవరి మీదనో ఆధార పడకుండా యువకులను శ్రమదానం కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములను చేసింది.
- యూత్ లీగ్స్ ద్వారా గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. రాత్రి పాఠశాలలు నిర్వహించారు. వీటిద్వారా గ్రామస్థులలో రాజకీయ చైతన్యాన్ని, అక్షర జ్ఞానాన్ని పెంపొందించారు.
- ఈ యువజన సంఘాలు స్థానికంగా సంఘ సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ సంఘాల ద్వారా బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకున్నారు. కులాంతర వివాహాలు, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. స్త్రీ విద్యను, సమానత్వాన్ని ప్రచారం చేశారు. స్త్రీలను వివిధ కార్యక్రమాలలో భాగస్వాములను చేశారు.
- మూఢ విశ్వాసాలను, ఫ్యూడల్ సంప్రదాయాలను ప్రతిఘటించారు. ప్రజలను కళారూపాల ద్వారా చైతన్యపరిచారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాన్ని, సోషలిస్టు సమాజం ఆవశ్యకతనీ అన్ని కార్యకలాపాలలో జోడించారు.
- ఈ యువత సమాజంలోని వివిధ వర్గాలకు చెందినవారు కావడంతో గ్రామంలోని అన్ని తరగతులలోనూ కమ్యూనిస్టుల ప్రభావం విస్తరించింది.

## మహిళా సంఘాలు

- జనాభాలో సగభాగంగా వున్న మహిళలను సమీకరించి ప్రజా ఉద్యమాలలో భాగం చెయ్యకుండా రాజకీయ, సామాజిక మార్పులు సాధ్యం కాదని కమ్యూనిస్టు పార్టీ భావించింది. గ్రామాలలో ప్రధానంగా పట్టణాలలో మహిళా సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.
- మహిళల నిత్య జీవిత సమస్యల చుట్టూ వారిని సమీకరించే కార్యక్రమాలను రూపొందించింది. స్త్రీ ఆరోగ్యం, పిల్లల పెంపకం, ప్రసూతి కేంద్రాల ఏర్పాటు, పేదలకు రేషన్ కార్డులు, చౌకధరల దుకాణాలు, సమాన పనికి సమాన వేతనం, బాల్య వివాహాల రద్దు, వితంతు వివాహాలకు ప్రోత్సాహం వంటి అంశాలపై సాగించిన ప్రచారం మహిళలలో కొత్త ఆకాంక్షలను రేకెత్తించింది. గ్రంథాలయాలలో ఈ తరహా పుస్తకాలను మహిళలకు అందుబాటులోకి తెచ్చింది. ఝాన్సీ లక్ష్మీబాయి, ఫాసిస్టు వ్యతిరేక పోరాట యువతి టాన్యా జీవిత చరిత్రలను అందుబాటులోకి తెచ్చి తిరుగుబాటు భావాలను వారికి అందించింది.
- విశాఖ, కాకినాడలలో బాంబులు పడడంతో ఫాసిస్టు యుద్ధ ప్రమాదం అందరికీ తెలిసివచ్చింది. దేశం మీద ఫాసిస్టు దాడి జరిగితే మహిళల స్వీయ రక్షణ, ఆత్మగౌరవ పరిరక్షణ ఆవశ్యకతపై ఈ మహిళా సంఘాలు ద్వారా ప్రచారం చేశాయి. మహిళలకు 'స్వీయ రక్షణ శిక్షణ' శిబిరాలను నిర్వహించింది. ఇది వివిధ వర్గాల మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ శిక్షణలో స్వీయరక్షణ, మిలటరీ డ్రిల్లుతో పాటు ఫాసిస్టు ప్రమాదాన్ని, సోవియట్ మహిళలు సాధించుకున్న హక్కుల ప్రచారాన్ని కూడా భాగం చేశాయి
- ప్రజానాట్యమండలి ప్రదర్శనలలో పురుషులే స్త్రీ పాత్రలు ధరించే స్థితిని తొలగించి ఆ పాత్రలను స్త్రీలే ధరించే చైతన్యం వచ్చింది. మహిళల ప్రత్యేక బుర్రకథ దళాలు స్త్రీ సమస్యలతోపాటు రాజకీయ సమస్యలపై సాగించిన ప్రదర్శనలు ప్రజల్ని విశేషంగా ఆకర్షించాయి.
- ఆంధ్రప్రాంతంలో మహిళలను బహుముఖ రంగాలలో ఆకర్షించిన ఏకైక మహిళాసంఘం అయింది.
- 1945 నాటికి అన్ని జిల్లాలలో మహిళా సంఘాల కార్యకలాపాలు వందలాది గ్రామాలకు విస్తరించాయి. మహిళా సంఘం సభ్యత్వం 20,000 కు చేరింది.

## బాల సంఘాలు

- బాల బాలికలను చదువుపట్ల, ఆట పాటల పట్ల, ఆసక్తి కలిగించడానికి బాలసంఘాలు ఏర్పడ్డాయి. భరతమాత ముద్దు బిడ్డలం – బాల దళం సభ్యులం అంటూ దేశభక్తిని చిన్న వయసులోనే ఈ సంఘాలు అందించాయి. గ్రామ గ్రంథాలయాలలో పిల్లల పుస్తకాలు, సాహస గాథల పుస్తకాలు ఏర్పాటు చేశారు.
- పిల్లలకు ఆటల పోటీలు – పాటల పోటీలు నిర్వహించారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం, కరువు బాధితులకు సహాయ కార్యక్రమాలు, సాంఘిక దురాచారాలను వ్యతిరేకించే అంశాలతో బాల దళాల సాంస్కృతిక బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఈ బాలదళాల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేకించి బుర్రకథలు విశేషంగా ప్రజల్ని ఆకట్టుకున్నాయి.
- 1945 నాటికి ఆంధ్ర ప్రాంతంలో 1200 గ్రామాలలో 40,000 మంది బాల సంఘంలో సభ్యులయ్యారు.

## అభ్యుదయ రచయితల సంఘం

- 1943లో ఆంధ్ర రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభ తెనాలిలో జరిగింది. అప్పటికే తెలుగు సాహిత్యంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. అలాంటి రచయితలందరినీ సమీకరించి ఒక సంఘంగా వ్యవస్థాగత రూపం ఇచ్చింది ఈ మహాసభ. ఈ సంఘంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం వున్నప్పటికీ దానిని పార్టీయేతర సంఘంగా ఏర్పాటు చేసింది.
- అరసం ఆవిర్భావంతో తెలుగు సాహిత్యం స్వరూప, స్వభావాలు పూర్తిగా మారిపోయాయి. సమాజం కోసం రచనలు, ప్రజల భాషలో రచనలు, ప్రజా సమస్యలు ఇతివృత్తంగా రచనలు, ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదే సాహిత్య సృజన పెద్దఎత్తున సాగింది. వ్యావహారిక భాష, దానికి తగ్గ ఛందస్సు, ఇలా మొత్తం సాహిత్యం కొత్తరూపాన్ని పొందింది.
- సాహిత్య వర్క్ షాపులను నిర్వహించి యువ రచయితలను ఆకర్షించింది. వారికి రచనా పాటవాలతోపాటు రాజకీయ సైద్ధాంతిక అవగాహన కల్పించింది.
- అభ్యుదయ సాహిత్య ప్రచారానికి అభ్యుదయ, నగారా, తెలుగుతల్లి, అరుణరేఖ, సంధ్య, ఉదయిని వంటి అనేక పత్రికలను నిర్వహించారు.
- రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాసంఘాల కార్యకలాపాలకు ఉత్తేజం కలిగించే రచనలతో పాటు తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చే రచనలు వచ్చాయి.
- 1946 నాటికి అరసంలో 900 మంది రచయితలు సభ్యులుగా వున్నారు. తెలుగు సాహిత్యం మీద అరసం తిరుగులేని అధిపత్యాన్ని పొందింది.

## ప్రజా నాట్యమండలి

- ఆంధ్రప్రాంతంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల ద్వారా సాధించిన భావ విప్లవంలో అరసం, ప్రజా నాట్యమండలి కీలకపాత్ర పోషించాయి. ఫాసిస్టు వ్యతిరేక ప్రచార దళాలకు ప్రజల నుండి లభించిన విశేష ఆదరణ ప్రజానాట్యమండలి ఏర్పాటుకు ప్రేరణ అయింది.
- 1943లో ప్రజా నాట్యమండలి ఏర్పడింది. అంతవరకు పురాణగాథల చుట్టూ తిరుగుతున్న నాటక రంగాన్ని ప్రజా నాట్యమండలి ప్రజల బాట పట్టించింది. ప్రజల జీవిత సమస్యల చుట్టూ ప్రజల భాషలో సాగిన కళాప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజలకు మరింత చేరువ కావడానికి కనుమరుగౌతున్న జానపద కళారూపాలను వెలుగులోకి తెచ్చింది. వర్తమాన పరిస్థితులకు తగిన రచనలు చేసి ప్రదర్శించింది.
- వివిధ ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న ఉద్యమాలను ఇతి వృత్తంగా రూపొందించిన కళా ప్రదర్శనలు ఆయా వర్గాలను ఉత్తేజితుల్ని చేశాయి.
- తెలంగాణలో సాగుతున్న రైతాంగ పోరాటం, ఆంధ్ర ప్రాంతంలో జమీందారీ వ్యతిరేక పోరాటాలను నాటికలూ, పాటలు తదితర కళారూపాలద్వారా ప్రచారం చేశాయి. మూఢ నమ్మకాలను, అంధ విశ్వాసాలను ఎండగట్టే కళారూ పాలు, సంఘసంస్కరణను ప్రోత్సహించే ప్రదర్శనలతో ప్రజలను చైతన్య పరిచాయి.
- రాష్ట్రవ్యాపితంగా అనేక బుర్ర కథ దళాలు, నాటికల దళాలు జానపద కళారూపాలతో ప్రజలలో భావ విప్లవాన్ని సాధించే ప్రయత్నం చేశాయి అల్లూరి సీతారామరాజు కథ దేశభక్తిని రగిలిస్తే మాభూమి, ముందడుగు, కష్టజీవి ప్రదర్శనలు ఉద్యమ చైతన్యాన్ని పెంపొందించాయి. 1946 నాటికి పూర్తి కాలం పనిచేసే 21 ప్రజానాట్యమండలి కళాబృందాలు, పాక్షికంగా పనిచేసే 30 బృందాలు ప్రచార రంగంలో ఉన్నాయి.

## కమ్యూనిస్టు పార్టీ సాధించిన అసాధారణ శక్తి

- ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన అసాధారణ శక్తిని అవగాహన చేసుకోవడానికి వీలుగా అది నిర్మించిన ప్రజాసంఘాలు సాగించిన బహుముఖ కార్యక్రమాలపై ఇంతటి వివరణ అవసరమైంది.
- 1934-47 మధ్య కాలంలో ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరించిన క్రమంపై శ్రీ. ఐ.నర్సయ్య గారు మంచి పరిశోధన చేశారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలపై వందల పేజీల సమాచారాన్ని సేకరించారు. వాటి మూలాలను ఉటంకించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆయన పరిశోధనా పత్రానికి డాక్టరేట్ ఇచ్చింది.
- ఆయన తన పరిశోధనా పత్రం ముగింపులో 'ఆంధ్రా ప్రాంతంలో కొన్ని పొరపాట్లు చేసినప్పటికీ సంస్కరణ వాద రాజకీయాలకు పాల్పడినప్పటికీ అక్కడ కమ్యూనిస్టు పార్టీ విశాలమైన ప్రజాపునాదిగల పార్టీగా రూపొందగలిగింది. పీడిత ప్రజల నాయకత్వ స్థానానికి ఎదగగలిగింది. కార్మిక వర్గానికి తిరుగులేని నేతగా నిలువగలిగింది. విప్లవాత్మకమైన రైతు ఉద్యమాన్ని నిర్మించగలిగింది. సామాజిక న్యాయం లక్ష్యంగా పోరాడే బలమైన శక్తిగా నిలబడగలిగింది. ఆంధ్రా ప్రాంతంలో ఆధునిక ప్రగతిశీల సాంస్కృతిక పతాకధారిగా ముందుకు వచ్చింది. ఫలితంగా రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అసాధారణమైన బలం పుంజుకుని ప్రముఖ రాజకీయ శక్తిగా అవతరించింది. దేశంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు ఆలస్యంగా

జరిగినప్పటికీ ఆంధ్రా పార్టీ బలవత్తరమైన శక్తిగా ఆవిర్భవించింది. కాంగ్రెస్ నాయకత్వంలో సాగిన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనకూడదని నిర్ణయించినప్పటికీ ఆంధ్రాపార్టీ ఈ స్థితికి చేరుకోగలిగింది' అని పేర్కొన్నారు

- ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన 'అసాధారణ బలానికి' ఈ ముగింపు అద్దం పట్టింది. ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ 'అసాధారణ బలాన్ని పుంజుకుని' ప్రబల రాజకీయ శక్తిగా మారిన క్రమాన్ని అర్థం చేసుకోవడానికి గ్రాంసీ భావజాలం మనకి ఉపకరిస్తుంది. పౌరసమాజంలో ప్రత్యామ్నాయ రాజకీయం ఆధిపత్యం పొందే ప్రక్రియలను గ్రాంసీ ఆవిష్కరించారు. దీనికీ, ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన దానికీ ఉన్న పోలికలను సారూపత్యలను మనం విశ్లేషణ చేసుకోవాలి.

## 1. ఉపశ్రేణుల చారిత్రక సంఘటన :

పౌర సమాజం మీద ఆధిపత్యానికి ప్రయత్నించే మౌలిక వర్గం, ఇతర ఉపశ్రేణులను సమీకరించి ఒక ఉమ్మడి లక్ష్యం, ఉమ్మడి భావజాలంతో ఒక 'చారిత్రక సంఘటన' గా ఏర్పడడం అన్నది గ్రాంసీ రూపొందించిన ప్రత్యామ్నాయ హెజమనీ భావనలో ఒక కీలక అంశం. ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ అలాంటి చారిత్రక సంఘటనను రూపొందించింది. పారిశ్రామిక కార్మికులకే పరిమితం కాకుండా అన్ని శ్రామికవర్గ ఉపశ్రేణులని కార్మిక సంఘాలలో సంఘటితపరిచింది. గ్రామీణ వ్యవసాయ కూలీలను ప్రత్యేక సంఘంగా సమీకరించింది. పలు వర్గ సమూహాలుగా విద్యార్థి, యువజనులను, వివక్షకు వ్యతిరేకంగా మహిళలను సంఘాలలో సమీకరించింది. రైతులతో ఐక్య సంఘటనకు బదులు వారిని తానే ఒక ప్రజాసంఘంలో సమీకరించి ఈ ఉద్యమాలలో అంతర్భాగం చేసింది. కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రజా సంఘాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా నాయకత్వం వహించి ఒక ఉమ్మడి ఆకాంక్ష, ఉమ్మడి లక్ష్యం గల ప్రజా సంఘాల సమ్మేళనాన్ని సాధించింది.

## 2. సవర్గ మేధావులు

పౌర సమాజంలో ఆధిపత్యాన్ని ప్రోదిచేయ్యడంలో సవర్గ మేధావుల పాత్రను గ్రాంసీ ప్రత్యేకంగా పేర్కొన్నాడు. వీరు కేవలం సిద్ధాంత పండితులు కాదు, ప్రజల గుండె చప్పుళ్ళను పసిగట్టగలవారై ఉండాలి. అంటే ప్రజా జీవనంలో ఉద్యమాలలో మమేకం కాగలగాలి. అప్పుడే వీరు ఈ ఉపశ్రేణుల బృందాలకు ఉమ్మడి మేథో నాయకత్వాన్ని అందించగలగుతారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులే ఆ పాత్ర పోషించారు. అన్ని ప్రజా సంఘాలకు మేధోపరమైన నాయకత్వాన్ని అందించారు. వారు సాగించిన ప్రజా ఉద్యమాల నుండి సవర్గ మేధావులు పుట్టుకొచ్చారు మరోపక్క అభ్యుదయ రచయితలు ఇలాంటి పాత్ర పోషించారు. ప్రజా ఉద్యమాల నుండి స్ఫూర్తిని పొందారు. ప్రజా సమస్యలు, ఉద్యమాలు ఇతివృత్తాలుగా రచనలు చేశారు. వీరి రచనలు ఉద్యమానికి ప్రేరణ ఇస్తే ఉద్యమాలు వీరి రచనలకు ప్రేరణ అయ్యాయి. ఇలా ఉత్తమ ప్రజా మేధావులను కమ్యూనిస్టు పార్టీ రూపొందించుకుంది.

## 3.లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే భావ విప్లవం:

ప్రజల నిత్య జీవితాన్ని లోకజ్ఞానం నడిపిస్తుందని అది చాలా వైరుధ్యాలతో నిండి ఉంటుందని, దానిని విచక్షణా జ్ఞానంగా ప్రజా చైతన్యంగా మార్చే సాంస్కృతిక విప్లవం తప్పనిసరి అన్నది గ్రాంసీ ఆవిష్కరించిన మరో కీలకమైన భావన. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు వివిధ ప్రజా సంఘాలతో వారి దైనందిన సమస్యలపై పోరాడుతూ వర్గ చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. రాత్రి పాఠశాలలు, రాజకీయ సామాజిక సాంస్కృతిక చైతన్యానికి వేదికలుగా చేసుకున్నారు. మరోపక్క అభ్యుదయ రచయితల సంఘం తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల మీద తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది. ఆంధ్రా ప్రాంతంలో సాహిత్య, సాంస్కృతిక భావ విప్లవానికి పునాదిగా మారింది. మరోపక్క ప్రజా నాట్యమండలి పేదలు, సామాన్య ప్రజల హృదయాలను ఆకట్టుకుంది. జానపద కళారూపాల ద్వారా సాంఘిక దురాచారాలను, మతమూఢ విశ్వాసాలను, వివక్షనీ, అణిచివేతనీ ఎండగట్టింది. సామాజిక మార్పు ఆవశ్యకతని కళారూపాల ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే భావ విప్లవాన్ని సాధించడంలోఇవన్నీ ప్రముఖ పాత్ర పోషించాయి.

## 4. నైతిక రాజకీయ నాయత్వం :

పౌర సమాజంలో ప్రజా సమ్మతి ద్వారా పొందే ఆధిపత్య సాధనలో ప్రతిష్ట గల నైతిక రాజకీయ నాయకత్వ పాత్రను గ్రాంసీ నొక్కి వక్కాణించారు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి ప్రజా సంఘాలకు కమ్యూనిస్టులు అలాంటి నైతిక రాజకీయ నాయకత్వాన్ని అందించారు. వారి సాదా జీవన శైలి, త్యాగ నిరతి, ఉద్యమం కోసం తమ జీవితాలను, ఆస్తులను, చివరికి తమ ప్రాణాలను త్యాగం చేసిన తీరు ప్రజలలో నాయకత్వం పట్ల అచంచల విశ్వాసాన్ని కలిగించింది. వారు ఏక కాలంలో విప్లవకారులుగా, సంఘసంస్కర్తలుగా, కుల వివక్షను సాంఘిక దురాచారాలను ప్రతిఘటించే వారుగా, స్త్రీ సమానత్వాన్ని కాంక్షించే వారుగా కనిపించారు. ఇలాంటి ప్రతిష్టగల నాయకత్వం అన్ని వర్గాల ప్రజల మీద సానుకూల ప్రభావం కలిగించింది.

## 5. ప్రజా సమ్మతి ద్వారా ఆధిపత్యం :

పౌర సమాజం మీద ప్రజా సమ్మతి ద్వారా ఆధిపత్యం

సాధించాలనే వర్గం తమ సమూహాలకే కాకుండా అందరి ప్రయోజనాలను కాపాడే వారుగా భావించే స్థితిని తెచ్చు కోవాలని గ్రాంసీ సూచించాడు ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలందరి కాంక్షగా ఉన్న భాషా ప్రయుక్త రాష్ట్ర నినాదాన్ని తన ప్రచార ఆందోళనలో కీలకం చేసింది. దీంతో కమ్యూనిస్టు పార్టీ కేవలం తన ప్రజా సంఘాలకి పరిమితమైన శక్తిగానే కాకుండా రాష్ట్ర ప్రజలందరి ప్రయోజనాల కోసం పోరాడే ప్రజాశక్తిగా ఎదిగింది. స్థూలంగా గ్రాంసీ పౌర సమాజం మీద ఆధిపత్యానికి అవసరమైన కీలక అంశాలుగా పేర్కొన్న వాటిని ఆంధ్ర కమ్యూనిస్టులు ఆచరణలో పెట్టారు. పౌర సమాజంలో ఇలాంటి స్థితిని సాధించడాన్ని గ్రాంసీ, యుద్ధ సన్నాహంగా(వార్ ఆఫ్ పొజిషన్) విశ్లేషించాడు. ఈ యుద్ధ సన్నాహం జరిగితే దానికి విజయం సిద్ధించడం ఖాయం అని తీర్పు కూడా ఇచ్చాడు. దీనినే ఆయన ప్రత్యామ్నాయ హెజమనీ రూపంగా నామకరణం చేశాడు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు అలాంటి హెజమనీని సాధించారు. అయితే వారికి గ్రాంసీ తెలియదు. గ్రాంసీ రూపొందించిన హెజమనీ భావజాలం తెలియదు. గ్రాంసీ 1937లో జైలులోనే మరణించాడు. జైలులో ఆయన నోట్‌బుక్స్ రూపంలో ఇటాలియన్ భాషలో రాసిన భావజాలం 1970లో ఇంగ్లీషులో కొన్ని భాగాలు వెలువడే వరకూ ప్రపంచానికి ఆయన భావజాలం తెలియదు. కానీ గ్రాంసీ భావజాలాన్ని ప్రపంచంలోనే మొట్టమొదట ఆచరణలో పెట్టింది మాత్రం ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులే. ఇలా తమకు తెలియకుండానే గ్రాంసీ భావజాలాన్ని ఆచరణలో పెట్టిన వారిని గురించి గ్రాంసీ మీద గొప్ప పరిశోధనలు చేసిన స్టూవర్ట్ హాల్ రాస్తూ దీనికి 'సద్యోజనిత గ్రాంసీ యిజం' గా పేరు పెట్టాడు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు సాధించిన హెజమనీ కూడా సద్యోజనిత గ్రాంసీయిజం' గానే మనం భావించాలి. ఇక్కడ కమ్యూనిస్టులు పౌరసమాజం మీద సాధించిన హెజమనీ రూపు రేఖలు పలు రంగాలలో తొంగి చూడడం కనిపిస్తుంది. ఆంధ్ర ప్రాంతంలో గ్రామాలు 'రెడ్ విలేజెస్'గా పేరు తెచ్చుకున్నాయి. అంటే గ్రామం అంతా కమ్యూనిస్టులు, లేదా వారి ప్రజా సంఘాల ప్రభావంతో నడిచే వారే. కృష్ణా జిల్లాలో కాటూరు గ్రామాన్ని స్టాలిన్ గ్రాడ్ అని ఎలమర్రు గ్రామాన్ని లెనిన్ గ్రాడ్ అని, గుంటూరు జిల్లాల నర్సాయపాలెం గ్రామాన్ని మరో స్టాలిన్ గ్రాడ్ అని కారంచేడులో ఒక వీధిని మాస్కో వీధిగా పిలిచే స్థితి వారు సాధించిన హెజమనీకి చిహ్నాలు మాత్రమే. ఆ కాలంలో విద్యార్థులుగా ఉన్నవారు తాము విద్యార్థి ఫెడరేషన్లో పాల్గొన్నామని గర్వంగా చెప్పుకునేవారు. ప్రతి ఒక్కరూ తాము అభ్యుదయ రచయితలమేనని చెప్పుకోవడానికి తాము ఒక సామాజిక సమస్యపై చేసిన రచనను చూపించేవారు. యువజన సంఘాలలో, బాల సంఘాలలో తమ పిల్లలు చేరడాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించడం ఆ కాలం ప్రత్యేకత. కమ్యూనిస్టుకు తమ ఆడ పిల్లనిస్తే దాన్ని గౌరవంగా చూసుకుంటాడని భావించిన కాలమది. కమ్యూనిస్టులు సాధించిన హెజమనీకి ఇవి కొన్ని నిదర్శనాలు మాత్రమే హెజమనీ అన్నది విడి విడి ప్రజా సంఘాల శక్తి మాత్రమే కాదు. అది కొత్త రూపం ధరించిన ఉమ్మడి సామాజిక శక్తి. కమ్యూనిస్టులు అసాధారణ బలం పుంజుకోవడంలో ఉన్నది హెజమనీ రూపం ధరించిన ప్రత్యేక శక్తి. ఈ హెజమనీ కొనసాగుతున్న దశలో కమ్యూనిస్టులపై తీవ్ర నిర్బంధకాండ సాగింది. చాలా మందిని ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపింది. ఇవన్నీ ప్రజలలో సానుభూతిని మరింత పెంచాయి. 1952 ఎన్నికలలో కమ్యూనిస్టులకు అనూహ్య విజయాలు వచ్చాయి. సుందరయ్య గారు విప్లవ పథంలో నా ప్రయాణం అన్న పుస్తకంలో 'మేము రహస్యంగా వుండి అంచనాలు వేసుకున్నాం. ఆంధ్రాలో 20 నుండి 25 సీట్లు మనం గెలుస్తామని కానీ 40 సీట్లకు పైగా గెలిచాం. ఉదాహరణకు నెల్లూరు, కోవూరు సీట్లు గెలుస్తామని ఎప్పుడూ అనుకోలేదు. కానీ గెలిచాం. ప్రజల మనోభావాలు అలా వున్నాయి' అని అన్నారు. అంటే ప్రజల మనోభావాలు అంచనాలకు మించి ఉన్నాయి. అదీ కమ్యూనిస్టులు సాధించిన హెజమనీ శక్తి. 1952లో కమ్యూనిస్టులు సాధించిన ఘనవిజయాన్ని కట్టబెట్టింది పౌర సమాజంలో వారు సాధించిన హెజమనీయే. ఈ హెజమనీయే వారి అంచనాలకు అందని అనూహ్య ఫలితాలను అందించిన విజయ రహస్యం.

## చేజారిన ప్రజా హెజమనీ

1946 – 51 మధ్య కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ కొన్ని విప్లవ ప్రయోగాలు చేసింది. వారికి ముందుగా తెలిసిన మార్గం రష్యన్ తరహా తిరుగుబాటు. దీనికి పిలుపునిచ్చారు కానీ ఇది ప్రారంభంలోనే ముగిసిపోయింది. మనది వ్యవసాయ దేశం గనుక చైనా మార్గంలో తిరుగుబాటు అన్న నినాదాన్ని చేపట్టింది. అది కూడా 1951తోనే ఆగిపోయింది. వీటితో పాటు 1942–46 మధ్య కాలంలో సాగించిన కార్యకలాపాలు, జాతీయోద్యమం పట్ల అనుసరించిన వైఖరి అన్నీ పార్టీలో చర్చనీయాంశాలయ్యాయి. ఒకసారి హెజమనీ సాధిస్తే దాని ప్రభావం కొంతకాలం కొనసాగుతుంది. 1952 ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీని ఏకైక పెద్ద పార్టీగా గెలిపించిన పౌర సమాజంపై హెజమనీ 1955 ఎన్నికలలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కమ్యూనిస్టు పార్టీని నిలబెట్టింది. పౌరసమాజంలో హెజమనీ ఒకసారి సాధిస్తే అది శాశ్వతం కాదు. దానిని నిరంతరం కాపాడుకోవాలి. నిలబెట్టుకోవాలి. మారుతున్న పరిస్థితులకు తగినట్టు వివిధ వర్గాలలో కొత్త ఆకాంక్షలని, కొత్త పరిష్కారాలని, కొత్త నినాదాలనీ చేపట్టి తాము సాధించిన 'చారిత్రక సంఘటన' చెల్లాచెదురు కాకుండా చూసుకోవాలి. సాధించిన హెజమనీని **(మిగతా 70వ పేజీలో)**


# భారత వామపక్షాలు గ్రాంసీని ఎందుకు అధ్యయనం చేయాలి ?



కొండూరి వీరయ్య

**వర్తమాన భారత రాజకీయాలు ఓ మూల మలుపులో ఉన్నాయి. ప్రగతి నిరోధక శక్తులు, ప్రతీఘాత శక్తులతో జత కట్టిన పాలకవర్గం లౌకిక ప్రజాతంత్ర భారతాన్ని హిందూ రాష్ట్రగా మార్చేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్తుంది. ఈ సందర్భంగా భావల జాల రంగంలో కరుడుగట్టిన హైందవోన్మాద శక్తులు సంపూర్ణ ఆధిపత్య సాధన దిశగా అడుగులు వేస్తున్నాయి. గత శతాబ్ది కాలంగా పరిశీలిస్తే భావజాల రంగంలో మూడు ప్రధాన పోరాట స్రవంతులను మనం గమనించవచ్చు.**

మొదటిది స్వతంత్ర భారతదేశాన్ని ప్రజాతంత్ర భారతదేశంగా నిర్మించటం కోసం సాగిన పోరాటం. ఈ పోరాటానికి స్వాతంత్ర్య పోరాటంలో మలి దశ, రాజ్యాంగ పరిషత్ ప్రధాన వేదికలుగా ఉన్నాయి. ఈ స్రవంతికి నాయకత్వం వహించింది కాంగ్రెస్. కాంగ్రెస్ ఆధునికత అంతా యూరప్‌లో జరిగిన




రినైజాన్స్, రిఫర్మేషన్ ఉద్యమ ప్రభావం, పరిధికి లోబడే ఉన్నది. అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం ఉండటంతోపాటు దేశీయంగా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వేళ్లూనుకోవడానికి ఈ ప్రజాతంత్ర ఆధునికత అవసరం కావడంతో దేశ రాజకీయాలను ఓ మేరకు ప్రభావితం చేయగలిగింది. స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్ పేరుతో పాల్గొన్న శ్రేణులను జాగ్రత్తగా గమనిస్తే అనేక దొంతరలు కనిపిస్తాయి. సాధారణంగా మన పరిశీలన, అధ్యయనం, విశ్లేషణ గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి మౌలిక కాంగ్రెస్ ధోరణులకే పరిమితం అవుతుంది. అయ్యింది. కానీ ఈ నాయకుల వెనక కరుడుగట్టిన ఛాందస వాదులు కూడా కాంగ్రెస్‌లోనే సంలీనమయ్యారు.

మోడీ ప్రభుత్వం తొలిసారి అధికారానికి వచ్చిన వెంటనే పండిట్ మదన్ మోహన మాలవీయకు భారతరత్న బిరుదు కట్ట బెట్టడం, మరుగున పడిన స్వాతంత్ర్యోద్యమ చరిత్రను, పోరాట వీరులను వెలికి తీస్తున్నామనే పేరుతో వివిధ ప్రాంతీయ అస్తిత్వ ధోరణులకు ప్రాతినిధ్యం వహించిన వ్యక్తులను తెర మీదకు తీసుకొచ్చి వారి త్యాగాలను కొనియాడుతూ ఉత్సవాలు చేయటం గమనిస్తే స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్ పేరుతో చలామణి అయిన శ్రేణులన్నీ ఫక్తు కాంగ్రెస్‌వాదులు కాదనీ, వారికి స్వతంత్ర ఎజెండాలు ఉన్నాయనీ, ఆయా ఎజెండాలను కాంగ్రెస్ గొడుగు నీడన అమలు చేసుకుంటూ వెళ్లారనీ స్పష్టంగా అర్థమవుతుంది. ఈ రెండో ధోరణి, తెరచాటు శ్రేణులు గత రెండు వందల సంవత్సరాలుగా నిర్మించుకుంటూ వచ్చిందే మిత వాద ఆధిపత్య భావజాలం. 1920 దశకంలో ఆర్ఎస్ఎస్ తెర మీదకు రాకపూర్వం ఈ శ్రేణులు సంస్కృతీ పరిరణక్షకు మాత్రమే పరిమితమయ్యాయి. కానీ 1920 దశకంలో ఆర్ఎస్ఎస్ తెరమీదకు వచ్చాక భారతీయ సంస్కృతిని సమిధగా మార్చుకుంటూ హిందూత్వ రాజకీయ ప్రస్థానం పురోగమిస్తోంది. ఈ క్రమంలోనే గత వందేళ్లలో మితవాద భావజాలం తన ఆధిపత్యాన్ని కట్టుదిట్టం చేసుకుంది. సంఘటిత పర్చుకొంది. దీని కోసం అహర్నిశలూ పనిచేసింది. ఈ ప్రతీపశక్తులనే ఆర్ఎస్ఎస్

1940 నుండీ సొంతం చేసుకుంటూ వచ్చింది. భారతదేశంలో వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమం ముందడుగు వేయాలంటే భావ జాలరంగంలో మితవాదశక్తులు నిర్మించిన ఆధిపత్య నిర్మాణాలను కూలగొట్టాలి. ఆ కర్తవ్య నిర్వహణలో భారతీయ వామపక్షాలు ప్రయాణించాలంటే దేశంలో ఆధిపత్య సంస్కృతి నిర్మాణం ఎలా జరుగుతోంది. దానికి ప్రత్యామ్నాయం ఏమిటి అన్న విషయంలో విస్పష్టమైన మార్గాన్ని ఎంచుకోవాలి. ఈ ప్రయత్నంలో గ్రాంసీ అధ్యయనం భారతీ వామపక్షాలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. గ్రాంసీ అధ్యయనం దిశగా సాగుతున్న ప్రయత్నాల్లో నా వంతు తోడ్పాటును అందించటం కోసమే ఈ వ్యాసం.

లెనిన్ అనంతర దశలో తెర మీదకు వచ్చిన మార్క్సిస్టు తాత్వి కుల్లో గ్రాంసీ ఒకరు. ఓ ప్రత్యేక చారిత్రక సంధ్యలో ఉన్న ఇటలీని శోధించి మధించి అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే అయినా గ్రాంసీ మార్క్సిజానికి సృజనాత్మకత జోడించాడు. లెనిన్ విప్లవ కార్యాచరణను అర్థం చేసుకునే దిశగా గ్రాంసీ సాగించిన కృషిలో భాగంగానే ఆధిపత్యం, ప్రత్యాధిపత్యం గురించి మార్క్సిస్టు దృష్టి కోణం నుండి వివరించేందుకు ప్రయత్నం చేశారు. మార్క్సిస్టు దృష్టి కోణంలో ఆధిపత్య భావజాలం గురించి అధ్యయనం చేయడమంటే కేవలం భావజాల రంగంలో విశ్లేషణకు పరిమితం కావడం కాదు. సదరు ఆధిపత్య భావ జాలం ఆచరణలో ఏ రూపం తీసుకొంటోంది, ఏ ప్రయోజనాలు ముందుకు తీసుకెళ్లటంలో సాధనంగా మారుతోంది అన్న విషయాలు పరిశీలించటం. అందువల్లనే గ్రాంసీ 'ఆచరణకు సంబంధించిన తాత్వికతను అలవర్చుకోవటం అంటే గత చరిత్ర తోపాటు వర్తమానంలో చరిత్రను సృష్టిస్తున్న కార్యాచరణను కూడా నిర్దిష్టంగా అధ్యయనం చేయటం' అంటాడు. గ్రాంసీని సమకాలీన భారత రాజకీయ పరిస్థితులకు వర్తింపచేయటం అంటే వర్తమాన భారతాన్ని అర్థం చేసుకోవటానికి ఆర్‌ఎస్‌ఎస్ నిర్మిస్తున్న ఆధిపత్య సాంస్కృతిక రాజకీయ నిర్మాణాలను అర్థం చేసుకోవడానికి భారతదేశపు వర్తమాన చరిత్రతోపాటు గత చరిత్రనూ అధ్యయనం చేయటమే. ప్రత్యాధిపత్య సాంస్కృతిక మూలాలు వెతికి వెలికి తీయటమే.

మధ్యయుగాల ఇటలీ చరిత్రను అధ్యయనం చేసిన గ్రాంసీ ఏ సమాజంలోనైనా ఓ వర్గము లేదా సామాజిక తరగతి ఆధిపత్య తరగతి, వర్గంగా ఎదగాలంటే యావత్ సమాజాన్నీ అదుపులో పెట్టుకోవాలి (సమాజంపై ఆధిపత్యం చలాయించాలి). ఆ సమాజానికి నైతికపరంగానూ, మేధోపరంగానూ నాయకత్వం వహించాలి. గ్రాంసీ అవగాహనలో ఈ రెండో అంశం – నైతిక పరంగానూ, మేధోపరంగానూ నాయకత్వం వహించటం ఆధిపత్య నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది. సామాజిక నియంత్రణ రెండు రూపాల్లో అమలు జరుగుతుంది. సమకాలీన సామాజిక విలువలకు లోబడి వ్యక్తి ఉండేలా చేయటం మొదటి రూపమైతే ఆయా వ్యక్తుల వ్యక్తిగత జీవనాన్ని, ప్రవర్తనను, దిశను ఆధిపత్య సామాజిక విలువలకు లోబడి ఉండేలా పరోక్ష ఒత్తిళ్లు సృష్టించటం రెండో రూపం. వ్యక్తిగత జీవితాన్ని, జీవనాన్నీ మలిచే నిర్మాణాలు, వ్యవస్థలు, ఆలోచనలు, అవగాహనలు, అవకాశాలు, విధానాల ద్వారా యావత్ సమాజాన్నీ గుప్పిట్లో పెట్టుకోవటం ఆధిపత్య వ్యవస్థల స్వభావం. ఇక్కడ ఆధిపత్యం అంటే రాజ్యం, రాజ్యాంగ యంత్రం ద్వారా బలవంతంగా సాగించే పెత్తనంతోపాటు ఆయా పెత్తనాలకు లోబడి వ్యక్తి నడుచుకునేలా చేయటం కూడా. ఈ కోణాన్ని వర్తమాన భారతీయ సమాజానికి వర్తింపచేసుకుని చూస్తే గౌరీ లంకేష్, గోవింద్ పన్సారే హత్య మొదలు కరీంనగర్ ఓ టీచర్‌పై దాడి వరకూ, గోరక్షణ దళాల మొదలు త్రేతాయుగంలో రామరాజ్య నిర్మాణానికి హనుమంతుని సేవలు కొనియాడుతూ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు హిందూ రాష్ట్ర నిర్మాణం, స్థాపనలో సమిధలు కావాలన్న పిలుపు వరకూ అన్నీ సగటు భారతీయుడి ఆలోచనలను, ఆచరణను, అభిప్రాయాలను మలచడంలో భాగంగా జరుగుతున్నవే అని అర్థం అవుతుంది. వీటన్నింటినీ వ్యతిరేకించటం, ఖండించటం సాధారణ ప్రజాతంత్ర చైతన్యం. కానీ, వీటి మూలాలను వెతికి పట్టుకుని పైన ప్రస్తావించిన ప్రయత్నాలు, ప్రయోగాలు అన్నీ నిర్దిష్ట రాజకీయ లక్ష్యసాధన దిశగా జరుగుతున్న నిర్మాణాత్మక ప్రయోగాలు, ప్రయత్నాలు మాత్రమేననీ, సాధారణ ప్రజల ఐహిక జీవితంలో సాధారణంగా ఆచరించబడే అంశాలు కాదనీ నిరూపించటం విప్లవ ప్రజాతంత్ర చైతన్యం అవుతుంది. ఏ సమాజంలోనైతే ఆధిపత్య వ్యవస్థల నిర్మాణం వ్యక్తుల నడవడికలను ప్రభావితం చేయటం ద్వారా సాగుతుందో ఆ సమాజంలో ఆయా నడవడికలను నియంత్రించే భావజాలాలు, ఆలోచనలు పౌరసమాజపు ఉప ఉత్పత్తుల స్థాయికి చేరతాయి. ఆధిపత్య నిర్మాణం, సామాజిక నియంత్రణ కంటికి కనిపించని అనేక మార్గాల్లో సాగుతూ ఉంటుంది. పాలకవర్గ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే ఈ ఆధిపత్య నిర్మాణ మార్గాలను గుర్తించటమే ప్రత్యాధిపత్య నిర్మాణంలో తొలి అడుగు అవుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా మనం వర్గీకరించుకుంటున్న ఆధునిక సమాజాలు అన్నింటిలోనూ ఆధిపత్యం బల ప్రయోగం తోపాటు లొంగదీసుకోవటం వంటి అనేక మార్గాల మేళవింపే.

గ్రాంసీ చర్చించి ఆధిపత్యం భావన మౌలికంగా సైద్ధాంతిక రంగానికి సంబంధించింది. భారతదేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిత ఆధిపత్య నిర్మాణం భావజాల రంగంలోనూ, సైద్ధాంతిక రంగంలోనూ నిర్నిరోధంగా సాగుతున్న కృషే. ఇక్కడ ఆధిపత్య నిర్మాణంలో రాజకీయ నాయకత్వం పాత్ర గురించి గ్రాంసీ ఆసక్తిరమైనది. రాజకీయ ఆధిపత్యం, లేదా రాజకీయ

నాయకత్వం అన్నది ప్రజలూ(శ్రేణులూ) పార్టీలకు నాయకత్వం వహించే వారి మధ్య ఒప్పంద పూర్వకంగా ఏర్పడే సంబంధమే తప్ప నియతివాదంతో కూడిన సంబంధం(డిటర్మినిస్టిక్) కాదని గ్రాంసీ వాదిస్తారు. సాధారణంగా వామపక్ష పార్టీలు ప్రత్యేకించి కమ్యూనిస్టు పార్టీల నిర్మాణ చరిత్రలు గమనిస్తే నాయకత్వానికి పార్టీ శ్రేణులకూ మధ్య ఉన్న సంబంధాలు సమ్మతి ఆధారిత సంబంధాలుగా కాక నియతివాదంతో కూడిన సంబంధాలుగా ఉండటం గమనిస్తుంటాం. ఉదాహరణకు కేంద్రీకృత ప్రజాస్వామ్యం పేరిట భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీలు అనుసరిస్తున్న నిర్మాణ చట్రం బ్యూరోక్రటిక్ ప్రజాస్వామ్యంగా మారింది. దీంతో పైనుండి చెప్పటమే తప్ప క్షేత్రస్థాయి శ్రేణుల మనోభావాలు అభిప్రాయాలు, అంచనాలు పరిగణనలోకి తీసుకోవడం ఉండదు. దాంతో అనేక సందర్భాల్లో కమ్యూనిస్టు పార్టీలు ప్రజల ఆలోచనలను పసిగట్టలేకపోయిన అనుభవం తెలుగు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు అందరికీ సుపరిచితమే.

ఆధిపత్యం గురించిన గ్రాంసీ అవగాహనను అర్థం చేసుకోవడానికి మనం రాజకీయ వ్యవస్థలతోపాటు పౌర సమాజాన్నీ అధ్యయనం చేయాలి. సాధారణంగా మార్క్సిస్టు విశ్లేషణ పేరుతో మనం అంతా రాజకీయ వ్యవస్థల విశ్లేషణకు పరిమితం అవుతాము. ఈ చారిత్రక భౌతిక వాదంలో పునాది, ఉపరితలం లేదా ఉపరినిర్మాణాల మధ్య ఉండే సంబంధాలు గురించి రెండో ఇంటర్నేషనల్ కాలంలో పెద్దఎత్తున చర్చలు జరిగాయి. ఈ చర్చలను పరిశీలించిన గ్రాంసీ ఆర్థికవాదానికి లోనైనప్పుడు ఈ సంబంధాలను మార్క్సిస్టు దృక్కోణంలో అర్థం చేసుకోవటం సాధ్యం కాదని చెప్తారు. ఇక్కడ ఆర్థికవాదం అంటే కేవలం రాజకీయ పోరాటాల్లో ఆర్థికాంశాలకు ప్రాధాన్యత ఇవ్వటం, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించే కర్తవ్యాన్ని పక్కన పెట్టడం అన్న పరిమిత అవగాహన కాదు. మార్క్సిస్టు అవగాహనలో కీలకమైనది పరస్పర సంబంధం అన్న గతి తార్కిక సూత్రం. ఏ వ్యవస్థలోనైనా భిన్న భాగాలు ఆయా స్థల కాల సందర్భాలను బట్టి పరస్పరం ప్రభావితం చేసుకుంటూ ఉంటాయి. కానీ ఇక్కడ ఆర్థికవాదులు కేవలం ఆర్థిక సంబంధాలు, నిర్మాణాలు మారిపోతే ఉపరినిర్మాణం ఆటోమాటిగ్గా మారిపోతుందన్న వాదనను ప్రబలంగా ముందుకు తెస్తుంటారు. ఇటువంటి తప్పుడు అవగాహన వల్లనే అప్పటి యూరోపియన్ దేశాల కమ్యూనిస్టు పార్టీలు రాజకీయ పోరాటాల్లో ప్రాధాన్యతలను ఎంచుకునేటప్పుడు ఉపరినిర్మాణంలోని అంశాల విషయంలో పోరాటం, జోక్యం చేసుకోవటానికి పెద్దగా ప్రాధ్యాత ఇవ్వలేకపోయాయనీ, ఫలితంగానే లెనిన్ తెచ్చి పెట్టిన అవకాశాన్నీ ఆయా దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు సద్వినియోగం చేసుకోలేకపోయాయనీ గ్రాంసీ అంచనాకు వస్తారు.

పౌరసమాజం గురించిన అవగాహన విషయంలోనూ మెజారిటీ కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యేకించి భారతదేశంలో విప్లవం లక్ష్యంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు ఈ నియతివాదానికి, ఆర్థిక వాదానికి గురయ్యాయని చెప్పకతప్పదు. భారతదేశంలో వర్గపోరాట స్వభావం గురించిన చర్చ ఇంకా అపరిష్కృతంగానే ఉంది. కేవలం ఆర్థిక పోరాటాలు, పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలతో పీడిత వర్గ చైతన్యాన్ని విప్లవ సాధన స్థాయికి తీసుకు రావచ్చన్న వాదనే నేటికీ బలంగా ఉంది. కానీ రష్యాలో విప్లవ సాధనకు ముందు లెనిన్ సోషల్ డెమొక్రసీ రెండు కర్తవ్యాలు అన్న కరపత్రంలో కార్మికవర్గ చైతన్యాన్ని పెంపొందించటం ఎంత అవసరమో విస్తృత సమాజంలో ప్రజాతంత్ర చైతన్యాన్ని పెంపొందించటం అంతే అవసరం అని వాదించారు. వర్గ పోరాటాలను ప్రజాతంత్ర పోరాటాలను మేళవించి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూత్రీకరించారు. ఈ మేళవింపు ఆయా స్థలకాల పరిస్థితులను బట్టి ఉండాలి. ఉంటుంది. మన దేశంలో కమ్యూనిస్టులు ఈ మేళవింపు అవసరాన్ని గుర్తించని వారే ఎక్కువ. గుర్తించిన వారు సైతం ఏ సందర్భంలో ఈ చర్చ వచ్చినా ఆర్థిక రంగంలో వర్గ పోరాటాలు పై దృష్టి కేంద్రీకరించాలని, తర్వాత సమయం ఉంటే మిగిలిన అంశాలు గురించి చూడాలని వాదిస్తారు. కాదని సామాజిక అంశాలు గురించి విప్లవోద్యమంలో వాటి ప్రాధాన్యత గురించి చర్చకు పెట్టాలని ప్రయత్నిస్తే వాళ్లకు అస్తిత్వ వాదం అంటగట్టి పార్టీ శ్రేణులు చిన్నచూపు చూసేలా చేస్తారు. ఈ సందర్భంగా గ్రాంసీ అభిప్రాయాన్ని గమనించాలి.

**గ్రాంసీ ఫాటలిజం గురించి చర్చిస్తూ కేవలం ఆర్థిక సంక్షోభమే మౌలిక మార్పులకు కారణం అవు తుందన్న నియతి వాదాన్ని తిరస్కరిస్తారు. సబ్జెక్టివ్ ఆబ్జెక్టివ్ చారిత్రక పరిణామాల మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రస్తావిస్తూ ఆయా ప్రత్యేక పరిస్థితులను బట్టి ఉపరినిర్మాణం, సాంస్కృతిక రంగం, రాజకీయ సైద్ధాంతిక రంగాల్లో ప్రత్యేక లక్షణాలు ముందుకొస్తాయని గ్రాంసీ వివరించారు.**

లెనిన్ చెప్పిన నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనానికి ఇది కొనసాగింపు మాత్రమే తప్ప ప్రత్యామ్నాయం కాదు. భారత వామపక్షాలు ప్రత్యేకించి వామపక్షాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీలు ఈ ధోరణి నుండి వైదొలగి లెనినిస్టు దృక్కోణంలో వ్యవహరిస్తే తప్ప వర్తమాన భారతంలో మధ్యయుగాల భావవాదం, నిష్క్రియావాదం పునాదిగా ఆధునిక ప్రపంచీకరణ సాగించే దోపిడీకి అండగా నిర్మితమవుతున్న ఆధిపత్య సైద్ధాంతిక

రాజకీయ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, విరుగుడు ఆలోచించటం సాధ్యం కాదు.

ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. ఆర్థికవాదం అన్న అవగాహనకు లోతైన పునాది ఉంది. కేవలం వేతన పోరాటాలు గురించి మాట్లాడటానికే ఆర్థికవాదం పరిమితం కాదు. వర్తమాన(ఇటలీ) సమాజంలో కాథలిసిజం, ముస్సోలిని ఫాసిజం పేట్రేగిపోవటానికి గల కారణాలను విశ్లేషించటంలో వైఫల్యానికే కాదు... సోషలిస్టు సమాజ నిర్మాణం అంటే కేవలం ఉత్పత్తి శక్తులను పెంపొందించటం మాత్రమే అనే పరిమిత అవగాహన కూడా ఆర్థిక నియతివాదానికి పునాది. ప్రాతిపదిక.

**ప్రస్తుత భారతీయ సమాజ అభివృద్ధి దశలో కనీసం భావి సోషలిస్టు సమాజ చిత్రణను మనం ప్రజల ముందుంచలేక పోయినా వర్తమాన భారతంలో ఫాసిజం, హైందవోన్మాదం పేట్రేగిపోవడానికి గల కారణాలు, దాన్ని నియంత్రించటానికి ప్రయత్నించకపోవటం ఆర్థిక నియతివాదమే అన్న గ్రాంసీ విశ్లేషణ వర్తమాన భారతదేశ పరిణామాలను అర్థం చేసుకోవటంలో వామపక్షాల వైఫల్యానికి మూలాలు వెతుక్కోవచ్చు.**

పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకు వ్యక్తిగత ఆస్తి మౌలిక పునాది. సమాజంపై పెట్టుబడిదారీ భావజాలపు ఆధిపత్యానికి వ్యక్తి గత ఆస్తిలోనే పునాదులున్నాయి. అంతమాత్రాన ఆర్థిక పునాదిని కీలకమని సోషలిజం గుర్తించినంత మాత్రాన ఉపరి నిర్మాణానికి సంబంధించిన సమస్యలన్నీ వాటంతట అవే పరిష్కారమవుతాయనీ, సమయోచితంగా సద్యోజనితంగా ప్రత్యామ్నాయ ఉపరి నిర్మాణం ఉనికిలోకి వస్తుందని భావించటం, విప్లవ కార్యాచరణ ను ఆ విధంగా మల్చుకోవటం ఆర్థిక నియతివాదంలో భాగమేనన్న గ్రాంసీ అవగాహనను వర్తమాన భారతీయ విప్లవ దశకు వర్తింపచేసుకుని కార్యాచరణలో ఉన్న లోపాలు, పరిమితులు, నిర్మాణాన్ని మదింపు వేయాల్సిన అవసరం ఉంది. సమాజ పరిణామాన్ని ప్రభావితం చేయటంలో పునాదికి ఎంత ప్రాధాన్యత ఉందో ఉపరి నిర్మాణానికి అంతే ప్రాధాన్యత ఉందన్న వాస్తవాన్ని గుర్తించిన మార్క్సిస్టుగా గ్రాంసీ చరిత్రలో నిలిచిపోతారు. గ్రాంస్కీఅర్థం చేసుకున్న మార్క్సిజం కేవలం వస్తుగత అభివృద్ధికి సమాజ పురోగమనానికి (ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి) పరిమితం చేసేది కాదు. ఉత్పత్తి శక్తుల పురోగమనంతోపాటు సార్వత్రిక వైయక్తిక(మానవ) సామర్థ్యాలను పెంపొందించటం, సార్వత్రిక సృజనాత్మక సామర్థ్యాలను పెంపొందించటం మార్క్సిజం యొక్క అంతిమ లక్ష్యం. దీన్ని సాధించటానికి శతాబ్దాలు పట్టొచ్చు. మనం ఊహించిన కాల పరిమితిలోనో లేక ఆశించిన ప్రమాణాలతోనో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం, సోషలిజం విజయం సాధన జరగలేదు కాబట్టి మార్క్సిజం సమాజానికి సంబంధించిన అసమగ్రమైన అంచనా అని తీర్మానించుకోవటం విప్లవకారుల లక్షణం కాబోదు.

కమ్యూనిస్టు శ్రేణులు, కమ్యూనిస్టు మేధావులు అనుకునేవారి మధ్య విప్లవ దశ, విప్లవ వ్యూహం విషయంలో భిన్నాభిప్రాయాలు సహజంగా ఉంటాయి. అయితే ప్రపంచీకరణ సరళీకరణ రూపంలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ సంబంధాలు సమాజాన్ని ఆవరించాయి కాబట్టి ఈ దశలో సోషలిస్టు విప్లవం ఒక్కటే మార్గం, లక్ష్యం అని అనిపించటం సహజం. ఇటువంటి చర్చల నేపధ్యంలోనే స్కీమాటిక్ పరిష్కారాలను గ్రాంస్కీ తిరస్కరించాడని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. స్కీమాటిక్ పరిష్కారాలు అంటే సమాజం ఓ దశ తర్వాత మరో దశకు పరిణామం చెందుతుంది కాబట్టి మధ్యలో మజిలీలు ఏమీ ఉండవు ఫలానా దశ దాటాము అంటే తదుపరి దశే అన్న అవగాహన. దీనికి రెండో ఇంటర్నేషనల్ కాలంలో జరిగిన సైద్ధాంతిక ఘర్షణలకు పోలిక ఉంది. ఈ రెండు రకాల ఆలోచనలు, అవగాహనలు నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేసి నిర్దిష్ట ఎత్తుగడలు వేయాలన్న మౌలిక విప్లవ కర్తవ్యాన్ని విస్మరిస్తాయి. అందుకే గ్రాంసీ ఆధిపత్యం భావన గురించి విశ్లేషిస్తూ మరో అంశాన్ని ప్రస్తావిస్తారు. అది కంజంక్చర్ ఆఫ్ ఫోర్సెస్ అన్నదే ఆ అంశం. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొనే సంక్షోభం సార్వత్రికం కాదనీ, అందులో జాతీయ అంతర్జాతీయ వర్గ శక్తుల దామాషా కలయిక ఉంటుందని, ఈ సంక్షోభం దశ, దిశ, స్థితి, తీవ్రతలను బట్టి ఆయా దేశంలోని వర్గ శక్తుల బలాబలాలను బట్టి ఆయా దేశాల విప్లవోద్యమానికి అవసరమైన నిర్దిష్ట వ్యూహాన్ని రూపొందించుకోవాలని గ్రాంసీ ప్రతిపాదిస్తారు.

ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులను అంచనా వేయటానికి గ్రాంసీ అందించిన మరో కాన్సెప్ట్ హిస్టారికల్ బ్లాక్. హిస్టారికల్ బ్లాక్ అన్న భావన అప్పటి వరకూ పునాది, ఉపరినిర్మాణం గురించి రెండూ వేరువేరని, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సాధనాలతో కూడిన పునాది కీలకమని, పునాది మారితే ఉపరితలం ఆటోమాటిక్‌గా మారుతుందన్న అవగాహనకు భిన్నమైనది. పునాది, ఉపరి నిర్మాణం మధ్య గతితార్కిక సంబంధం ఉంటుందని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని ఆర్థిక సంబంధాలు, నిర్మాణాలు, మిగులు సమీకరణ పద్ధతులు, క్షేత్రాలు అభివృద్ధి చెందని పెట్టుబడిదారీ దేశాల్లోని ఆర్థిక సంబంధాలు, నిర్మాణాలు, మిగులు సమీకరణ పద్ధతులు, క్షేత్రాలు

ఒకదాన్నొకటి సంఘటితం చేసుకుంటున్నట్లే పునాది, ఉపరినిర్మాణంలోని ఒకదాన్నొకటి సంఘటితం చేసుకుంటూ ఓ చారిత్రక స్థితిని సమాజం ముందుంచుతాయని గ్రాంసీ విశ్లేషిస్తారు. సమకాలీన ప్రపంచీకరణ దశలో స్వేచ్ఛా మార్కెట్లు, పెట్టుబడి, వాణిజ్యం పునాది అయితే అన్ని దేశాలూ ఈ మార్గంలో ప్రయాణించేందుకు కావల్సిన స్వేచ్ఛా వాణిజ్య భావనలు, వినిమయవాదం, రాజ్యం స్వేచ్ఛకు వ్యతిరేకం అన్న భావన ఉపరినిర్మాణ అంశాలు. ఈ రెండింటి మేలుకలయికే ప్రపంచీరణ. సామాజిక జీవనంలో మనకు నిత్యం తారసపడే అనేక వాదనలు, సామెతలు, పొడుపు కథలు, లోకజ్ఞానంగా చలామణి అయ్యే సార్వత్రిక సామాజిక నియమాలు నిబంధనలు, వాటిని పరిరక్షించి పెంపొందించి విస్తృతీకరించి వ్యక్తిగత జీవితాన్ని నిర్దిష్టమైన గాడిలో పెట్టే బాబాలు, మఠాలు, ప్రార్థనా స్థలాలు, ఉపదేశాలు, జీవన శైలిలు అన్నీ ఈ చారిత్రకత స్థితి (హిస్టారిక ల్ బ్లాక్) నిర్మాణంలో అంతర్లీనంగా ఉండే భాగాలు. 1920 దశాబ్ది నాటి ఇటలీ సామాజిక జీవితం, చర్చి ప్రభావం నేపథ్యంలో ఈ అంశాలను మార్క్సిస్టు దృష్టికోణంలో విశ్లేషించటానికి గ్రాంసీ చేసిన ప్రయత్న ఫలితమే హిస్టారిక్ బ్లాక్ అన్న అవగాహన.

ఏ సమాజంలోనైనా సంస్కృతి అనేది తరతరాల ఆర్థిక సంబంధాల నిర్మాణపు ప్రత్యుత్పత్తిగా ఎదుగుతుంది. పాలు కాచి చల్లార్చిన తర్వాత తెట్టుకట్టే మీగడలాగా. మనం మీగడనే చూసి మీగడ కింద ఉన్న పాలు చూడకపోతే పొరపాటు అవుతుంది. దీన్నే గ్రాంసీ మాటల్లో చెప్పుకోవాలంటే ప్రతి సాంస్కృతిక ఉద్యమానికీ, రూపానికీ, భావానికీ, ఆచరణకూ వెనక తత్సంబంధిత ఆర్థిక పునాది అనివార్యంగా ఉంటుంది. ఆర్థిక అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ దాని నుండి ఉత్పత్తి అయిన భావజాలానికి ప్రాధాన్యత ఇవ్వని ఉద్యమ స్థితిని పార్టీ నిర్మాణ స్థితిని కథారసిస్ అని పిలుస్తారు గ్రాంసీ.

నేడు వర్తమాన భారతదేశంలో కూడా కమ్యూనిస్టు ఉద్యమాలు, నిర్మాణం ఈ దశలో ఉన్నాయని చెప్పటం అతిశయోక్తి కాబోదు. మార్క్సిజం ఓ నూతన సమగ్ర సిద్ధాంతం. ఇప్పటి వరకూ నోరులేని సామాజిక వర్గాలు, తరగతులకు గొంతునిచ్చిన తత్వం. ఈ నోరులేని సామాజిక వర్గాలు, తరగతులే నూతన సమాజ నిర్మాణ సోపానాలు. నూతన ప్రపంచాన్ని సృష్టించాల్సిన ఆర్గానిక్ ఇంటలెక్యువల్స్ సాగించే విప్లవ కార్యాచరణకు రెండు లక్ష్యాలు ఉంటాయి. సమీకృత మేధావులు(విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటానికి అవసరమైన నూతన ప్రాపంచిక తాత్వికతను, నూతన సంస్కృతిని రూపొందించే మేధోయజ్ఞంలో భాగస్వాములయ్యే విప్లవకారులు) ఆధునిక భావజాలాల యొక్క అత్యంత ఆధునిక రూపం, సారంపై పోరాడాలి. మధ్యయుగాలకు చెందిన సంస్కృతిపై ఆధారపడిన సాధారణ విశాల ప్రజానీకాన్ని చైతన్య వంతులను చేయాలి. ఈ రెండు కర్తవ్యాల నిర్వహణ విప్లవోద్య మాన్ని ముందుకు తీసుకెళ్లటంలో కీలక భూమిక పోషిస్తుంది.

సవాలు విప్లవ కార్యాచరణతత్వంపై ఓ అధ్యయనం అన్న తన వ్యాసంలో ఈ విషయాన్ని మరింత లోతుగా చర్చిస్తూ గ్రాంసీ ప్రధానంగా విశాల జనబాహుళ్యాన్ని చైతన్యవంతులను చేయటానికి విప్లవ కార్యాచరణ తాత్వికతకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తారు. అప్పటికి జర్మన్ తత్వశాస్త్రం అత్యున్నత స్థాయికి పురోగమించింది. మార్క్సిస్టు తాత్వికత జర్మన్ తత్వశాస్త్ర అత్యున్నత అభివృద్ధికి తదుపరి దశలో ప్రపంచ యవనిక మీదకు వచ్చిన విముక్తి తాత్వికత. ఈ తాత్వికతను ఆచరణలో పెట్టడానికి పలు దేశాల్లో పలు మార్గాల్లో ప్రయత్నాలు జరిగాయి. కొన్ని దేశాల్లో విజయవంతం అయ్యింది. మరికొన్ని దేశాల్లో పురిటినొప్పులకు లోనైంది. వేల సంవత్సరాల పాటు ఆధిపత్య సిద్ధాంతాలుగా ఉన్న దోపిడీ సిద్ధాంతాలను దాదాపు శతాబ్ద కాలంపాటు ప్రపంచ ప్రజానీకాన్ని విముక్తి మార్గంవైపు నడిపించిన విప్లవ తాత్విక సిద్ధాంతం మార్క్సిజం.

పెట్టుబడిదారీ వ్యవస్థ 20వ శతాబ్దిలో ప్రవేశించే నాటికి మార్క్స్ కాలంకంటే ఎన్నో విద్యలు, నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంపొం దించుకుంది. ఎవరితో ఎప్పుడు రాజీపడాలి, రాజీపడకపోయినా ఎవరిని ఎప్పుడు ఎలా గుప్పిట్లో పెట్టుకోవాలి అన్న అంశాల్లో పలు రకాలైన అనుభవాలు నేర్చుకుని ప్రావీణ్యం సంపాదించింది. రాజ్యాంగ యంత్రం అణచివేత సాధనంగానే కొనసాగుతున్నా క్రౌర్యం స్థానంలో నాజూకుదనం పెరిగింది. లాలన, ఆలన, పాలన రాజ్యాంగ యంత్రపు తంత్రంగా మారింది. ఈ పరిస్థితులు ప్రపంచీకరణ దశలో మరింత సంఘటితమవుతూ వచ్చాయి. ఈ క్రమంలోనే అణచివేతను సమర్థించే సూత్రాలు, సిద్ధాంతాలు సంస్కృతి, చరిత్ర, సామాజిక విలువలు వంటి విషపు గుళికలు చక్కెర కోటింగ్తో నోరూరించటం మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో 21వ శతాబ్దపు పెట్టుబడిదారీ వ్యవస్థ, రాజ్యాంగ యంత్రం, దాని నాజూకుదనం, భావజాల రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రదర్శిస్తున్న వైవిధ్యం, బహురూపత్వంను అర్థం చేసుకోవాలంటే గ్రాంసీను అధ్యయనం చేయాలి. అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారీ విధానం ఆధునిక సమాజం పేరుతో నిర్మిస్తున్న చారిత్రక స్థితిని, ఆధిపత్య దోపిడీ వ్యవస్థలను అడ్డుకునేందుకు, బద్దలు కొట్టేందుకు మార్క్సిజం పునాదిగా ఎదిగిన గ్రాంస్కీ ఆలోచనలు అనుసరణీయం. ❑


# గ్రాంసీ ఆలోచనల వెలుగులో మనం



- కృష్ణుడు

**కార్పొరేటీకరణ పెరుగుతున్న కొద్దీ చరిత్రలోనే కాదు, మీడియాలో విస్తృత వర్గాలకు స్థానం తగ్గిపోతూ వచ్చింది. చాలాచోట్ల పత్రికలు ప్రజల పోరాటాలను రికార్డు చేయడమే లేదు. సోషల్ మీడియా కూడా ఆధిపత్య వర్గాల చేతుల్లోకి దాదాపు వెళ్లిపోయిందనే చెప్పాలి. చరిత్రను వక్రీకరించడంలోను, అసత్య ప్రచారం ఉధృతంగా చేయడంలోనూ, ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలోనూ మీడియా, సోషల్ మీడియా పాత్రను విస్మరించలేము.**

చరిత్రలో ప్రతి ఘట్టానికీ గతంలో అదృశ్యమైన పోలికలు, ప్రతిధ్వనులు ఉంటాయని కారల్ మార్క్స్ అన్న మాటల్లో కఠోర వాస్తవం ఉన్నది. ఇవాళ దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే చరిత్ర పునరావృతమవుతోందా? అన్న అనుమానాలు చాలా సందర్భాల్లో కలుగుతుంటాయి. ప్రస్తుత సందర్భాలను విశ్లేషించేందుకు చరిత్ర ఎప్పుడూ మనకు దృష్టాంతాలను మిగులుస్తూ ఉంటుంది. హిట్లర్, ముస్సోలినీ, ఫ్రాంకో వంటి నియంతలు మనకు తటస్థ పడుతుంటారు. హైతీ, కంబోడియా, బోస్నియా, రువాండా, పాలస్తీనా, మయన్మార్ నుంచి కశ్మీర్ వరకు చరిత్ర మనకు ఎన్నో నెత్తురుటేర్లను చవి చూపించింది. ఎన్నో కుప్పకూలిన ప్రజా ఉద్యమాలు, పోరాటయోధుల త్యాగాలు, ఊచకోతలు, ఉరితీతలు మనకు ఎదురవుతూనే ఉంటాయి. ఎన్నో నినాదాలు గోడలపై మెరిసి వెలిసిపోతుంటాయి. ఎందరో పసి పిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోవడాన్ని మనను గాయపరిచి మాయమవుతూనే ఉంటాయి. 'చరిత్ర చాలా చిన్నది, మనం చేసినవన్నీ తప్పులా?' అన్న విషాదకరమైన ఆత్మావలోకనాలు ఎదుర్కొన్న వారు వేల సంఖ్యలో ఉంటారు. కాని చరిత్ర చిన్నది కాదు. అది పాఠాలు చెబుతూనే తనను తాను పునరావృతం చేసుకుని కొత్త పోరాటాల్ని, కొత్త తరాన్ని, కొత్త గాలుల్నీ ఆహ్వానిస్తూనే ఉంటుంది.




**జర్మనీ పతనానికి నాజీలు కారణమైనట్లే మతతత్వ శక్తులను భారతదేశంలో వ్యాపించేందుకు ఆస్కారం కలిగిస్తే దేశానికి అపారమైన నష్టం కలుగుతుందని 1947 డిసెంబర్ 7న మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో హెచ్చరించారు. తర్వాతి తరం భారతదేశ నేతల్లోనే కాదు, ఉద్యమాల్లోను అలాంటి చారిత్రక దృష్టి, సైద్ధాంతిక దృక్పథం లేనందు వల్లే ఇవాళ దేశంలోని జరుగుతున్న పరిణామాలను అడ్డుకోలేకపోతున్నామా అన్న బాధ కలుగుతుంది.**

నిజానికి ఏ సమాజమూ ఆకస్మికంగా, ప్రజాస్వామికంగా, ఆధునిక భావాలతో అవతరించదు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, హేతుబద్ధత దిశన ఒక సమాజం ప్రయాణించాలంటే అనేక దుర్మార్గాల మార్గంలో పయనించాల్సి ఉంటుందనడంలో సందేహం లేదు. వలస పాలన నుంచి సామ్రాజ్యవాదం వరకు

అనేక ఘట్టాలను దాదాపు ప్రతి దేశమూ ఎదుర్కొంది. రాచరిక, భూస్వామ్య నియంతృత్వం నుంచి పెట్టుబడిదారీ నియంతృత్వాల వరకు అనేక సమాజాలనూ మనం చూస్తూనే ఉన్నాం. అనేక దేశాలు దేశభక్తి, జాతీయవాదం పేరుతో నియంతృత్వ సమాజాలను ఎదుర్కొన్నాయి. ఈ విషయంలో మనం యూరోపియన్ సమాజం నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉంటుంది. అందులో ఒకటి ఫాసిజం లేదా నియంతృత్వం. తన 35వ ఏట జైలు పాలై పదేళ్లపాటు నియంతృత్వ కటకటాల్లో గడిపిన గ్రాంసీ జైలు నుంచి రాసిన నోట్ బుక్స్‌లో తాను ఎదుర్కొంటున్న అనుభవాల నుంచి భవిష్యత్ సమాజం ఎదుర్కోబోయే సమస్యల గురించి అభివర్ణించారు. అందుకే ఆయన వాక్యాల్లో మనం మన ప్రస్తుత సమాజాన్ని ఇప్పటికీ చూసుకోగలం. ఇటాలియన్ ఫాసిజం చారిత్రక మూలాల గురించి, ఇటాలియన్ సంస్కృతి, భాషలోని ఫాసిస్టు, సామ్రాజ్యవాద స్వభావం గురించి గ్రాంసీ చెప్పిన వాక్యాల ప్రతిధ్వనులు మరో రూపంలో మన దేశంలో గత కొన్ని ఏళ్లుగా కనిపిస్తున్నాయి. ఇటలీలో ముస్సోలినీ, జర్మనీలో హిట్లర్ పాలనలతోపాటు స్పెయిన్, ఇతర పశ్చిమ యూరప్ ఫాసిస్ట్ హయాంలను కలిసి చూడాల్సి ఉంటుందని, ఇవేవీ కేవలం వ్యక్తిగత నియంతృత్వాల్లో భాగం కాదని గ్రాంసీ చెప్పిన మాటల్ని మనం గుర్తుచేసుకోవాల్సి ఉంటుంది. యదాతథంగా అన్వయించడం సరైనది కానప్పటికీ భారతదేశ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఆయన ఆలోచనలు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు.

గ్రాంసీ అభివర్ణించిన సాంస్కృతిక ఆధిపత్యం, విస్మృత వర్గాలు అని ఒక దానితో మరొక దానితో సంబంధం ఉన్న రెండు పదాలు భారతదేశ సందర్భాల్లో అత్యంత విలువైనవి. సాంస్కృతిక ఆధిపత్యం అనేది సైద్ధాంతిక, సాంస్కృతిక మార్గాల్లో సమాజంపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తుందని, ఇందు కోసం విలువలు, ఆలోచనలు, అంచనాలు, ప్రాపంచిక దృక్పథం, సమాజం ప్రవర్తనను బలంగా ప్రభావితం చేసేందుకు అధికారంలో ఉన్న వారు సామాజిక సంస్థలను ఉపయోగించుకుంటారని గ్రాంసీ విశ్లేషించారు. అధికార వర్గం ప్రాపంచిక దృక్పథాన్ని రూపొందించే ఈ సాంస్కృతిక జాతీయవాదం సమాజంలో అందరి ప్రయోజనం కోసమే సామాజిక ఆర్థిక నిర్మాణాలు ఉంటాయని చెబుతుంది. కాని, ఈ నిర్మాణాలు అధికారంలో ఉన్న వారి ప్రయోజనం కోసమే పనిచేస్తాయి. సైనిక నియంతృత్వం లాంటివి అవసరం లేకుండానే సిద్ధాంతం, సంస్కృతి ఈ పనిచేస్తాయి. విశ్వాసాలు, అంచనాలు, విలువలు ఆధిపత్య సామాజిక వర్గానికి అనుకూలంగా మారేందుకు సంస్థలు, వ్యవస్థలు తోడ్పడతాయి. ఈ సంస్థలు, వ్యవస్థలను నియంత్రించే ఆధిపత్యవర్గం సమాజంపై పట్టు బిగుస్తుంది. మారుతున్న ఆర్థిక సామాజిక పరిస్థితులు సహజమైనవని, తప్పనిసరి అని నమ్మించే ప్రయత్నం జరుగుతుంది. గ్రాంసీ చెప్పిన సమాజంలో విద్యాలయాలు, చర్చిలు, న్యాయస్థానాలు, మీడియా వంటి సామాజిక సంస్థలు ఈ ప్రచారానికి దోహదం చేశాయి. భారత సమాజంలో చర్చిల స్థానంలో మందిరాలు, మఠాలు, స్వాముల కార్యకలాపాలు చేరాయి. మీడియాలో మరింత విషపూరితమైన ప్రభావం కలిగించే సోషల్ మీడియా కూడా చేరింది. ఇవన్నీ సమాజాన్ని నియంత్రిస్తున్నాయి.

'విస్మృత వర్గాలు' అన్న పదాన్ని కూడా గ్రాంసీ సాంస్కృతిక ఆధిపత్యంలో భాగంగానే విశ్లేషించారు. జాతి, కులం, లింగం, మతం, ప్రాంతం ప్రాతిపదికగా వివక్షకు గురైన వర్గాలపై సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఆయన సిద్ధాంతీకరించారు. ఈ వర్గాలపై అధికారం నిలుపుకోవడానికి సాంస్కృతిక సంస్థలను ఏ విధంగా ఉపయోగించుకుంటాయో ఆయన వివరించారు. సామాజిక మార్పు జరిగే క్రమంలో భారతదేశంలో విస్మృత వర్గాల పాత్ర అత్యంత కీలకమైనది. ఈ వర్గాలు కేవలం వర్గాలే కావు. గ్రాంసీ ప్రకారం సంక్లిష్టమైన సామాజిక నిర్మాణంలో భాగం, ఈ వర్గాల్లో కూడా ఆధిపత్య, విస్మృత భావజాలాలు ఉంటాయి. సామీప్యతలు, వ్యత్యాసాలు ఉంటాయి. ప్రతి వర్గంలోనూ నాయకత్వం కోసం సంఘర్షణ ఉంటుంది. వాటిని ఉపయోగించుకునే ఆధిపత్య వర్గాలు ఉంటాయి.

గ్రాంసీ ఆలోచనా విధానాన్ని రంజిత్ గుహ లాంటి భారతీయ చరిత్రకారులు చరిత్ర రచన గురించి వివరించేటప్పుడు ఉపయోగించుకున్నారు. విస్మృత వర్గాల చరిత్ర రచన (సబాల్టర్న్ హిస్టరియోగ్రఫీ)కి, సంపన్న వర్గాల చరిత్ర రచన (ఎలైటిస్ట్ హిస్టరియోగ్రఫీ)కి తేడాను ఆయన విశదీకరించారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సామాన్యుల సాహసాలకు విలువ లేకపోవడం, ఆదివాసీ, రైతాంగ పోరాటాలకు చరిత్ర రచనలో స్థానం లేకపోవడం ఆయన ఎత్తి చూపారు. ఆర్థిక వనరుల్లో, సామాజిక హోదాలో, మేధావిత్వంలో ఆధిక్యత కారణంగా చరిత్ర రచన కొన్ని వర్గాలకే సానుకూలంగా మారిందనడంలో సందేహం లేదు. నయావలసవాదం, నయా జాతీయవాదం ప్రజలపై, భారతదేశంలో అణగారిన వర్గాల వనరులపై ఆధిపత్యం, పట్టు కొనసాగించడానికి వీలు కలిగింది. మన చరిత్ర కారులు గ్రాంసీ లాంటి మేధావుల స్థాయిని ఎంత మేరకు అందుకున్నారా అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు.

కార్పోరేటీకరణ పెరుగుతున్న కొద్దీ చరిత్రలోనే కాదు, మీడియాలో విస్మృత వర్గాలకు స్థానం తగ్గిపోతూ వచ్చింది. చాలాచోట్ల పత్రికలు ప్రజల పోరాటాలను రికార్డు చేయడమే

లేదు. సోషల్ మీడియా కూడా ఆధిపత్య వర్గాల చేతుల్లోకి దాదాపు వెళ్లిపోయిందనే చెప్పాలి. చరిత్రను వక్రీకరించడం లోను, అసత్య ప్రచారం ఉధృతంగా చేయడంలోనూ, ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలోనూ మీడియా, సోషల్ మీడియా పాత్రను విస్మరించలేము. ఇది తార్కికమా అని ఆలోచించే వివేచనా శక్తిని అది దెబ్బ తీస్తోంది. టీవీల ద్వారా ప్రచారాన్ని కొనుగోలు చేయడం ద్వారా ఎన్నిక కాగలిగానని ఒకప్పటి అమెరికా ఉపాధ్యక్షుడు అల్ గోరే 'అసాల్ట్ ఆన్ రీజన్' అన్న పుస్తకంలో రాశారు. 'ప్రజాస్వామ్యం అనేది ఒక కొనుగోలు వస్తువు' అని ఆయన చెప్పారు. వ్యాపారస్తులు, మాఫియాలు, నేరచరితులు ప్రజా ప్రతినిధులుగా అవతరించడం, ప్రభుత్వాలు అభివృద్ధి పేరిట ఉన్నత వర్గాలు, కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రజాస్వామ్యానికి నిల యాలుగా భావించే పార్లమెంట్, సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్‌లలో లక్షల కోట్ల విలువైన నిర్ణయాలు తీసుకుని ప్రజల భవిష్యత్‌ల ను, దేశం రూపురేఖల్ని క్షణాల్లో మార్చివేయగలగడం, ఒక్క కలం పోటుతో ఆదివాసీలు, రైతులు, సామాన్యుల జీవితాలను అంధకార బంధురం చేయడం, వీటి గురించి యోచించకుండా ఉండేందుకు సంస్కృతి, దేశభక్తి, దైవభక్తి పేరుతో మతం ప్రజల మనసులను ప్రభావితం చేయడం, అణగారినవర్గాలకు, ఆధి పత్య వర్గాలకూ మధ్య ఒక 'జాతీయ' అనుబంధం ఏర్పర్చే ప్రయత్నం చేయడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడడం గ్రాంసీ అంచనా వేసిన సమాజం విశ్వరూపంలో భాగాలే.

'ప్రజాస్వామ్యం ముసుగులో ఫాసిజం ఏర్పడడం పెట్టుబడి దారీ సంక్షోభంలో భాగం' అన్న గ్రాంసీ మాటల్ని కూడా మనం గుర్తుపెట్టుకోవాల్సిఉంటుంది. మార్క్స్ రచించిన 'ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'లో అన్వేషించిన పరిస్థితుల దారిలోనే గ్రాంసీ 'ద రెవిల్యూషన్ అగైనిస్ట్ క్యాపిటల్' అనే వ్యాసాన్ని రచిం చారు. అంతిమంగా దశల వారీగా జరిగే సామాజిక పరిణామం లో భాగంగా ఆయా దేశాలు తమతమ పెట్టుబడిదారీ విధానాల ను కూలద్రోయగలవా అన్నది మనకు ఇంకా అనుభవంలోకి రావల్సి ఉన్నది. ఈ క్రమంలో రైతుల ధర్నాలు, నిరసన ప్రదర్శ నలు, ప్రజాస్వామ్యం కోసం వివిధ వర్గాల పోరాటాలు, వ్యవస్థ లు తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో చేసే సంఘర్ష ణలు చిన్న చిన్న సూచికలే కావచ్చు. గ్రాంసీ స్వరాన్ని తొక్కి పెట్టినట్లే అనేక స్వరాలను తొక్కిపెట్టిన సందర్భాలూ మనకు ఎదురవుతున్నాయి వీటిని పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాప్తిని అడ్డుకు నే క్రమంలో జరిగే ప్రతిఘటనలేనని అభివర్ణించేవారు ఉన్నారు.

'నాగరికత ప్రస్తుత పెట్టుబడిదారీ విధానాన్ని తట్టుకుని మనుగడ సాధించగలదా' అన్న నిరాశావాద ప్రశ్నలు వేసే వారు కూడా ఉన్నారు. ప్రజల ఆలోచనలకు తగ్గట్లుగా ఉద్యమాలు, ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు, మేధావులు ఎదగకపోవడం ఈ ప్రశ్నలకు కారణం కావచ్చు. కాని అత్యంత క్లిష్టమైన సందర్భాల్లో కూడా ప్రపంచమంతటా న్యాయం, హక్కుల కోసం ప్రజలు సంఘర్షిస్తుండడం మాత్రమే మనకు ఒక విశ్వాసాన్ని కలుగచేస్తుంది. ❑

---

# ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు ప్రజా హెజమనీ

**(61వ పేజీ తరువాయి)**

కొనసాగించాల్సిన దశలో సిద్ధాంత, రాజకీయ చర్చ నానాటికీ పెరుగుతూ వచ్చింది. ఈ దశలో రెండు పరిణామాలు చోటు చేసుకున్నాయి. మొదటిది కమ్యూ నిస్టు పార్టీకి వెలుపల జరిగిన మార్పులు. 1953లో భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కమ్యూనిస్టులకు తోడ్పాటు నిచ్చిన కొన్ని వర్గాలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో చెల్లాచెదురయ్యాయి. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చింది. ఇది రైతులలో కొత్త ఆకాం క్షలను కల్పించింది. మరోపక్క 1957లో ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను అమలులోకి తెచ్చింది. స్థానిక అధికారానికి ద్వారాలు తెరుచుకున్నాయి.

ఇవన్నీ కమ్యూనిస్టులు సాధించిన హెజమనీపై తీవ్ర ప్రభా వాన్ని కలిగించాయి. వారు సమీకరించిన ప్రజా సమూహాలలో చీలికలు తెచ్చాయి. రెండో పరిణామం కమ్యూనిస్టు పార్టీలో మొదలైన అంతర్గత చర్చ విభేదాల స్థాయికి చేరింది. తాము సాధించిన హెజమనీని మారిన పరిస్థితులలో కొనసాగించ డానికి తగిన ప్రత్యామ్నాయ ఎత్తుగడల చర్చను విస్మరించారు. పౌర సమాజంలో ఆధిపత్యం కోసం జరగాల్సిన ప్రయత్నం స్థానంలో, పార్టీలో ఆధిపత్యం కోసం అంతర్గత పోరుగా మారింది. అంతర్జాతీయ పరిణామాలు దీనికి తోడయ్యాయి. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. చీలిపోయిన మార్క్సి స్టు పార్టీ 1969లో మరో చీలికకు గురైంది. నక్సలైట్లుగా విడిపో యిన వాళ్ళు అనేకపాయలుగా చీలిపోయారు. ఆంధ్రాలో క మ్యూనిస్టు పార్టీ అనేక ప్రజా ఉద్యమాల నిర్మాణం ద్వారా, అనేక త్యాగాలతో పౌర సమాజంపై సాధించిన హెజమనీ చేజారిపోయింది. ❑


# గ్రాంసీ ఆధిపత్య భావన



మర్ల విజయకుమార్

**ప్రజా సమస్యలను విస్మరించే ఏ ప్రభుత్వమైనా కుప్పకూలక తప్పదు. ఈ దోపిడీ వర్గ ఆధిపత్యాన్ని బద్దలుకొట్టి, నిజమైన ప్రత్యామ్నాయ ప్రజా ఆధిపత్యాన్ని నిర్మించవలసిన అవసరాన్ని గ్రాంసీ వివరించారు. శ్రామిక వర్గం ప్రధాన శక్తిగా, తమతోపాటు దోపిడీకి గురయ్యే ఇతర అనుబంధ వర్గాలను తమతో కలుపుకుని ఒక చారిత్రక సంఘటనను విప్లవ శక్తులు ఏర్పాటు చేయాల్సి ఉంది.**

బూర్జువా సమాజంలో ప్రజలపై భౌతిక, మానసిక ఆధిపత్యాన్ని ఏర్పరుచుకుని, దానిని కొనసాగించగలిగినంత కాలం బూర్జువా వర్గ పరిపాలన పదిలంగానే ఉంటుంది. పెట్టుబడిదారీ




వర్గానికి అనుబంధ వర్గాలైన వ్యాపార, భూస్వామ్య వర్గాలను కలుపుకుని ఒక చారిత్రక సంఘటనను ఏర్పర్చుకొని, సమాజంలోని ఇతర వర్గాలైన పేద రైతులు, కార్మికులు, గ్రామీణ-పట్టణ పేదవర్గాలు, మధ్య తరగతి ఉద్యోగులు, చిరు వ్యాపారులను తమతో కలుపుకున్నట్లుగా నటిస్తూ (సబ్ కే సాత్, సబ్ కి వికాస్) అందరి కోసం, అందరికి మేలు; వంటి మోసపూరిత నినాదాలతో క్రింది వర్గాలు తమ అధికారంపై ఎదురు తిరగబడకుండా, తమ ఆధిపత్యాన్ని వారు అంగీకరించేటట్లు చేసుకొనటం వారికి అత్యవసరం. ఇందుకు వారి మద్దతును పొందటానికి భౌతికంగా పేదలకు ఇళ్ల పట్టాలు, ఆడ పిల్లలకు సైకిళ్ళు వంటి బుజ్జగింపు పథకాలను ప్రవేశపెట్టటం అవసరం అవుతుంది. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని అణచివేయటానికి, సామాజిక సమస్యలపై వారి మెదడులు మొద్దు బారేటట్లు చేయటానికి, నేడు అనేక సాధనాలు వారి చేతుల్లో ఉన్నాయి. మార్క్స్, లెనిన్, గ్రాంసీల కాలంలో పత్రికలు ఒక్కటే ప్రచార సాధనాలు. ఈ నాటి సమాచార యుగంలో టీవీ, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లలో కుప్పతెప్పలుగా వచ్చిపడే వాట్సాప్ వంటి ప్రచార సాధనాలు అధికార వర్గానికి అందుబాటులోకి వచ్చాయి. ఇక టీవీ సరే సరి. మానసిక ఆధిపత్యాన్ని కొనసాగించటానికి, జర్నలిజంలో ప్రశ్నించే తత్త్వం ఉన్న వారిని ఒక పద్ధతి ప్రకారం ఏరివేయటం, అధికారం వర్గానికి అడుగులకు మడుగులు ఒత్తే అమ్ముడుపోయిన జర్నలిస్టులను ముందుకు తెచ్చి, అబద్ధాలను నిజాలుగా వక్రీకరించి జనం మెదడులు మొద్దు బారే స్థాయిలో ప్రచారం చేయటం మనం చూస్తున్నాము. నిజాయితీగా వార్తలను ప్రజల ముందుంచే టీవీ ఛానళ్లను గుత్త పెట్టుబడిదారుల చేతుల్లోకి తీసుకోవడం మనం నిత్యం చూస్తున్నాం. మతాన్ని, సంస్కృతిని కలగా పులగం చేసి భారతదేశమంటే హిందూమతమేనని, ఇతర మతస్థులు బయట నుంచి వచ్చినా వారు పరాయివారని ప్రచారం పెద్ద ఎత్తున చేస్తూ, వారిపట్ల హిందువులలో ద్వేషభావాన్ని రగిల్చి పెంచి పోషించటం, వీలైన చోటల్లా మత ఘర్షణలు ప్రేరేపించటం ద్వారా ప్రజల దైనందిన సమస్యల నుంచి దృష్టి మళ్లించటం,

దానికి ప్రచార సాధనాలను విరివిగా ఉపయోగించటం ద్వారా అధికార వర్గం తమ పబ్బం గడుపుకుంటుంది. మత కలహాలు, సినీ తారల తళుకు బెళుకులు, వారి రహస్య జీవితాల గురించి ప్రజల్ని ఊరించటం-అధికారవర్గానికి వజ్రాయుధాలు.

**యువత చెడు వ్యసనాలకు బానిసలైతే, వారికి సామాజిక స్పృహ మచ్చుకైనా ఉండదు. వారికి తోటి వారి కష్టాలు పట్టవు. నిర్వీర్యమైన యువత తిరుగుబాటు చేయదు. బూర్జువా ప్రభుత్వాలు ప్రవేశపెట్టే అద్భుత ప్రజా రంజక పథకాల వల్ల తమకు ఏదో గొప్ప మేలు జరుగుతుందనే భ్రమలను ప్రజల్లో కల్పించి దోపిడీ వర్గాలు తమ అధికారాన్ని సుస్థిరం చేసుకుంటాయి.**

ధనిక వర్గాలు, అవినీతిలో మునిగి తేలే బూర్జువా రాజకీయ నాయకులు దేశంలో కూడబెట్టిన నల్ల ధనాన్ని సింగపూర్, మారిషస్ వంటి దేశాల్లోని అవినీతి బ్యాంకులకు తరలించి, ఆ ధనాన్నే విదేశీ పెట్టుబడులుగా తెల్ల రంగు పూసి వెనక్కితెస్తారు. వారికి ఈ ప్రభుత్వం అన్నిరకాల పన్ను రాయితీలు, పేద రైతుల నుండి బలవంతంగా లాక్కున్న వేల ఎకరాల పంట పొలాలను ధారాదత్తం చేస్తుంది ఈ ప్రభుత్వం. ఈనాడు మన దేశంలో ఎన్నడూ కనివిని ఎరుగని స్థాయిలో సంపద తారతమ్యాలు పెరుగుతున్నాయి. ప్రపంచ కుబేరుల లిస్టులో ఆదాని, అంబానిలు ఉన్నారు. గడిచిన రెండేళ్లలో వారి సంపద అనేక రెట్లు పెరిగింది. మొత్తం ఆర్థిక వ్యవస్థను గుత్త పెట్టుబడిదా రులకు ధారాదత్తం చేయటానికి మోడీ కంకణం కట్టుకున్నాడు. వైజాగ్ స్టీల్ వంటి భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమ లను వీరికి ధారాదత్తం చేస్తున్నాడు. విమానాశ్రయాలు, రైళ్లు, రైల్వే స్టేషన్లు, రోడ్లు, ఒకటేమిటి - దేశం మొత్తాన్ని ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అనుసరించి ప్రైవేటుపరం చేయటమే పరమావధిగా బీజేపీ ప్రభుత్వానికి ఉంది. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించ టానికి Ease of doing business ; పేరుతో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ మదుపరులకు అన్ని విధాల సౌలభ్యాలు కల్పిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సమాజ విశ్లేషణకు గ్రాంసీ యొక్క భావాలను మనదేశంలో ఎలా వినియోగించుకోవాలనేది మన ముందున్న ప్రశ్న. గ్రాంసీ ఇటలీలో ముస్సోలిని అధికారాన్ని ఛేజిక్కించుకుని ప్రజాస్వామ్యాన్ని సమాధి చేసి ఫాసిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో గ్రాంసీతో సహా పలువురు ముఖ్య కమ్యూ నిస్టు, కార్మిక నాయకుల్ని, కార్మికోద్యమాన్ని రాజ్యబలంతో ధ్వంసం చేసి, కార్మిక వర్గాన్ని తన మోసపురిత కుహనా దేశభక్తి నినాదాలతో తనవైపు తిప్పుకున్నాడు. జీవిత కాలం కష్టించి నిర్మించిన కార్మికోద్యమం ఫాసిస్టుల పాలుగావటం కమ్యూనిస్టు లను తీవ్ర నిరాశకు, గందరగోళానికి గురిచేసింది. జైలులో ఉన్న గ్రాంసీ తీవ్ర నిర్భందంలో ఉండి కూడా ఈ సమస్యపై తీవ్రంగా ఆలోచించి 'జైలు నోటు పుస్తకాల' పేరున అనేక కొత్త ఆలోచనలకు తెరతీశాడు. గ్రాంసీ 1937లో తీవ్ర అనారోగ్యం తో బాధపడి మరణించాడు. ఆయన రచనలు రహస్యంగా భద్రపరచబడి 1960వ దశకంలో ప్రచురితమయ్యాయి. 1917 రష్యాలో విజయవంతమైన అక్టోబరు మహా విప్లవం మూసలోనే ఇతర దేశాలలో కూడా విప్లవాలు సంభవిస్తాయని ఎవరైనా భ్రమలో ఉంటే, వారికి నేను చెప్పేది ఒకటే! మీరు మీ జన్మలో అటువంటి విప్లవాన్ని చూడలేరు అని 1922లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సభలో లెనిన్ వక్కాణించాడు. గ్రాంసీ, లెనిన్ ఇద్దరూ ఇదే నిర్ణయానికి వచ్చారు. ఆ తరువాత ఇటలీకి వచ్చిన గ్రాంసీ నిర్బందించబడ్డాడు. గ్రాంసీ తన రచనల్లో పారిశ్రామికం గా వెనుకబడ్డ రష్యాకు, జర్మనీ వంటి బలమైన పారిశ్రామిక దేశాల్లో విప్లవ పురోగతి ఒకేలా ఉండదని చెప్పాడు. పైగా ఇటలీలోనే ఉత్తర ప్రాంతం పారిశ్రామికంగా ముందుంటే, దక్షిణ ఇటలీ వ్యవసాయిక ప్రాంతం కనుక విప్లవోద్యమ నిర్మాణంలో ఈ ప్రాంతాల వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పాడు. గ్రాంసీ ఈ ఆలోచన చేసి 90 ఏళ్లకు పైగా అయింది. ఈ 90 ఏళ్లలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు, అభివృద్ధి జరిగాయి. పూర్తి గ్రామీణ ఆర్థిక వ్యవస్థగా వున్న దేశంలో అనేక పరిశ్రమలతో, ఆధునిక నగరాలతో రూపాంత రం చెందింది. నేడు దేశం జనాభాలో 40 శాతానికి పైగా ప్రజలు పట్టణాలలో నివసిస్తున్నారు. నేడు గ్రామాల్లోని రైతాంగం స్థానిక భూస్వామి దోపిడీనే కాక విత్తనాలు, పురుగు మందుల కంపెనీలు, రుణాలు ఇచ్చే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు మొదలైన పెట్టుబడిదారీ కంపెనీల దోపిడీకి ఎక్కువగా గురవుతున్నారు. అప్పుల బాధ తాళలేక లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అందుచేత గ్రాంసీ రోజుల నాటి ఇటలీకి, నేటి భారతదేశానికి చాలా వ్యత్యాసం ఉంది. పైగా ప్రపంచంలోని ఏ ఇతర దేశంలో లేనటువంటి ఇనుప సంకెళ్ళవంటి కులవ్యవస్థ కారణంగా అత్యధికులైన వెనుకబడిన కులాలపై, ఆర్థికంగా బలపడిన అగ్రకులాల వారి కుల వివక్ష ఇక్కడ నిత్యసత్యం.

**ఈ భారతదేశాన్ని హిందూ రాజ్యంగా ప్రకటి స్తామంటూ అడుగడుగునా మత విద్వేషాలను రెచ్చగొడుతూ దేశం సమగ్రతకు తూట్లు పొడుస్తున్నారు. ఈ విధంగా భారతదేశంలో విప్లవోద్యమ నిర్మాణం మిగతా దేశాలకంటే భిన్నంగా ఉంటుందన్నది తిరుగులేని సత్యం. బీజేపీ అధికారాన్ని హిందుత్వ ఆధిపత్యాన్ని, గుప్పెడు మంది గుత్తపెట్టుబడిదార్ల సంపద పోగునకు మాత్రమే పనిచేస్తున్నది.**

దేశంలో రైతుల దుస్థితి వర్ణనాతీతం. దాదాపు ఏడాదిపాటు ఢిల్లీ సరిహద్దుల్లో లక్షలాది మంది రైతులు నిరసన తెలుపుతుంటే ఆ ఉద్యమాన్ని బల ప్రయోగంతోనూ, మీడియాలో విషం చిమ్మే అబద్ధపు ప్రచారం తోనూ అణచప్రయత్నించింది ప్రభుత్వం. మహారాష్ట్రలో వేలాది మంది పేద రైతులు వందల మైళ్ళు కాలి నడకన పగలు, రాత్రి నడిచి చేరుకుంటే వారితో తుతూమంత్రంగా చర్చ చేసి వారి అసలు సమస్యలను విస్మరించారు. కొట్లాది మంది కార్మికులు దేశవ్యాప్తంగా రెండు రోజులు సమ్మె చేసి దేశాన్ని స్థంబింపజేస్తే, ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు. ఉద్దేశ పూర్వకంగా ప్రజా ఉద్యమాలను అశ్రద్ధ చేసి, దేశం సంపదను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆదాని, అంబానీల పరం చేయటమే మోడీ పరమావధిగా ఉన్నది. కబుర్లు, అసత్య ప్రచారం తప్ప ప్రజా సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవు. దానితో గుత్త పెట్టుబడిదారీ వర్గం యొక్క సేవలో తరించే మోడీ ప్రభుత్వం మెజారిటీ ప్రజలపైన మానసిక ఆధిపత్యాన్ని కోల్పోవటం తథ్యం. ఇక భౌతిక ఆధిపత్యం, అంటే బల ప్రయోగం, చెరసాలలు, హిందుత్వ గూండాలతో మూకదాడులు చేయించటం ద్వారా అధికారాన్ని నిలబెట్టుకోవాలి. మత రాజ్యంగా అవతరించిన పాకిస్తాన్ రెండు ముక్కలయ్యింది. మరొక నాలుగు ముక్కలైనా ఆశ్చర్యం లేదు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది.

మెజారిటీ ప్రజలు ముసల్మానులయినా వారు తమ దేశ ఐక్యతను నిలబెట్టుకోలేక పోతున్నారు. మతంకంటే ఆకలి ఎన్నోరేట్లు బలమైనది అని మరొకసారి రుజువు అవుతున్నది. ప్రజా సమస్యలను విస్మరించే ఏ ప్రభుత్వమైనా కుప్పకూలక తప్పదు. ఈ దోపిడీ వర్గ ఆధిపత్యాన్ని బద్దలుకొట్టి, నిజమైన ప్రత్యామ్నాయ ప్రజా ఆధిపత్యాన్ని నిర్మించవలసిన అవసరాన్ని గ్రాంసీ వివరించారు.

> **శ్రామిక వర్గం ప్రధాన శక్తిగా, తమతోపాటు దోపిడీకి గురయ్యే ఇతర అనుబంధ వర్గాలను తమతో కలుపుకుని ఒక చారిత్రక సంఘటనను విప్లవ శక్తులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రత్యామ్నాయ ప్రజాధిపత్యం నిర్మాణంలో అన్ని (శ్రామిక) వర్గాలను ఒకచోట చేర్చి, అందరి అవసరాలకు అనుగుణంగా ఈ చారిత్రక సంఘటన పనిచేయవలసి ఉన్నది. పరస్పర అవగాహనతో, జన సత్తాక ప్రజాస్వామ్యంగా ఈ సంఘటన పనిచేయాలి. ఈ కొత్త చారిత్రక సంఘటన శ్రామిక వర్గానికి, ఇతర అనుబంధ వర్గాలకు ఆమోదయోగ్యమైన ఒక కొత్త ప్రాపంచిక దృక్పథానికి తెరలేపుతుంది.**

దోపిడీ నిర్మూలన, శ్రమైక జీవన సౌందర్యం(అంటే ప్రతీ మానవుడు దోపిడీకి గురి కాని తన శ్రమ ద్వారా జీవన మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు) అనేవి ఈ ఆవిష్కరింపబడే కొత్త సమాజానికి పునాదిగా ఉంటాయి. విప్లవ శక్తులు తమ భావజాలాన్ని తమ ఉద్యమాల ద్వారా, పత్రికలు, ఇతర ప్రచార, సమాచార సాధనాల ద్వారా కళా రూపాలు, విస్తృత చర్చలు ద్వారా ప్రజల్లో ఈ కొత్త దృక్పథానికి ఆమోదాన్ని పొందటం ద్వారా వారిపై తమ భావజాల ఆధిపత్యాన్ని సాధించ గలుగుతారు. ఇందుకోసం గట్టి పునాదిపై నిర్మితమైన బూర్జువా భావజాలానికి, వారి ప్రచారసాధనాలకు వ్యతిరేకంగా పోరాడవలసి ఉంటుంది. ❑

- **పాలిత వర్గంగా ఉన్న వర్గం నిజంగానే స్వతంత్రమై, ప్రాముఖ్యం వహించే దశకు చేరుకున్నప్పుడు, నూతన రాజ్యాధికార వ్యవస్థను నిర్మించవలసి వచ్చినప్పుడు, నూతన మేధో - నైతిక విధానాన్ని రూపొందించవలసిన కచ్చితమయిన అవసరం ఏర్పడుతుంది. అది నూతన సామాజిక వ్యవస్థ రూపుదిద్దుకోవడానికి దారితీస్తుంది. అందుచేత మనం వీలయినంత విస్తృతంగా సార్వజనీన భావనలను అభివృద్ధి చేసుకుని వుండాలి! అత్యంత నిశితమైన, నిర్ణయాత్మకమైనన భావజాల శస్త్రాలను సిద్ధం చేసుకునివుండాలి.**
- **లోకుల జ్ఞానం నిల్వ నీటి మడుగు లాంటిది కాదు. అది నిరంతర పరిణామ స్రవంతి. మామూలు మనుషులలో వ్యాపించిపోయే శాస్త్రీయ పరిజ్ఞానంతోనూ, తాత్విక చింతనతోనూ ఈ లోకుల జ్ఞానం సుసంపన్నమవుతూ వుంటుంది. తత్వ శాస్త్రానికీ, వైజ్ఞానిక శాస్త్రానికీ, అర్థశాస్త్రానికీ - మామూలుగా మనం చెప్పుకునే జానపద విజ్ఞానానికీ మధ్యలో ఉంటుంది ఈ జనాభిప్రాయం. భవిష్యత్ జనాభిప్రాయాన్ని రూపొందించేది లోకుల జ్ఞానమే! నిర్దిష్ట స్థల కాలాల్లో ఏర్పడే మామూలు మనుషుల అభిప్రాయాలకు చట్రం రూపం కల్పిస్తే వచ్చేదే ఈ జనాభిప్రాయం.**
- **ఒక మనిషి తన మాండలికంలో మాట్లాడుతూ ప్రామాణిక భాషను అర్థం చేసుకోవడం లేదని అనుకుం దాం. అప్పుడు ప్రపంచం గురించి ఆయన అవగాహన కూడా అలా అరకొరగానే ఉంటుంది. ప్రాంతీయ తా పరిమితుల్లోనే ఎదుగు బొదుగు లేకుండా ఉంటుంది. ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన ఆలోచనలతో సంబంధం లేకుండా, చారిత్రకంగా వెనుకబడుతుంది.**

**- గ్రాంసీ**


# పౌర సమాజంలో ఆధిపత్య రాజకీయాలు



డీవీవీఎస్ వర్మ

**మోదీ పాలనాపరంగా బలహీనుడే, ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయవేత్తే. కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవాడే. ఆయన ప్రజాకర్షణ, ఆయన అనుసరిస్తున్న రాజకీయ విధానాలలో లేదు. పౌరసమాజంలో నెలకొన్న భావజాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద చేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద చేస్తే సరిపోదు. మోదీ రాజకీయం మీద పోరు పౌర సమాజంలో నెలకొన్న భావజాలం మీద జరగాలి.**

గ్రాంసీ రాజ్య వ్యవస్థను రాజకీయ వ్యవస్థ, పౌర సంస్థల సమ్మేళనంగా పరిగణించాడు. అయితే వాటిని విడదీసి అవి నిర్వహించే పాత్రలను విశ్లేషణ చేశాడు. రాజకీయ వ్యవస్థలో సైనిక బలగాలు, పోలీసు, బ్యూరోక్రసీ, చట్టాలు, జైళ్లు వగైరా అణచివేత సాధనాలను పేర్కొన్నాడు. మరో పక్క పౌర సమాజంలో ట్రేడ్ యూనియన్లు, చర్చి, విద్యా సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలతోపాటు వివిధ ఉపశ్రేణుల సమూహాలు - మహిళలు, మైనారిటీల ప్రత్యేక సంస్థలు, భాషా ప్రాంతీయ సముదాయాల అస్తిత్వ సంస్థలు- వుంటాయి. పాలక వర్గాల భావజాలం ఈ పౌర సంస్థల ద్వారా ఉపశ్రేణుల సమ్మతిని పొందుతాయని పేర్కొంటూ ఇలా సాధించిన భావజాల ఆధిపత్యాన్ని "హెజమనీ"గా నిర్వచించాడు. దీంతో హెజమనీ సిద్ధాంతం గ్రాంసీ భావజాలానికి కేంద్ర బిందువు అయింది. హెజమనీ అంటే పెత్తనం కాదు, పౌరసమాజం నమ్మతి ద్వారా పొందే ఆధిపత్యం. పాలకవర్గాలు తమ పాలనను స్థిరపరుచుకోడానికి రాజకీయ వ్యవస్థ అణిచివేతను, పౌరసమాజ సమ్మతిని సాధనాలుగా వినియోగిస్తాయి. అలాగే ఒకసారి హెజమనీని సాధించి విజయాలు పొందినా అది శాశ్వతం కాదు. ఎందుకంటే పౌరసమాజం ఒకే ఒక వర్గం కాదు పైగా భావజాల సంఘర్షణకు అది కేంద్రం. పాలకవర్గాల మనుగడకి ఎలాగైతే పౌరసమాజ నమ్మతి ఉపయోగపడుతుందో అదేవిధంగా కార్మికవర్గం, దాని ఉపశ్రేణులు రాజ్యాధికారం కోసం సాగించే పోరాటంలోనూ పౌర సమాజం సమ్మతి అలాంటి పాత్రనే పోషిస్తుంది. పౌర సమాజ నమ్మతిని గెల్చుకోవడం అన్న ముఖ్యమైన అంశాన్ని గ్రాంసీ ముందుకు తెచ్చాడు. కార్మిక వర్గం ఇతర ఉపశ్రేణులతో కలిసి చేసే ఉమ్మడి ప్రయత్నంగానే హెజమనీని ఆయన ప్రస్తావించాడు. ఉపశ్రేణుల నమ్మతిని గెలుచుకోవడానికి కార్మిక వర్గం తన స్వీయ ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవలసి వుంటుంది. మరికొన్నింటిని సవరించుకోవలని వుంటుంది. కార్మికవర్గం ఈ ఉపశ్రేణులన్నింటి ప్రయోజనాలకు, ఆకాంక్షలకు తోడ్పాటునిచ్చేదిగానూ, మద్దతునిచ్చేదిగానూ ఉంటే సరిపోదు. తానే వాటికి గొంతునిచ్చేది. అవి కూడా తన ప్రయోజనాలేనని స్పష్టపరిచేది కావాలి. ఈ కలయిక పైపై



ఐక్యత కాకుండా ఒక ఉమ్మడి ప్రయత్నంగా, ఉమ్మడి ప్రపంచ దృక్పదంగా రూపుదిద్దుకోవాలి. విడివిడి కలయికగా కాకుండా ఒక ముద్దగా ఏకం కావాలి. అప్పుడే అది వ్యవస్థను మార్చే భౌతిక శక్తి అవుతుంది.

కార్మిక వర్గం రూపొందించుకోవలసిన నవర్గ మేధావుల పాత్రను, నైతిక, రాజకీయ నాయకత్వ ఆవశ్యకతను గ్రాంసీ వివరిస్తాడు. భావజాలంలో లోకజ్ఞానం (కామన్ సైన్స్), విచక్షణా జ్ఞానం (గుడెసెన్స్) అనే భావన మరో ముఖ్యమైన అంశం. "ప్రతి వ్యక్తీ తత్వవేత్త"అంటాడు గ్రాంసీ. తత్వవేత్తల పాత్ర వారు పోషించలేకపోవచ్చును గానీ ఎవరికి వారు తమదైన రీతిలో ప్రపంచాన్ని అర్థం చేసుకుంటారు. వారు తమకున్న లోకజ్ఞానంతో ప్రపంచాన్ని చూస్తారు. ఈ లోక జ్ఞానంలో తాలూ తప్పులూ వుంటాయి. పాలక వర్గాలు నిరంతరం నూరి పోసేవి. గతం నుండి సరాసరి వచ్చి చేరినవి. నలుగురితో నారాయణా అంటూ ఆచరించేవి. మతపరంగా తెచ్చుకున్న నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, అనుభవం నుంచి నేర్చుకున్న అంశాలు వగైరాలన్నీ వుంటాయి. లోకజ్ఞానం వైరుధ్యాల పుట్టగా వుంటుంది. అయితే దీనిని తప్పుడు చైతన్యం అని తీసిపారెయ్యకూడదు. అందులో కొన్ని సత్యాలు, అవసరమైన అంశాలు, విలువలు కలగలసి వుంటాయి. అది ప్రజల ప్రపంచం. దానిలోకి చొరబడాలి తప్ప దానికి దూరంగా బైట నుంచి అనిర్దిష్టమైన తాత్విక భావాలను రుద్దడం వల్ల ప్రయోజనం వుండదు. ఈ లోకజ్ఞానం నుండి విచక్షణా జ్ఞానానికి. ప్రజల్ని నడిపించే సాంస్కృతిక ఉద్యమం తప్పనిసరి అవుతుందని అన్నాడు.

పౌర సమాజం మీద ఆధిపత్యం సాధించకుండా సాగించే తక్షణ యుద్ధం విజయాన్ని చేకూర్చదని, పౌర సమాజం మీద ఆధిపత్యం సాధించడం అంటే ప్రజల లోకజ్ఞానం విచక్షణా జ్ఞానంగా రూపాంతరం చెందినప్పుడు యుద్ధ సంసిద్ధత పరిపూర్తి అవుతుందని అంటారు. ఒకసారి పౌర సమ్మతితో కూడిన యుద్ధ సంసిద్ధత సాధిస్తే దాని విజయాన్ని ఎవరూ ఆపలేరు అంటారు గ్రాంసీ. వామపక్ష శక్తులు పౌర సమాజం మీద ఆధిపత్యాన్ని సాధించడానికి తగిన వ్యూహాలతో ముందుకు సాగాలి. దానికి తగిన రాజకీయ సాంస్కృతిక ఉద్యమాలను రూపొందించుకోవాలి. స్థూలంగా పౌర సమాజంపై గ్రాంసీ చేసిన విశ్లేషణల నేపథ్యంలో మోదీ రాజకీయాలను పరిశీలించుకోవాలి. మోదీ రాజకీయం మామూలు రాజకీయం కాదు. సంప్రదాయ రాజకీయానికి పూర్తిగా భిన్నమైంది. ఈ ప్రత్యేక తరహా రాజకీయాన్ని ఆవిష్కరించడానికి, విశ్లేషించ దానికి సంప్రదాయ రాజకీయ కొలబద్దలు పనికిరావు. ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటోనియో గ్రాంసీ రచనలలోని భావజాలం మనకు ఉపకరిస్తుంది. మోదీ రాజకీయాన్ని ప్రతిఘటించడానికి, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని రూపొందించడానికి అది దారి చూపిస్తుంది. ఈ భావజాలం నేపథ్యంలో మోదీ రాజకీయాన్ని అర్థం చేసుకోడానికి మనం కొత్త ఉపకరణాలను రూపొందించుకోవాలి. ప్రతిఘటించడానికి కొత్త మార్గాలను అన్వేషించుకోవాలి.

నిత్యజీవితంలో ప్రజలు కష్టాలను అనుభవిస్తున్నారు అయినా మోదీని ఆమోదిస్తున్నారు. ఇది మన కళ్ల ముందు కనిపిస్తున్న రాజకీయ వైరుధ్యం, పాలకులు ప్రజల నెత్తిన భారాలు పెడితే వారు దానిని నిరసించాలి, ప్రతిఘటించాలి. పాలకులు ప్రజాదరణ కోల్పోవాలి. లేదా పరాజయం పొందాలి. కాని ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా వుంది. పప్పులు, నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీలు చేస్తున్నాయి. నిరుద్యోగం కొవిడ్‌కి ముందే తారస్థాయికి చేరింది. తర్వాత ఉపాధి స్థితి అధ్వాన్నం అయింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర పెరగకపోగా ఉన్నదీ పోతోంది. కొత్త వ్యవసాయ చట్టాలు, కొత్త కార్మిక చట్టాలు, కొత్త పౌరసత్వ చట్టాలు అన్నీ ప్రజా వ్యతిరేకమైనవే. పౌరహక్కుల మీద, ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నిత్యం దాడులు జరుగుతున్నాయి. పెద్ద నోట్ల రద్దుతో కుదేలైన ఆర్థిక వ్యవస్థ ఎన్ని ఉద్దీపనలు యిస్తున్నా తిరోగమనంలోనే వుంది. కొవిడ్ కాలంలో ప్రజలు పడ్డ, పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిత్యజీవితంలో ప్రజలు ఇన్ని కష్టాలను భరిస్తున్నారు.

**ఒకనాడు ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రభుత్వాలు పడిపోయిన దేశంలో ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ప్రజలు కష్టాలను భరించడానికి సిద్ధం అవుతున్నారు. కాని మోదీని వదిలించుకోవాలని భావించడం లేదు. 2021 జనవరిలో ఇండియాటుడే నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో మోదీ జనాకర్షణ కించిత్తు కూడా తగ్గలేదని, ఎన్నికలు జరిగితే 302 సీట్లు గెలుస్తారని వెల్లడించింది. ప్రజలు మోదీ పాలనలో కష్టాలను భరించడానికి ఎందుకు సిద్ధం అవుతున్నారు ? మోదీ పట్ల మోజును ఎందుకు వదులుకోవడం లేదు? మోదీ రాజకీయంలోని ఈ ప్రత్యేకతను ఎలా అర్థం చేసుకోవాలి అన్న దానిని లోతుగా పరిశీలించాలి.**

2014 ఎన్నికలలో మోదీ ఘన విజయం సాధించారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలలో అధికార మార్పిడి సహజం. ఈ అధికార మార్పిడి సంప్రదాయ రాజకీయ పరిణామంగానే జరిగిందా? లేక సంక్షోభకాలపు ప్రత్యేకత వల్ల జరిగిందా అన్న

అంశాన్ని విశ్లేషించుకోవాలి. 2014 ఎన్నికల నాటికి దేశంలో రాజకీయ సంక్షోభం లేదా నాయకత్వ సంక్షోభం చోటు చేసు కుంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల పరం పరలో చిక్కుకుంది. అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్ చట్టం కోసం అన్నా హజారే ప్రారంభించిన ఉద్యమం ఢిల్లీని కదిలిం చింది. దేశవ్యాపిత ఉద్యమ రూపం ధరించింది. రాజకీయాలకు దూరంగా వుండే మధ్య తరగతి వర్గాలు ఈ రాజకీయ ఉద్య మంలో పాత్రధారులయ్యారు. సోనియాగాంధీ చేతిలో కీలు బొమ్మ ప్రధానిగా మన్మోహన్‌ను నిర్ణయాలు తీసుకోలేని అసమ ర్థునిగా భావించారు. అలాగే ముంబై పేలుళ్లపై పాకిస్తాన్‌తో దీటుగా వ్యవహరించలేదన్న విమర్శలు చేశారు. ఎన్నికల నాటికి పాలక పార్టీ 'నాయకత్వ సంక్షోభం'లో పడింది. ఇలాంటి రాజకీయ సంక్షోభాలపై ఆంటోనియో గ్రాంసీ తన రచనలలో చాలా లోతైన విశ్లేషణలు చేశారు.

**పాలక పార్టీ తన అధికారాన్ని కొనసాగించలేని స్థితి మరో పక్క ప్రతిపక్షాలు దానిని తొలగించలేని స్థితి వున్నప్పుడు రాజకీయ సంక్షోభంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అలాంటప్పుడే రాజకీయ రంగంలో సమ్మోహనా శక్తులకు ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ అనిశ్చితిని తొలగించగల హీరోల కోసం, ప్రజల వెదుకులాట ప్రారంభం అవుతుంది. ఇది స్థూలంగా గ్రాంసీ విశ్లేషణ సారాంశం.**

2014 నాటికి కాంగ్రెస్ పార్టీ అధికారానికి నూకలు చెల్లాయి. కాని దాని స్థానాన్ని ఏ ఒక్క పార్టీ ఆక్రమించగల స్థితిలేదు. అలాగే ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు అధికారం చేపట్టగల స్థితి కనిపించలేదు. గ్రాంసీ పేర్కొన్నట్లు ఇలాంటి అనిశ్చితి కాలంలో ప్రజలు హీరోల కోసం వెదుకులాడడం సహజం. అయితే దీనిని మోదీ గాని బీజేపీ గాని ముందుగానే పసిగట్టిన దాఖలాలు లేవు. మోదీ తన ఎన్నికల ప్రచారంలో హిందూ త్వాన్నీ, రామాలయాన్ని తెరవెనుకనే వుంచారు. అందరికీ మంచిరోజులు, అందరికీ అభివృద్ధి, యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాలలో ఉన్న అవినీతి సొత్తు తెచ్చి తలా రూ.15 లక్షల పంపిణీ వంటి సాధారణ వాగ్దానాలనే ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. గుజరాత్‌లో సాధించిన విజయాలనే దేశమంతా విస్తరింప చేస్తాననే ప్రచారాన్ని పెద్దఎత్తున చేపట్టారు. అయితే ఈ నినాదాలు ఆయన విజయానికి ఎంత వరకు దోహదం చేశాయో తెలియదు కాని ప్రజలు, ప్రత్యేకించి యువత ఆయన వాగ్దానాల కోణం నుండి కాకుండా దేశాన్ని రక్షించే, నడిపించే హీరోగా ఓట్ల ప్రభంజనాన్ని సృష్టించారు. ఈ ఎన్నికల్లో ఆయన వాడిన నినాదాలకంటే 'నాయకత్వ సంక్షోభం' కాలపు ప్రజల మనోస్థితి ప్రధానపాత్ర వహించింది. ఇది మోదీ నినాదాలు సృష్టించిన ప్రభంజనం కాదు. సంక్షోభ కాలంలో ప్రజల మనోస్థితి సృష్టించిన ప్రభంజనం. అందువల్ల మోదీ బలం ఆయన ప్రచారం చేసిన నినాదాలలో కంటే ప్రజల మనోభావాల స్థితిలో వుందన్న అంశాన్ని మనం గుర్తించాలి.

## మోదీని హీరోని చేసింది ఎవరు?

పౌరసమాజంలో భావజాల ఆధిపత్యం లేదా ప్రాబల్యం నిర్వహించే పాత్రపై గ్రాంసీ తన హెజమనీ సిద్ధాంతంలో విపులంగా చర్చించారు. పాలకవర్గాలు తమ పాలన సాగించడానికి బలప్రయోగ పద్ధతులతోపాటు పౌరసమాజ సమ్మతిని పొందడం కూడా సాధనం చేసుకుంటారు. ఈ పౌర సమాజ సమ్మతికి ప్రభుత్వేతర పౌర సంస్థలన్నింటి ద్వారా అంటే పాఠశాలలు, మతసంస్థలు, సాంస్కృతిక సంస్థలు వగైరాలన్నింటినీ వినియోగించుకుంటారు. ఈ భావజాల ప్రాబల్యాన్ని సాధించడంలో సవర్గమేధావుల పాత్రను ఆయన వివరించారు. ఇది పాలక వర్గాల హెజమనీ సాధనలోనూ, దానికి ప్రత్యామ్నాయంగా రూపొందే కౌంటర్ హెజమనీ సాధనలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ విశ్లేషణ నేపథ్యంలో మోదీని హీరోని చేసిన అంశాలను పరిశీలించడం అవసరం.

2017లో అమెరికాకు చెందిన అసోసియేషన్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ సంస్థ భారత ప్రజల రాజకీయ అభిప్రాయాల మీద సర్వే నిర్వహించింది. దేశంలో ఎలాంటి మినహాయింపులు లేని ప్రజాస్వామ్య ప్రభుత్వమే వుండాలన్న స్పష్టమైన నిబద్ధతను ప్రకటించిన వారు కేవలం 8 శాతం వున్నారు. 67 శాతం మంది ప్రజాస్వామ్యంపై కొంత విశ్వాసం ప్రకటించినప్పటికీ వారు ప్రజాస్వామ్య రహిత ప్రభుత్వాలపై కూడా సానుకూలతను వ్యక్తం చేశారు. 55 శాతం మంది నిరంకుశ ప్రభుత్వాలను సమర్థించారు. 27శాతం మంది 'బలమైన నాయకుడు' అవసరమన్నారు. అంతేకాదు 53 శాతం మంది సైనిక పాలన అవసరంగా భావించారు. భారతదేశానికి పాకిస్థాన్ 'అత్యంత' ప్రమాదకరమైన దేశంగా భావించారు. ఈ సర్వే 2017లో నిర్వహించినా ఇలాంటి భావాలు చాలకాలంగా దేశంలో వ్యక్తం అవుతూనే వున్నాయి. దీనికితోడు బీజేపీ మాత సంస్థ రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఐదేళ్లుగా చరిత్రనీ, సంస్కృతిని వక్రీకరిస్తూ మతవిద్వేష భావజాలాన్ని, గత కాలపు హిందూ వైభవాలనీ, మత జాతీయవాదాలు వగైరాలను నూరి పోస్తూనే వుంది. పైగా మన చరిత్ర రచన నేటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నది, పురాణాలనే చరిత్రగా భావించడం, దుష్ట శిక్షణకు యుగ పురుషుల అవతారాలపై ప్రచారం నేటికీ నడుస్తూనే వుంది.

రాజకీయరంగంలో 'నాయకత్వ సంక్షోభం' తలెత్తినప్పుడు,

హీరోల కోసం వెదుకులాటలు ప్రారంభమైన పుడు పౌర సమాజంలోని ఇలాంటి భావ జాలం కీలకపాత్ర పోషిస్తుంది. మన పౌర సమాజంలో నెలకొనివున్న ఈ భావజాలానికి తగిన ప్రతినిధిగా మోదీ కనిపించారు. ఆయనను ఈ భావజాలమే హీరోని చేసింది. దేశాన్ని ఐక్యపరిచిన వ్యక్తిగా ప్రాచుర్యంలో వున్న 'సర్దార్ పటేల్'కు నివాళిగా ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహ నిర్మాణాన్ని మోదీ ప్రకటించారు. ప్రజలు మోదీలోని 'ఉక్కు మనిషి'ని అందులో చూశారు. గుజరాత్ అభివృద్ధి నమూనా ప్రచారంతో 'మోదీ వికాస్ పురుష్' అయ్యాడు. గుజరాత్ అల్లర్లలో ముస్లింలను 'ఉక్కు పాదంతో' అణిచివేసిన తీరుతో 'ప్రతీకారేచ్ఛకు' ప్రతిరూపమయ్యాడు. భార్యను విడనాడి భరతమాత సేవకు అంకితమైన 'సర్వసంగ పరిత్యాగి' 'భారత్‌మాతాకి జై' అంటూ దేశం కోసమే జీవిస్తున్న హీరోగా కనిపించాడు.



మొత్తం మీద పౌరసమాజంలో నెలకొని వున్న ఈ భావజాలం కోరుకున్నది 'దేశరక్షకుడైన ఉక్కుమనిషిని', దేశానికి 'ప్రమాదకారి' అయిన ముస్లిం పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పగల హిందూ జాతీయవాదిని, గతకాలపు 'పురాణ' వైభవాలను పునరుద్ధరించే హీరోనే. మోదీ విజయం తర్వాత ప్రజలు ఆయన పాలనను ఈ భావజాలపు కళ్లద్దాలతోనే చూస్తున్నారు. నిత్య జీవితానికి సంబంధించిన మోదీ వైఫల్యాలు వారికి అంతగా పట్టకపోవడానికి ఇదే కారణం.

## ప్రజా సమస్యలకు దూరం - జనాకర్షణకు మార్గం

మోదీ ఒక సాధారణ రాజకీయవాదిగా వ్యవహరించడం లేదు. ప్రభుత్వపాలన తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తు న్నారు. ఆయన ప్రసంగాలలో ప్రజలు నిత్య జీవితంలో పడు తున్న కష్టాలను ప్రస్తావించడం లేదు. వాటిని మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి వదిలేశారు. వాటివల్ల వచ్చే అసంతృప్తికి తాను గురి కాకుండా జాగ్రత్త పడుతున్నారు. తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. తానొక సన్యాసిగా, యోగా సాధకునిగా, సంసార జంఝాటం లేనివాడిగా, భౌతిక వస్తువుల సంపదపై ఆసక్తి లేని వానిగా అందరి దృష్టినీ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆయన భారతదేశాన్ని కేవలం రాజకీయవేత్తగా కాకుండా సామాజికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా నడిపించే నేతగా కనిపించే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆయన తపస్సు గురించి, యజ్ఞం గురించి, యోగా గురించి, గతకాలపు హిందూ వైభవం గురించి అనేక ప్రస్తావనలు చేస్తున్నారు. కష్టాలు పడకుండా సుఖాలు, ముక్తి దక్కదన్న భావన కల్పిస్తున్నాడు. ఈ మార్గంలో ఆయన రాజకీయ అభిమానులని కాకుండా భక్తులను సృష్టించుకుంటున్నాడు.

**భక్తులకు వచ్చే కష్టాలు దేవుడు పెట్టే పరీక్షలు వారు కష్టాలను అనుభవిస్తారే తప్ప తమ ఆరాధనని వదులుకోరు. పైగా మరింత పెంచుకుంటారు. దేశానికి మోదీ అవసరం అన్న నినాదం దీని నుండి పుట్టుకొచ్చిందే. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే నాయకుడు అన్న నినాదం అంతిమంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేస్తుంది. వైవిధ్యాన్ని తొలగిస్తుంది. నియంతృత్వానికి, ఫాసిజానికి ద్వారాలను తెరుస్తుంది. అందువల్ల మోదీ రాజకీయాన్ని మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి.**


మోదీ పాలనాపరంగా బలహీనుడే, ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయవేత్తే. కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవాడే. ఆయన ప్రజాకర్షణ, ఆయన అనుసరిస్తున్న రాజకీయ విధానాలలో లేదు. పౌరసమాజంలో నెలకొన్న భావజాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద చేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద చేస్తే సరిపోదు. మోదీ రాజకీయం మీద పోరు పౌర సమాజంలో నెలకొన్న భావజాలం మీద జరగాలి. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా జరగాలి. ఇందులో సాంస్కృతిక రంగంలో జరిగే పోరాటం కీలకం అవుతుంది. ప్రజల లోకజ్ఞానంలో భాగమైన ఈ భావజాలాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే కొత్త రూపంలో, సరికొత్త నినాదాలతో జరగాలి. పౌర సమాజంలో అలాంటి ప్రజాప్రత్యామ్నాయ భావజాలం మీద సాగించే ఉద్యమాల రూప కల్పనకు గ్రాంసీ భావజాలం మనకు దారి చూపిస్తుంది. ❑

# భారతీయ సమకాలీన పౌర సమాజం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

**పోలీసు, సైన్యం, చట్టాలు, పరిపాలన మొదలగు ప్రభుత్వ సంస్థలతో కూడినది రాజకీయ సమాజం. కుటుంబాలు, విద్యాలయాలు, వినోద కేంద్రాలు, సామూహిక స్థానిక బృందాలు, ఎన్జీవోలు, కార్మిక వృత్తి ప్రజా సహకార సంఘాలు, నిపుణుల సమూహాలు, దాతృత్వ మత సాంస్కృతిక స్వతంత్ర పరిశోధన సంస్థలు, సామాజిక ఉద్యమాలు, ఫౌండేషన్లు మొదలగు ప్రభుత్వేతర సంస్థలతో పౌర సమాజం ఏర్పడుతుంది. రాజకీయ, పౌర సమాజాలు సమాజ ఉపరితల నిర్మాణంలో అంతస్సంబంధం గల రెండు విభిన్న అంశాలు. ఉత్పత్తి మౌలిక సదుపాయాలు, పౌర సమాజం మధ్య నిపుణులు లంకెలుగా పనిచేస్తారు. సంప్రదాయానికి, గత కాలపు మేధోసంపదకు చెందిన మేధావులు సంప్రదాయ మేధావులు. పౌర సమాజంలో వీరికి ప్రముఖ స్థానం ఉంది.**




మన దేశంలో పౌర సమాజానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థలు విద్య, ఆరోగ్యం, సంస్కృతి మొదలగు అంశాల అభివృద్ధిలో, ప్రకృతి విపత్తుల ఉపశమన పనులలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. 19వ శతాబ్దపు రెండవ అర్ధ భాగంలో జాతీయ స్పృహ వ్యాపించింది. అనేక రాజకీయ సామాజిక ఉద్యమాలు జరిగాయి. బ్రహ్మ సమాజ్ (1843), ఫ్రెండ్ ఇన్ నీడ్ సొసైటి (1858), ప్రార్థన సమాజ్ (1864), సత్యశోధక సమాజ్ (1873), ఆర్య సమాజ్ (1875), నేషనల్ కౌన్సిల్ ఫార్ ఉమెన్ ఇన్ ఇండియా (1875), ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ (1887)లతోపాటు అనేక సంస్థలు స్థాపించబడ్డాయి. క్రైస్తవ మిషనరీలు, ఇతర ప్రభుత్వేతర సంస్థలు పాఠశాలలు, ఆస్పత్రులు, ఇతర మౌలిక సౌకర్యాలను ఏర్పాటుచేశాయి. కొన్ని సంక్షేమ సౌకర్యాలు కల్పించాయి. 1905లో స్థాపించబడిన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా లౌకిక కార్యక్రమాలు చేపట్టింది. నేడు దేశంలో స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో 15 లక్షల ప్రభుత్వేతర సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిలో విద్యాసంస్థలు, ఆస్పత్రులు, క్రీడా మత సంస్థలు ఉన్నాయి. సొసైటి ఫార్ పార్టిసిపేటరి ఇన్ ఏసియా సర్వే ప్రకారం రెండు కోట్ల మంది స్వచ్ఛంద సేవకులు గానో, జీతాలకో ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేస్తున్నారు. 73.4% సంస్థల్లో జీతంపై పనిచేసే సిబ్బంది లేరు. లేదా ఒక్కరే ఉన్నారు. 26.5% ఎన్జీవోలు మత కార్యక్రమాలు చేపట్టాయి. 21.3% సాంఘిక సేవల్లో ఉన్నాయి. 20% విద్యా రంగంలో, 17.9% క్రీడలు, సాంస్కృతిక రంగంలో, 6.6% ఆరోగ్య రంగంలో ఉన్నాయి. పారదర్శకత, జవాబుదారితనాల కోసం 600 ఎన్జీవోలు కలిసి 2004 మేలో క్రెడిబిలిటి అలియన్స్ సంస్థను స్థాపించుకున్నాయి.

గ్రాంసీ పౌర సమాజాన్ని పునాది రంగం నుండి ఉపరితల రంగానికి మార్చారు. కుటుంబాన్ని పౌరసమాజంలో కలిపారు. పౌర సమాజపు కొన్ని అంగాలు గుంటలు తవ్వి రాజ్యాధికార కోటలను కాపాడుతాయి. గుంటలు దాటి గమ్యాన్ని చేరలేవు.

గుంటలను దాటనిదే విప్లవ పార్టీలు విప్లవాన్ని సాధించలేవు. పౌరసామాజ పరిణామం మానవ నాగరికతకు పర్యాయం. 'ఆధునిక పౌరసమాజం ఆర్థిక సాంస్కృతిక రంగాలలో నాగరిక విధులను నిర్వహిస్తుంది. రాజకీయ సమాజం, పౌరసమాజంలో కలిస్తేనే సిద్ధాంతబద్ధ వ్యవస్థ నిర్మాణం సాధ్యం. పౌరసమాజ బహుముఖ విధులను పునర్నిర్వచించాలి. అసమానతలను, సామాజిక మినహాయిం పులను, సమాజ సంస్థల ప్రైవేటీకరణను సమర్థించే పౌరసమాజం క్యాపిటలిస్టు సమాజమే. పౌరసమాజం వర్గ రాజ్యానికి సాంస్కృతిక వనరులను అందిస్తోంది. రాజ్యం నుండి పౌరసమాజ వేర్పాటుకు, రాజ్యాధిపత్యాన్ని హేతుబద్ధం చేయటానికి పాలితులను, పౌరులను సిద్ధం చేస్తోంది' అని గ్రాంసీ వాదన. పౌర సమాజపు అస్పష్ట, విరుద్ధ స్వభావాలను అర్థం చేసుకోవాలి. దాని సార్వజనీన, ప్రత్యేక ఉపయోగాలు అంతర్గత వైరుధ్యపు రెండు పార్శ్వాలు. ఆధిపత్యవర్గాలచే అణగదొక్కబడిన తరగతులు పౌర సమాజంలో భాగమే. వీరి చెమట, నెత్తురులతో పౌర సమాజం నిర్మించబడింది. కాని వారికే సామాజిక ప్రయోజనాలను తిరస్కరిస్తున్నారు. ప్రజా స్వామ్యంలో, పాలనలో పౌర సమాజం భాగం. పౌరసమాజం లోనే పాలితులు పౌరులుగా ఎదుగుతారు. విభిన్న పాలితులకు పౌరసత్వం ఇస్తే పౌరసమాజం విశాలమౌతుంది.

పౌర సమాజాలలో సభ్యత్వం ప్రధానమైనది. విభిన్న తాత్వికతల మధ్యనే గాక ఒకే తాత్వికత కలిగిన సంస్థల మధ్య కూడా ఉన్న పోటీలు పౌరసమాజ సంఘటితశక్తిని విచ్ఛిన్నం చేస్తున్నాయి. గమ్యసాధనలో ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. వివిధ నేపథ్యాల కార్మిక సంఘాలలో ప్రాతినిధ్య సభ్యత్వం ప్రధాన పాత్ర పోషిస్తుంది. రాజకీయ చర్చలు కార్మిక సంఘాల్లో కీలకం. కొన్ని రంగాల్లో దోపిడీకి గురయ్యే కార్మికుల సంఘాల కంటే దోపిడీ వర్గాల సంఘాలే బలంగా పనిచేస్తాయి. ఇండియాలో స్థానిక స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి గల వివిధ వృత్తి సంఘాలు ఉన్నాయి. వీటికి తమ సభ్యుల శ్రేయస్సే ముఖ్యం. కొన్నిసార్లు ఇది సమగ్ర సమాజ శ్రేయస్సుకు భంగకరం కావచ్చు. సామాజిక, సాంస్కృతిక సభ్యుల ఆసక్తులు వేరు వేరుగా ఉంటాయి. స్వయం సహాయక బృందాల, స్వయం ఉపాధి మహిళా సంఘాల ఆసక్తులు సమంజసాలు, సమర్థనీయాలు. రోటరీ, లయన్స్ క్లబ్బుల కార్యక్రమాలు ఇతరులకు సహాయం చేసేవే. వామపక్ష ప్రజా సంఘాలు పేదల, వెనుకబడ్డ తరగతుల కోసం పనిచేస్తాయి. న్యాయమూర్తులకు, ప్రభుత్వాధి కారులకు, పోలీసులకు, సైనికులకు, ప్రజా ప్రతినిధులకు సంఘాలు లేవు. గ్రామీణ పాఠశాలల, వైద్యశాలల, తంతి తపాలా, తాగు, మురుగు నీటి కార్మికుల సేవలు సమాజానికి ముఖ్యమైనవి. పరిశోధన, ఆధునిక సమాజంలో సమాచార, సాంకేతిక, సాఫ్ట్‌వేర్ రంగాలు, మానవత్వ సంస్థలు, సలహా సంప్రదింపుల సంస్థలు పౌర సమాజంలో ప్రముఖ పాత్రలు పోషిస్తున్నాయి. పాలనా విధానాలను ప్రభావితం చేస్తున్నాయి.

### సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో పౌరసమాజ ఉద్యమంలో 2 విభిన్న ధోరణులు కనిపిస్తాయి.

1. మితవాదం రాజ్యాన్ని సమరశీల దృష్టితో చూస్తుంది. పారదర్శకత, జవాబుదారీతనం, మితవాద పరిధి తగ్గింపు ద్వారా ఈ ధోరణిని ఎదుర్కోవచ్చు. పౌరసమాజానికి హక్కులు ఉంటాయి. రాజ్యం మానవ హక్కులను ఉల్లంఘిస్తే పౌర సమాజం రాజ్యాన్ని నిరోధించగలదు. పౌర సమాజం మానవ జీవిత సూత్రబద్ద నిర్మాత.

2. వామపక్ష ధోరణి ఉత్పత్తి విధాన, స్త్రీవాద రాజకీయ నమూనా. పర్యావరణ పరిరక్షణ విధానం. పెట్టుబడిదారీ విధా నాన్ని, రాజ్యాధికారాన్ని ఇది చట్టబద్ధంచేస్తుంది. పౌరసమాజ అనుకూల, వ్యతిరేక వైఖరులను రెండిటిని గ్రాంసి సవరించారు. పౌరసమాజపు స్వేచ్ఛ విశ్వాసాలను కోల్పోకుండా అధికారాల సరళీకరణ అవసరమన్నారు. పౌరసమాజం-వర్గాలు, పౌర సమాజం - రాజ్యాధికారం అంశాల మధ్య ముఖ్యమైన వ్యత్యాసాలను ఎత్తిచూపారు. పౌరసమాజం రాజ్య ఆర్థిక అవసరాలు తీరుస్తుంది.

గ్రాంసీ ప్రకారం పౌరసమాజం సకారాత్మకం, రాజ్యం నకారాత్మకం. సకారాత్మక, నకారాత్మక అంశాలు రెండూ పౌరసమాజంలో ఉంటాయి. వర్గ ప్రవృత్తులను, ఆసక్తులను, పోరాటాలను పౌర సమాజం స్వీకరిస్తుంది. కుటుంబం, మత సంబంధాలు, సాంస్కృతిక బృందాలను సామాజిక పెట్టుబళ్ళ ద్వారా సాధారణీ కరిస్తుంది. దీనితో కార్మిక వర్గం సంపద, విద్య, ఉద్యోగం మొదలగు విషయాల సందిగ్ధ స్థితిలో బతకడానికి మొగ్గు చూపుతుంది. ఈ విషయాల వ్యతిరేక వాదనలను పౌరసమాజ సంస్థలు చట్టరహితంచేస్తాయి. కార్మిక వర్గాలు అదృష్టవాదంతో తమ స్థితిని, దోపిడీని కర్మ సిద్ధాంతంతో సమర్థించుకుంటాయి. ఆర్థిక సమస్య రాజకీయ అస్థిరత్వంగా మారకుండా కొన్ని పౌరసమాజ సంస్థలు అడ్డుకుంటాయి. రాజ్యాధికార అవసరాలను తీర్చి, రాజకీయ నాయకులను, నియమాలను అందిస్తాయి. పాలకులనే గాక ప్రజానీకాన్నీ చైతన్యపరుస్తాయి. ఆర్థికఅంశాల్లో ప్రజాభిప్రాయాన్ని తయారుచేస్తాయి. ఆచారాలు,

సాంప్రదాయాలతో చట్టాల అవగాహన కల్పిస్తాయి. పరోక్ష సమ్మతితో ప్రజలను వత్తిడికి గురిచేస్తాయి. కాని పరస్పర గౌరవం, క్రమశిక్షణ, నైపుణ్యతలను, హేతుబద్ధతను, ఆలోచనా శక్తిని నేర్పుతాయి. సాంస్కృతిక విధులను నిర్వహిస్తాయి. పౌరసమాజంలో ప్రతి ఒక్కరు ఇతరులు తమ జీవితాసరాలను ఆక్రమిస్తారనుకుంటారు. రాజ్యం పౌరసమాజానికి కొన్ని సూత్రాలను నిర్ధారిస్తుంది. నైతిక రాజ్యంగా అవతరిస్తుంది.

భారత చట్టాలు ఎన్జీవోలను ధార్మిక సంస్థలు, సంఘాలు, ఆదాయపన్ను చెల్లించనక్కర లేని కంపెనీలుగా వర్గీకరించాయి. విదేశ నిధులు పొందే ఎన్జీవోలను ఫారిన్ కంట్రిబ్యూషన్స్ రేగులేషన్ యాక్ట్ 1976 ప్రకారం ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుం ది. 1990ల తర్వాత ప్రభుత్వాలు, ఎన్జీవోల మధ్య చర్చలకు అనేక వేదికలు పుట్టుకొచ్చాయి. సామూహిక సాధికార, ప్రజా స్వామ్య బలోపేత సంస్థల, విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక సేవల అభివృద్ధి సంస్థల(ఎన్జీవోల) లక్ష్యాలు కలిసిపోయాయి. ఎన్జీవోల నిధులను పెంచడానికి ప్రభుత్వం ఖాదీ (గ్రామీణ పారిశ్రామిక సహకార సంఘాలు, కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు, జాతీయ బంజరు భూమి అభివృద్ధి బోర్డు మొదలగు అనేక సంస్థలను స్థాపించింది. దీనితో లబ్ధిదారులు ప్రభుత్వంపై ఆధారపడవలసి వచ్చింది. ఎన్జీవోలు స్వయం ప్రతిపత్తిని కోల్పో యాయి. ప్రభుత్వాలకు లొంగి పనిచేయవలసి వచ్చింది. 2007 మేలో భారత ప్రభుత్వం, ప్రభుత్వం-స్వచ్ఛంద సంస్థల మధ్య సంబంధాల మెరుగు కోసం, స్వచ్ఛంద రంగ జాతీయ విధానాన్ని ఆమోదించింది. దీని ప్రకారం ప్రభుత్వం ఎన్జీవోలకు పన్నురాయితీలు ఇస్తుంది. విదేశీ చందాల క్రమబద్ధీకరణను సరళీకరిస్తుంది. అత్యుత్తమ సంస్థలను గుర్తిస్తుంది.



కేంద్ర ప్రభుత్వం 1950లలో సంక్షేమ కార్యక్రమాలను వికేంద్రీకరించింది. అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థలు భారత్‌లో ప్రవేశించాయి. శాశ్వత కేంద్రాలను స్థాపించుకు న్నాయి. పౌరసమాజ స్వభావం మారిపోయింది. విదేశాల్లో శిక్షణ పొందిన భారతీయులు పౌరసమాజంలో ప్రవేశించారు. దీన్ని వ్యాపార వృత్తిగా మార్చారు. పేదలు, వెనుకబడ్డవారి పట్ల బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకుంది. సంక్షేమ, సాధికార సంస్థలు తయారయాయి. అభివృద్ధి, పౌర స్వేచ్ఛలు, విద్య, పర్యావరణం, ఆరోగ్యం, బతుకుదెరువు మొదలగు అంశాలపై దృష్టిపెట్టాయి. రాజ్యాభివృద్ధిలో ఎన్జీవోలను భాగస్వాములుగా ప్రభుత్వం గుర్తించింది. ఎన్జీవోలు అట్టడుగువర్గాలను చేరాయి. హక్కుల రక్షణ కోసమని వెనుకబడ్డవారిని సమీకరించడం మొదలు పెట్టాయి. 1990లలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో సర్దుబాటు పద్ధతులు మొదలయాయి. ద్వైపాక్షిక ఒప్పందాలతో ప్రభుత్వాల ద్వారా విదేశీ చందాలు వస్తున్నాయి. ఎన్జీవోలు, భారీ కార్పొరేట్ సంస్థలు ప్రజా సంస్థలను వెనక్కు నెట్టాయి. సామాజిక, ఆర్థిక దోపిడి వ్యతిరేక చర్యలు ఎన్జీవోల రంగం నుండి వైదొలిగాయి.

దేశంలో పౌరసమాజ ఉద్యమాలు చాలా జరిగాయి. మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు ఏడో తేదీన స్థాపించబడింది. అభివృద్ధి కార్యక్రమాలతో స్వయం సమృద్ధి, గ్రామీణ స్వయం నిర్భరత సాధించి దేశాభివృద్ధికి దోహదపడటం దీని లక్ష్యం. దీన్ని మోదీ ఇండియాలో తయారీ గా నకలుచేశారు. భూదానోద్యమం, కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డు, మైక్రోఫైనాన్స్, నాబార్డ్-వ్యవసాయ గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు, స్వయం సహాయక బృందాలు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, అంతర్జాల పాలన (ఇ-గవర్నెన్స్), కార్పొరేట్ సామాజిక బాధ్యత, సోషల్ ఎంటర్ ప్రైజెస్ అండ్ ఇనొవేషన్స్, పౌరసమాజ సంస్థల సంగణీకరణ (డిజిటలైజేషన్) పౌర సమాజ ఉద్యమాల్లో కొన్ని.

**చారిత్రకంగా భారత సమాజం ఆదివాసులను, గిరిజనులను, దళితులను, మహిళలను అణగదొక్కింది. గ్రాంసి అధ్యయన నేపథ్యంలో ఈ తరగతుల ఆసక్తులు, ఆందోళనలు, ఆకాంక్షలను కాపాడే ఉద్యమాలు బలోపేతమయ్యాయి. సామాజిక రోగాలైన మద్యపానం, వరకట్నం, స్త్రీల వారసత్వ హక్కు నిరాకరణలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చాయి. అభివృద్ధి కార్యక్రమాలలో ఆదివాసులు, గిరిజనులు, పేదలు నిర్వాసితులవుతారు. వీరి పునరావాసానికి అనేక సామాజిక ఉద్యమాలు సాగాయి. పాలన, ప్రభుత్వాల జవాబుదారీతనం మీద అనేక ఉద్యమాలు లేశాయి. అవినీతి వ్యతిరేక, పౌరహక్కులు, మానవ హక్కులు, సమాచార, విద్యా హక్కులు, ఆహార భద్రతా హక్కు, జీవనభృతి హక్కు, పర్యావరణ పరిరక్షణ, సంరక్షణ, పునరుత్పత్తి ఉద్యమాలు దేశవ్యాపితంగా ఊపందుకున్నాయి. చిప్కో ఉద్యమం, నర్మదా బచావ్ ఆందోళన, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన, ఇండియా అగైన్స్ట్ కరప్షన్, నిర్భయ అత్యాచార ప్రతిఘటన, నల్ల వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతుల ఉద్యమాలను పౌరసమాజ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలి.**

ప్రతి సామాజిక ఉద్యమ దృష్టికోణం, విధానం వేరు వేరుగా ఉంటాయి. ఇవి వ్యక్తుల సమావేశ, సంఘటిత పటిమలను నిర్ణయిస్తాయి. ఐచ్ఛిక భాగస్వామ్యం, సమావేశ తాత్కాలికతలను నిర్ధారిస్తాయి. వ్యక్తుల తాత్వికత, అవగాహన, నిబద్ధత, శక్తియుక్తులు, నిర్మాణనైజం, వనరులు వివిధ సామాజిక ఉద్యమాల్లో విభిన్నంగా ఉంటాయి. పాలనా విధానాలను, సంస్థలను, సమాజాన్ని సంస్కరించడమే సామాజిక ఉద్యమాల ప్రాథమిక విధి. ఉద్యమాలలో పాలుపంచుకునే పౌరులపాత్ర, సంఘటిత శక్తి అమోఘమైనవి. వీటి వెనుక గ్రాంసి ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉంది. నేటి భారత పౌరసమాజపు అజెండా ప్రజాస్వామ్య ఏర్పాటు నుండి దాని సంరక్షణ స్థితికి దిగజారింది. ఇండియా గిని పేదరిక గుణకం 2014లో 34.4%. 2020లో 82.3%. (100% పేదరిక గరిష్ట స్థాయి) సామాజిక, ఆర్థిక, అభివృద్ధి, సాంకేతిక అంశాల అసమానతలు పెరిగాయి.

విభజన, వెలివేతల కుట్రలతో అర్హతను కోల్పోయినా, స్వార్థంతో చేసే సేవాకార్యక్రమల వలన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) దాని అనుబంధ సంఘాలను పౌరసమాజంలో చేర్చక తప్పదు. రాజకీయ వ్యవస్థల, పార్టీల నిర్మాణాత్మక, వ్యవస్థీకృత లోపాలు, సాంకేతిక, సంగణీకరణ (డిజిటలైజేషన్) విప్లవం, రాజకీయీకరణతో ముక్కలైన మాధ్య మాలు, విపరీ తంగా విస్తరించిన సామాజిక మాధ్యమాల శబ్దపఠన దృశ్య మాలికలు, రాజకీయ సమీకరణలు, కేంద్రీక రణలలో సంఘ్ సంస్థలు ప్రధానమైన పాత్ర పోషిస్తున్నాయి. ఔదార్యం లేని, అల్పబుద్ధిగల పౌరసమాజపు ఆవిర్భావానికి దారితీస్తున్నాయి. అది ప్రజాస్వామ్యపతనానికి, నిరంకుశత్వానికి దోహదపడింది. రాజకీయసంస్థలు స్వచ్ఛందసంస్థల విస్తరణకు అవకాశమివ్వని చోట, ప్రజాస్వామ్య పద్దతులతో ప్రజల కోరికలు తీరనపుడు, పౌరసమాజ రాజకీయీకరణ, కేంద్రీకరణలకు విరుగుడు లేనపుడు సమీకరించబడిన బలమైన తప్పుడు పౌరసమాజం ఫాసిజాన్ని పెంచుతుంది. ఈ సంస్థల నటీనటులు,మానవ విజ్ఞతా రాహిత్యంతో సాంస్కృతిక, రాజకీయ కేంద్రీకరణల నిప్పును రాజేస్తారు. రాజకీయ అస్థిరతకు, ఎన్నికల విధాన విధ్వంసానికి కారకులవుతారు.

అధికారదర్పం జవాబుదారితనాన్ని మరిచింది.మెజారిటి మత తాత్వికత సమాజాన్ని ప్రభావితంచేస్తోంది. అధికారపక్ష పౌర సమాజాలకే నిధులు అందుతున్నాయి. శ్రమసంస్కృతి, శక్తి సామర్థ్యాలు గల వారిని ఇవి ఆకర్షిస్తున్నాయి. ఈ పౌరసమాజా లకే ప్రభుత్వ వత్తాసు లభిస్తోంది. ప్రజాస్వామ్య పౌరసమాజాల ను జాతి వ్యతిరేకులని, అభివృద్ధి నిరోధకులని, భారత అభి వృద్ధిని అడ్డుకునే విదేశాలకు, ప్రత్యేకించి పాకిస్తాన్‌కు,వత్తాసు పలుకుతున్నారని పాలకులు నిందిస్తున్నారు. గ్రీన్ పీస్, కోర్డాయి డ్, ఆమ్నెస్టి, యాక్షన్ ఎయిడ్ వంటి సంస్థలను దేశ ఆర్థిక భద్రతకు హానికరమని, ఆందోళన కార్యక్రమాలలో పాల్గొన్నాయని, సానుభూతి పరిశోధనలకు నిధులు ఇచ్చాయని, ఎన్నికలలో రాజకీయ పార్టీలకు సాయంచేశాయని నిందారోపణలతో వాటి కార్యక్రమాలను అడ్డుకున్నారు. నిధులను, బ్యాంకు అకౌం ట్లను స్థంభించారు. సాధ్యంకాని అతి కఠిన నియమాలను విధిం చారు. నిర్వహణ ఖర్చులకు విదేశీ నిధుల ఉపయోగాన్ని 50 నుండి 20 శాతానికి తగ్గించమని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీచేశారు. నేటి భారత స్థితిగతులు ఇవే.

**ప్రభుత్వాలు పౌరసమాజాన్ని ముప్పుగా గాక సంపదగా చూడాలి. అది ప్రజాస్వామ్యాన్ని, అభివృద్ధిని, నిఘా విభాగ కార్యక్రమాలను సులభతరంచేస్తుందని, ఘర్షణల నివారణలో శాంతి స్థాపనలో కీలకపాత్ర పోషిస్తుందని ప్రభుత్వాలు గుర్తించాలి. సమాచార శాసన ఆర్థిక ప్రక్రియల పారదర్శకతను ప్రదర్శించాలి. పౌరసమాజ ప్రాథమిక హక్కును గుర్తించాలి. వాటి అధ్యయనాలు, పరిశోధనలు, ప్రతిపాదనలను సమాజ ప్రగతికి, దేశాభివృద్ధికి వినియోగించాలి.**

**ప్రభుత్వం - సమాజం - మార్కెట్ త్రికోణ ప్రజాస్వామ్యపాదాలలో పౌరసమాజం ఒకటి. ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చే ప్రజాస్వామ్య ఛత్రం లోనే బలమైన పౌరసమాజం మనగలుగుతుంది. సహజీవన సంబంధాలను కొనసాగించగలుగుతుంది. బహుళ సంస్కృతుల, సాంప్రదాయాల, మతాల, భాషల భారతీయ సమాజంలో ఆత్మనిర్భర భారత్ సాధనలో పౌరసమాజం అసమాన కృషి చేయగలదు.**


పేదరికం, అసమానతలు పెరిగిన దశలో పౌరసమాజం పాత్ర పెరిగింది.పౌరుల కోరికలు-ప్రభుత్వ సేవల మధ్య, పౌరుల ఆందోళనలు-ప్రభుత్వపరిమితుల మధ్య ఆదర్శ పౌరసమాజం సమతుల సంధాన శక్తిగా పనిచేస్తుంది. సమస్యలు తీవ్రతరం కాకుండా పనిచేస్తుంది. దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులను,సమస్యలను గమనించి పరిష్కా రాలను సూచిస్తుంది. వాటి అమలుకు ప్రభుత్వంపై వత్తిడి తెస్తుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పౌరసమాజంలోని అన్ని అంగాలు, తమ అరమరికలు, గమన విభేదాలు మరిచి, ఉమ్మడి గమ్య సాధనకోసం కృషిచేయాలి. ❑

# భారత సమాజం..
# గ్రాంసీ ఆలోచనలు



**మహమ్మద్ అక్బర్**

**భారత సమాజంలో అంతర్గతంగా ఉన్న కుల వ్యవస్థతోపాటు, అనేక దేశాల దండయాత్రల వలన, భారతదేశ సమాజాలు ఎంతో సంక్లిష్టమైనవి. ప్రజలు మాట్లాడే భాషలు, వారి వేష భాషలు, సంస్కృతులను బట్టి జాతులు ఏర్పడతాయి. ఉదా: తెలుగు జాతి, తమిళ జాతి, మలయాళ జాతి, మరాఠీ జాతి, గుజరాతి జాతి మొదలైనవి. ఈ జాతులన్నీ బ్రిటీషు వలసవాద ఆక్రమణలతో ఎంతో నష్టపోయాయి. కొన్ని ప్రయోజనాలు (తంతి, తపాలా, రవాణా మార్గాలు) పొందాయి. కరువు కాటకాలతో కోట్లాది భారతీయులు నశించిపోయిన విషయం మనకు తెలిసిందే. 'ఈ నేపథ్యంలో గ్రాంసీ మహాశయుని ఆలోచనలు భారతదేశ సమస్యలను అవగాహన చేసుకునేందుకు దోహదపడుతుందనే భావనతో, నేను ఈ వ్యాసాన్ని రాస్తున్నాను.**




ఆంటోనియో గ్రాంసీ ఇటలీ దేశపు మార్క్సిష్టు సిద్ధాంతవేత్త. ఆయన కారల్‌మార్క్స్ రచనలను అధ్యయనం చేసి, మార్క్సిజాన్ని ఇంకా అభివృద్ధి చేశారు. కారల్ మార్క్స్ ఏ సమాజానికైనా, ఆర్థిక అంశాలు (అంటే ఉత్పత్తి, ఉత్పత్తి సంబంధాలు) పునాది అని, రాజకీయాలు, చట్టాలు, సంస్కృతి, నైతిక అంశాలు.. ఉపరితల అంశాలనీ, పునాదికి, ఉపరితలానికి మధ్య గతితార్కిక సంబంధం (అనగా ఒక దానిని మరొకటి ప్రభావితం చేస్తూ, నిర్ణయాత్మక సంబంధం కలిగి ఉంటుంది.) ఉంటుందనీ, వీటి మధ్య (ఘర్షణ/పోరాటం జరిగి, మరొక కొత్త వ్యవస్థ ఏర్పడు తుందని సిద్ధాంతీకరించాడు. (స్థూలంగా వివరణ) గ్రాంసీ తన దేశ పరిస్థితుల్లో ముఖ్యంగా ముస్సోలిని పాలనలో ఫాసిజం రూపుదిద్దుకోవడాన్ని అధ్యయనం చేసి(అంటే ఉపరితల అంశాన్ని) మారుతున్న పరిస్థితులలో ఉపరితలానికి సంబంధిం చిన కొత్త అంశాలను చేర్చాడు. తన ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్రాయసాగాడు. ఇవి తన పాలనకు ప్రమాదమని భావించిన దేశ పాలికుడు ముసోలిన్, తన అధికారబలంతో గ్రాంసీకి 20 సంవత్సరాల జైలుశిక్ష వేయించాడు. జైలు నుండి విడుదలైన కొద్ది కాలానికే పిన్న వయసులో అనారోగ్యంతో మరణించాడు గ్రాంసీ. జైలులో ఉండగానే తాను రాసిన వ్యాసా లను, లేఖల ద్వారా రహస్యంగా బయటి తన మిత్రులకు పం పించాడు. వీటిని 'జైలు లేఖలు" అని పిలుస్తున్నారు. అయితే ఆయన లేఖల సారాంశం కారల్ మార్క్స్ సిద్ధాంతానికి మరింత వివరణయే, కాని వ్యతిరేకం కాదు. అయితే అనంతర సిద్ధాంత వేత్తలు గ్రాంసీ ఆలోచనల వక్రీకరించి వ్యాసాలు వ్రాశారు.

## గ్రాంసీ సిద్ధాంతం :

ప్రతి సమాజంలో రెండు రకాల ప్రజలు ఉంటారు. ఒకరు పాలకులు అనగా తమ విధానాలతో ప్రజలపై ఆధిపత్యం వహించి పాలించేవారు. రెండవ వారు పాలితులు అంటే పాలకుల విధానాలతో పాలింపబడేవారు. పాలకులు సంఖ్య రీత్యా మైనారిటీ, చాలా తెలివి గలవారు. ప్రపంచగమనాన్ని

ప్రజల ఆలోచనలను గ్రహించగలిగిన సామర్థ్యం కలిగిన వారు. వీరు ప్రజల ఆలోచనలలో వస్తున్న మార్పులను గమనించి, తమ పాలనకు రానున్న ప్రమాదాన్ని అంచనా వేయగల సర్వశక్తి మంతులు. వారి ఆయుధం ప్రజలను ఏ మార్గంలోనైనా విడగొట్టి పాలించడం. పాలకులు ప్రజలను తమ ఆధిపత్యంలో బంధించడానికి రెండు విధాలుగా ప్రయత్నిస్తుంటారు.

**మొదటిది :** బల ప్రయోగంతో పరిపాలించడం. అంటే చట్టాలు, కోర్టులు, పోలీసులు, సైన్యం, జైళ్ళు, వంటి అణచివేసే పద్ధతులను ఉపయోగించి, ప్రజలలో భయోత్పతాన్ని కలిగించి, ప్రజలను తమ ఆధిపత్యంలో ఉంచుకొని తిరుగుబాటు చేయకుండా చూసుకొని, పరిపాలన సాగిస్తుంటారు. ఇది ఎక్కువ మందికి తెలిసిన అంశమే.

**రెండవ పద్ధతి :** ప్రజల ఆలోచనలను అనేక పద్ధతులలో నియంత్రించడం, ఈ పద్ధతి చాలా మందికి సులువుగా అర్థం కాదు. కారణమేమంటే పాలకులు ప్రజలను పాలించడానికి ప్రజల సమ్మతిని పొందుతారు. ఇందుకు పాలకులకు మంచి ఆయుధం సంస్కృతిని ఉపయోగించుకోవడం. ఈ సంస్కృతిలో సాహిత్యం, కళలు, విజ్ఞానం, మనోవిజ్ఞానం.. తదితర అంశాలు మేళవించబడి ఉంటాయి. ఈ సాంస్కృతిక అంశాలపై పాలకులు, పాలితులు వివిధ రకాలుగా స్పందిస్తారు. ఈ సంస్కృతి అంశాలన్నిటినీ కలిపి పౌర సమాజం అని అంటాడు గ్రాంసీ. గ్రాంసీ ఈ పౌర సమాజాన్ని విశ్లేషిస్తూ జైలు నుండి ఉత్తరాలు వ్రాశాడు. పౌరసమాజంలో అతి ముఖ్యమైనవి, కుటుంబ నేపథ్యం, విద్య, వైద్యంతో కలగలిసిన సాంస్కృతిక వాతావరణ నేపథ్యం. గ్రాంసీ రాజకీయ అధికారమనేది సగం నిర్బంధం, సగం స్వచ్ఛంద అంగీకారం అంటాడు. అంటే ఈ అధికారం సగం మనిషి సగం జంతువులాంటిది. ప్రజలు తమ ఇష్టంతోనే పాలించడానికి ఈ సమ్మతిని పాలకులకు ఇచ్చేస్తారు. (భారతదేశంలో ఓటు ద్వారా తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు, ఇష్టంతోనే నా పాలకులు తమ పరిపాలనను కొనసాగిస్తారు. ఇపుడు పాలితులు అంటే పాలింపబడే ప్రజల గురించి తెలుసుకుందాం. పాలితులలో రెండు రకాల ప్రజలు ఉంటారు. సామాన్య ప్రజలు, మధ్యతరగతి ప్రజలు వీరిలో ఎక్కువ శాతం సామాన్య ప్రజలు, తక్కువ శాతం మధ్య తరగతి ప్రజలు ఇది చాలా స్థూలమైన వివరణ. రాజకీయ అభిప్రాయాలు మారేకొద్దీ, సామాన్య ప్రజలలో కొందరు, మధ్య తరగతి ప్రజలలో మరికొందరు రాజకీయవేత్తలుగా మారుతూ ఉంటారు. మధ్య తరగతి ప్రజల ఆలోచనలు (ముఖ్యంగా టీచర్లు, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు) సామాన్య ప్రజల ఆలోచనలకూ భిన్నంగా ఉంటాయని మనకు తెలిసిందే. కాని ఆ వైవిధ్యభరిత ఆలోచనలకు మూల కారణాలు కొద్దిమందికి మాత్రమే తెలుసు. కారణం వారికి బయటి ప్రపంచంపట్ల ఆసక్తి తక్కువగా ఉంటుంది. వ్యక్తిగత ధోరణులు ఎక్కువ. పాలకుల చర్యలు తెలిసినా మనకెందుకులే అనే ధోరణి ఎక్కువ.

సామాన్య ప్రజలలో ఎక్కువ మంది శారీరక శ్రామికులే, వ్యవసాయదారులు, చేతి వృత్తుల వారు, కార్మికులు, రోజు వారి పనులు చేసుకునేవారు. వీరు తమ తమ పనులలో నిమగ్నమై, బ్రతుకుబండి లాగుతూ జీవనం సాగిస్తుంటారు. వీరికి పాలకుల నిర్బంధచర్యలు తెలుసుకునే అవకాశం కొంత మేరకు ఉండవచ్చు. కాని ఎక్కువ మంది, మధ్యతరగతి ప్రజలలాగే భయపడుతూ ఉంటారు. గ్రామాలలో ఉండే భూస్వాములు, ధనిక రైతులు పాలకులతో చేతులు కలిసి, సామాన్య ప్రజలను తమ ఆధిపత్యంలో ఉంచుకోడానికి ప్రయత్నిస్తుంటారు. ఇంతకూ, పాలకులు సామాన్య ప్రజల అంగీకారాన్ని ఎలా పొందుతారో చూద్దాం. సంపన్నుల అందమైన భవనాలు, మంచి విద్య, మంచి ఉద్యోగం తదితరాలు సామాన్య ప్రజలను ఆకర్షిస్తాయి. గొప్ప ప్రభావాన్ని కలిగిస్తాయి. సామాన్య ప్రజలు కూడా సంపన్నులలాగే జీవించాలనీ కలలు కంటుంటారు. కాని, అలా జరగదని వారికి తెలుసు. కారణం వారికి సంపన్నుల జీవన విధానం అర్థం కాకుండా చేసే కొన్ని అడ్డంకులున్నాయి. అడ్డంకులలో కొన్ని ముఖ్యమైనవి : మత సంస్థలు, ప్రచార సాధనాలు, కార్మిక సంఘాలు, పత్రికలు, సినిమాలు, రాజకీయ పార్టీలు, విద్యా సంస్థలు, సాంస్కృతిక వ్యవస్థలు, ఆరోగ్య వ్యవస్థలు, ఆర్థిక రంగం వాణిజ్య వ్యాపారాలు, పరిశ్రమలు, వీటిలో అనేక సంస్థలు ముఖ్యంగా రాజకీయ సంస్థలు కలిసి రాజ్యాంగాన్ని, ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయి. అవి కాక, మిగిలిన వాటిని కలిపి 'పౌరసమాజం' అని పిలిచాడు గ్రాంసీ.

పౌర సమాజంలో కుటుంబాలు, సామాజిక సంబంధాలు ఉంటాయి. అయితే సామాజిక సంబంధాలు, ఆర్థిక సంబంధాల కంటే భిన్నమైనవి. రాజ్యం, ప్రభుత్వాలు పై వాటితో దేనితోనైనా సంబంధం లేనివిగా చాలా ప్రత్యేకమైనవిగా కనపడుతుంది. ప్రజల స్వచ్ఛంద అంగీకారంతో పౌర సమాజం నడుస్తుంది. అందుకే గ్రాంసీ రాజ్యానికీ/ప్రభుత్వానికి, పౌర సమాజానికి మధ్య సంబంధాలను ఈ విధంగా వివరించాడు. రాజ్యం / ప్రభుత్వమంటే, నిర్బంధ విధానంతో కలిసి ఉన్న ప్రజల స్వచ్ఛంద సమ్మతి అన్నాడు. రాజ్యాధికారం రాజ్యంలో / ప్రభుత్వంలో ఉన్నట్లే, పౌర సమాజమంతటా వ్యాపించి ఉంటుంది. సామాజిక సంబంధాలు పౌర సమాజంలో అధికార సంబంధాలుగా కూడా ఉంటాయి. రాజ్యం / ప్రభుత్వం పౌర సమాజం చుట్టూ రక్షణ కవచంలా ఉండి కాపాడుతుంది. ఒక వేళ రాజ్యానికి ఏమైనా తిరుగుబాటు వస్తే, పౌర సమాజానికి చెందిన రిజర్వు బలగాలు(ప్రభుత్వ మిత్రులు) వెంటనే కదలి

వచ్చి, రాజ్యానికి వచ్చిన ప్రమాదాన్ని ఎదుర్కొని కాపాడుతాయి. పాలకులకు అనుకూలమైన అభిప్రాయాలను ప్రజలలో కల్పించటానికి అనేక విధాలుగా కృషి చేస్తాయి.

## విద్యా వ్యవస్థ :

అత్యంత అభివృద్ధి చెందిన దేశాలలో కూడా, కార్మికుల పిల్లలలో అత్యధికులు కార్మికులుగానే జీవిస్తున్నారు. మధ్య తరగతికి చెందిన అత్యధికులు చిన్న ఉద్యోగులుగానే ఉంటున్నారు. సంపన్నుల పిల్లలు సంపన్నులుగా ఉంటున్నారు. అమెరికాలో జరిగిన అధ్యయనం ప్రకారం, 'కుటుంబ నేపథ్యం' పిల్లలపై 'నిర్ణయాత్మక ప్రభావాన్ని కలిగించింది. ఆ విద్యార్థులు ఏ అసమానతలతో స్కూల్లో ప్రవేశిస్తారో అవే అసమానతలు స్కూలు విద్య పూర్తయిన తరువాత కొనసాగుతున్నాయని, 1996 కోల్మన్ రిపోర్టు తెలియజేస్తున్నది. ఇది భారతదేశానికి కూడా వర్తిస్తుంది. పాఠశాలలు 'సాంస్కృతిక పునరుత్పత్తి'కి ఒక సాధనంగా ఉన్నదని అనేకమంది అంగీకరిస్తున్నారు. ఈ విధానంలో కింది వర్గాల పిల్లలు తమ కుటుంబ నేపథ్యాన్ని గమనంలో ఉంచుకొని, తాము పెద్ద వారైన తర్వాత, అధిక వేతనాల వచ్చే ఉద్యోగాలు కాని, ఉన్నతస్థాయిని గాని పొందలేమని అత్యధికులు గ్రహిస్తారు. తాము సంపన్నులకంటే 'తెలివి గలవారము కామ'ని తమ అల్పత్వాన్ని అంగీకరించి, తమంతట తామే తమ సామాజిక తరగతిలోకి వెళ్ళేందుకు సిద్ధమవుతారు. పాలకవర్గాలైన పారిశ్రామికవేత్తలు పాఠశాలలు ఉంటేనే తమకు ప్రయోజనకరమని భావిస్తుంటారు. పాఠశాలలే పిల్లల మనసుల్లో పారిశ్రామికవేత్తలకు అవసరమైన విలువలను సృష్టిస్తూ, వారి ఆధిక్యతను సమర్థించే సంస్కృతిని పాఠశాలలే కల్పిస్తాయి. చాలా కాలం నుండి పౌర సమాజంలో ఇదే కొనసాగుతున్నది.

## ఆరోగ్య రంగం :

విజ్ఞాన శాస్త్రాలు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, రోగ కారకాలను, అనారోగ్యాన్ని గుర్తించడానికి బదులు, ఆరోగ్యం గురించి ఒక అవాస్తవికమైన అభిప్రాయాలు మన దేశంలో ఇంకా కొనసాగుతున్నాయి. 'రోగాలు లేకపోవడమే ఆరోగ్యమనీ, డాక్టర్లు, మందులతో రోగాలను నయం చేస్తారని ఎక్కువ మంది ప్రజలు భావిస్తున్నారు. ఆరోగ్యానికి సంబంధించిన ఈ ఆలోచనలు, ఒక సంస్కృతిగా రూపొంది, ఈ రోజు మందుల పరిశ్రమ విపరీతమైన లాభాలను దండుకుంటున్నది. కోవిడ్ సందర్భంగా బహుళజాతి కంపెనీలు ప్రజలను విపరీతంగా దోచుకున్న విషయం మనకు తెలిసిందే. 90 శాతం మందులు పనికి మాలినవని తెలిసినా, ప్రతి రోగానికి కళ్ళు మూసుకొని మాత్రలు మింగడమనే సంస్కృతి పెరిగింది. దీనితో మందుల పరిశ్రమలు లక్షల కోట్లలో లాభాలు పొందుతున్నాయి. తెలిసి డాక్టర్లు మోసానికి పాల్పడుతున్నారా? కాదు. వారికి ఒక ప్రత్యేక తరహా వైద్య విద్య బోధింపబడుతున్నందు వల్ల, అలా చేస్తున్నారు. జనం ఈ మందుల సంస్కృతి అనే ఊబిలో దిగబడి, తమ సంస్కృతిని వెతుక్కుంటున్నారు. ఈ ఆరోగ్య సంస్థలు, ఆరోగ్య సంస్కృతి పాలకులకు వరాలు కురిపిస్తున్నాయి. పాలకులు వ్యాధులను సామాజిక సమస్యలుగా చూడ నిరాకరి స్తున్నారు. జనాభా సమస్యను పేద ప్రజల సెక్స్ సమస్యగా చూస్తున్నారు. దారిద్రం, దానికి సంబంధించిన సమస్యల వల్లే పేద ప్రజలు ఎక్కువ మంది పిల్లలను కోరుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఆదుకుంటారనే ఆశతో, ఈ విధంగా అనేక సమస్యల సంస్కృతితో దారిద్రంతో ముడిపడి ఉన్నాయి. అందువల్ల సాంస్కృతోద్యమం ఆరోగ్య సంస్కృతిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది.

## ప్రపంచీకరణం సంస్కృతి :

నేటి ప్రపంచీకరణయుగంలో అమెరికాకు, యూరపుకు అనుకూలమైన అభిప్రాయాలు కల్పించడం వ్యాపార ప్రకటనల ద్వారా తమ సరుకులకు గిరాకి సృష్టించుకోవడం, కొద్దిమంది మాత్రమే గ్రహిస్తున్నారు. పెద్ద జనాభా కలిగి ఉన్న భారతదేశం, మూఢ నమ్మకాలకు కేంద్రంగా ఉన్న పరిస్థితిని మన పాలకులు తమ వ్యాపారాలకు అనువుగా వాడుకుంటున్నారు. టీవి సీరియల్స్ ద్వారా కాలం చెల్లిన పాత విలువలను ప్రజల మనస్సులలో ఎక్కించి, సమాజాన్ని కులాల, మతాల ఆలోచనలతో భూస్వామ్య యుగాల సంస్కృతికి మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారు, విదేశీ, స్వదేశీ పాలకులు, కలగలిపి సామాజిక సమస్యలను దేవుడి కటాక్షమే నిర్ణయిస్తుందని ప్రజల మనస్సులలో కాలుష్యాన్ని నింపుతున్నారు. యువతలో క్రికెట్ ఆటయే సర్వస్వమనే భావాలను చొప్పిస్తున్నారు. మద్యానికి దాసోహం చేస్తున్నారు.

ముగింపు : గ్రాంసీ ఆలోచనలు, కారల్ మార్క్స్ సిద్ధాంతం మాదిరి ప్రపంచంలోని అన్ని సమాజాలకు వర్తిస్తాయి. భారత దేశంలో చరిత్రను వక్రీకరిస్తూ, గత హిందూ రాజుల పాలన స్వర్ణయుగమనీ, ముస్లిం రాజుల పాలనతోనే భారత సమాజంలో సమస్త దోషాలు వచ్చి చేశాయనీ, దానితో భారత సమాజం క్షీణించిందనీ బాహాటంగానే ప్రకటనలు వెలువడుతున్నాయి. నేటి భారతదేశ పాలకులు కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతూ, ప్రజలను వేధిస్తున్న ధరల పెరుగుదల వంటి సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారు. గ్రాంసీ చెప్పినట్లు అత్యధిక ప్రజల సమ్మతిని పొందుతున్నారు. అందువల్ల మన నేటి కర్తవ్యం ఏమంటే పౌర సమాజంలోని సామాజిక సమస్యలను రాజకీయ ఆర్థిక సమస్యలతో జోడించి ఒక సమగ్ర విశ్లేషణ ద్వారా అధ్యయనం చేయాలి. ఈ ప్రక్రియలో విద్యావంతులను ప్రజాతంత్ర, అభివృద్ధి కాముక, శక్తులను వామపక్ష శక్తులతో కలిపి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. ❑


# గ్రాంసీ : ప్రసార మాధ్యమాల్లో పురుషస్వామ్యం



కోమల్ తుజారె

**గ్రాంసీ తన జైలు రాతప్రతుల్లో ప్రస్తావించిన హెజిమొని (ఆధిపత్య) భావన తర్వాతి సంవత్సరాలలో అనేక వ్యాఖ్యానాల కు గురైంది. జైలులో రోజు రోజుకు క్షీణిస్తున్న ఆరోగ్యం వల్ల గ్రాంసీ ఆ భావనని క్రమబద్ధంగా విశ్లేషించలేకపోవడమే ఇందుకు కారణం. అయినా ఈ వ్యాఖ్యానాలన్నిటిలో ఒక అంశం సాధారణంగా కనిపిస్తుంది. అది హెజిమొనీలో ప్రజలూ, సామాజిక వర్గాలూ అధికారం ద్వారా మాత్రమే కాదు, భావనల ద్వారా కూడా పరిపాలింపబడతారని అర్థం చేసుకోవడం. చరిత్ర అనేకమార్లు రుజువు చేసినట్టుగా, ఈ భావనలు పాలకవర్గాల భావనలే నన్న అంశంలో కూడా వ్యాఖ్యాతలందరిలో ఏకీభావం ఉంది.**

మార్క్స్ స్వయంగా చెప్పినట్టుగా ప్రతి యుగంలోనూ ప్రజల్ని పాలించిన భావనలన్నీ పాలకవర్గ భావనలే. ఈ హెజిమొనీ పునాది, ఉపరితలాంశాల మధ్యతుల్యతను సృష్టించి వర్గ సంఘర్షణ తలెత్తకుండా చేస్తుంది. సమాజం వర్గ సంఘర్షణకు లోను కాకుండా క్షేమంగా ఉంచే సాధనమే హెజిమొనీ అయితే




ఇప్పటి పాలక వర్గం ఉపరితలం నుంచి పునాదిలోకి ప్రసరింప చేసి మన ఆమోదం పొందిన భావజాలం సహాయంతోనే మన ల్ని పరిపాలిస్తున్నదనీ అంగీకరించాలి. గ్రాంసీ అంటున్నాడు.. 'భావ జాల నిర్మాణంలో పత్రికలది చోదక పాత్రే కానీ ఏకైక పాత్ర కాదు. ప్రజాభిప్రాయాన్ని ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ప్రభావితం చేసే ప్రతి అంశమూ ఇందులో తన పాత్రను నిర్వహిస్తుంది'. ఇక్కడ 'భావజాల నిర్మాణం' అన్నది గుర్తిం చవలసిన పదబంధం. గ్రాంసీ హెజిమొని సిద్ధాంతంలో ప్రము ఖంగా ప్రస్తావనకు వచ్చే 'భావజాలం ద్వారా పొందే అమోదం' ఘర్షణాత్మకమైందీ, హింసాత్మకమైందీ కాదు. సమ్మతితో సాధిం చే ఆమోదం అది. ఆధిపత్య వర్గాలను ప్రశ్నించే వీలు లేకుండా సాధించే ఈ ఆమోదంలో స్వేచ్ఛకూ ప్రజాస్వామ్యానికి జాగా ఉన్నట్టు కనిపిస్తుంది. అసలు భావనలే, ముఖ్యంగా తప్పుడు భావనలే సమాజంలో వేళ్లూనుకునిపోయి స్వాభావికంగా మారి ప్రశ్నించే అవకాశాన్ని వ్వవు. ఇట్లా భావజాలం హెజిమొనీ లో ముఖ్యపాత్ర వహిస్తే, ఈ హెజిమొనీ పాలకవర్గాలు ఆధిప త్యం చలాయించడానికి దన్నుగా నిలుస్తుంది.

21వ శతాబ్దంలో సమాచార సాధనాలూ వ్యాపార ప్రకట నలూ పాలకవర్గాల చేతుల్లో పనిముట్లై ప్రజల భావనల్ని నియంత్రిస్తున్నాయి. అందువల్లనే వ్యాపార ప్రకటనల్లో అధిక శాతం పురుష స్వామిక వ్యవస్థని యదాతథంగా ఉంచే లింగ వివక్షను పోషిస్తున్నాయి. థియోడోర్ అడోర్నో, మాక్స్ హార్కిమీర్ లు తమ వ్యాసం 'ద కల్చర్ ఇండస్ట్రీ'లో అన్నట్టుగా నువ్వు దేనికైతే expose అయి ఉన్నావో ఆ ప్రతీది నీ మీద ఆధిపత్యం చలాయిస్తుంది. నువ్వు చదివే పుస్తకాలూ, వినే పాటలూ, చూసే సినిమాలూ, షోలు, వ్యాపార ప్రకటనలూ అన్నీ భావజాలంలో అంతర్భాగమై హెజిమొనీని నిర్మిస్తాయి. ఇది బహిరంగ విషయమే, గోప్యత ఏమీలేదు. మన చూట్టూ ఉన్న ప్రతీ అంశమూ విశాలమైన పాలనాధిపత్యం అనే తానులో ముక్కే. ఈ అంశాన్ని వివరించడానికి మీడియాలో మహిళల ప్రాతి నిధ్యం గురించి చర్చిస్తాను. సినిమాల్లో, టీవీ షోలలో, పాటల్లో, వ్యాపారప్రకటనల్లో మహిళలెట్లా వివక్షకు గురిచేయబడుతు న్నారో చూస్తూనే ఉన్నాం. అవి హనీసింగ్ పాటలు కావొచ్చు,

పొట్టి దుస్తులేసుకున్న మహిళలు పురుషుడి వెంట పరుగెత్తే ఏక్స్ (Axe) డియోడరెంట్ వంటి వ్యాపార ప్రకటనలు కావొచ్చు మీడియా నిండా మహిళల్ని కించపరచే ప్రదర్శనలే. మనం గమనించినా గమనించకపోయినా మహిళలు ఉమ్మడి వస్తువులు గా శారీరక సంతోష సౌందర్య హేతువులుగా మాత్రమే చూడ బడే భావజాలానికి లోనై ఉన్నాం. ఈ ప్రకటనల్లో మహిళలకిచ్చే పాత్రలన్నీ ఇంట్లో అందరి అవసరాలూ తీర్చే ఆదర్శవంతమైన ఇల్లాలు లేదా అమ్మ లేదా కోడలు పాత్రలే. దాదాపు సబ్బుల ప్రకటనల్లో కనిపించే ఇల్లాళ్లందరూ ప్రేమను పంచే, జాగ్రత్త వహించే, బలహీనమైన, సాత్వికమైన వారే. తేలికగా లోబడి ఉండి, సహచరులచేత ఆర్థికంగానే కాదు, శారీరకంగా మానసి కంగా ఆధిపత్యం వహించబడడానికి అనుకూలంగా ఉండేవారే. ఈ నమూనా మహిళలు స్త్రీలుగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడంలోనే కాదు అందానికి నిర్వచనాలుగా సన్నగా నాజూకుగా తెల్లగా పొడవుగా ఉండడానికి ప్రాధాన్యత నిస్తారు. అంతేకాదు, అంగీకరింపబడిన మూసలో బట్టలు ధరించడానికీ, నడవడానికీ, నవ్వడానికీ, మాట్లాడడానికీ ఇష్టపడతారు.

> **ఏ టీవీ షో లావుగా నల్లగా పొట్టిగా ఉండే మహిళల్ని చూపించదు. ఒకవేళ చూపించవలసి వస్తే వాళ్లు దుర్మార్గులో హాస్యకత్తెలో అయి ఉంటారు. ఆధిపత్యం చలాయించగలిగే స్వతంత్ర ప్రవృత్తి గలిగిన మహిళలను రాక్షసులుగా చిత్రించడం శతాబ్దాలుగా సాగుతున్న మరో చరిత్ర. కాబట్టి పురుషులు మహిళల మీద హెజిమొనీ కలిగి ఉండడం ఒక అంశమైతే, మహిళల్లో కొందరు మిగిలిన మహిళలపై ఆధిపత్యం కలిగి ఉండడం మరొక అంశం.**

వ్యవస్థ బీటలు వారకుండా ఉండడానికి సామాజిక నిర్మాణం ఇటువంటి భావనల్ని శాశ్వతం చేసే ప్రయత్నం చేస్తుంది. పురుషుడు స్త్రీ మీద చలాయించే ఆధిపత్యం ఆమోదం పొంది, వ్యవస్థను ప్రశ్నించే విధానాన్నే మరచిపోయేటట్టు చేస్తుంది. గ్రాంసీ హెజిమొనీలో పాలకవర్గాలు తాము అధికారంలో ఉన్నట్టు భావించుకుంటాయి కానీ అది ప్రజలు ఇచ్చిన అధికా రం కాదు. అందువల్ల స్త్రీ పురుష సంబంధాలు కొంత అను కూల ధోరణితో కొంత వ్యతిరేక ధోరణితో నిరంతరం సాగుతూ ఉంటాయి. సిమన్ డిబూవర్ తన పుస్తకం 'ద సెకండ్ సెక్స్' లో చెప్పినట్టు పురుషుణ్ణి స్త్రీని బానిసగా చూస్తూ మహరాణిగా నమ్మించే ప్రయత్నం ఒక విధానంగా నడుస్తూ ఉంటుంది. ఆధునిక యుగం స్త్రీకి చాలా మేరకు స్వేచ్ఛాయుతమైన చోటు ను కల్పించినా పురుషుడితో సమానస్థాయి ఇవ్వడానికి ఇంకా చాలా దూరంలో నిలబడిఉంది. ఈ విషయం చెప్పడానికి 2015లో విడుదలైన ఎయిర్ టెల్ ప్రకటన మంచి ఉదాహరణ. ఈ ప్రకటనలో ఒకే ఆఫీసులో తన భర్తకన్నా ఉన్నతస్థాయి ఉద్యోగం చేసే మహిళ ఇంట్లో వంట వార్పు చేసి భర్త రాకకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఆఫీసులో స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటూ భర్తకు ఆదేశాలిచ్చే ఆ మహిళ ఇంటి దగ్గర మాత్రం సేవకురాలే. ఈ ప్రకటన పురుషాధిపత్యాన్ని కొంతమేర ప్రతిఘటించినా చివరకు మహిళ బయట ఎన్ని విజయాలు సాధించినా ఇంటికి వచ్చి భావజాలం అంగీకరించిన నమూనా మహిళగా మారిపోవడాన్ని చూపుతుంది. భారతీయ కండోమ్ ప్రకటనల్లో చూపించే లైంగిక క్రియలో పురుషునిదెప్పుడూ చురుకైన పాత్రే. మహిళది పురుషునికి సంతృప్తి కలగడానికి సహకరించే సహాయకపాత్ర మాత్రమే. డిటర్జెంట్ ప్రకటనల్లో పురుషులు ఉద్యోగాలు చెయ్యడానికి బయటికివెళ్తే వారైతే మహిళలు పాత చీరలు కట్టుకుని బట్టలు ఉతికేవారై ఉంటారు. థమ్సప్ ప్రకటనల్లో పురుషులు ప్రాణాంతక మైన స్టంట్‌లలో పాల్గొని తమ సామర్థ్యాలను రుజువుపరచుకుం టుంటే మహిళలు రుతుసమస్యల్ని కూడా బహిరంగంగా కాక నర్మగర్భంగానో గుసగుసలు(Whisper) గానో మాట్లాడుకుం టారు. 2012 లో వచ్చిన యమ్‌టీఆర్ ప్రకటనలో తల్లి కుటుంబంలో ఉన్న వాళ్లందరి రుచులను సంతృప్తి పరచడానికి మూడు జతల చేతులతో ఆరు రకాల వంటలను ఏకకాలంలో చేస్తూ ఉంటుంది. ఇది వంట గదికే పరిమితం చేసినన్నాళ్లు మహిళలు ఎట్లా దైవికశక్తుల్ని సంతరించుకుంటారో తెలియ చెప్తుంది. ఇక మహిళల శరీరాకృతికి సంబంధించిన ప్రకటనల కు లెక్కే లేదు. మహిళల శరీరం మీద పురుషుల ఆధిపత్యం ప్రదర్శించే బాలీవుడ్ పాటలు కొల్లలుగా ఉన్నాయి. 1974 నాటి కభీ కభీ గీతంలో కీ జైసె తుఝే కో బనాయా గయాహై మేరె లియే (నువ్వు నా కోసమే ఎట్లా తయారు చేయబడినావో) మొదలు 1994 నాటి తూ చీజ్ బడీ హై మస్త్ మస్త్ (నువ్వు మహా బాగా ఉన్నదానివి) వరకూ స్త్రీ వస్తువుగానే చూడబడింది.

మహిళలు తమను తామే పురుషులను సంతృప్తిపరచే సాధనా లుగా ప్రకటించుకోవడం కనిపిస్తుంది. 2012 నాటి ఫెవికాల్ సె పాటలోని ఈ వాక్యాలు చూడండి: మై తో తందూరీ ముర్గీ హూ యార్(నేనొక తందూరీ కోడిని రా అంటే ముక్కలు చేయ కుండా ఆ పళంగా వండిన కోడిని, నీచేత ఆబగా తినబడడానికి సిద్ధంగా ఉన్నాను) ఇది మహిళల మీద చూపించే ఆధిపత్యంలో కొత్తకోణం. అంటే లింగ వివక్షకు కారణం కేవలం పురుషుల అణచి వేత మాత్రమే కాదనీ మహిళలు తమను తాము పురుషునికి బలి పెట్టుకోవడం కూడా ఉందని చెబుతుంది. ఇదే హెజిమొనీ పునాది. హెజిమొనీ అంటే ఎదుటి వారి సమ్మతితో వారిపై ఆధిపత్యం చలాయించడం. మహిళల్ని పురుషులు రెండో సగం(సెకండ్ సెక్స్)గా చెయ్యడం వల్లనే కాక వారు అంగీకరించినందువల్ల మహిళలు ద్వితీయశ్రేణికి చేరుకున్నారు. హెజిమొనీలో స్థిరపడిన (మిగతా 87వ పేజీలో)


# ఆధిపత్య సంస్కృతి - గ్రాంసీ వెలుగులో ప్రతిఘటన



కె.శాంతారావు

**వర్గ చైతన్యమే వర్గ పునాది అని భావించినవారు, ఆ చైతన్యాన్నే పరమావధిగా భావించి తలచి ఎప్పటికప్పుడు అధ్యయనంలో తమ ప్రాపంచికవర్గ దృక్పథాన్ని పదును పెట్టుకుంటూ ఉంటారు. తాము తెలుసుకున్న జ్ఞానాన్ని శ్రేణులకు, స్నేహితులకు, ఆ తర్వాత ప్రజలకు ఉద్యమాల ద్వారా వంట పట్టించేలా పాటు పడతారు. తత్సంబంధిత వ్యూహాలు, ప్రణాళికలు రచించి పాఠశాలలు, గోష్టులు, సదస్సులు నిర్వహించడం కమ్యూనిస్టులకు కొత్తేం కాదు. అయితే ఇది నిబద్ధతతో కూడిన నిత్య ప్రక్రియ. ఈ ప్రక్రియలో ఏ మాత్రం అలక్ష్యం, శూన్యం ఆవహించినా, ఆ శూన్యంలోకి అన్యవర్గ భావజాలమో, ఆధిపత్య భావజాలమో రాక మానదు. అందుకే చైతన్యవంతమైన కార్యకర్తలు నిత్య జాగరూకతతో ఎప్పటికప్పుడు అప్రమత్తులవుతూ ఉంటారు. ఎందుకంటే మానవాళి విముక్తికి దారి దీపం వర్గ సంఘర్షణే కదా.**

సాంస్కృతిక చైతన్యం అనేది విడదీయలేని జంట పదం సంస్కృతి స్థల కాలాదులకు లోబడి ఉంటుంది. ప్రాంతం ప్రాంతానికి, తరతరానికి మారుతూనే ఉంటుంది. ఓ సామూహిక జీవన విధానంగా 'సంస్కృతి'ని నిర్వచించినప్పుడు ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, అలవాట్లతోపాటు భాష, భావధార (ఆలోచనా తీరు) సంస్కృతిలో అంతర్భాగం అవుతుంది. సాంస్కృతిక ఆధిపత్యం(హెజిమోని) అంటే సైద్ధాంతిక సాంస్కృతిక మార్గాల్లో పాలకులు పట్టు సంపాదించడం అని గ్రాంసీ పేర్కొంటాడు. అందుకు విలువలు ఆలోచనలు, అంచనాలు చివరకు ప్రాపంచిక దృక్పథాన్ని సైతం వారు తల క్రిందులు చేయగలరు. ఆచరణలో అవి అలా బలంగా సాగేలా అధికారంలో ఉన్న వారు వ్యవహరిస్తారు. మీడియాతో సహా సకల రాజకీయ, ఆర్థిక సంస్థను దాసోహం అయ్యేలా వారు చేసుకుంటారు. పాలకవర్గం తనదైన ప్రాపంచిక దృక్పథాన్ని రూపొందించే క్రమంలో సాంస్కృతిక జాతీయవాదాన్ని సృష్టించి బలంగా రుద్దుతుంది. దేశ సమాజం కోసమే తమ ఆర్థిక, రాజకీయ, నిర్మాణాలని పదే పదే చెబుతుంది. నిజంగానే వాటిని మేధావులతో సహా చాలా మంది విశ్వసిస్తారు కూడా. అయితే వాస్తవంగా ఆ నిర్మాణాలు పాలకవర్గానికే ఉపయోగపడతాయి. పాలకవర్గం వాటిని గుప్పెట్టపట్టి వాటి ద్వారా సమాజంపై పట్టును బిగిస్తుంది అని అంటాడు గ్రాంసీ.




రాజ్యాంగ వ్యవస్థలు-ఎన్నికల కమిషన్, కోర్టు, ఈ.డీ. ఐ.టీ, మీడియా మొదలైన వాటిని తమకు అనుకూలంగానూ, ప్రత్యర్థులకు వ్యతిరేకంగానూ ఉపయోగించడం నేడు మనం కళ్ళారా చూస్తున్నాం. దీనినే మరోలా చెప్తాడు గ్రాంసీ. 'పాలకవర్గం భావాలు కేవలం రాజ్యం ద్వారా మాత్రమే తమ ఆధిపత్యాన్ని చలాయించలేవు. రాజ్యం అనేది కేవలం కోట ముంగిట ఉండే కందకం వంటిది మాత్రమే కోటలోపల అనేక మార్గాలు, కట్టడాలు మాదిరి అనేక అంశాలు, వ్యవస్థలు పాలకవర్గ సాంస్కృతిక ఆధిపత్యాన్ని బలోపేతం చేస్తాయి. 20వ శతాబ్దంలో ప్రజాస్వామ్య సంస్కృతి బలోపేతం అయింది. రెండు ప్రపంచ యుద్ధాల ద్వారా పెల్లుబికిన విశ్వశాంతి ఉద్యమం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, వలసపాలనా విముక్తి స్వతంత్ర పోరాటాలు, అన్నింటికీమించి దోపిడీ, అణచివేత వ్యతిరేక పోరాటాలు మానవీయ పతాకను ఎత్తిపట్టాయి. మనిషిని మనిషిగా చూడాలనే

ఆధునిక భావనకు ఊపిరిలూదాయి. ఈ క్రమంలో ప్రజా స్వామ్య సంస్కృతి అనేది ఓ జీవన విధానంగా రాజకీయ కార్య కలాపాల్లోనే కాకుండా నిత్యదైనందిన కార్యక్రమాల్లో భాగస్వా మ్యం అయింది. అంతిమంగా సాటి మనిషిని గౌరవించడం, వారి హక్కులను గుర్తించడం, బాధితులకు శ్రామికులకు అండ గా నిలబడటం ఓ మానవీయ సంస్కృతిగా పరిఢవిల్లింది. గ్రాంసీ మానవహక్కుల కోణంలో మనిషి సంస్కృతిని పరిశీలించే తీరు ఆసక్తిగా ఉంటుంది. నాలుగు ప్రతిపాదనలు చేసాడు.

1. ప్రతివ్యక్తి సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాడో, తిరిగి సమాజం చేత ఏ విధంగా ప్రభావితం అవుతాడో తెలుసుకో వడం అవసరం. మనిషి సామాజిక జీవి అయినప్పుడు, అతని సామాజిక స్పృహను అంచనా వేసుకోవాలి. తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం అంటే సమాజాన్ని మార్చుకోవడమని గ్రహిం చాలి. మనిషిని గురించి అంచనా వేసే మార్గంలో ఆ మానవ సమాజానికి లభిస్తూన్న విజ్ఞానశాస్త్రానికి పారంపర్యంగా వస్తు న్న తత్వజ్ఞానానికి మధ్య గల సంబంధాన్ని కూడా అధ్యయనం చేయాలని చెప్తాడు. ఇదే వైయుక్తిక అంశా నికి-ప్రాకృతిక ప్రపంచానికి గల అంతర్లీన సంబంధంగా భావిస్తాడు.
2. మానవ హక్కులకు కేంద్రం సమాజమే తప్ప రాజ్యం కాదు అని తేల్చి చెబుతాడు. అంతేకాదు చైతన్యరహిత తిరుగుబాటు మానవ హక్కులకు ప్రమాదం అని కూడా అంటాడు. మనిషి తన అవసరాలు తీర్చుకునే (క్రమంలో) - ఏర్పరుచుకున్న ఉత్పత్తి(మానవ) సంబంధాలను, ప్రకృతిని మార్చుకోవలసి ఉంటుంది. ఆ ఘర్షణలో మానవ హక్కులు ఉనికిలోకి వస్తా యి. మానవహక్కుల ఉద్యమం మనుగడ పరిణతిపైనే రాజ్యం స్వభావం ఆధారపడి ఉంటుంది. రాజ్యాన్ని ప్రధానచోదక శక్తి గా చేసి సమాజాన్ని ద్వితీయ శ్రేణిగా భావిస్తే మానవహక్కుల అభివృద్ధి తిరోగమనంలో పడుతుందని గ్రాంసీ వివరిస్తాడు. అంటే ఇక్కడ ఉపశ్రేణులను, ప్రజా సంఘాలను, ప్రజా ఉద్య మాలను నిత్యం పనిలో ఉంచుతూ సామాజిక చైతన్యానికి అగ్రతాంబూలం ఇవ్వాలని వక్కాణిస్తాడు.
3. క్రింది వర్గాలలో చైతన్యమవుతున్నవారిని తమకు అనుకూలం గా మార్చుకుని, ఆ క్రింది వర్గాలపైనే పెత్తనం చేసే పద్ధతిని 'అణు పరిణామం'గా వర్ణిస్తాడు. నయానో, భయానో వారిని రాజ్యాధికారంలో కలుపుకోవడం-ఇది నిజంగా పీడిత వర్గాల స్వేచ్ఛాభివృద్ధికి పెద్ద ఆటంకం. ఈ ప్రక్రియ ద్వారా వారి సాంస్కృతిక చైతన్యం గందరగోళంలో పడుతుంది. సమాజం లో అణచివేతకు గురయ్యే అట్టడుగు వర్గాల వారు సహజం గానే తమ హక్కులను కోల్పోతారు. ఆ కోల్పోయే తీరును అని వార్యంగా తమ కళల్లో వ్యక్తీకరిస్తారు. అటువంటి కళాకృ తులను 'సబ్ - ఆల్‌టర్న్' అంటాడు గ్రాంసీ. వీటిని లోతుగా అధ్యయనం చేస్తేనే గానీ సామాజిక - సాంస్కృతిక చైతన్యం ఒక దానితో ఒకటి పెనవేసుకున్న తీరు అర్థం కాదు.
4. ఇక చివరగా రాజ్యం - పౌరసమాజం - వర్గం అనే త్రికోణం లో బందీ అయిన మనిషి, ఏ ఒక్కదాన్నో విమర్శించి, మిగిలిన వాటి పట్ల అంత శ్రద్ధ చూపకపోతే మనిషి సమూలంగా విముక్తి కావడం అసాధ్యం అని పేర్కొంటాడు. అందుకే సాం స్కృతిక రంగంలో వర్గపోరాటం అంటే కేవలం రాజ్యంపై అస్త్రాలను ఎక్కుపెడితే చాలదు. తనతో సహా తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిత్య జాగురుకతతో పరిశీలించడం, సరి చేసుకోవడం, అధ్యయనం చేయడం, శాంతియుత సహ జీవనానికి లేదా నిస్వార్థంగా ఆ వర్గాల హక్కులకు కట్టుబడే సజాతి కళాకారులు, మేధావుల (అర్థానికి ఆర్టిస్ట్స్, ఇంటలెక్టు వల్స్) కృషి అపారంగా తోడ్పడుతుందని తెలుపుతాడు. ఇప్పుడు మనకు ఎదురౌతున్న ఫాసిస్ట్ ప్రమాదంలో సాంస్కృతి ప్రతివ్యూహంగా మనం చేపట్టాల్సిన పనులు ఇవే. ❑

---

# ప్రసార మాధ్యమాల్లో పురుష స్వామ్యం

(85వ పేజీ తరువాయి)

జెండర్ భావ జాలం సిమన్ డి బూవర్ చెప్పినట్టుగా సహజం (nature) కాదు, కేవలం పెంచి పోషించ(nurture)బడినదే. దీనినే జుడిత్ బట్లర్ పదేపదే పేర్కొనడంద్వారా, ప్రదర్శించడం ద్వారా భావజాలాన్ని ఆమోదింపచెయ్యడం (performativity) అని అంటుంది. గ్రాంసీని ఉంటంకిస్తూ గిసెప్పీ పియోరి 1916 లో ఇట్లా అన్నాడు 'పురుషుడు సహజంగా ఉద్భవించినవాడు కాదు, చరిత్ర చేత నిర్మించబడినవాడు.' అందువల్ల ఇవాళ దేశంలోని స్త్రీ పురుషుల్ని మీడియా చూపిస్తున్న ఆదర్శ స్త్రీ పురు షుల ప్రతిరూపాలుగానే భావించాలి. స్త్రీల మీద పురుషుల హెజిమొనీ పితృస్వామ్య వ్యవస్థ సజావుగా సాగిపోవడానికే అను కూలిస్తుంది. అయితే భారతీయ మీడియా ఈ మూస భావజాలా న్ని బద్దలు కొట్టే ప్రయత్నం కొంతమేరకైనా చెయ్యకపోలేదు. ఇవాళ మరిన్ని వ్యాపార ప్రకటనల్లో స్త్రీలు స్వతంత్రులుగా తమ జీవితాల మీద తాము ఆధిపత్యం కలవారుగా కనిపిస్తున్నారు. తితన్ రాగ (టైటాన్ మహిళా వాచీలు) ప్రకటనలు స్వయం నిర్ణయ మహిళా ధారిత ఇతివృత్తాలతో వెలువడుతున్నాయి. వీటిల్లో మహిళలు తమ కెరీర్‌ను, జీవిత భాగస్వాములను ఎన్ను కోవడంలో స్వేచ్ఛను ప్రదర్శిస్తున్నారు. పెళ్లి చేసుకోవాలో చేసుకో కూడదో, చేసుకుంటే ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు చేసుకోవాలో నిర్ణయించుకుం టున్నారు. వీళ్లు సాంప్రదాయిక సమాజ నిర్మా ణాన్ని బద్దలు కొడుతున్నారు. పని స్థలాలలో మహిళలు సాధిస్తు న్న పురోగతి వారి అందచందాల ప్రదర్శన వల్ల కాదనీ, ఉద్యోగ మేధోసామ ర్థ్యాల వల్లనేనని రుజువుచేస్తున్నారు. పునరుత్పత్తి హక్కు తమ దేనని చెప్పడం ద్వారా మాతృత్వం త్యాగం కాదనీ మహిళల వ్యక్తిత్వానికీ, సాధికారతకు సంబంధించిన విషయ మనీ చాటుతున్నారు. ❑

# ప్రత్యామ్నాయ సాంస్కృతిక సేనాని !




**(ఒక ప్రజాతంత్ర బుద్ధిజీవి ప్రాసంగికత)**

- గౌరవ్

**పాలక పక్షం దుర్మార్గాలను ధైర్యంగా ప్రశ్నించి, రాజ్యం చేసే సాంస్కృతిక దాడికి సంబంధించిన అనేక పాశ్వాల్ని మొట్టమొదటిసారిగా బయటపెట్టి, అందుకు సుమారు రెండు దశాబ్దాల కాలం ఖైదులో మగ్గిపోయి, చెరశాలనే చరిత్ర రచన కేంద్రంగా మల్చుకున్న అద్వితీయ ప్రత్యామ్నాయ ప్రజా తాత్వికుడు ఆంటోనియో గ్రాంస్కీ.**

తొంభై ఐదేళ్ళ క్రితం 1927లో ఫ్రెంచ్ తాత్వికుడు జూలియన్ బెండా మేధావులు చేసే ద్రోహం కోసం చర్చిస్తూ LA Trahison des Clercs (The Treason Of The Intelle ctuals) అనే గ్రంథం రాశాడు. సమయం వచ్చినప్పుడు మన నిరసన ప్రకటించకుండా, అసలే మాత్రం స్పందించకుండా మౌనంగా ఉండటం అంటే, జరుగుతున్న అన్యాయానికి పరోక్షంగా మద్దతు తెలపడమే కాగలదు. అలా పాలకపక్షం దుర్మార్గాలను ధైర్యంగా ప్రశ్నించి, రాజ్యం చేసే సాంస్కృతిక దాడికి సంబంధించిన అనేక పాశ్వాల్ని మొట్టమొదటిసారిగా బయటపెట్టి, అందుకు సుమారు రెండు దశాబ్దాల కాలం ఖైదులో మగ్గిపోయి, చెరశాలనే చరిత్ర రచన కేంద్రంగా మల్చుకున్న అద్వితీయ ప్రత్యామ్నాయ ప్రజా తాత్వికుడు ఆంటోనియో గ్రాంస్కీ. మార్క్సిజాన్ని పిడివాదంగా కాక, ప్రత్యామ్నాయ వైధ్యానిక పద్ధతి (Alternative Methodology)గా అర్థం చేసుకున్న అతి తక్కువ మంది బుద్ధి జీవుల్లో గ్రాంస్కీ ఒకడు. అతడి మౌలిక అంశం మనిషి, అందుకే సారవంతమైన సమాజాన్ని సృష్టించగలిగాడు. అర్థవంతమైన వ్యవస్థకు అక్షరాభ్యాసం చేయగలిగాడు. చనిపోయే కొద్దిరోజుల ముందు పెద్ద కొడుకు డీలియోకి రాసిన చివరి లేఖలోని ఈ వాక్యాలు చూడండి.




> I am feeling a bit tired and cannot write a lot. Write to me always, and tell me about everything that interests you at school. I think you like history, just as I did when I was your age, because it is about living men. And every thing that is about men, as many men as possible, all the men in the world united among them selves in societies, working and struggling and bettering themselves must please you more than any other thing.

ప్రపంచంలోని మెరుగైన సమాజస్థాపన కోసం జరిగే పీడితుల పోరాటాలన్నింటి పక్షం వహించి వాటి గురించి నిక్షిప్తం చేయడమే చరిత్రకి అర్థం అని నమ్మాడు కనుకే ఇంతటి గొప్ప వాక్యాలు రాయగలిగాడు. నాకు తెలిసీ లోకంలో ఏ తండ్రి కూడా తమ పిల్లలకి ఇంతకంటే ఉన్నతమైన సందేశాన్ని ఇవ్వలేరు. నిజానికి ఇది ఒక్క తన సంతానానికే కాదు, సమస్త మానవాళికీ, తన తదనంతరం గ్రాంస్కీ ఇచ్చిన మహోన్నతమైన సందేశం.

**ఈ దేశంలో మనుషుల్ని చులకనగా చూస్తూ మతం పేరిట సాంస్కృతిక ఆధిపత్యం ఎప్పటి నుంచో చెలామణీ అవుతోంది. సామ్రాజ్యవాదం కొత్తగా దానికి తోడై ఒక సంకరజాతి దోపిడీ వర్గం జనించింది. కాన ఇక్కడ సాంస్కృతిక ప్రతి దాడి ప్రధానంగా బహుముఖంగా సాగాలి. సకల మార్గాలనూ అవలంబించాలి. దానికి సమసమానత్వం, సామాజిక న్యాయమనేవే లక్ష్యం కావాలి. ఇందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్య కార్యాచరణపై దృష్టి పెట్టాలి. అధ్యయనం ఒక తప్పనిసరి ఆయుధమనే విషయం గుర్తించాలి. రాజకీయ వేదికలకంటే కూడా వైజ్ఞానిక తాత్విక ధోరణుల్ని మెరుగుపర్చు కోవడంపై దృష్టి కేంద్రీకరించాలి.**

మార్క్సిజాన్ని నిర్మాణాత్మకంగా విమర్శించిన ప్రముఖ అరాచక వాద తత్వవేత్త ప్రౌధాన్‌ని మిత్రపూరిత చర్చకు ఆహ్వానిస్తూ 1846 మే 5న మార్క్స్ లేఖ రాయగా, దానికి జవాబు లేఖ ప్రౌధాన్ రాస్తూ..

> With all my heart I welcome your idea of exposing all opinions to the light. Let us have decent and sincere polemics. Let us give the world an example of learned and far sighted tolerance. But, simply because we are at the head of a movement do not let ourselves become the leader of a new intolerance, let us not pose as apostles of a new religion even - though this religion be the religion of logic, the religion of reason itself. Let us welcome, let us encourage the protests; let us condemn all exclusions, all mysticisms. But, never let us think of any question as closed, and even we have exhausted our very last argument, let us begin again, if necessary with eloquence and irony. On that condition I shall be delighted to associate with you - but otherwise no. అంటాడు.

ఇదెంత వాస్తవిక దృష్టితో రాసిందో అర్థం కావాలంటే తర్వాత 75 ఏళ్ళకు 1917 రష్యా విప్లవాన్ని చిమ్మ చీకట్లో చిక్కటి వెలుగంటూ పొగుడుతూ వర్ణించిన బెట్రాండ్ రస్సెల్, తర్వాత 1920లో అనధికారికంగా రష్యా చూసొచ్చి, Bolshevism is not merely a political doctrine; it is also a religion with elaborate dogmas and inspired scriptures అనడాన్ని అర్థం చేసుకోవాలి.

మార్క్సిజాన్ని కొత్త మతంలా అనుసరించడం అప్పటికే ఎంతగా ముదిరిపోయిందో, దాన్నొక ప్రభావశీలమైన విధానం గా కాక, పిడివాదంగా ఒప్పచెప్పడం ఎంతగా పెచ్చరిల్లిందో చెప్పడానికి శతాబ్దం క్రితం నాటి ఆ బుద్ధి జీవి మాటలే ప్రత్యక్ష సాక్ష్యం. సరిగ్గా ఇప్పుడు గ్రాంస్కీ గురించిన చర్చలో ఈ విషయాన్ని ప్రస్తావించడానికి కారణం ఉంది. ఆర్థిక అసమాన తలకు మాత్రమే మార్క్సిజాన్ని కుదించిన పరిస్థితుల్లో, ప్రాదేశిక ప్రత్యేకతలను పరిగణనలో తీసుకుని మాత్రమే పని చేయాలనే పంథాని భౌతికవాద దృక్పథంతో వినూత్నమైన రీతిలో ప్రతిపాదించిన మేధావి గ్రాంస్కీ. ముఖ్యంగా, భారతీయ సమాజంలో నెలకొన్న సాంస్కృతిక అస్తిత్వాలకు కులం ఒక బల మైన చోదకశక్తిగా ఉంది. ఇక్కడ సాంస్కృతిక పరాయీకరణ కులంతో ముడిపడి ఉంది. దానిని మొదట గుర్తించడం అవసరం. ఈ అంశానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఈ సరికే తేరుకోలేని తప్పు అభ్యుదయ శక్తులు చేశాయి. కావున, ఇకనైనా సాంస్కృతిక సామ్రాజ్య వాదం ఎంత ప్రమాదమో గుర్తించడం అవసరం అని నా అభిప్రాయం.

సరిగ్గా ఇక్కడే మనకి గ్రాంస్కీ తాత్వికతని అధ్యయనం చేయ డం ఎంత ముఖ్యమో అర్థం అవుతుంది. ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ అనేది పుట్టడానికి వందేళ్ళకు ముందే అనేక ఆధిపత్య వ్యతిరేక పోరాటాలు జరిగాయి. మొట్టమొదటి తెలుగు నిఘంటు నిర్మాణకర్తగా పేరొందిన మామిడి వెంకయ్యా వంటి వాళ్ళు చేసిన పోరాటాలు ఏకంగా ఇంగ్లాండు ప్రివీ కౌన్సిల్ వరకూ వెళ్ళొచ్చాయనే విషయం మరువరాదు. కులం పేరిట అంతటి భయంకరమైన దడుల్ని కట్టుకున్న వ్యవస్థలో సమానత్వం కోసం జరిగే ప్రయత్నాలు కచ్చితంగా సంస్కృతిని అధ్యయనం చేయడం వలనే జరుగుతాయనే ప్రాథమిక గ్రహిం పు అవసరం. ఆ గ్రహింపుతోనే వందేళ్ళ క్రితం సాంస్కృతిక సంఘంగా ప్రారంభం అయిన మతోన్మాద ఆరెస్సెస్, ఈ రోజు దేశంలో అధికారంలో ఉండగా, రాజకీయార్థిక సిద్ధాంతంగా మాత్రమే అర్థం చేసుకోబడిన మార్క్సిజం భారతీయ సాంస్కృతిక మూలాల్ని విస్మరించి వివిధ శాఖోపశాఖలుగా చీలిపోయిందనేది మన కళ్ళ ముందు కనిపిస్తున్న నిజం. ఇప్పటికైనా

మించిపోయింది లేదు. మంచికి ఎప్పుడూ ఒక ఆశాజనక స్థానం ఉంటుంది, కాన భారతీయ సమాజంలో వివిధ రకాలైన సాంస్కృతిక బహుళ రూపాల్ని సారంతో సహా ఆచరణాత్మకంగా అధ్యయనం చేయడానికి గ్రాంస్కీ స్ఫూర్తితో ప్రగతిశీల శక్తులు పూనుకుంటే బావుంటుంది.

మార్క్సిజాన్ని తాత్వికంగా అత్యున్నత స్థాయిలో నిలబెట్టిన బుద్ధిజీవిగా గ్రాంస్కీని వర్ణిస్తాడు ఎంఎన్ రాయ్ తన జ్ఞాపకాలు గ్రంథంలో. అయితే, రాయ్ జైల్లో ఆరేళ్ళు ఉన్నాడు. ఆ కాలంలో గ్రాంస్కీలానే రాయ్ ప్రత్యేకంగా, శ్రద్ధగా విస్మరిత సంస్కృతిని అధ్యయనం చేశాడనీ, నవ్య మానవవాదం (New Humanism) పేరిట, ప్రత్యామ్నాయ సాంస్కృతిక నిర్మాణం అనేది ప్రజా బాహుళ్యంలో జరగకుండా విప్లవం పేరిట జరిగే తంతుల వల్ల ప్రయోజనం ఉండదనే నిర్ణయానికి రాయ్ అప్పుడే వచ్చాడం టారు ప్రఖ్యాత మేధావి భాస్కర్ సూర్,

> During his long jail term, he(Roy) much like Gramsci was deeply thinking over the necessity of radical cultural transformation. Until there was to be a cultural revolution or Renaissance, or to put it in Gramscian vocabulary, a counter hegimony, any seizure of power would dismally fail in its revolutionary mission. అంటారు.

అటువంటి సాంస్కృతిక వికాసం ఈ దేశంలో విస్తరించడమే ధ్యేయంగా, యంయన్ రాయ్ 75 ఏళ్ళ క్రితం Indian Renaissance Institute నెలకొల్పడం జరిగింది. దాని ప్రధాన ఉద్దేశం నూతన మానవుణ్ణి సృష్టించడమే. అందుకే The Renaissance was a rebirth of man అంటాడు రాయ్.

అప్రస్తుతం కాదు కనుక ప్రస్తావించాల్సిన ముఖ్య అంశం ఏమిటంటే, ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన ఎందరో వినూత్న సైద్ధాంతిక మార్క్సిస్టు మేధావుల్ని మలిచిన ఫ్రాంక్ఫర్ట్ స్కూల్ కూడా ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్ పేరిట సరిగ్గా వందేళ్ళ క్రితం 1923లో స్థాపించబడి ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక చరిత్రకీ, శోధనకి అద్భుతమైన చింతనాత్మక వారసత్వాన్ని అందించింది. అలాంటి సత్యాన్వేషణా తృష్ణను జీర్ణించుకుని కొత్త భావాలకు ఎల్లప్పుడూ తలుపులు తెరిచి సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు సాగిపోవడమే ఏ కాలంలోనైనా ప్రజాహితవాదాలు చేయాల్సిన పని. మార్క్స్ వాదమైనా, గ్రాంస్కీ




వాదమైనా మనిషి పక్షాన అలా నిలిచేందుకు, మనిషి కాలాను గుణంగా మార్పుచేర్పులు చేసుకుందుకు మలచబడిన మహత్తరమైన మానవీయ మార్గాలే.

ఈ దేశంలో మనుషుల్ని చులకనగా చూస్తూ మతం పేరిట సాంస్కృతిక ఆధిపత్యం ఎప్పటి నుంచో చెలామణీ అవుతోంది. సామ్రాజ్యవాదం కొత్తగా దానికి తోడై ఒక సంకరజాతి దోపిడీ వర్గం జనించింది. కాన ఇక్కడ సాంస్కృతిక ప్రతిదాడి ప్రధానంగా బహుముఖంగా సాగాలి. సకల మార్గాలనూ అవలంబించాలి. దానికి సమసమానత్వం, సామాజిక న్యాయమనేవే లక్ష్యం కావాలి. అందుకోసం వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్య కార్యాచరణపై దృష్టి పెట్టాలి. అధ్యయనం ఒక తప్పనిసరి ఆయుధమనే విషయం గుర్తించాలి. రాజకీయ వేదికలకంటే కూడా వైజ్ఞానిక తాత్విక ధోరణుల్ని మెరుగుపర్చు కోవడంపై దృష్టి కేంద్రీకరించాలి. పౌర సమాజంలో అర్థవంతమైన ఆలోచనల్ని సారవంతంగా నిర్మించడమే ఏకైక ఎజెండాగా పనిచేయాలి. పార్టీలకు అతీతంగా ప్రజాపక్ష బుద్ధి జీవులకు, ప్రజాస్వామిక శ్రేణులకి మద్దతివ్వాలి. అప్పుడు మాత్రమే పేట్రేగిపోతున్న మతోన్మాదాన్ని కనీసంగానైనా నిలువరించగలం. అదే, అద్వితీయ సాంస్కృతిక కార్యశీలిగా, గ్రాంస్కీ నుండి స్వీకరించాల్సిన క్రియాశీల నిర్మాణాత్మకత. అదే, భావితరాలకు గ్రాంస్కీ అందించిన అపూర్వమైన కార్యోన్ముఖ ఆచరణాశీలత. అదే, ఎన్నటికైనా ఆంటోనియో గ్రాంస్కీ నుండి వర్తమాన సమాజం తప్పని సరిగా గ్రహించాల్సిన ప్రజాహిత ప్రాసంగికత. ❑

# భావజాల రంగంలో హెజిమోని



డి.సోమసుందర్

**ఇరవయ్యవ శతాబ్దపు పెట్టుబడిదారీ సమాజానికి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అత్యంత ప్రతిభావంతంగా అన్వయించి, దాన్ని ఆచరణాత్మకంగా తీర్చిదిద్దడానికి కృషి చేసిన మార్క్సిస్టు మేధావుల్లో ఆంటోనియో గ్రాంసీ ఒకరు. 1920-30 దశకాల్లో ఇటలీ ఫాసిస్ట్ ప్రభుత్వ జైలు నిర్బంధంలో మగ్గిపోతూ గ్రాంసీ రాసిన మూడు వేల పేజీల 'ప్రిజన్ నోట్స్' మార్క్సిస్టు ఆలోచనా పరులకు అపారమైన భావజాల సంపదను అందజేసింది.**

ఇటాలియన్ ఫాసిజం పుట్టు పూర్వోత్తరాలను, ఇటలీ పెట్టుబడి దారీ సమాజ అభివృద్ధి ధోరణులను, అందుకు దారితీసిన కారణాలను, ఇటలీ జాతీయవాద స్వభావాన్ని గ్రాంసీ లోతుగా అధ్యయనం చేశారు. సంప్రదాయక మార్క్సిస్టు భావనలలోని కొన్ని అంశాలను మార్క్స్ అనంతర కాలానికి అత్యంత ప్రతిభావంతంగా అన్వయించి కొన్ని కొత్త నిర్ధారణలను చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కచ్చితంగా పతనమై తీరుతుం దనే చారిత్రక అనివార్యత గురించి మార్క్సిజం గట్టిగానే చెబుతుంది. పెట్టుబడిదారీ సమాజాల్లో వర్గ వైరుధ్యాల తీవ్రత




పెరిగి, పెరిగి చివరికి పాత సమాజపు చట్రాన్ని బద్దలుకొట్టే సోషలిస్టు విప్లవం జరిగి తీరుతుందని 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో మార్క్స్, ఏంగెల్స్ స్పష్టంగా చెప్పారు. పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన పారిశ్రామికదేశాల్లో సోషలిస్టు విప్లవం త్వరితంగా వస్తుందని వారు ఊహించారు. అయితే వారి అంచనాకు విరుద్ధంగా పారిశ్రామికంగా బాగా వెనుకబడిన సోవియట్ రష్యాలో బోల్షెవిక్ విప్లవం వచ్చింది. కార్మికవర్గ ఆధిపత్యంలో జరిగే(వర్కింగ్ క్లాస్ హెజిమోని) విప్లవం ద్వారా సోషలిస్టు సమాజం ఏర్పడుతుందని లెనిన్ కూడా నొక్కి వక్కాణించారు. బోల్షెవిక్ పార్టీ దాన్ని ఆచరణలో రుజువు చేసి చూపించింది. సోవియట్ రష్యా విప్లవం తర్వాత వివిధ పారిశ్రామిక దేశాల్లో ఉత్పత్తి సాధనాలు నిరంతరం విప్లవాత్మకంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఉత్పత్తి సంబంధాలు తల కిందులయ్యే పరిస్థితులు సంభవిస్తూ వచ్చాయి. ఆర్థిక వ్యవస్థలో పదేపదే తీవ్ర సంక్షోభాలు ఎదురవుతూ వచ్చాయి. ఆర్థిక యుద్ధాలు సైనిక యుద్ధాలుగా పరిణామం చెందాయి. అయితే వాటన్నిటినీ తట్టుకుని పెట్టుబడిదారీ వ్యవస్థ తన మనుగడను కొనసాగించు కోగలిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ యుద్ధాల తోనూ, వలస విధానంతోనూ సుస్థిరం అవుతూ వచ్చింది. దీని లోని మర్మం గురించి పెద్దగా అధ్యయనం జరగలేదు. మూల పురుషులు ప్రవచించిన 'విప్లవ చారిత్రక అనివార్యత' దగ్గరే మార్క్సిస్టు ఆలోచన ఆగిపోయింది. ఇదే అంశంపై ఇటాలి యన్ పరిస్థితుల నేపథ్యంలో గ్రాంసీ లోతుగా అధ్యయనం చేశారు.

తన ప్రిజన్ నోట్స్‌లో విస్తారంగా చర్చించారు. ఆ రకంగా మార్క్సిస్టు ఆలోచనకు తనదైన దోహదాన్ని ఆయన అందజేశారు. వర్కింగ్ క్లాస్ హెజిమోని అనే లెనిన్ భావనను మరింత లోతుగా, విస్తృతంగా గ్రాంసీ చర్చించారు. పెట్టుబడి దారీ విధానం కూలిపోయే బదులు అది మరింతగా పాతుకు పోయిందని గ్రాంసీ అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు సంప్రదాయకమైన

రాజకీయ, ఆర్థిక ఘర్షణ ద్వారా మాత్రమే కాకుండా భావజాలం ద్వారా కూడా ప్రయత్నిస్తూ వచ్చిందని గ్రాంసీ ఎత్తి చూపిం చారు. హింస, అణచివేత, ఘర్షణ వంటి సంప్రదాయ పద్ధతులు కొనసాగిస్తూనే ఆర్థిక రంగంలో కొన్ని రాజీల ద్వారానూ, మతం, విద్య, మీడియా, సాంస్కృతిక, రంగాలలో కొన్ని భావనలను ప్రవేశ పెట్టడం ద్వారానూ రాజ్యం పౌర సమ్మతిని సాదించిందని గ్రాంసీ విశ్లేషించారు. పెట్టుబడిదారీ వర్గం తనదైన కొన్ని సామా జిక విలువలను, నియమాలను ప్రాచుర్యంలోకి తెచ్చి తద్వారా సమాజంలో సాంస్కృతిక ఆధిపత్యాన్ని సాధించిందని గ్రాంసీ చెప్పిన అంశం ఆధునిక కాలానికి సంబంధించినంత వరకూ మార్క్సిస్టు అవగాహనలో ఒక ప్రామాణికమైన నిర్ధారణ అని చెప్పాలి.

వివిధ ఆలోచనా ధోరణుల నుంచి, వాటి పరస్పర చర్యల నుండి 'పౌరుల సామాన్య వివేకం' అనేది ఒకటి రూపొందు తుందని గ్రాంసీ ప్రతిపాదించారు. తనకు జరిగే మంచిని సమస్త ప్రజానీకానికి జరిగే మంచిగా చూపడంలో పెట్టుబడిదారీ వర్గం విజయం సాధించిందని గ్రాంసీ అంటారు. తమ విలువలు సాధారణమైనవనీ, సహజమైనవనీ పెట్టుబడిదారీ వర్గం వాదిస్తుంది. అదే 'సామాన్యవివేకం' రూపంలో వ్యక్తం అవుతుం దని గ్రాంసీ అన్నారు. ఫలితంగా విప్లవానికి, తిరుగుబాటుకు పూనుకోవాల్సిన కార్మికవర్గం యథాతథ స్థితి కొనసాగించే చైతన్యంలో భాగమైందని గ్రాంసీ అంటారు. పెట్టుబడిదారీవర్గం సృష్టించిన 'సామాన్యవివేకం' చివరికి రాజ్యం సాధించిన హెజిమోనికి కీలకాంశం అయ్యిందని గ్రాంసీ అంటారు. ఆ క్రమంలోనే హెజిమొని, సాంస్కృతిక హెజిమోని బలంగా తయారవుతాయనీ గ్రాంసీ అంటారు. బూర్జువావర్గం సృష్టించిన విలువ లూ, నియమాలూ మొత్తం సమాజ హితాన్ని కోరేవి కావని, తమకు వాటికీ సంబంధం లేదని, కార్మికవర్గం స్పష్టం చేయాల్సి ఉంటుందని గ్రాంసీ అంటారు. బూర్జువా విలువలకు కార్మికవర్గ ప్రత్యామ్నాయం ఉందని బలంగా చెప్పాల్సి ఉంటుం దని అంటారు. రాజకీయ లక్ష్యాల సాధనలో సాంస్కృతిక రంగం పాత్ర సహాయకారి మాత్రమేనన్న లెనినిస్ట్ భావనను గ్రాంసీ ఆమోదించలేదు. సాంస్కృతిక ఆధిపత్యమే (కల్చరల్ హెజిమోని) ప్రాథమికమైనదని, రాజకీయ అధికారం పొందడా నికి సాంస్కృతిక ఆధిపత్యాన్ని సాధించడం తొలి మెట్టు అవుతుందని గ్రాంసీ అంటారు. అధునిక పరిస్థితుల్లో ఆర్థిక ప్రయోజనాల సాధనా లక్ష్యం ఒకటి మాత్రమే కార్మిక వర్గపు ఆధిపత్యం తీసుకురాలేదనీ, అలాగే ఘర్షణ, బలప్రయోగం మొత్తం ప్రజానీకాన్ని సమీకరించజాలదని స్పష్టంగా చెబుతారు. దాని బదులు మేధో, నైతిక నాయకత్వం అందించడంపై కార్మికవర్గం దృష్టి సారించాలని చెబుతారు. అవసరమైతే వివిధ అంశాలపై ఒప్పందాలు, రాజీలు చేసుకుంటూ విశాలమైన సామాజిక కూటమిని నిర్మించేందుకు వివిధ సామాజిక శక్తులతో కూడిన ఒక 'చారిత్రక కూటమి'ని ఏర్పాటు చేసేందుకు, కార్మిక వర్గం పూనుకోవాలని ప్రతిపాదించారు. ఏకాభిప్రాయంతో కూడిన ఒక సామాజిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి, సమాజంలోని వివిధ శక్తుల, సంస్థల, ఆలోచనల, సామాజిక సంబంధాల ఉమ్మడి హెజిమోని రూపొందించాలని గ్రాంసీ అంటారు. ఆర్థిక పునాదిలోని సంబంధాలను నిలబెట్టడానికి లేదా వాటిని బద్దలు కొట్టడానికి ఉపరితలంలోని రాజకీయ, భావజాల, అంశాలు తోడ్పడతాయని గ్రాంసీ విశ్లేషించారు. జానపద సాహిత్యమూ, గాథలు, కళారూపాలు, మతమూ, సాంస్కృతిక రూపాలు, సంప్రదాయాలు, అలవాట్లు బూర్జువా సంస్కృతితో ముడిపడి ఉన్నాయని హెజిమోని సాధనలో వాటికి కీలకపాత్ర పోషించాయని గ్రాంసీ అంటారు. ప్రత్యామ్నాయ (కౌంటర్ హెజిమోని) సాధనలో కూడా వాటి పాత్ర కీలకం అని స్పష్టం చేశారు.

**సామాన్య ప్రజలకు, మేధోవర్గానికి, చదుకున్న వారికీ, చదువులేని వారికీ మధ్య అంతరాలు పెరగకుండా చూడటానికి ప్రత్యామ్నాయ సంస్కృతి ఒక వారధి ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. పునరుజ్జీవన కాలంలో ప్రగతిశీల ధోరణులు సామాజిక మార్పునకు దోహదం చేసిన అంశాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవాలని గ్రాంసీ అంటారు.**


సమాజ మార్పులో, ఉపశ్రేణుల పాత్రను, మేధావుల కృషిని కూడా ప్రముఖంగా పేర్కొన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఆర్థిక అంశాలకు మతం, జాతీయవాదం వంటివి తోడయితే సంప్రదాయక హెజిమోని కాస్తా ఒక్కొక్కసారి వికృతరూపం ధరిస్తుందని వరించారు. దాన్ని 'బాస్టర్డ్ హెజిమోని' అని కూడా ఆయన అన్నారు. అలాంటి బాస్టర్డ్ హెజిమోని నుండే ఫాసిజం పుట్టుక సాధ్యమైందని నిర్ధారించారు. ఈ స్థితిలో సామాజిక మార్పులు కోరుకునే పురోగామిశక్తులు 'కౌంటర్ హెజిమోని'ని సృష్టించాల్సి ఉంటుందని అంటారు. 'కౌంటర్ హెజిమోనీ' ని రూపొందించడంలో కార్మిక వర్గం మాత్రమే కాకుండా మేధావులు, ఉపశ్రేణులు, వివిధ సామాజిక శక్తులు పాలు పంచుకుంటాయని అంటారు. వాటన్నిటినీ సమీకరించి విశాల మైన కూటమి ఏర్పాటు చేసే కృషి కీలకం అవుతుందని అంటారు. నియోఫాసిజం వివిధ దేశాల్లో వివిధ రూపాలలో జడలు విప్పుతూ పెద్ద ప్రమాదంగా తయారవుతున్న నేటి తరు ణంలో గ్రాంసీ భావనలను లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. భారతదేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యా నికి అనుకూలంగా ఉన్న 'బాస్టర్డ్ హెజిమోని' స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి గ్రాంసీ భావనలు తోడ్పడతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ❑

# గ్రాంసీ చిత్రాలు - జ్ఞాపకాలు









## వ్యాస రచయితల మాటల్లో గ్రాంసీ భావనలు




- 'ఆధిపత్యం' అంటే కొన్ని విలువలు, ధోరణులు, నమ్మకాలు, నైతికతలను మొత్తం సమాజం మీద రుద్దడం ద్వారా అధికార సంబంధాల్లో యథాతథస్థితిని కొనసాగించడం. ప్రజల దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లోకీ ఈ విలువలను చొప్పించడం అనేది ఒక నిరంతర కార్యక్రమంగా కలిగి ఉండడం.

- రాజ్యం బీటలు వారితే దాని వెనుక పౌర సమాజం అనే గట్టి నిర్మాణం బయటపడుతుంది. రాజ్యం అనేది కోట బయట కందకం మాత్రమే. దాని వెనుక అత్యంత బలమైన మట్టి కట్టలు, కోట గోడలు (పౌర సమాజం) ఉంటాయి.

- కొత్త మేధావులను ఎంతబాగా విషయాలు చెప్పగలుగుతున్నారన్న దాన్నిబట్టి  కాకుండా దైనందిన జీవితంలో నిర్మాతలుగా, ఆర్గనైజర్స్ వారి పనిని బట్టి నిర్ణయించాలి. నిరంతరం వెంటబడి పనులు జరిగేట్లు చూసేవారే గానీ కేవలం ఉపన్యాసాలు  చెప్పేవారు సజీవ మేధావులు.

- రాజ్యమే అన్నీ అయింది. పౌర సమాజం శైశవ దశలో, పలుచటి బంకలా ఉంది.  పశ్చిమ దేశాల్లో రాజ్యానికీ, పౌర సమాజానికీ మధ్య సరైన సంబంధాలున్నాయి. అక్కడ రాజ్యం కుప్పకూలిపోతే వెనువెంటనే పటిష్టమైన పౌర సమాజం అనే బలమైన నిర్మాణం బయట పడుతుంది.

- మనం పరిసరాలకు సర్దుకొనిపోవాలని అన్పించవచ్చు. కాని పరిసరాల్ని అధిగమిస్తాము, వాటి కింద అణచివేయబడము.

- జరిగిపోయే పరిణామాలన్నీ ఏదో కొంత మంది కోరుకున్న దానికి అనుగుణంగా సంభవించినవి కావు. అత్యధిక సంఖ్యాకులైన పౌరులు తమ విధులను నిర్వర్తించకుండా, నిర్లిప్తంగా ఉండిపోయినందు వల్లనే ఇవన్నీ సాధ్యమయ్యాయి.

- నిరాశావాదాన్ని, ఆశావాదాన్ని నా మనసు సంశ్లేషిస్తుంది. వాటిని అధిగమిస్తుంది కూడా. మేధోపరంగా నేను నిరాశా వాదినైనా, ఆశావాదాన్ని నా ఇచ్ఛాశక్తి నాకు ఇచ్చేది. యే పరిస్థితినైనా నేను అధిగమిస్తాను. అమితమైన సహనశీలత, నిష్క్రియ సహనం కాదు, పట్టుదలతో నిండిన సహనం నా ఆయుధం.

- అసమానతలను, సామాజిక మినహాయింపులను, సమాజ సంస్థల ప్రైవేటీకరణను సమర్థించే పౌర సమాజం క్యాపిటలిస్టు సమాజమే. పౌర సమాజం వర్గ రాజ్యానికి సాంస్కృతిక వనరులను అందిస్తోంది. రాజ్యం నుండి పౌరసమాజ వేర్పాటుకు, రాజ్యాధిపత్యాన్ని హేతుబద్ధం చేయటానికి పాలితులను, పౌరులను సిద్ధంచేస్తోంది.

- మేధావులకు తమ సొంత వర్గం ఉండదు. అయితే ప్రతీ వర్గానికి దాని సొంత మేధావులు ఉంటారు. ఒక మనిషి తనకున్న ప్రజ్ఞా పాటవాల ఆధిక్యత వల్ల మేధావి కాడనీ, సామాజిక హెజమనీ వ్యవస్థీకరణలో అతను నిర్వహించే విధుల వల్ల మాత్రమే మేధావి అవుతాడు.

- అన్నింటికిమించి మనిషి చైతన్యం, బుద్ధి, అనగా మనిషి ప్రకృతి సిద్ధంగా రూపొందిన వాడు కాదు. చారిత్రక పరిణామాల పర్యవసానంగా రూపుదిద్దుకున్నవాడన్న మాట.

- కొందరు వ్యక్తుల విషయంలో, కొన్ని చిన్న చిన్న గుంపుల విషయంలో ఆ తేడాకు కారణం ఆత్మవంచన కావొచ్చు. విశాల ప్రజానీకం (మాసెస్) విషయంలో ఈ తేడా ప్రజల సాంఘిక చారిత్రక పరిస్థితుల్లోని తేడాకు ప్రతిబింబం.

- ప్రశ్నించేతత్వమే సమాజ పురోగతికి ఇంధనం. అది సైన్స్ అయినా, చరిత్ర అయినా ప్రశ్నల సమ్మెట దెబ్బ లు తింటేనే సత్యం బయటపడు తుంది. ఏ విషయంలోనైనా అతి కీర్తనలు పనికిరావు. చరిత్రను అర్థం చేసుకోవడానికి అందులోని కొన్ని ఘటనలను, కొందరు వ్యక్తులను కీర్తించడంకూడదు.

- ఊకదంపుడు సుదీర్ఘ ఉపన్యా సాలు, ప్రజలకు అర్థం కాని భాషలో రాసే రాతలు ప్రజాస్వామిక పద్ధతి కాదు. ప్రజలకు అర్థం కానిది ఏదైనా వ్యర్థమే. వాళ్ళకు అర్థమయ్యే విధం గా చెప్పడమంటే వాళ్ళ జీవితాలతో మమేకం కావడం, వాళ్ల భాషను, భావాలను పట్టుకోవడం, వాటి ఆధారంగానే కొత్త జ్ఞాన ప్రక్రియను మొదలు పెట్టడం.

గ్రాంసీ స్వీయ రచనలు

# మార్క్స్ కాపిటల్‌కు భిన్నంగా రష్యా విప్లవం

- ఆంటోనియో గ్రాంసీ



**బోల్షివిక్ విప్లవం ఇప్పుడు నిజంగా రష్యా ప్రజల విప్లవ మైంది. జరుగుతున్న పరిణామాలు ఆగిపోయి భవిష్యత్ వైపు నడక నిలిచిపోరాదనే సంకల్పంతో బోల్షివిక్ రెండు నెలల క్రితం వరకూ బూర్జువాలతో ఒప్పందానికి కూడా సిద్ధపడ్డారు. కానీ వాళ్లే ఇప్పుడు అధికారాన్ని కైవసం చేసుకుని శ్రామిక నియంతృత్వ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. విప్లవం ఇప్పటికే అసాధారణ ప్రయోజనాలను సాధించింది. సామ్యవాద చట్రంలో స్థిరపడడానికి అవసరమైన సంఘీభావాన్ని సృష్టించడానికీ, ముఖాముఖీ ఘర్షణలని నివారించడానికి కృషి చేస్తోంది.**

బోల్షివిక్ విప్లవంలో సిద్ధాంతాలకన్నా సంఘటనలే ప్రాముఖ్యత వహించాయి.(అందువల్ల అంతరార్థంలో మనం ఇప్పటి వరకూ తెలుసుకున్న దానికన్నా ఎక్కువ తెలుసుకోవ లసినదేమీ లేదు.) ఇది మార్క్స్ కాపిటల్ భిన్నమైన విప్లవం. రష్యాలో మార్క్స్ కాపిటల్ బూర్జువాల పుస్తకమే గానీ, శ్రామికుల పుస్తకం కాదు. అది ఇట్లా జరుగుతుందని ముందు గా చెప్పబడిన పరిణామాలని అనుసరించడంలో విమర్శనాత్మక ఉదాహరణగా నిలిచింది. శ్రామికులు తమ వర్గ డిమాండ్లనూ, తిరుగుబాటునీ, తమ విప్లవాన్నీ ఊహామాత్రంగానైనా గుర్తించక మునుపే, అది రష్యాలో పాశ్చాత్య నాగరికతను నెలకొల్పడం ద్వారా బూర్జువా వర్గం ఎట్లా అభివృద్ధి చెందాలో పెట్టుబడిదారీ వ్యవస్థకు తలుపులెట్లా తెరుచుకోవాలో తెలియచెప్పింది. సిద్ధాంతాలను సంఘటనలు అధిగమించాయి. చారిత్రక భౌతిక వాద దృక్పథ సూత్రాల నుంచి విప్పారవలసిన రష్యా చరిత్రను ఈ సంఘటనలు పేల్చివేశాయి. బోల్షివిక్‌లు కార్ల్ మార్క్స్‌ను తిరస్కరించారు. చారిత్రక భౌతికవాద సూత్రాలు అందరూ భావించినంత లేదా విశ్వసించినంత ఒంగనివి కావని వారి



చర్యలూ విజయాలూ రుజువు చేస్తున్నాయి.

బోల్షివిక్‌లు కాపిటల్లో ఉన్న కొన్ని నిర్దేశాల్ని పక్కకునెట్టారు. అయితే అందులో అంతర్లీనమై వున్న బలాన్ని వారు నిర్లక్ష్యం చేయలేదు. వాళ్లు మార్క్సిస్టులు కారు, అంతే ! వాళ్లు తమ ఉపాధ్యాయుడి సిద్ధాంతాలని ప్రశ్నించడానికి వీలులేని పిడి వాదంగా మార్చడానికి సంకల్పించలేదు. వాళ్లు మార్క్సియన్ సిద్ధాంతంలో జీవించారు. ఏ సిద్ధాంతమైతే శాశ్వతమో, ఏ సిద్ధాంతమైతే జర్మన్ ఇటాలియన్ భావవాదానికి కొనసాగింపుగా వచ్చి మార్క్స్ ప్రత్యక్ష, స్వాభావికవాదాల చేత పూత పూయబడిందో లేదా పెచ్చు కట్టిందో దాన్ని వారు లోపలికి తీసు కున్నారు. ఈ ఆలోచన ఎంతో బలీయమైంది. కేవలం ఆర్థికాం శాలను కాదు. మనిషిని, చుట్టూ సమాజం ఉన్న మనిషిని, మరొకరితో సంబంధాలున్న మనిషిని మనిషితోనే ఒప్పందాలు కుదుర్చుకునే మనిషిని చూశారు. వీటన్నిటి ద్వారా అతను ఒక నాగరికతను ఒక సామూహికతను ఒక సామాజిక ఇచ్ఛను సృష్టించడాన్ని చూశారు. అది ఆర్థిక వాస్తవాలను అర్థం చేసు కుని గుణదోష నిర్ధారణ చేసుకుని వాటిని చోదక శక్తిగా నిరపేక్ష సత్యంగా పొందుపరచుకునే సామాజిక ఇచ్ఛ. అది సజీవంగా కదులుతూ లావాలా ఉబుకుతూ ఎక్కడ ఎలా క్రమబద్ధీకరింప బడాలో అలా క్రమబద్ధీకరింపబడే సామాజిక ఇచ్ఛ. మార్క్స్ ముందుకు చూడగలిగినంత మేర చూశాడు. కానీ యూరోపియ న్ యుద్ధాన్ని (మొదటి ప్రపంచయుద్ధాన్ని-అను) చూడలేకపో యాడు. లేదా ఆ యుద్ధం ఎంత కాలం ప్రభావం చూపగల శక్తి కలిగి ఉందో అంతకాలం చూపగలదని గుర్తించ లేకపోయాడు. మూడేళ్ల వ్యవధిలో యుద్ధం సృష్టించగల - మాటల్లో చెప్పలేని వేదననీ, బాధలనూ అది రష్యాలో కలిగించిన సామూహిక ప్రజేచ్ఛనూ చూడలేకపోయాడు. సాధారణ పరిస్థితుల్లో అటువంటి సామూహిక చేతన కలగడానికీ Antonio Gramsci వ్యాపించడానికి చాలా కాలం పడుతుంది. Selections from Writings 1910-1920 అందుకు విస్తృతంగా వర్గ అనుభవం అవసరమౌతుంది. మామూలుగా మనుషులు సోమరులుగా ఉంటారు. వాళ్లు మొదట బాహ్యంగా సంఘాలుగా సమితులుగా సమీకరింపబడాలి. తర్వాత అంతర్గతంగా ఆలోచనలతో కాంక్షలతో తమ నిరంతరాయంగా జ్వలించగలగాలి. ఈ బహిరంతర ప్రపంచాలు ఒకదానినొకటి ఉద్దీపింపచేసుకోవాలి. అందువల్లనే 'సాధారణ పరిస్థితుల్లో'

మార్క్సిస్టు చారిత్రకవాద సూత్ర విమర్శ – వాస్తవాలను గ్రహించి వాటిని పట్టుకుని విశదీకరిస్తుంది. 'సాధారణ పరిస్థితుల్లో' పెట్టుబడిదారీ వ్యవస్థలోని రెండు వర్గాలు ముమ్మరమైన వర్గ సంఘర్షణ ద్వారా చరిత్రను సృష్టిస్తాయి. శ్రామికవర్గం తన పేదరికం పట్ల నిరంతర అసౌకర్యాల పట్ల నిశితమైన దృక్పథం కలిగి జీవన ప్రమాణాలను మెరుగు పరచవలసినదిగా బూర్జువా వర్గం మీద ఒత్తిడి తెస్తుంది. అది బూర్జువా వర్గంతో సంఘర్షణకు దిగి ఉత్పత్తి నైపుణ్యాలను పెంచి శ్రామికవర్గ తక్షణ అవసరాలకు వాటిని పొందుపరచ వలసినదిగా అనుగుణంగా బలవంతపెడుతుంది. ఫలితంగా అభివృద్ధిలో దుడుకుతనం ప్రవేశిస్తుంది. ఉత్పత్తిలో వేగం పెరుగుతుంది. ఆగకుండా జరిగే వస్తూత్పత్తి సమాజానికి కొంత మేలు చేస్తుంది. అయితే ఈ ఉధృతిలో అనేకమంది పక్కకు నెట్టివేయబడతారు. వారి అవసరాలు నిర్లక్ష్యం చేయబడతాయి. ప్రజలు నిరంతర సంక్షోభంలో కూరుకుపోతారు. ఈ కల్లోల పరిస్థితుల్లో వారి ఆలోచనలు ఒక క్రమాన్ని వెదుక్కుంటాయి. వారు తమ శక్తి పట్ల, సామాజిక బాధ్యత పట్ల తమ భవిష్యత్తుకు తామే నిర్దేశకు లుగా మారడం పట్ల ముందెన్నడూ లేని చైతన్యాన్ని పొందుతారు.

సాధారణంగా అయితే ఇట్లానే జరుగుతుంది. ఒక పద్ధతిగా సంఘటనలు పునరావృతం అయినపుడూ, ఇంచుమించు ఒక లాగానే దశలుగా చరిత్ర విప్పారుతున్నపుడు దాని ప్రాధాన్యత, విలువల్లో సంక్లిష్టత పెరిగినపుడు ఇట్లానే జరుగుతుంది. కానీ రష్యాలో యుద్ధం ప్రజల ఇచ్చని పరుగులు పెట్టించింది. మూడేళ్లుగా గుది గుచ్చబడిన వారి బాధలు తెల్లారేసరికల్లా బలీయమైన శక్తిగా పరిణమించాయి. భీకర క్షామం ఆసన్నమై ఉంది. పొంచి ఉన్న ఆకలి ఎవరినైనా బలి తీసుకోవచ్చు. ఒక్క దెబ్బతో లక్షల్లో మట్టుబెట్టవచ్చు. ఈ నేపథ్యంలో తొలివిప్లవం (1905 విప్లవం–అను) తర్వాత ఇప్పుడు మొదట యాంత్రికంగా తర్వాత చైతన్యంతో ప్రజలు ఒకటయ్యారు.

సామ్యవాద ప్రచారం రష్యాలో ప్రజల్ని ఇతర శ్రామిక వర్గ అనుభవంతో సంధానపరచింది. సామ్యవాద ప్రచారం హఠాత్తుగా నాటకీయంగా శ్రామిక వర్గ చరిత్రను ప్రాణవంతం చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సేవకత్వం నుంచి విముక్తి కోసం, మరో ప్రపంచ అవిష్కరణ కోసం ఒక నూతన చైతన్యాన్ని నిలపడానికి అది అనేక పోరాటాలు, ధారావాహిక ప్రయత్నాలూ చెయ్యవలసి వచ్చింది. ఈ సామ్యవాద ప్రచారమే రష్యా ప్రజల సంకల్పానికి రూపమిచ్చింది. వాళ్లెందుకు ఇంగ్లండ్ చరిత్ర పునరావృతమయ్యే వరకు వేచిచూడాలి ? అక్కడ జరిగినట్లు బూర్జువా వర్గం ఆవిర్భవించి, వర్గ సంఘర్షణ మొదలై, చుట్టూరా వర్గ చైతన్యం వ్యాపించి పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే విధ్వంసం వారిని తాకే వరకు ఎందుకు ఎదురు చూడాలి ? రష్యా ప్రజలు – వారిలో కొంత శాతమైనా ఈ అనుభవాన్ని తమ ఆలోచనల్లో చవిచూశారు. ప్రస్తుత సంఘటన వారి అనుభవాన్ని దాటిపోయింది. అది వారు పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పడంలో పాశ్చాత్య అనుభవాన్ని వాడుకున్నట్లే పాశ్చాత్య ప్రపంచంతో సమానంగా ఉత్పత్తి చేసే దశను వేగంగా చేరుకోవడానికి ఈ అనుభవం ఉపయోగపడుతుంది. పెట్టుబడిదారీ పరిభాషలోనైతే ఉత్తర అమెరికా ఇంగ్లండ్‌కంటే అభివృద్ధి చెందింది. ఎందుకంటే ఉత్తర అమెరికాలోని ఆంగ్లో–సాక్సన్లు సుదీర్ఘ పరిణామం తర్వాత మాత్రమే ఇంగ్లండ్ చేరుకోగలిగిన స్థితిని ఒక్కసారిగా పొంది అక్కడి నుంచి పైకి లేచారు. ఇప్పుడు సామ్యవాద సహిత విద్యను పొందిన రష్యా శ్రామిక వర్గం తమ చరిత్రను ప్రస్తుతం ఇంగ్లండ్ ఏ దశను చేరుకుని వుందో అక్కడి నుంచి ప్రారంభిస్తుంది. చిల్లర దశ నుంచి మొదలు కావలసినది వేరొక చోట సాధించిన పరిణతిని అందిపుచ్చుకుని మొదలవుతుంది. అందువల్ల మార్క్స్ ఆశించిన సామూహికత్వానికి అవసరమైన ఆర్థిక పరిపక్వతను అందుకుంటుంది. విప్లవకారులే తమ లక్ష్య సాధన సంపూర్ణం కావడానికి అవసరమైన పరిస్థితులను సృష్టించుకుంటారు. పైగా వాటిని వారు పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే దానికన్నా వేగంగా రూపొందించుకుంటారు. బూర్జువా వ్యవస్థ చేత రూపొందించ బడిన సామ్యవాదులు దాని అపరిపక్వతనీ ఆర్థిక దుర్వ్యయ లక్షణాన్ని కలిగి ఉంటారనే విమర్శని ఇప్పుడు విప్లవకారులు అధిగమించడానికి అవకాశం ఏర్పడింది. అది ఇప్పుడు పేదరికంలో బాధలలో ఉన్న సామూహికతకు ప్రాధాన్యతనిస్తుంది. అదే బూర్జువా పరిపాలనైతే వాటిని వారసత్వంగా అంది పుచ్చుకుంటుంది. రష్యాలో సామూహికత్వాన్ని మించి పెట్టుబడిదారీ వ్యవస్థ వెంటనే చెయ్యగలిగేదేమీలేదు. నిజానికి ఈ రోజు అది తీవ్ర అసంతృప్తితో చెలరేగుతున్న శ్రామిక వర్గాన్ని ఎదుర్కొంటూ ఇంతకంటే చాలా తక్కువ మాత్రమే చెయ్యగలుగుతుంది. కాబట్టి మానవీయ కోణం నుంచి ఇప్పుడు రష్యాలో సామ్యవాదాన్ని నిర్దిష్టంగా అంగీకరించవచ్చు. శాంతి తర్వాత చుట్టుముట్టబోయే సమస్యల్ని శ్రామికులు – పరిస్థితులన్నీ పూర్తిగా తమ అధీనంలోనే ఉన్నాయనీ, ప్రయత్నిస్తే తక్కువ వ్యవధిలోనే వాటిని తగ్గించగలుగుతామనీ భావించినపుడే ఎదుర్కొనగలుగుతారు.

ఒక దారుణ విధ్వంసానికి రష్యా ప్రజలు గురికాకూడదనుకునే ఎవరికైనా బోల్షివిక్‌లు అధికారం కైవసం చేసుకోవడం ఒక అనివార్య జీవావసరమనే భావన కలుగుతుంది. రష్యా ప్రజలు తమ పునరుజ్జీవనానికి అంతులేని శ్రమకు తమను తాము గురిచేసుకోవలసి వస్తే అది ఆకలి తోడేలు కోరలలో చిక్కుకోవడం కన్నా తక్కువ బాధనే కలిగిస్తుందనీ, శవాలను చింపుకుని పీక్కు తినే అనాగరిక పశువుల మధ్యకు విసరివేయబడడం కన్న మేలైనదేననీ గుర్తించాలి. (అవాంతి!, 24, డిసెంబరు 1917) ❑

గ్రాంసీ స్వీయ రచనలు

# గ్రాంసీ : ఆందోళన - ప్రచారం

- ఆంటోనియో గ్రాంసీ



ఇటాలియన్ పునరుజ్జీవన ఉద్యమం-రిసార్జిమెంటో తర్వాతి కాలంలో, ఈ దేశపు రాజకీయ పార్టీల ఆందోళన-ప్రచార కార్యకలాపాల మధ్య తూకం తప్పిందనిపిస్తుంది. ఈ సామాన్య సూత్రానికి ఇటాలియన్ నేషనలిస్ట్ పార్టీని మినహాయింపుగా చెప్పొచ్చు. సూత్రబద్ధం కాని రాజకీయ ఆచరణ, అవకాశవాద ధోరణి, సహజ సజీవ కార్యాచరణ కొనసాగకపోవడం, ఎత్తుగడలకూ-వ్యూహానికీ మధ్య తూకం తప్పడం లాంటివి ఈ పరిణామానికి కారణాలనలేం. చిత్తడిచిత్తడిగా మారిపోయిన దేశ సామాజికార్థిక వ్యవస్థలో వివిధ ఆర్థిక వర్గాలు కరిగిపోవడం ఈ పార్టీలు ఇలా వుండడానికి ప్రధాన కారణం. ఈ వివరణ ఏదో కర్మ సిద్ధాంతంలా కనిపించవచ్చు. రాజకీయ పార్టీలు నిర్దిష్ట వర్గాలకు ప్రతినిధులనే మాట ఎంత నిజమో, ఆయా పార్టీలు ఆయా వర్గాల తాలూకు నిష్క్రియాశీలమైన, కేవలం యాంత్రిక ప్రతినిధులు కావనే మాట అంతే నిజం. రాజకీయ పార్టీలు తాము ప్రాతినిధ్యం వహించే వర్గాలను పటిష్టపరచి, సార్వజనిక నిర్మాణాలుగా రూపొందించే దిశగా క్రియాశీలకంగా ప్రభావితం చేస్తాయి కూడా. ఇటలీలో జరగనిది అక్షరాలా ఇదే! అలా జరగకపోవడం పర్యవసానంగానే, ఆయా పార్టీల ఆందోళన ప్రచార కార్యకలాపాల మధ్య తూకం తప్పడమనే లోపం ఏర్పడింది. ఈ పరిణామాన్ని లోపం అనకపోతే ఏమంటారు ఎవరయినా? ఈ పరిస్థితి తలెత్తడంలో, రాజ్యానికి లేదా ప్రభుత్వానికి నిర్దిష్ట పాత్ర ఉంది. ప్రభుత్వం బలపడకుండా చూడడంలోనూ, అది జాతికంతటికీ సొంతమైన విషయం కాదని రుజువు చేయడంలోనూ రాజ్యానికి కచ్చితమయిన పాత్ర వుంది!

వాస్తవానికి, ఈ క్రమంలో రాజ్యం ఒక కారకంగానూ ప్రేరకంగానూ మాత్రమే వ్యవహరించింది. రాజకీయ పార్టీలకు అతీతంగా తనను తాను నిలబెట్టుకుంది రాజ్యం. ఒక శాశ్వత చట్రంలో భాగంగా వుండే ఆయా పార్టీల ప్రయోజనాలూ కార్యకలాపాల మధ్య సయోధ్య నెలకొల్పడానికి అది అలా చెయ్యలేదు - వాటి మధ్య విభేదాలు తలెత్తే రీతిలో వ్యవహరించింది. ఆయా పార్టీలు విస్తృత జనశ్రేణులకు దూరమయ్యేలా చేసేందుకే అలా వ్యవహరించింది. 'పార్టీలతో సంబంధం లేని వ్యక్తులను కలుపుకుని, బోనపార్టిస్ట్-సీజరిస్ట్ తరహా పెత్తందారీ పెదరాయుడిలా వ్యవహరించే శక్తిగా ఆవిర్భవించేందుకే ప్రభుత్వం అలా ప్రవర్తించింది. డిప్రెటిస్, క్రిస్పీ, గియోలిట్టీలి తదితరుల నియంతృత్వాల వ్యవహార సరళినీ, వారు అనుసరించిన రాజ్యాంగ సంస్కరణవాదం-ట్రాన్స్ఫార్మిజ్మో అనే పరిణామాన్నీ అచ్చం ఇలాగే విశ్లేషించవలసి వుంటుంది.

వర్గాలే పార్టీలకు జన్మనిస్తాయనే మాట నిజమే. రాజ్యం యొక్క ప్రభుత్వం యొక్క భాగస్వాములకు మాత్రం పార్టీలు జన్మనిస్తాయి. పౌర - రాజకీయ సమాజాల నేతలను ఈ పార్టీలే మలుస్తాయి. ఈ వ్యవస్థల మధ్యా వాటి విధుల మధ్యా సఫలమైన, సార్థకమైన సంబంధాలు ఉండాలి. రాజకీయ పార్టీలు సిద్ధాంతపరమైన కృషి చెయ్యని పక్షంలో నాయకులను తీర్చిదిద్దే క్రమం సాగదు. ఆయా పార్టీలు ఏయే వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయో వాటి ప్రవృత్తికి సంబంధించిన కారణాలను ఆవిష్కరించి, అధ్యయనం చేసే లక్ష్యంతో పద్ధతి ప్రకారం కృషి జరగకపోతే నాయకులను తీర్చిదిద్దడం సాధ్యం కాదు. ఈ పరిణామం, రాజ్య విధులు-ప్రభుత్వ బాధ్యతలు నిర్వహించగల వ్యక్తుల కొరతకు దారితీస్తుంది. పార్లమెంటరీ వ్యవహారవేత్తల దారిద్ర్యానికి దారితీస్తుంది. పార్టీల మనుగడకు తప్పనిసరిగా అవసరమయ్యే, కొద్ది మంది వ్యక్తులు అవినీతికి పాల్పడేందుకూ, తద్వారా పార్టీలను కబ్జా చేసుకోడానికీ, పర్యవసానంగా ఆయా పార్టీలు ముక్కలు చెక్కలయిపోవడానికి మార్గం సుగమమవుతుంది! అది, జాతి సాంస్కృతిక జీవితం దరిద్రంగా తయారయ్యేందుకు దారితీస్తుంది. ఉత్కృష్ట సాంస్కృతిక ప్రమాణాలు కనుమరుగయ్యే నికృష్ట పరిస్థితి ఏర్పడుతుంది. రాజకీయచరిత్ర స్థానంలో జీవం లేని పాండిత్య ప్రకర్ష స్థిరపడ్డానికీ- మతం స్థానంలో మూఢవిశ్వాసం స్థిరపడ్డానికీ - ఉత్తమ గ్రంథాలనూ, గొప్ప సమీక్షల స్థానంలో దినపత్రికలు స్థిరపడ్డానికీ- సీరియస్ రాజకీయాల స్థానంలో చిల్లర తగాదాలూ వ్యక్తిగత సిగపట్లూ స్థిరపడ్డానికి ఈ పరిణామం దారితీస్తుందివిశ్వవిద్యాలయాల్లో, మేధావులనూ సాంకేతిక నిపుణులనూ తీర్చిదిద్దే సంస్థల్లో రాజకీయ పార్టీల జీవనసరళి తాలూకు ప్రభావం వ్యాప్తి చెందజాలవు. జాతీయ జీవన వాస్తవాలు ప్రతిఫలించ దారుణాలు జాలవు. ఫలితంగా, జరిగిపోతాయి.

ఈ ఉన్నత విద్యాలయాలు రాజకీయ వాసనే లేని జాతీయ కార్యకర్తలను ఉత్పత్తిచేస్తాయి. వాళ్ళలో ఊకదంపుడు ఉపన్యాస ధోరణినీ, జాతీయేతర మానసికతనూ నింపిపెడతాయి.

పర్యవసానంగా అధికార వర్గం దేశానికి దూరమైపోతుంది. పాలనాపరమైన అధికారాల ద్వారా, ఈ అధికారవర్గమే సిసలైన రాజకీయ పార్టీ అవతారం ఎత్తుతుంది! అన్నింటికన్నా ఘోరమైన విషయమేమిటంటే, రాజకీయ మేధోపరమైన సోపానం స్థానంలో అధికారవర్గంలోని నిచ్చెనమెట్ల వ్యవస్థ వచ్చి చతికిలబడుతుంది! పర్యవసానంగా, అధికారవర్గమే, రాజ్యాధికార పక్షంగా బోనపార్టిస్ట్ పార్టీగా అవతరిస్తుంది!!

ఇక్కడ గ్రాంసీ ప్రస్తావిస్తున్న ముగ్గురు నేతలు 19-20 శతాబ్దాల్లోని ఇటలీ పాలకులు. ఆగస్తినో డిప్రెటిస్(1813-87) పదహొండేళ్ళపాటు-ఆమరణాంతం- ఇటలీని ఏలుకున్నాడు. ఫ్రాన్సెస్కో క్రిస్పీ (1818-1901) మాజినీ, గాలీబాల్టీలకు సన్నిహిత మిత్రుడు. ఆరేళ్లపాటు ఇటలీ ప్రధానిగా ఉండిన క్రిస్పీ మొదట్లో ఉదారవాది, అధికారం చేతికొచ్చాక, పెత్తందారుగా వ్యవహరించాడు. ఇక, 1892-1921 సంవత్సరాల మధ్య కాలంలో అయిదుసార్లు ఇటలీకి ప్రధానమంత్రిగా వుండిన గియోవాన్నీ గియోలిటీ (1842-1928) పేరుకు వామపక్షీయుడయినా పేరు మోసిన పెత్తందారు. పార్లమెంటరీ నియంత! వీళ్ళు ముగ్గురూ ప్రవేశపెట్టి అనుసరించిన ట్రాన్స్ఫార్మిజ్మో" అనే పరిణామం వివరించుకుంటే తప్ప గ్రాంసీ చెప్పేది అర్థం కాదు. ఇటలీ పార్లమెంటు వ్యవహార సరళికి సంబంధించిన రాజ్యాంగపరమైన ఒప్పందం ఒకటి 1861లో సభ ఆమోదం పొందింది. జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలపై విధాన నిర్ణయాలు తీసుకునే క్రమంలో ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రులు పరస్పరం సంప్రదించుకుని నిర్ణయం చేసేయవచ్చని ఈ ఒప్పందం చెప్పింది. ఫలితంగా, జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలపై విధాన నిర్ణయాలు తీసుకునే క్రమం నుంచి ప్రభుత్వాలు పార్లమెంటును తప్పించగలిగాయి. అది ఎన్నో వివాదాస్పదమైన నిర్ణయాలు చేసేందుకు అవకాశమిచ్చింది. అన్నిటికీ మించి, విధాన నిర్ణయ క్రమంలో రాజకీయ పార్టీలకు స్థానం లేకుండా పోయింది.

"ప్రష్యా రాజు", జెర్మనీ చక్రవర్తి అయిన రెండో విల్ హెల్మ్ కైజర్ అనీ అంటారు. 1888 నుంచి 1918 వరకూ జెర్మనీని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన ఈ కైజర్ బలవంతంగా పదవీ త్యాగం' చేయవలసి వచ్చింది. ఆ పరిణామాల గురించి 1919 తర్వాత, అంటే మొదటి ప్రపంచయుద్ధం నేపథ్యంలో వెలువడిన పుస్తకాలు - ఉదాహరణకు మ్యాక్స్ వెబెర్ రాసిన "పార్లమెంట్ అండ్ గవర్నమెంట్ ఇన్ జెర్మనీస్ న్యూ ఆర్డర్ : ఎ పొలిటికల్ క్రిటిక్ ఆఫ్ బ్యూరాక్రసీ అండ్ పార్టీ లైఫ్" - చదివితే ఇక్కడ గ్రామ్సీ వివరించిన పరిణామాల గురించి మరింత స్పష్టత ఏర్పడుతుంది. ❑

---

## వ్యాస రచయితల మాటల్లో గ్రాంసీ భావనలు




- **హెజిమోని అంటే బలాత్కారపు ఒత్తిడి లేకుండా అధికారం చలాయించడం. అంటే పాలక వర్గం సాంస్కృతిక సాధనాల ద్వారా సమాజ మేధో జీవితాన్ని నియంత్రించడం. కార్మిక వర్గం రాజకీయాధికారం సాధించాలంటే మొదట సాంస్కృతిక సాధనాలన్నిటినీ స్వాధీనం చేసుకొని వాటిలో కొన్నిటిని ధ్వంసం చేసి, కొన్నిటిని రూపాంతరీకరించి, కొన్నిటిని సర్దుబాటు చెయ్యాలి.**
- **'సంస్కృతి'ని ఓ సామూహిక జీవన విధానంగా నిర్వచించినప్పుడు.. ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, అలవాట్లతోపాటు భాష, భావధార (ఆలోచనా తీరు) సంస్కృతిలో అంతర్భాగం అవుతుంది. సాంస్కృతిక ఆధిపత్యం(హెజిమోని) అంటే సైద్ధాంతిక సాంస్కృతిక మార్గాల్లో పాలకులు పట్టు సంపాదించడమే.**
- **మేధావులు ఆధిపత్య బృందానికి ప్రతినిధులు. వారు రాజకీయ పాలన, సామాజిక హెజిమోని విధులను నిర్వర్తిస్తారు. ప్రత్యేకంగా ఆర్గానిక్ మేధావులు మరీ ముఖ్యమైన వారు. ఎందుకంటే వీరే ఆర్గానిక్ ఐడియాలజీని వివరించి వ్యాపింప చేస్తారు. రాజకీయాల్లో ఈ మేధావుల పాత్ర చాలా ముఖ్యమైనది.**
- **పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొనే సంక్షోభం సార్వత్రికం కాదు. అందులో జాతీయ అంతర్జాతీయ వర్గ శక్తుల దామాషా కలయిక ఉంటుంది. ఈ సంక్షోభం దశ, దిశ, స్థితి, తీవ్రతలను బట్టి ఆయా దేశాల్లోని వర్గ శక్తుల బలాబలాలను బట్టి విప్లవోద్యమానికి అవసరమైన నిర్దిష్ట వ్యూహాన్ని రూపొందించుకోవాలి.**
- **విద్యంటే సంపూర్ణ జ్ఞాన ప్రక్రియ. అందులో ఒక సంఘజీవికి కావాల్సిన అన్ని విలువలు ఉండాలి. ఆ ప్రక్రియలో సమత, మానవతావాద దృష్టి ఏర్పడాలి. అటువంటి విద్య అందరికి సమానంగా అందుబాటులో ఉండాలి. అలాంటి యూనిటరీ స్కూల్స్ ఏర్పడాలి.**

# S.V.K.P & Dr. K.S.Raju Arts & Science College (Autonomous)

Estd : 1947

Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram

College with Potential for Excellence & Accredited by NAAC with 'A'

PENUGONDA - 534 320, W.G.Dt. A.P.

Website : svkpandksrajucollege.edu.in

Phones : 08819 - 246126, 9066 365 365

గ్రామీణ & పట్టణ విద్యార్థిని విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో క్రమశిక్షణతో కూడిన అత్యుత్తమ విద్యను అందిస్తూ MNC కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తున్న సేవాభావం కలిగిన యాజమాన్యంతో నడుపబడుతున్న కళాశాల



Sri Pitani Suryanarayana
President



Dr.K.Ramachandra Raju, M.D.,
Secretary & Correspondent



Sri Vuddagiri Lavakumar, B.Com.,
Treasurer



Dr.Y.V.V Appa Rao, M.Sc.,Ph.D.,
Principal

## U.G. COURSES OFFERED

**B.Sc.**

M.P.C.
(Maths, Physics, Chemistry)

M.P.Cs.
(Maths, Physics, Computer Science)

M.P.E.
(Maths, Physics, Electronics)

M.E.Cs.
(Maths, Electronics, Computer Science)

M.C.Cs.
(Maths, Chemistry, Computer Science)

C.B.Z.
(Chemistry, Botany, Zoology)

C.Z.BT.
(Chemistry,Zoology, Biotechnology)

M.B.BT.
(Microbiology, Biochemistry, Biotechnology)

**B.C.A.**
(Bachelor of Computer Applications)

**B.A.**

H.E.P
(History, Economics, Politics)

**B.Com.**

General
Computer Applications

**Optional Subject**

Second Language
TELUGU / HINDI

**P.G. Courses**

M.B.A.
M.C.A
M.Sc.,Organic Chemistry
M.Sc.,Botany
M.Sc.,Zoology
M.Sc.,Aquaculture

## SALIENT FEATURES

| | | |
|---|---|---|
| IQAC | Research & Innovation Centre | Placement Cell |
| VIRTUAL LIBRARY CUM VIDEO CONFIRENCE HALL | SKILL DEVELOPMENT CENTERS | ONLINE COACHING FOR GROUP EXAMS |
| DIGITAL LIBRARY | NSS UNITS | NCC FOR BOYS & GIRLS |
| e - CLASS ROOMS | LIVE BLOOD BANK | NCC TRAINING CENTER |
| SPORTS & GAMES | MEN'S HOSTEL | WOMEN'S HOSTEL |
| GYMS FOR BOYS & GIRLS | INTERNET LABS | WOMEN EMPOWERMENT CELL |
| LANGUAGE LAB | COMMERCE LAB | A/C SEMINAR HALL |
| IIT ONLINE CERTIFICATE COURSES | R.O. WATER PLANT | CANTEEN |

## SVKP Degree College (A) విశిష్టతలు

- UGC - New Delhi వారిచే 2(f) & 12(B) గుర్తింపు పొందిన కళాశాల.
- UGC - New Delhi వారిచే స్వయం ప్రతిపత్తి (AUTONOMOUS) హోదా సాధించడం.
- National Assessment and Accreditation Council(NAAC), Banglore వారిచే 'A' Grade సాధించడం.
- Indian Standard Organization (ISO) తో 3 Certificates పొందిన కళాశాల.
- UGC - New Delhi వారిచే College with Potential for Excellence (CPE) హోద్దా పొందడం.
- కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ (MHRO) వారిచే RUSA (రాష్ట్రీయ ఉచ్ఛ్‌తర్ శిక్ష అభియాన్) నిధులు సాధించడం.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన కళాశాల. మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంకు అనుబంధ కళాశాల.
- ఉన్నత విద్యారంగంలో 25 సం॥లకు పైబడి అనుభవం కలిగిన సీనియర్ అధ్యాపక బృందం కలిగియున్న ఏకైక కళాశాల.
- భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన New Education Policy(NEP) - 2020 ప్రకారం విద్యాప్రమాణాలు కలిగిన కళాశాల.

1974 సం॥ లో స్థాపించబడి 49 సం॥ నుండి ఎందరో విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తును అందిస్తూ 50 వ సం॥ లో అడుగుపెడుతున్న విద్యా సంస్థ

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 1 - Issue No : 7 April 2023




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.